

విషయానుక్రమణిక

చిత్రములు



చెన్నపట్టణము సెప్టెంబరు ౧౯౨౫

సంపుటము ౨. క్రోధన సంవత్సరము, భాద్రపదమాసము సంఖ్య ౯.

తిక్కన

పెమ్మరాజు లక్ష్మీపతి గారు

ఉ. ఉరువైస్మృత్యతమిస్రపుంజ రచనోద్యుక్తంబు లౌకాలపుం
బౌరలం జీల్చుచు నాంధ్రవాఙ్మయకళావ్యోమప్రదేశంబు సు
స్థిరకాంతిస్థగితంబుగా వెలుగు నీతేజోమయాకార మాం
తరదృష్టింగని కేలుమోడ్చెద గవీంద్రా, తిక్కశర్మాహ్వయా!

సీ. అతిమనోహరమగు నాననాంబుజమున, బ్రహ్మతేజంబు విభాసిలంగ
నౌన్నత్యశోభితం బౌ లలాటస్థలి, బాండితీవిభవ మేపారుచుండ
జలజాతసదృశవిశాలాక్షిదీప్తుల, గవితావిలాసముల్ గడలుకొనగ
ఆజానుబాహుద్వయం బాశ్రయంబుగ, వీరభావంబు పెంపారుచుండ

జయ మహామాత్యశేఖరా! జయమహాధ్వర ప్రదీపిత! జయ కవిబ్రహ్మ! జయమ
హామహోద్దండ దండనాయకయటంచు, నతులు నుతులును గొన్న నీయతులమూర్తి.
గానలేమైతి మకట తిక్కన్న నాడు.

ఉ. భావము లక్షరంబులయి వ్రాలగ గంటము మించి తాళప
త్త్రావళిపైన భారతకథారచనాత్మకమైన నృత్య మి
చ్ఛావిధిజేయ నుజ్జ్వల రసాశ్రయమైన 'మహాకవిత్వ దీ
క్షావిధి నొంది' భాసిలు యశస్వికి దిక్కన కేను మ్రొక్కెదన్.

సీ. కవిపుంగవులు మహాకవిపుంగవుండన, నద్వైతవిదులు వేదాంతి యనగ
మంత్రివర్యులు మహామాత్యశేఖరుడన, దండనాథులు బలోద్దండుడనగ
వైదికోత్తము లొక్క వైదికాగ్రణి యన, లౌకికు లొక్కటి లౌకికుడన
పండితాఖండు లుద్దండ పండితుడన, వక్తలెల్లరు మేటివక్తయనగ
మించి, పంచమవేదమై మెరయునట్టి, భారతమునకు తెలుగురూపం బొసంగి
నట్టి యిలవేల్పు పెద్దయై పుట్టినట్టి, తిక్కనకవి కేను నిరతంబు మ్రొక్కువాడ.

చ. అల్లనవిచ్చునంత కలయంబడి మన్మమహీశురాజ్యమం
దెల్లెడ జుట్టివచ్చు నొకయించుక దృష్టిమరల్చు నంతలో
నల్ల రసప్రపంచసముదంచిత వీథుల బ్రాకు నీదు దృ
గ్వల్లిక లాంధ్రభూమికి నవాభరణంబులు కావె తిక్కనా!

ఉ. మేటివిపంచి కేలగొని మించినశక్తి బినాకినీనదీ
వాటికలన్ గవిత్వరసవైభవముల్ వికసింప నెన్నడో
మీటిన భావరాగముల మేదురనాదము మారుమ్రోయు నీ
నాటికిగూడ నాంధ్రభువనంబున దిక్కకవీంద్ర! హాయిగన్.

చ. తెలుగుకవిత్వ మెన్నగ నిదేయని తద్‌జ్ఞులు మెచ్చునట్టు లు
జ్జ్వలులయినట్టి పాండుకురువంశ్యులనెల్లర దెల్గువారలై
మెలగెడునట్లు మార్చితి వమేయకళాచతురత్వ మొప్ప నీ
తెలుగున వ్యాసుడేయనుచు నుతిం గనజాలితివౌర! తిక్కనా!

చ. ఒకటియొ రెండొ యక్షరము లొప్పుచునుండెడు తెల్గుపల్కులం
దుకొనుచు దండగ్రుచ్చి రసతోయము లిమ్ముగజల్లి మేటిమాం

త్రికునివిధాన వాని కొకదేహము జీవమునిచ్చి భావనా
త్మకలన జూపజాలితి వయారె! యొయారపుకైత లొప్పఁగన్.


చ. వలనుగ నెల్ల రెల్లపుడు వాడుచునుండెడు తేటతెల్గుమా
టల మెఱయించినాఁడవు కడానిమిటారము లెంతొ వింతరీ
తుల తులలేనిశోభ తులదూఁగ పదంబులనేర్చి కూర్చితో
తెలుగున నింతతీపి కలదే యని విస్మయమందునట్లుగన్.

ఉ. పూఁచినయట్లు భావములఁ బొల్పు పదంబులసౌరు త్రాసునన్
దూఁచి యమర్చినట్లు రసధూర్వహలీల రచించినాఁడవో
రా చవులూర భారతము రాజితసత్కవితాధనంబు నీ
నోఁచిననోముపంట యగునో యది యొడ్డుల కెట్టు లబ్బెడిన్.

ఉ. నన్నయనాఁడె యాంధ్రగగనంబున దివ్యకళావిలాసభా
స్వన్నవశోణదీప్తుల ప్రభాతము తోఁచె; నఖండకాంతిసం
పన్నవిభాకరోదయ మపారముదావహ మౌచు బొల్చె ది
క్కన్న! త్వదీయహస్తమున గంటము వ్రాలినదాది మేదినిన్.

చ. అనఘ! త్వదీయ దివ్యమహిమాతిశయంబు నుతించుపట్ల నే
మనుటకు దోఁచకింక భువినంతటివా డితరుం డెవండు లే
డనుచు వచింపగావలయు నంతియకాని నుతింపగా దొరం
కొనిన పదంబు లెందుకలుగున్ బుడమింగల బాస లన్నిటన్.

చ. అలతిరుతంబు గద్గదసమాకులమై నిను బిల్చుచున్న నా
పలుకులు నిన్ను జేరక నభఃస్థలి లీనములైన నౌనుగా
కలఘుగుణాఢ్య! జిహ్వతనియన్ నినుబిల్చి త్వదీయరూపమే
దలఁచెద డెందమందిక కృతార్థుఁడ నయ్యెద వేయునేటికిన్.



కాళహస్తి మాహాత్మ్య విమర్శనము

మేడేపల్లి వేంకటరమణాచార్యులు గారు

మొట్టమొదట నాంధ్రభాషాకవనము రామాయణము, మహాభారత భాగవతాది సంస్కృత పురాణముల కాంధ్రీకరణముతో నారంభమైనది. అట్లు పురాణముల నాంధ్రీకరింప మొదలిడినవారిలో నన్నయభట్టు మొదటివాఁడు. ఇతనికంటె ముందాంధ్ర కవులు, ఆంధ్రకవనము లేదని కొందఱు, కలవని కొందఱు వివరించుచున్నారు. అట్టివివాదలతో మన కిచటఁ బని లేదు. తరువాతఁ గొంతకాలమున కాంధ్రభోజుఁ డని ప్రసిద్ధిగాంచిన కృష్ణదేవరాయల కాలమం దీయాంధ్ర భాషాకవనము మాళవదేశాధీశ్వరుఁ డగు భోజమహారాజు కాలమందు సంస్కృతభాషాకవనమువలె నత్యుచ్ఛదశ నొందెను. ఈకృష్ణరాయలు స్వయముగా మహాకవియై యుండుటయేకాక యనేకవిద్వత్కవుల నాదరించుటవలనను అనేకదేశములను జయించుటవలనను సుప్రసిద్ధుఁడైనవాఁడు. దక్షిణహిందూదేశమును బాలించిన రాజులలో నింతదేశమును జయించి యేలినవాఁడు, ఇంతకీర్తిని సంపాదించినవాఁడు మఱి యెవ్వఁడును లేఁడు. ఈతనిరాజధాని బళ్లారిమండలములో నున్న యానెగొందికి సమీపమున తుంగభద్రానదీతీరమందున్న విజయనగరము. ఈపట్టణమునకు విద్యానగరమని నామాంతరము గలదు. "వానివంశంబు తుళువాన్వవాయమయ్యె" నన్నట్లీతఁడు తుళువవంశస్థుఁడు. ఇంటిపేరు సాళువవారు. ఇతఁ డనేకకవుల నాదరించి కావ్యములను జేయించుటయేకాక తానుగూడ విద్వాంసుఁడై సంస్కృతాంధ్రములయందు గ్రంథములను రచించుటకుఁ దగిన సామర్థ్యము గలవాఁడై యుండెను. ఇతఁడు సంస్కృతభాషలో ననేకగ్రంథములను రచించినట్లు విష్ణుచిత్తీయమునందలి యీపద్యమునందుఁ జెప్పఁబడియున్నది.

సీ. పలికి తుత్ప్రేక్షోపమల జాతి పెంపెక్క
    రసికులౌ నన మదాలసచరిత్ర
భావధ్వని వ్యంగ్యసేవధిగాఁగ జె
    ప్పితివి సత్యావధూప్రీణనంబు
శ్రుతిపురాణోప సంహిత పేర్చికూర్చితి
    సకలకథాసార సంగ్రహంబు
శ్రోత్రఘుచ్ఛటలు విచ్చఁగ రచించితి సూక్తి
    నైపుణి జ్ఞానచిన్తామణికృతి
తే గీ. మఱచియు రసమంజరీముఖ్యమధుర కావ్య
    రచన మెప్పించుకొంటి గీర్వాణభాష
    నంధ్రభాష యసాధ్యంబె యందు నొక్క
    కృతి వినిర్మింపు మిఁక మాకుఁ బ్రియముగాఁగ.

ఇతఁడు రచించిన "ఆముక్తమాల్యద" యనుమహాప్రబంధ మొక్కటియే మనకుఁ గానవచ్చుచున్నది. కాని పద్యోక్తములైన యా సంస్కృతగ్రంథము లెచ్చటను గానరావు. ఆముక్తమాల్యదామనుచరిత్రముల పీఠికలలోఁ గొన్ని పద్యములు సాధారణముగా నుండుటనుబట్టి మన పండితులలోఁ గొందఱు కృష్ణరాయ లాముక్తమాల్యదను వ్రాయ లేదనియు నతని పేరుపెట్టి అలసాని పెద్దన వ్రాసెననియు నభినివిష్ట మనస్కులై వాదించుచున్నారు. ఆముక్తమాల్యదను మనుచరిత్రమును జక్కఁగాఁ జదివి పరిశీలించిన పండితుఁ డెవ్వఁడును రెండుగ్రంథము లేక కవిత్వములని సమర్థింపఁజాలఁడు. కృష్ణరాయ లాముక్తమాల్యదను రచింప లేదని చెప్పుటలో నితనికిఁ గవనశక్తి పాండిత్యము లేదనిగదా తాత్పర్యము. అట్లయినచో,

"క. శ్రీవేంకటగిరివల్లభ
    సేవాపరతంత్రహృదయ చిన్నమదేవీ

జీవితనాయక కవితా
ప్రావీణ్యఫణీశ కృష్ణరాయమహీశా"

అను పారిజాతాపహరణపద్యములోని "కవితా ప్రావీణ్యఫణీశ" అను విశేషణము సముద్రఘోషవలె నర్థశూన్యము గావలసివచ్చును. పూర్వము నేను వ్రాసిన ఆముక్తమాల్యదా పీఠికలో నీవిషయమునుగురించి యతి విపులముగాను సప్రమాణముగాను జర్చించి యుంటిని; కావునఁ బేటికాసంగతి న్యాయముచేఁ దటస్థించిన యీ యవాంతరసంగతి నింతతోఁ జాలించి ప్రకృతము ననుసరించెదను.

ఈ కృష్ణరాయలు కవులను బ్రోత్సాహపరిచి కావ్యములను జేయించియు దాను జేసియు నాంధ్ర భాషకు మహోపకారము గావించియున్నాఁడు.

"చ. పరిణయయానశైల ఋతు
పానజయాహవ దౌత్యమంత్రసా
గర విరహాంగనారతి మృ
గవ్యసు తేందు దివాకరాశ్రమాం
తర పురదోహ్యదామృ
తవనంబుల సంస్థితు లొప్పఁ జెప్పఁగా
నిరువదిరెండు వర్ణనల
నెన్నికకెక్కు ప్రబంధ మిద్ధరన్."

అని చెప్పఁబడిన యిరువదిరెండువర్ణనలతోఁగూడి నవరసభరితములై సంస్కృతకావ్యములతో సదృశములైన నూతనప్రబంధముల రచన యీ కృష్ణరాయలకాలమందే ఆరంభింపఁబడెను. నేను లోఁగడ వ్రాసిన ట్లింతకుఁ బూర్వమందున్న కవులు సంస్కృతభాషలోనున్న గావ్యములను, బురాణములను, ధర్మశాస్త్రములను దెలిఁగించుచు వచ్చిరి. వారిలోఁ గేతన యను కవి యాజ్ఞవల్క్య ధర్మశాస్త్రమును, దండి చెప్పిన దశకుమారచరిత్రమును, శ్రీనాథుఁడు శ్రీహర్ష విరచితమైన నైషధకావ్యమును బద్యరూపముగాఁ దెనిఁగించిరి. ఇట్లు పూర్వకాలమందలి కవులు రచించిన యాంధ్రగ్రంథము లన్నియు సంస్కృతగ్రంథముల కనువాదరూపములే కాని స్వబుద్ధికల్పితముగా రచించిన నూతనగ్రంథ మొక్కటియుఁ గానరాదు.

ఈ కృష్ణరాయల ఆస్థానమం దష్టదిగ్గజము లని పేరుపొందిన యెనమండ్రు తెలుఁగుకవు లుండిరని వాడుక. 1. అల్లసాని పెద్దన్న, 2. నందితిమ్మన్న, 3. అయ్యలరాజు రామభద్రకవి, 4. ధూర్జటి, 5. మాదయ్యగారి మల్లన్న, 6. పింగళి సూరన్న, 7. రామరాజభూషణుఁడు, 8. తెనాలి రామకృష్ణుఁడు.

కాని యిందుఁ జెప్పఁబడినవారిలోఁ గడపటి ముగ్గురును కృష్ణదేవరాయని కాలమం దున్నారో లేదో యని సందేహింపవలసియున్నది. మొదటి అయిదుగురుమాత్ర మా కాలమం దున్నట్లు కొన్ని గ్రంథనిదర్శనములు కనఁబడుచున్నవి. వారిలో నల్లసాని పెద్దనార్యుఁడు తాను రచించిన మనుచరిత్రమును, నందితిమ్మన్న తాను వ్రాసిన పారిజాతాపహరణమును కృష్ణదేవరాయల కంకితము చేసిరి. అయ్యలరాజు రామభద్రకవి కృష్ణదేవరాయల ఆజ్ఞాప్రకారముగా సకలకథాసారసంగ్రహమను నొక గ్రంథమును వ్రాసెనుగాని యది రామాభ్యుదయమువలె నంత ప్రౌఢముగా నుండలేదు. రామభద్రకవి తన్ను గృష్ణరాయలు కోరుటచేత సకలకథాసారసంగ్రహమును జేసితినని వ్రాసినభాగము నాగ్రంథమునుండి యిచట నుదాహరించుచున్నాను.

"కీర్తివిస్తారధురంధరుఁడగు కృష్ణరాయనరపాలాఖండలుండు నన్నుఁ బిలిచి శ్రీమచ్ఛీతారమణచరణకమల పరిచరణైకరతమానసుండవు, బహువిధకవితాచమత్కారధుర్యుండవు, సకలపురాణేతిహాసప్రబంధరచనాదక్షుండవు మన్మనోరథకార్యనిర్వాహకుండవు నగుటం జేసి పురాతన మహాకవి ప్రబంధంబుల నన్వేషించి భగవద్భక్తినిష్ఠాగరిష్ఠులగు రాజశ్రేష్ఠుల వృత్తంబులు ప్రసిద్ధంబు లగు నట్లుగాఁ బ్రశస్తకథలు విన్యస్తంబులుగా సమకూర్చి సాహిత్యలక్షణచిత్రకవిత్వప్రభావంబు లొకొక్కచోట గనంబడ నతిమధురసాయనద్రాక్షాపాకంబుగా శృంగారరసయుక్తంబగునట్లు సకలకథాసారసంగ్రహంబు గ్రంథవిస్తరము గాకుండునట్లు రచియింపుమని యుపన్యసించిన సంతోషామృతతరంగితాంతఃకరణుండ నగుచున్న సమయంబున."

రాజశేఖరచరిత్రమును రచియించిన మాదయగారిమల్లన్న, కృష్ణదేవరాయలు గోలకొండ, బిజాపురము మొదలగు తురుష్కసంస్థానములను జయించినపు డాతనికీర్తిని వర్ణించినట్లు కుమారధూర్జటి తానురచించిన కృష్ణరాయవిజయమం దిట్లు చెప్పియున్నాఁడు.

"తే.గీ. అటుల జయలక్ష్మి గైకొని యరుల కరుల
హరుల ధనపంక్తులను దనపరము చేసి
వెలయు శ్రీకృష్ణరాయల విభవగరిమ."

"తే.గీ. సరససాహిత్యరచనవిస్ఫురణ మెఱయ
సారమధురోక్తి మాదయగారిమల్ల
(?)నార్యుఁ డలయల్లసానిపెద్దనార్యవరుఁడు
ముక్కుతిమ్మన మొదలైన ముఖ్యకవులు.

"క. వినిపించి రపుడు వారికి
[illegible]గనకాంబరభూషణముల ఘనతనొసఁగి యా
జనవరుఁ డప్పాజిఁగనుం
గొని యిట్లనిపల్కె నపుడు కుతుకం బలరన్."

కాళహస్తిమాహాత్మ్యమును రచించిన మహాకవి యగు ధూర్జటికూడ కృష్ణరాయనిసభలోనున్న ట్లితని పౌత్రుఁడగు కుమారధూర్జటి రచించిన కృష్ణరాయవిజయమువలనఁ దెలియవచ్చుచున్నది.

"చ. స్తుతమతియైన యంధ్రకవి
ధూర్జటిపల్కుల కేలగల్గెనో
యతులితమాధురీమహిమ
నా మను మీపెదతాత చాల స
న్నుతి గనెఁ గృష్ణరాయల
మనోజ్ఞసభ న్నిను మీవు నట్ల మ
త్కృతబహుమానవైఖరుల
గీర్తివహింపుము ధాత్రిలోపలన్."

ఇట్లు ముక్కుతిమ్మన్న, అలసానిపెద్దన్న, అయ్యలరాజు రామభద్రకవి, మాదయగారిమల్లన, ధూర్జటికవి కృష్ణరాయలసభలో నున్నట్లు గ్రంథనిదర్శనములు కానవచ్చుచున్నవి. తక్కిన ముగ్గురు ననగా పింగళిసూరనార్యుఁడు, రామరాజభూషణుఁడు, తెనాలిరామకృష్ణుఁడు కృష్ణరాయలసభలోనున్నట్లు గ్రంథప్రమాణ మేమియుఁ గానరాదు.

ధూర్జటికవి

కాళహస్తిమాహాత్మ్య మను మహాప్రబంధమును వ్రాసినమహాకవి యితఁడే. కాళ-వనఁగా సర్పము. హస్తి యనఁగా గజము. ఈరెండుజంతువులు నచటనున్న శివలింగమును బూజించి ముక్తినొందెను గావున నీస్థలమునకుఁ గాళహస్తి యని పేరు కలిగెను. ఇది గొప్పశివక్షేత్రము. దీనికి దక్షిణకాశి యని నామాంతరము కలదు. ఈధూర్జటికవి పాకనాటియాఱువేలనియోగి బ్రాహ్మణుఁడనియు భరద్వాజగోత్రుఁడనియు, నాపస్తంబ సూత్రుఁడనియు నితని మనుమఁడుకుమారధూర్జటి కృష్ణరాయవిజయమందు వ్రాసిన యీపద్యముచే స్పష్టమగుచున్నది:

"సీ. నను భరద్వాజగోత్రుని సదాపస్తంబ
సూత్రుని బాంధవస్తోత్రపాత్రుఁ
బాకనాటార్వేలవంశప్రసిద్ధుని
ధూర్జటిపౌత్రు బంధురచరిత్రు
సద్గురుకారుణ్యసంప్రాప్తవిద్యావి
హారుని శ్రీకాళహస్తినిలయుఁ
జిత్ప్రసూనాంబికా శ్రీకరానుగ్రహ
సాధితకవితారసజ్ఞహృదయు
తే. గీ. సారరచనాధురీణుఁ గుమారధూర్జ
టిప్రధానాగ్రగణ్యుఁ బటీరహీర
మహితసత్కీర్తి గాళియామాత్యపుత్రు
వేంకటార్యునిఁ బిలిపించి వేడ్క ననియె."

ఇంతకంటె నితనివృత్తాంతమును దెలుపు సాధనములు మఱేవియును లేవు. ఇతఁడు గొప్పశివభక్తి గలవాఁ డన్న సంగతి నితఁడు రచించిన గ్రంథమే తెలుపుచున్నది. ఇతఁడు కాళహస్తినివాసి. నాలుగాశ్వాసములతోఁ గూడిన కాళహస్తిమాహాత్మ్యమను ప్రబంధమును రచించి కాళహస్తియందున్న శివుని కంకితము చేసెను. ఇతఁడు కృష్ణరాయల యాస్థానమునం దున్న కవులలో నొకఁడుగావున 16వ శతాబ్దముయొక్క ఆరంభమందున్న వాఁడని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. కుమార ధూర్జటి కవికిఁ బుత్రుఁడగు లింగరాజకవి యనునతఁడు మఱియొక కాళహస్తి మాహాత్మ్యమును రచించియున్నాఁడు. అది పెద్దధూర్జటికవిరచించిన కాళహస్తిమాహాత్మ్యముకంటె విపులతరముగా నున్నది. పండ్రెం డాశ్వాసములతోఁ గూడినది. ఆకాలమందు గాళహస్తిని బరిపాలించుచుండు అక్కరాజు వెంకటపతిగారి కంకిత మీయఁబడినది. ఆగ్రంథములోని పద్యములు గొన్ని యీక్రింద వ్రాయఁబడుచున్నవి. వీనివలనఁ బెద్ద ధూర్జటికవియొక్కయు నతఁడు

రచించిన ప్రబంధముయొక్కయు వృత్తాంతము గొంత మట్టునకుఁ దెలిసికొనుటకుఁ సాధనము లగుచున్నవి.

"సీ. శ్రీకాళహస్తి గౌరీనాథపదపద్మ
సద్భక్తియుక్తి నిశ్చలతఁగాంచి
సారసుధాసార సరసోక్తిగుంభన
గాళహస్తిమహత్త్వకథ నొనర్చి
కృష్ణరాయకిరీట కీలితమణిగణా
ర్చిత పదాబ్జస్వయశ్రీవహించి
యాసేతుకాశీ తటావనీవిఖ్యాత
సత్కీర్తి విస్ఫూర్తిఁ జాలవెలసి
తే.గీ. ధరణిఁ జెలువొందె నేకవీశ్వర వతంసఁ
రత్నమమ్మహనీయు ధూర్జటిసుధీంద్రుఁ
దలఁతు జలనిధి వీచికాకలకలాను
కారి భూరికవిత్వ వాక్పటిమ గులుక."

పెద్దధూర్జటికవి కృష్ణరాయలచే సన్మానితుఁడైన వా డను నంశము నీపద్యము దృఢపర్చుచున్నది.

"సీ. శ్రీకాళహస్తీశ సేవనాన్వితచిత్త
చిత్తజాకార లక్ష్మీవిహార
రమణీయశీల భారద్వాజగోత్రప
విత్ర యాపస్తంబసూత్ర మహిత
ధూర్జటివంశపాథోధిచంద్రకుమార
ధూర్జటినామ విస్ఫూర్జితాంశ
స్తుతమతి వేంకటపతితనూభవలింగ
రాజకులేంద్ర ధైర్యాచలేంద్ర."

ఈపద్యముచే నా కవియొక్క గోత్రసూత్రాదు లనుసరించి చెప్పినయంశము యథార్థమని నిశ్చయింపఁ గలము.

"క. వినుకాళహస్తి మహిమం
బనుపమమై వెలయు మూను పదధ్యాయికథన్
దెనుఁగునఁ గావ్యముగ నొన
ర్చెను బెదధూర్జటికవీంద్ర శేఖరుఁ డనఘా.
అ. వె. బహుపురాణమథితభవ్యార్థ శివతత్త్వ
సారమెల్ల నైక్యసరణిఁబొదవి
జగతి శివరహస్యసంగ్రహ మనునీతి
హాసమొనరు విబుధు లభినుతింప.

సీ. ఆయితిహాసంబునందలి యుత్తర
భాగంబునందు భాస్వన్నిరూఢి
గాళహస్తిమహత్త్వకథ నూటయిర్వది
యధ్యాయములఁ జెలు వమరుచుండు
దత్కథఁ దెనుఁగున ద్రాక్షారసోర్మికా
పరిపాక విస్ఫూర్తిఁ బరిఢవిల్లఁ
గృతియొనర్పుము మదంకితముగ శబ్దచ
మత్కృతి బండితు ల్మదిఁ గణింప."

అను పద్యములచే బెద్ద ధూర్జటికవి వ్రాసిన కాళహస్తి మాహాత్మ్యమునకుఁ దరువాత నీతని ప్రపౌత్రుఁడగు లింగరాజకవి వ్రాసిన కాళహస్తి మాహాత్మ్యమునకు శివరహస్యసారమను నొక యితిహాసముయొక్క ఉత్తర భాగము మూలగ్రంథమనియు దానినిఁ జూచి వీ రుభయులు తమ ప్రబంధములను రచించిరని స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది.

ఈ ధూర్జటికవి తాను రచించిన కాళహస్తి మాహాత్మ్యమునకు గుర్వాజ్ఞానుమోదముగా శివుని గృతిపతిగా నొనర్చితినని కృత్యాదియందుఁ జెప్పియున్నాఁడు.

"ఉ. ఈశుభకావ్యరత్నమున
కీశు నధీశుని జేసిన న్మహా
దేశిక సార్వభౌముఁడు మ
దిక్ ప్రమదంబు వహించు ధూర్జటీ."
"క. అనిగురుఁ డనుపమకరుణా
వనధియనుగ్రహము సేయన్."

కృత్యాదియందు సకల కవిసంప్రదాయసిద్ధమైన ప్రాచీనకవిస్తుతి నితఁడు చేయలేదు. "తన సేవకు ల్గమల జాతశ్రీధరు ల్గాఁ జెలంగిన దేవోత్తము నమ్మహాత్ముఁ దరమే కీర్తింపఁగా నేరికిన్" అని చెప్పుటచే నితనికి శివునియందే భక్తి. శ్రీమహావిష్ణువును శివునికి సేవకునిగాఁ జెప్పినాఁడు. ఇతఁడు రచించిన కాళహస్తీశ్వరశతకమందుఁ గూడ "శ్రీ లక్ష్మీపతి సేవితాంఘ్రియుగళా శ్రీ కాళహస్తీశ్వరా" (కాళహస్తిశతకము, 18పుట) అని చెప్పియున్నాడు.

"శా. రాజు ల్మత్తులు వారిసేవ నరక
ప్రాయంబు వారిచ్చునం

భోజాక్షీచతురంతయానతురగీ
భూపాదు లాత్మవ్యథా,
బీజంబుల్" (కాళ-శత)

అని చెప్పుటచే నైశ్వర్యమత్తులైన రాజులను సేవించుట, వారిపైఁ గవనము చెప్పుట లేశ మిష్టము లేనివాఁడని స్పష్టమగుచున్నది. అందువలననే యీతఁడు కృష్ణరాయల యాస్థానమందున్న అష్టదిగ్గజములలో నొకఁడైనను తన ప్రబంధమును గృష్ణరాయలకుఁ గృతి యీయలేదు. శతకమందుఁగూడ నిట్లు వ్రాసెను:

"శా. నీకుంగాని కవిత్వ మెవ్వనికి నే
నీనంచు మీఁదెత్తితిన్
జేకొంటి న్బిరుదంబు కంకణము ముం
జేగట్టితిన్" (కాళ–114 ప.)

ఇతఁడు చిరకాలముగృహస్థాశ్రమమందుండిదారాపుత్రాదిపోషణముకొఱకు నానావిధక్లేశముల ననుభవించినట్లు శతకములోని పద్యములవలన స్పష్టమగుచున్నది.

"ఆలంచు న్మెడఁగట్టి దానికి నపత్యశ్రేణిఁ గల్పించి త
ద్బాలవ్రాతము" (కా–శ.)

"భవదుఃఖంబులు రాజకీటముల నేఁ
బ్రార్థించిన న్మానునే" (కా–శ)

"వెనుకం జెందిన ఘోరదుర్దశలు భా
వింపంగ రోఁతయ్యెడున్"

"నను నేఁ జూచియు నావిధు ల్దలఁచియు
న్నాకే భయం బయ్యెడున్."

అని చెప్పియున్నాఁడు.

"పరిశీలించితి మంత్రతంత్రములు చె
ప్పన్వింటి సాంఖ్యాదియో
గరహస్యంబులు" (కా–శ. 77 ప.)

అనీ కాళహస్తిశతకమందును;

"సిద్ధ నీరేజకూర్మాసనాభ్యాసనాడీసదాశోధనాయాసముం బొంది యాధారజాలంధరోడ్డీనబంధంబుల న్బట్టుచున్ గుండలీశక్తిప క్రిం బవక్రంబుగాఁ జేసి షట్చక్రికావీథిఁ జేతస్సమేతంబుగా వాయువుం గ్రోలుచున్" (1 ఆ. 142 ప.)

అని ప్రబంధమందును జెప్పియుండుటచే నీతఁడు మంత్రశాస్త్రమును యోగశాస్త్రమునుగూడ నెఱింగిన వాఁడని యెఱుంగవలెను.

ఇతఁడిట్టి శివభక్తి, వైరాగ్యము, నిస్పృహత గలిగినవాఁడై యున్నను వేశ్యాలంపటుఁడని యొక దుష్కీర్తి యతని తలపైఁ బడెను.

"చ. స్తుతమతియైన యంధ్రకవి
ధూర్జటిపల్కుల కేలగల్గెనో
యతులితచాతురీమహిమ"

అని కృష్ణరాయ లడుగగాఁ దత్సభాసదులలో నొకరు "హా తెలిసెన్ భువనైకమోహనోద్ధత సుకుమార వారవనితాజనతాఘనతాపహారిసం, తత మధురాధరోదిత సుధారసధారలఁ గ్రోలుటం జుమీ" అని యాపద్యమును బూర్తిచేయుటచే నితఁడు స్త్రీలోలుఁడని యూహించెదరు. "కాయల్గాచె వధూనఖాగ్రములచేఁ గాయంబు వక్షోజముల్, రాయన్రాపడె రొమ్ము మన్మథవిహారక్లేశ విభ్రాంతిచేఁ, బాయంబాయెను బట్టగట్టెఁ దలచెప్ప న్రోతసంసార మే, చేయంజాల విరక్తుఁ జేయఁగదవే శ్రీకాళహస్తీశ్వరా!" (కా. శ. 14 ప.)

అని కవి స్వీయముగా దానువ్రాసినశతకములో నీరీతిగా వ్రాసియుండుటచే నట్టివాఁడై యుండునేమో యని యూహింపవలసియున్నది.

ఇతఁడు రచించినకాళహస్తిమాహాత్మ్యము నాలుగాశ్వాసములు పరిమితిగలది. దక్షిణకైలాసమని ప్రసిద్ధి నొందిన శివక్షేత్రమగు కాళహస్తిపురవర్ణనతోఁ బ్రథమాశ్వాస మారంభమైనది. నారాయణవనమను పురము నేలుచున్న యాదవభూపాలుని భక్తినిబరీక్షించుటకు శివుఁడొకనాఁడు జంగమవేషమును ధరించి యాపురవీథులలోఁ దిరుగుచుండఁగానొక రాజదాసి యాతనిఁజూచిమోహించి తనయింటికి గొనిపోయెను. ఈదాసి యామాయాజంగమ పరిచర్యారతాత్మయై రాజమందిరమునకుఁ బోనొల్లకయుండెను. అంత నారాజు కుపితుఁడై భటులచే దానిని బిలిపించి దానికొప్పు గోయించెను. అది దిక్కులు ప్రతిధ్వనియిచ్చునట్లేడ్చుచుఁ బరుగిడి యమ్మాయాజంగము పాదములపైఁబడి తనదురవస్థను జెప్పెను. సర్వభూతాను

కంపియగు నప్పరమేశ్వరుఁడు దానిపై రూప్యమునకు వగచుచు నిజకరముచే దానిశిరస్సు స్పృశించి యెప్పటి యట్ల శిరోజములు వచ్చునట్లు చేసెను. ఆదాసి మునుపటి వలె రాజసదనమునకుఁబోయి పనులుచేయుచుండగా రాజుచూచి విస్మయమునొంది దాసినడుగఁగా నదిమా యింటి కతిథిగా నేతెంచిన యొకజంగమయ్య కటాక్షముచే నాజుట్టు మునుపటివలె వచ్చెనని చెప్పెను. అపుడా రాజు శివభక్తాగ్రగణ్యుఁడగుటచే నాజంగమును జూచుటకు తనపరివారముతో దాసియింటికిఁబోయి యాతఁడు సాక్షాత్పరమశివుఁడని యెఱింగి భక్తి నమ్రుఁడై యాతని పాదములపైఁబడి మ్రొక్కిన సంతోషించి యాజంగమ రూపియగు శివుఁడారాజునకుఁ గాళహస్తి క్షేత్రోత్పత్తి ప్రకారమును దానిమాహాత్మ్యమును చెప్పఁదొడంగెను. ఈప్రబంధమంతయు శివునికి యాదవరాజునకు జరిగిన సంవాదమునే ప్రతిపాదించుచున్నది. కాళహస్తిక్షేత్రమందు తపంబాచరించిన వసిష్ఠమహర్షి కీశ్వరుఁడు ప్రత్యక్షమగుట, సువర్ణముఖరియనునది పుట్టినరీతి, అగస్త్యుఁడు వింధ్యపర్వతోచ్ఛ్రాయమును భంగపుచ్చుట మొదలగు కథలు ప్రథమాశ్వాసమందు వర్ణింపఁబడెను.

బ్రహ్మ ఈశ్వరునికొఱకుఁ దపస్సుచేయఁగా నీశ్వరుఁడు ప్రత్యక్షమై యతనికి వరములొసఁగుట, ఒకసాలెపురుగు తననోటిలోని దారములచే నాలయగోపురప్రాకారమంటపాదులనిర్మించి విశేషభక్తితో శివునిఁబూజించుచుండఁగా శివుఁడు దానిభక్తికి సంతసిల్లి దానిని బరీక్షించుట కొకనాఁడు నిజాలయస్థిత దీపశిఖచే నాపురుగల్లిన పట్టునంతయు దహింపఁజేసెను. అంత నామర్కటకము మిగుల దుఃఖపడి ప్రాణములఁ బరిత్యజించుటకు దీపజ్వాలలో నురకబోయెను. ఈశ్వరుఁడు దానిభక్తికి మెచ్చి తన సాయుజ్యమొసంగెననియు, నట్లనే శివపూజాతత్పరమైన యొకకాలసర్పము రత్నములచేతను, నొకయడవియేనుఁగు బిల్వపత్రములచేతను శివలింగమును బూజించి శివసాయుజ్య మొందెననియు ద్వితీయాశ్వాసమందుఁ జెప్పఁబడెను.

'పొత్తపినా' డను దేశమం దొక మహారణ్యము గలదు. అయ్యరణ్యములో నుడుమూ రను నొక బోయపల్లె యుండెను. దానికి నాథనాథుఁ డనువాఁడు రాజు. వానిభార్యపేరు తండె. వారిరువురికి దిన్నఁడను నొకపుత్రుఁడు కలిగెను. కొన్నాళ్లకు వాఁడు పెద్దవాఁడై సవయస్కులగు కిరాతకుమారులతో మృగయావిహారార్థమై యరణ్యమునకుఁ బోయెను. అచట చిర మృగయాసేవనమువలనఁ బరిశ్రాంతుఁడై వటవృక్షచ్ఛాయయందు మైమరచి నిద్రించియుండఁగాఁ బరమేశ్వరుఁడు స్వప్నమందు సాక్షాత్కరించి యాయడవిలో నొకమూల నొకమఱ్ఱిచెట్టు క్రిందనున్న శివలింగమును బూజించుకొనుచుండుమని చెప్పి తిరోహితుఁడయ్యెను. అంతఁ దిన్నఁడు మేల్కాంచి నలుగడలం బరికించి చూచి యెవ్వరింగానక విస్మయాక్రాంతచిత్తుఁడై యున్నసమయమున నొక యడవిపంది యాతని యెదుటనుండి పరుగెత్తి పోయెను. దానిని గొట్టుటకుఁ దిన్నఁడు ధనుష్పాణియై దాని వెనువెంట బరుగిడెను. ఆకోలము తిన్ననిఁ దనవెంబడిఁ జాల దూరముగాఁ దీసికొనిపోయి శివుఁడు కలలోఁ జెప్పిన శివలింగము దరిఁ జేర్చి యంతర్ధానము నొందెను. అప్పుడు తిన్నఁడు తనకు శివుఁడు స్వప్నమందుఁ జెప్పిన శివలింగ మిదియే యని గురుతుపట్టి దానికి సాష్టాంగదండప్రణామంబు లొనరించి నాఁటినుండి యా శివలింగమును గడు భక్తితోఁ బూజించుకొనుచుండెను. ఇతనితో వేఁటకు వచ్చిన కిరాతకుమారులు పందివెంబడిఁబోయిన తిన్ననిఁ గానక యమ్మహారణ్యమునందు వెదకి యెట్టకేల కతనిం గాంచి పల్లెకురమ్మని నిర్బంధించిరి. లింగపూజను విడిచి రానని తిన్నఁడు పలికెను. ఇట్లు ప్రతిదినము తిన్నఁడు సేయుచున్న శివపూజకు మెచ్చి శివుఁ డాతనికి స్వసాయుజ్యము నొసంగెను. ఇది తృతీయాశ్వాసములోని కథ.

పిదప నత్కీరుని కథ వక్కాణింపఁ బడియె.

ఈ నత్కీరుఁడు దక్షిణదేశమం దున్న మధురాపురము నేలు పాండ్యభూపాలుని యాస్థానమం దుండెడు ద్రావిడభాషాకవిపుంగవుఁడు. ఇతనికాలమందు మిగులఁ బ్రసిద్ధికెక్కిన ద్రావిడకవి. రాజసన్మానమునకుఁ బాత్రుఁడై యుండెను. ఇట్లుండ నొక కాలమందు దేశక్షోభకరంబగు మహాక్షామము సంభవించెను. దేశపుప్రజలశనశూన్యులై మడియుచుండ నాదేశమును విడిచి యెందేని బోవ సమకట్టిన యొక బ్రాహ్మణునివీక్షించి మహేశ్వరుఁడు ప్రసన్నుఁడై శృంగారరసానుబద్ధంబగు నొకపద్యము ద్రావిడభాషలో రచించి యిచ్చి యీ పట్టణము

నేలేడు రాజు నెదుటికరిగి దీనిని జదువుము. రాజు మెచ్చి నీకుఁ గొంతధనమిచ్చును. దానితో నీ క్షామకాలమును గడపగలవు. ఇంతలో వర్షములు కురిసి దేశము సుభిక్షముగా నుండునని చెప్పి పంపెను. అట్లావిప్రుఁడు రాజసమ్ముఖమునకుబోయి శివప్రణీతంబైన యా పద్యమును జదువ నందలియర్థంబు "సింధురరాజ గమనాధమ్మిల్లబంధంబు సహజగంధంబు" అని యుండుటంజేసి రాజుసభలోనున్న నత్కీరుఁ డా పద్యమును విని యది కవిసమయవిరుద్ధమనియు సరిగా నుండలేదనియు నాక్షేపించెను. అంతఁజదువురాని యాద్విజుఁడవమాన ఖిన్నమానసుండై ఆశాభంగమునొంది మరలశివునియొద్దకుఁబోయి జరిగిన వృత్తాంతమును దెల్పెను. అది విని ఖండేందుశేఖరుఁడు మిక్కిలికోపించి ఎట్టెట్టూ, నాకవితయందు నత్కీరుడు తప్పుబట్టెనా? కనుగొందము రమ్మని యా భూసురుని వెంటనిడుకొని రాజుసన్నిధికిం బోయి నత్కీరునిగని "గిరితనయా కచభారము సహజగంధము" అని యర్థాంతరమును గల్పించి చెప్పినను వాఁడు వినక "ఇట్లుపలుకుట మానుము. ఇది ప్రత్యక్షవిరుద్ధము" అని మాత్సర్యముతో బలికెను. అందుపై నగజావల్లభుఁ డతికోపావిష్టుఁడై ఘోరమగు కుష్ఠవ్యాధిచేఁ బీడితుఁడ వగుము" అని నత్కీరునికి శాపమిచ్చెను. అంతవాఁడు భయమునొంది గడగడ వడఁకుచుఁ బరమేశ్వరుని పాదపద్మములపైఁ బడి వేడుకొని శాపాంతము ననుగ్రహింపుమని మొఱపెట్టెను. మృడుఁడప్పుడు కరుణార్ద్రచిత్తుఁడై నా కైలాసమును జూచితివేని నీకీవ్యాధి మానునని చెప్పి తిరోహితుఁడయ్యెను. శాపసమనంతరమందే శరీరమందు బ్రవేశించిన కుష్ఠవ్యాధిచేఁ బీడితుండయ్యును నత్కీరు డీశ్వరాజ్ఞానుసారముగాఁ గైలాస దర్శనమునకై బయలువెడలి మార్గమధ్యమం దనేకనదులను, పుణ్యక్షేత్రములను, పర్వతములను, అరణ్యములను జూచుచు జనిచని యొకయడవిలో నొక రాక్షసునిచేతిలోఁ జిక్కువడియె. తప్పించుకొనుట కశక్తుఁడై యీశ్వరపుత్రుఁడగు కుమారస్వామిని బ్రార్థించెను. అపుడు తారకారాతి వానికిఁ బ్రత్యక్షమై యయ్యసురుఁ దునుమాడి దక్షిణకైలాసమని ప్రసిద్ధినొందిన కాళహస్తి క్షేత్రమును నీవు సేవించినయెడల నాకైలాసదర్శనఫలము లభించును. ఈవ్యాధి మానునని యుపదేశించి యదృశ్యుడు కాగా నత్కీరుఁడు కాళహస్తికిబోయి యా పరమేశ్వరుని సేవించి ద్రావిడపద్యశతకముచే స్తుతించెను. దానిచే నీశ్వరుడు సంతసిల్లి నిజపదము ననుగ్రహించెను. ఇది తృతీయాశ్వాసకథ.

మధురాపురంబున నివసించు మాణిక్యవల్లి యను వేశ్యయొక్క పుత్రిక లిద్దరు కాళహస్తికిఁ బోవుచుండఁగా వారికి దారిలోఁ జోరులవలనఁ గలిగిన భయమును శివుఁడు నివారించుట, పూర్వకాలమందు వాలి పూజించిన శివలింగమును వారు సేవించుట, కొనకా వేశ్యాదుహిత లిరువురు గిరీశునికృపచే ముక్తినొందుట మొదలగు కథలు చతుర్థాశ్వాసమందుఁ గథితములయ్యె.

ధూర్జటి కవన శైలి

ధూర్జటికవనము నిరర్గళధారతోఁగూడి ఓజోగుణభూయిష్ఠమై యొప్పుచున్నది. ప్రబంధములోని పద్యములు కొన్ని నారికేళపాకముగలవి. మఱికొన్ని ద్రాక్షాపాకభరితములు. పోతనవలె నీతఁడు నంత్యనియమములయం దభిలాష గలవాఁడు.

ఉ. చెంగట నుండఁ గాంచెఁ
          గవిసింహముపోయి హిమానలాత్మజో
    త్తుంగకుచోపగూహన వి
          ధూతమనోభవభూతిలేప స
    ర్వాంగము లోచనీకృత సు
          ధాంశుకృశానుపతంగము న్వని
    ర్లింగము జంబునాథ శివ
          లింగము భక్తమనోబ్జభృంగముల్.
(3 ఆ. 181 ప.)

చ. చనిచని కాంచె నంతఁ గవి
          చంద్రుఁడు ధన్యుఁ గవేరకన్య జీ
    వనశితఖడ్గఖండిత భ
          వప్రభవాఘవిరోధి సైన్యుఁ బా
    వన నిజనామసంస్మరణ
          వారిత మానవదైన్య నిత్యమ
    జ్జనరతకోటిముక్తిపద
          సౌఖ్యవదాన్యుఁ గృతావగాహుఁడై.
(3 ఆ. 182 ప.)

కవి యీ ప్రబంధములో వాడుకలో లేని దేశ్య పదములను బ్రయోగించియున్నాఁడు.

1. అరబములు=పైరు.

2. గోవాళ్లు=యువకుఁడు (ఇది నిత్యబహువచనాంతము.)

3. కొట్ర=ఎసరు.

4. కారాకూరము=బలాత్కారము.

5. రొక్కారొక్కములు=పలువిధములు.

6. మల్లె=సస్యవ్యాధివిశేషము.

7. లూలామాలపుమాటలు=మోసపుమాటలు.

8 గిద్దులు=ఒకవిధమైనడేగలు.

9. గగ్గులకాడు=సిగ్గు లేనికఁకి.

ఇట్టిపదము లనేకము లున్నవి.

ఈకవి—పిడి (ఆడయేనుఁగు)

తిరు=శ్రీ.
పెణ్ణాస=స్త్రీమీఁదియాశ.
మణ్ణాశ=భూమ్యాశ.
పొన్నాశ=స్వర్ణాశ.

మొదలగు ద్రావిడపదములను,

1. మాడబేకు=చేయుము.

2. దేవరు=దేవర.

3. బిడారు=బస.

4. ఓజమాడు=విచ్చేయుము.

5. మార్తమాడి=స్నానముచేసి.

ఇత్యాది కర్ణాటకపదములను ప్రయోగించియున్నాఁడు.

ఇతని కవనమం దెచ్చటను ఛందోనియమోల్లంఘనము గానరాదు. కాని దగలకుఁ బ్రాసమైత్రి గలిపియున్నాఁడు.

శా. కోదండంబుల నిట్టు లొండొరు జటా
కోటీరము ల్లక్షి ప
క్షోదేశంబుల నంసభాగముల స
క్రోధంబున న్వేయుచున్
రోధోంతంబున నట్టహాసములు నా
ర్భటిపిక్కటిల్లంగ బా
హాదర్పంబున మల్లసంగరము సే
యంజొచ్చి రద్రాద్యనుల్ (4 ఆ-18 ప)

కాని యీ ప్రయోగము నిష్ప్రమాణముగాదు. ఆదిపర్వములో నన్నయకూడ నిట్టిప్రాసమునే చెప్పెను.

ఉ. కాదన కిట్టిపాటి యప
కారము తక్షకుఁ డేకవిప్రసం
బోధనఁజేసి చేసె నృప
పుంగవ..."

నృసింహపురాణములోనియీపద్యమునుజూడుడు:

క. వేదములాదిగఁ గల య
ష్టాదశవిద్యలకు నీవ ప్రష్టవు తత్త
ద్బోధకులును భవదాజ్ఞా
పాదకులు సమస్తసర్గపాలనచతురా.

ఇశ్వసంధి, పట్టుక, చేసుక మొదలైనప్రయోగము లీకవికి సమ్మతములు.

వేడినెత్తురులు జేగుఱుశేఁటులు కొండనుండి జాఱొప్పున గార వీరరస మొల్కెడుచందము దోఁప నుగ్రుఁడై. (2 ఆ. 56 ప)

ఇచట "జాఱునొప్పున" అని యుండవలెను.

చిందమృతంబుబిందువుల శంకం గ్రమ్మఁగంజేయుచున్. (2 ఆ. 134 పం)

ఇచట "చిందు నమృతంబు బిందువు"లని యున్న సరిగా నుండును.

ఇతఁడుచెప్పిన స్వభావోక్తులు మిక్కిలి చారుతరములు. వాలి శివలింగమును బెకలించుపద్య మెట్లున్నదో చూడుఁడు:

ఉ. గ్రక్కున లేచి కాలమున
గాఢతరంబుగఁ జుట్టి పిక్కలు
క్కెక్కఁగఁ ద్రొక్కి నిల్చి తను
వించుక వంచి కరంబు లూరులఁ
నొక్కి ముఖాంబుజంబునఁ
గనుంగవఁ గెంపుజనింపఁ జేవమై

నిక్కఁగఁ ద్రుంగఁ బాదములు
నేలఁ జలింపదు లింగ మేమియున్.
(4 ఆ. 74 ప)

శివార్జునులమల్లయుద్ధ వర్ణనము:

సీ. చెయ్యిచ్చి యొకకొంత సేపునేర్పున బిగ్గి
యినుమడింపఁగఁ జోరనీకమలసి
యొక తెఱంగునఁ జొచ్చి యొండొండఁగా సెలు
నొడిశి పట్టుక కొంతతడవుపోరి
యది మాని కొంతప్రొద్దవనినూదినకాళ్లు
పెకలించి పడవైవఁ బెనఁగిపెనఁగి
మఱికొంతవడి మెడవిఱియ భుజముత్తిలఁ
జిక్కించి యక్కున నొక్కినొక్కి
తే. గీ. నడుముల నొడిసి కబళించి పుడమిమీఁద
సమముగా వ్రాశి బలపరాక్రమము లెసఁగ
హెచ్చుగుం దేమియును లేక యీశ్వరుండు
హరిహయసుతుండు మల్లసంగర మొనర్చె.

కడుపుతీపు

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

(చీకటివేళ)

సకల జగమునకును జైతన్యమొనగూర్చి, కాంతి మెఱసినట్టి కర్మసాక్షి
తేజుదొఱఁగి చాటుగాఁ జనె నిఁకమీఁద, నేది జరిగనేమి యెవరి కెఱుక?

గీ. సూర్యు నసిపెనుఁ జంద్రుఁ జుక్కగమిని, మబ్బుతెరచాటునకుఁ దార్చి మాటుపఱిచె
గాలమాయావి యిఁకనేమి కానిపనులు, చేయనున్నాఁడో ముందెట్లు చెప్పవచ్చు?

గీ. నాఁడు మానిసి యఱమేను పాడుపడెను, తేజుమాసెను దానికిఁ దెలివిమాసె;
పక్షవాత మహావ్యాధిబాధయేమొ?, కల్గునట పక్షపాత దుర్గతుల కదియు.

సీ. మెల్లమెల్లగఁ బిల్లు లిళ్లెల్లశోధించు, గ్రుడ్లగూబలు చెట్లకొమ్మ లరయు
పురుగుపుట్రలు పుట్ట పొదరు వీడి చరించు; బెబ్బులుల్ కానల బొబ్బరించు
జార-చోరులు తప్పుదారు లారయుదురు, మాయామహాశక్తి మచ్చరించు
జాగ్రత్త చల్లఁగాఁ జల్లనాఱును విజ్ఞ, తాద్రవ్య మది మోహ ముద్రితమగు
గీ. అడరి కామపిశాచి తా నావహింప, నరులు నారులు చెలరేఁగి మరులుకొందు
రెందుకని సృష్టిచేసెనో యీశ్వరుండు, కటికతనమూని కటికచీకటిఁ గటకట!

వ. అప్పుడా యిల్లాలు.

గీ. శీఘ్రముగను వంట చేసెను భర్తకు, బుడుతకుఱ్ఱలకును భుక్తివెట్టె
అద్దె యింటివారి పెద్దపంచముపయిఁ, బరుపు దులిపి చక్కఁ బ్రక్కఁగూర్చె.

ఉ. మంచముమీఁదఁ బుత్త్రకులమధ్యమునన్ శయనించుఁడంచుఁ బ్రా
ర్థించెను భర్తఁ, బుత్త్రుల కదే వెసఁజెప్పెను "వానయీఁదురన్

మించెనుగాన యయ్యకడనే శయనింపుఁ డటంచు "నా సుతుల్
కొంచెముగూడ దాని కనుకూలురుగారయి రెంత చెప్పినన్.

ఉ. "నాయన చెంతఁ బండుకొనినన్ మఱి నిద్దుర రాదు మాకు న
మ్మా! యదియేల నేలపయి మాకును నీకడఁ బక్కఁగూర్పుమా
హాయిగ నిద్రవోదు మిపుడన్నము నీవును దిన్నదాఁక మే
మీయెడఁ గూరుచుందు" మని యెంతయు వారలు వంతగింపఁగాన్.

క. చెప్పిరి వలదని చెప్పిరి, చెప్పిరి తలిదండ్రు లెంత సెప్పిన నదివా
రొప్పికొనరయిరి కడకుం, దప్పనిసరి వారి పట్టుదలయే నెగ్గెన్.

వ. అందులకు,

గీ. "అమ్మయమ్మ యటంచు చెప్ప డమ్మకొఱకె, రోదనంబాయె నేహాదురోకదమ్మ
అమ్మలేకున్న" నని యామె యుమ్మలించి, యార్తయై పల్కె నదివిని భర్త యుల్కె.

గీ. జనని భోజనమ్ము సలుపుచు నుండఁగాఁ, గొడుకుఁ గుఱ్ఱ లెదురఁ గూరుచుండి
రెట్లొ కనులఁ గునికిపాట్లు తాండవమాడ, నాఁచుకొనుచు నిద్రఁ బాచుకొనుచు.

ఉ. వేగభుజించి యంట్లరసి విస్తళు లెత్తి విశుద్ధిఁజేసి క
న్నాగక తూఁగు బిడ్డలకునై వడి సావడిలోన నేలపై
బాగుగఁ గంబళిం బఱచి ప్రక్కఘటించెను "జక్కఁజాఁగె మీ
యాగడమే" యటంచుఁ దనయావలి నావలిశయ్యఁ జేరిచెన్.

క. శయనించెఁ బట్టెమంచము, పయిఁ బెనిమిటి పుత్త్రకులును భార్యయు నేలన్
శయనించిరి; తోడ్తోనిద్రయువచ్చెన్ సాధ్వి యొక్కతెయ మెలఁకువతోన్.

ఉ. "చెప్పితిఁ జెప్పితిన్ వినరు చిట్టినిసుంగులు పట్టెమంచమం
దొప్పుగ నిద్రవోవఁదగదో! నిదురాచిరి కాచి రింత కీ
చొప్పున నేల నన్నొఱయుచున్ శయనించిరి యమ్మమీఁద మా
యప్పల కెంతప్రేమ మహహా యని చేఁ దడవాడె" వారలన్.

ఉ. చిక్కఁగ వెన్నసంటి పయిఁ జేయిడి యొక్కఁడు, నాచియాచిపాల్
గ్రుక్కలఁగొంచు నొక్కఁడును, గోకచెఱంగును గొంచు నొక్కఁడున్
ముక్కును మూతియుం దడవి పుణ్కుచునొక్కఁడు, పుత్త్రు లమ్మ కిర్
ప్రక్కలఁ జక్కనిద్రగొని రమ్మకు నెమ్మది చెమ్మరింపఁగాన్.

శా. "స్వామీ యేమియు నేర రీ నిసుఁగు లజ్ఞానుల్ గదా! నాయెడన్
బ్రేమోద్రేకముచేత నేలపయినే నిద్రించుచున్నారు; ని
ద్రాముద్రా వివశత్వమందిపు డనర్థం బేమి లేకుండఁగా
క్షేమంబారఁగ వీరి నేలుకొనవే శ్రీకాకుళాధీశ్వరా!

వ. అంచుఁ గాకులేశ్వరుఁ బ్రార్థించి తానును నిద్రావివశయయ్యెను. అప్పుడు,

సీ. కీచురాళ్లు రవళ్లు రేఁచె బాలకు లీల, వైచినట్టును గంచుగీచినట్టు
భేకముల్ నెగయించె బెకబెకలఱవఱ, లఱవలు బెరసి కాఱాడినట్టు
పాఱువాఱెడు వెల్లి హోరు ఘోరంబయ్యెఁ, బేర్చి గెల్చిన సేన యార్చినట్టు
ముసురుచీకటియాద్రు ముజ్జడ్డుగా రేఁగెఁ, గఱవక్కఱయు లేమి దొరసినట్టు
గీ. పౌరు లటువంటి చీకాకు కారణముగ, గుండెలు గుబుల్ గుబుల్ మని కొట్టుకొనఁగ
వారివారిండ్లలో వారువారు వెచ్చ, ముచ్చముడిఁగి నిద్రించిరి ముచ్చటుడిగి.

వ. అంతఁ గొంతకుఁ దద్గృహమున.

ఉ. లాంతరులోనదీపము చెలంగుచునుండెను రాత్రి యెంతయో
కొంతచనెన్ గడంగి పసికున్నఁడు మేల్కని పాల కేడిచెన్
గాంతయు నంత మేలుకని కాల్కడి కడ్గికొనంగ నంగణ
ప్రాంతముకై చనెన్ దెఱచి ద్వారము వెల్తురు దారిచూపఁగాన్.

ఉ. కొండొకయేడ్పు కన్మొగిచెఁ గుఱ్ఱఁడు 'పాలకునేడ్చె బాలకుం
డెండెనొ గొంతు'కంచు జనయిత్రియు నాత్రముతోడఁ దల్పులన్
గొండెము వేసివచ్చెఁ బడుకొన్న కుమారకు మూరుకొంచుఁ గూ
ర్చుండెను జేపువచ్చి చను లుబ్బఁగ దబ్బున మేలుకొల్పఁగన్.

శా. తెల్లంద్రాచఱె యప్పు డామెపయి కుద్రేకించి దూఁకెన్ బుసల్
చల్లెన్ పైఁ బడగార్చె నంత సుతరక్షాచింత యేతక్కఁ ద
క్కెల్లన్ ద్రోపడ నాపె పాపశిరమట్టే పట్టె నిర్చేతులన్
"బిల్లల్ పిల్లలు పిల్ల"లంచు నఱచెన్ బీభత్సకంఠధ్వనిన్.

ఉ. నిద్దురమున్గియున్న మగనిన్ సుతులన్ మఱిపొర్గువారలన్
దద్దరిలంగఁజేసె నలతన్వి విషాదపురోదనస్వరం
బెద్దియుఁదోపకే పెనిమి "ఏమది యేమది"యంచు గుండియల్
బ్రద్దలుగా నిలంబడియె బాలురు లేచిరి గోలుపెట్టుచున్.

క. "అయ్యో! బిడ్డలఁ జేకొను, డయ్యో బిడ్డలని యేడ్చె" నంతే కాని
యయ్యమ్మ పాముఁబట్టితి, చెయ్యిదిగో కఱచు ననుచుఁ జీర దయారే!

ఉ. "మంచముఁ జేర్చుఁడీ వడిగ మంచముఁ జేర్చుఁడి కన్నబిడ్డలన్
మంచముఁ జేర్చుఁడీ" యను చమాంతముగా సతియట్టు బిట్టురో
దించుడు నేమిమూఁడెనొ గదే యనుచున్ బతి యుక్కిబిక్కిరై
కాంచియుఁ గాంచలేని కనుకాన్పున బిడ్డలఁ జేర్చె మంచమున్.

ఉ. ఆభృశదుస్సహస్వరవిహారము హోరని మ్రోయు వెల్లి సం
క్షోభము మీఱ యీదురు ముసుర్ కలిగించెడు పీడ మించి ని
ద్రాభర ముద్రితాక్షులగు తత్పురవాసుల లేవఁగొట్టెఁ దం
ద్రీభయభుగ్నులన్ జలిపి తెచ్చెను జెచ్చెర వారి యింటికిన్.

వ. అప్పటి కక్కడ.

శా. ఘోరక్రూరవిషోరగంబు తలతోఁ గొట్టాడుచున్ దోఁకతో
నారీరత్నము హస్తయుగ్మకము నంటన్ జుట్టె, నట్టె యెటుం
బోరాకుండగ బట్టె నామెయును దన్మూర్ధాధరోద్దేశమున్
ధారల్ గారుచునుండె రక్తము కరద్వంద్వంబునం దామెకున్.

శా. వారున్ వీరునువచ్చి యచ్చెలువనొంపన్ జంపఁగా నేరరై
రారన్ జుట్టెను రెండుచేతులను బుస్సం జూచుచుండెన్ దలన్
ధీరుం డందొకఁ డుత్తరీయమున నెత్తింగప్పి యప్పాము సం
హారించెన్ బ్రయతించి వీడుపఱిచెన్ హస్తద్వయం బామెకున్.

ఉ. బిడ్డలఁజంపునో యనెడిభీతిని నా తరుణీమతల్లి త
న్నొడ్డెను బాముఁబట్టుకొనె నొందు విచారము నేరదయ్యె నా
బిడ్డల ప్రాణముల్ నిలిపెఁ బిమ్మట నాత్మకథన్ గనుంగొనెన్
గ్రుడ్డులు తేలవైచెఁ 'గనుఁగో భగవంతుఁ'డయంచు మ్రొక్కిడెన్.

ఉ. పాలకు నేడ్చినట్టి పసిబాలుఁడు పైఁబడెఁ, దక్కువారు గ
గ్గోలయి యేడ్వఁజొచ్చి, రట కొందఱు మందుల నూఱితెచ్చి, రా
భీలవిషార్చు లంగములఁ జేర్చి దహింప నుపక్రమించెఁ, బు
త్రాళిని భర్త నత్తఱి సమాకులమై కని యాకె వాకొనెన్.

ఉ. "ఒత్తిలియేడ్చు నాఁకటికి నోపఁడు పాపఁడు, చేఁపువచ్చెఁ బా,
లిత్తునటన్నఁ బాపవిష మెట్లొకొ? యిట్లొకయింత యేడ్చి తా
నత్తఱిఁగూరికెన్, దెలియదయ్యెను దయ్యము నెత్తికో, లయో.
నెత్తిని మూఁగియున్న పెనునిద్దుర యిద్దరవస్థఁగూరిచెన్."

వ. అని మఱియు,

క. "పసిబిడ్డలసేమ ముపేక్ష సేయవల దట్లుమీరు శపథము సేయన్
వ్యసనమ్మువీడి సుఖముగ, నుసురువిడుతు" నంచు భర్తనొత్తిలి వేఁడెన్.

మ. "కసుఁగందుల్ వెరవెందు లేదు, తఱికిం గద్పార నాహార మి
చ్చి సమాశ్వాసమొనర్తు రెవ్వ రిఁక? మీ క్షేమం బెటో?" యంచుఁ ద్రొ

క్రీసలాడెన్ బతిఁజూచెఁ బుత్త్రులఁగనెన్ గేలార్చె నిట్టూరిచెన్
"బసిబిడ్డల్ పసిబిడ్డల" న్పలుకుతోఁ బ్రాణంబులన్ వీడ్కొనెన్.

*　　*　　*　　*　　*　　*　　*

ఇది చీకటివేళ

ఉ. ఆయమ మండ చేతఁగొని యావలవై వఁగ రేవుచెంత నే
దో యగపడ్డ దట్టె యది యూహ యొనర్పఁగ సర్పమేయగున్
బోయిన జీవమున్ నిలిపెఁ బ్రొద్దుట నాయమ చేయి, యిప్పుడా
చేయియె శత్రువై కఱవఁ జేకుఱె నా కుటిలాహిదంష్ట్రకన్.

వ. ప్రజ లామె నిట్లు ప్రస్తుతించిరి:

గీ. కొడుకుఁ గుఱ్ఱలకై జంకుఁగొంకులేక, పాసెఁ దనప్రాణముఁ దృణప్రాయముగను
బూటకంబయ్యె నిప్పు డీబోటివలనఁ, బ్రాణ మన్నింటికంటెఁ దీపనెడిపలుకు.

ఉ. చేసెన్ గాపుర మీపురమ్మునను లక్ష్మీదేవి వోలెన్ సుత
శ్రీసంపన్నత వన్నెఁగాంచెఁ బ్రియునిన్ సేవించె భృత్యాళి నా
యాసంపెట్టక సాకె వాకిటి కతిథ్యభ్యాగతుల్ రా సమా
శ్వాసించెన్ సుతరక్షకై తుదకు నుద్వాసించె సర్వస్వమున్.


సీ. కృష్ణవేణ్ణాతరంగిణిలో సనంతాన, మానందమున స్నాన మాచరించె
ఆంధ్రవల్లభదేవు నారాధన మొనర్చెఁ, దలఁదాల్చెఁ దత్పాదజలముఁ దులసి
పూచిన తంగేడువోలె భూషలు దాల్చె, యింటింట కరిగెఁ బేరంటమునకు
పౌరాంగనలచేతఁ బసుపుఁ గుంకుమములు, గొనియె నెల్లర వీడుకోలు పడసె,
గీ. పుత్త్రరక్షార్థమై ప్రేమమూర్తియగుచుఁ, బుణ్యకాంతాత్వమున ముక్తిఁ బొందెననుచు
నాఁడు నేఁడును బెంపారు నామెపేరు, పేరుకొని కొనియాడు నాయూరునాఁడు.

ఉ. తేళ్లను సర్పముల్ మఱి యెదేవిషజంతువు నాఁటనుండి యా
యూళ్లను బాధపెట్ట వటు లొక్కెడ నెక్కడ నేని పెట్టినన్
నళ్లను నామెనామ మొకసారి దలంచిన బాధయెల్ల దే
వళ్లను గొల్చుచో నలసువాసిని కొల్పును సాగు నచ్చటన్


శా. "ఆత్మార్థం పృథివీం త్యజే"త్తనెడు వాక్యం బేమి వాక్యంబొ తా
రాత్మత్యాగమునన్ జగమ్మునకు శ్రేయంబుం బ్రసాదించి ధ
న్యాత్మల్ శాశ్వతపుణ్యలోకముల నాహ్లాదింతు; రాయమ్మ య
ట్లాత్మత్యాగ మొనర్చెఁ దీర్చెను విషాపాయమ్ము నాయూళ్లలోన్.

గీ సృష్టియెల్లఁ బ్రేమసిక్తము సృష్టికిఁ, గర్తవెలయుఁ బ్రేమమూర్తియగుచుఁ
దత్స్వరూపమందుఁ దనివందువారు గుర్తింపఁగలరు కడుపుతీపురూపు.

చిత్రము ౧



౧. 934. పట్టుదారమున గూర్చిన వెండిపదకముల పేరు. తిబేతుదేశముది. 935. తిబేతుదేశమున లడఖు స్త్రీలు ధరించెడు వెండి తాయెతులుగల పగడముల దండయొక్క భాగము. 936. నేపాళదేశమున బ్రింజర స్త్రీలు ధరించు శిరోభూషణముయొక్క భాగము. నగిషీపనిగల వెండిగుండ్లు, పతకములు, చంద్రవంక, బావిలీలు మొదలయినవి గొలుసులతో గూర్పబడినవి.



౨. 937. ఆఫ్ఘను దేశపు వెల్వెటు ఒడ్డాణము; వైడూర్యములతో, వర్ణరత్నములతోను చెక్కబడినది; బద్ధి అను పేరుగలది. 938. నాగోడు దేశపు జంటపేరుల హారము. వెండిపూవులు, పడవవలెనుండు పదకములు, చిరుగజ్జలు గలది. 939. 'ఝుబ్ఝు' అను పేరుగల వెండి మెడపట్టు. నాగోడు దేశము. 940. వెండి బాజుబందు. మెఱుగెక్కించిన వెండి నగిషీపనిగలది. ఇదియును నాగోడు దేశమువే.

సూత్రసమన్వయము-అహోబలపండితీయము

విద్వాన్ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి గారు

(1) "వాయిరవు ర్వ్యక్రతమా" అనునీ నన్నయభట్టీయసూత్రమునకు "వికృతిశబ్దేషు యః ఐత్ ఔచ్చ తయోర్వా అయి, అవు ఇత్యేతావాదేశౌ స్తః. చెలువై, చెలువయి, ఔరా, అవురా ఇత్యాది." అని యహోబలపండితుఁడు వ్యాఖ్యానము చేసి యున్నాఁడు. దీనింబట్టి వైకృతశబ్దములలో, ఐ, ఔ, అనువానికి, అయి, అవు-అనునవి యాదేశములై వికల్పముగావచ్చునని యహోబలపండితుఁడు పై సూత్రమున కర్థమును గ్రహించినట్లు స్పష్టపడుచున్నది.

వావిళ్లవారి యాదిసరస్వతీనిలయమున ముద్రితమయిన యాంధ్రశబ్దచింతామణికిఁగల యాంధ్రటీకలోఁ (టీకా కర్తపేరు కానరాదు) గూడఁ బై దానికి ఛాయారూపముగనే సూత్రసమన్వయమును స్థాన్యాదేశభావపద్ధతియుఁ గానవచ్చుచున్నవి గాని, 'చెలువయి, చెలువై, అవురా, ఔరా' అని యిట్లుదాహరణములు మాత్రము క్రమముమార్చి యీయఁబడియున్నవి.

ఈ నడుమఁ గ్రొత్తగా వెలువడిన పారనంది రామశాస్త్రులవారి టీకలో "ఐ ఔ క్రమేణ అయి, అవు ఇతివా స్తః. ఐకారము=అయి, ఔకారము=అవు, అనియు వికల్పముగా నగును." అని కలదు.

ఏదేనొకసూత్రము వికల్పముగా నొక కార్యమును విధించునపు డాకార్యము ప్రవర్తించినరూపమును ముం దుదాహరించి పిమ్మటఁ దదభావపక్షమున సిద్ధించు రూపము నుదాహరించుట సంస్కృత వైయాకరణుల సంప్రదాయము. ఇదియే బోధనాపద్ధతికి మిక్కిలి యనుకూలించు మార్గమనుట యందఱకును ననుభవసిద్ధము. ఇట్లుండ సంస్కృత వ్యాకరణసంప్రదాయజ్ఞతను హెచ్చుగా వెల్లడించుకొను నహోబలపండితుఁడు ప్రకృతసూత్రమునఁ దాను వ్యాఖ్య చేసిన రీతిని విధేయ మగు 'అయి, అవు'అను నాదేశములు వచ్చిన రూపములను దొలుతఁ జూపక తలక్రిందుగా నుదాహరించుటలో హేతువు గానరాదు. నన్నయభట్టీయమున వైకల్పిక కార్యవిధాయకము లగు సూత్రములు 23-24 మాత్రమే యున్నట్లించుమించుగాఁ జెప్పవచ్చును. వానిని బరిశీలింపఁగా నందు 15, 16 సూత్రములలోని యుదాహరణప్రదర్శనరీతిలో సంస్కృతశాబ్దిక సంప్రదాయానుసారిత్వమును దక్కిన యే

డెనిమిది సూత్రములలోఁ ద ద్విరోధమును నగపడుచున్నవి. ఆ సూత్రము లన్నిటిని బ్రాతిస్వికరూపముగా నిట యుదాహరించుట యనావశ్యక మని విడిచితిని. సంస్కృతవ్యాకరణపక్కినే సర్వథా యనుసరింపవలయు నను నియమము లేదు గాని యిట్టి వైకల్పికస్థలములలోని యుదాహరణప్రదర్శనపద్ధతి విషయమున సంస్కృతవ్యాకరణపక్కి ననుసరించుట యుక్తమనక తప్పదు.

ఇఁక సూత్రసమన్వయమును విమర్శింతము.

పైని జూపిన మువ్వురు వ్యాఖ్యాతలును "వాయిరవుర్వక్రతమా" అను నీసూత్రములో, 'ఐ ఔ'లు స్థాను లనియు, 'అయి, అవు' లాదేశము లనియు గ్రహించినట్లు స్పష్టము గదా! పైసూత్రములో నుద్దేశము (స్థాని) షష్ఠ్యంతముగా నిర్దిష్టమై లేకుండుటచే వ్యాఖ్యాతలు తమ యిచ్చవచ్చిన చొప్పున స్థాన్యాదేశభావమును గ్రహించుటకు వీలుకలిగి యున్నది. కాని యీపై వ్యాఖ్యాత లనుకొన్నట్లుగాక, 'అయి అవులే' స్థానులనియు, ఐ ఔలే యాదేశము లనియు నన్నయ యభిప్రాయమై యుండునని తోఁచుచున్నది.

అయిదు, ఐదు, అవురా, ఔరా మున్నగు శబ్దముల యవయవములను సాకల్యముగా విభజించి చూపు ప్రక్రియ తెలుఁగు వ్యాకరణములో లేనందున వీనిలో నేది స్థాని యన్నను నేది యాదేశ మన్నను నంతగా బాధ కానరాదు. కాని అగును, అవును, ఔను; అగుదురు, అవుదురు, ఔదురు; అగుట, అవుట, ఔట; అను మొదలగు నీ మూఁడుజాతుల రూపములును నొకేధాతువునకు (అగు ధాతువునకు) సంబంధించియున్నట్లు స్పష్టముగా నగపడుచున్నవి. ఈ యగు ధాతువునకు 'కా' దేశమువచ్చి కాక, కాని, కాఁడు, కారు, కాను, కమ్ము మున్నగు రూపములశాఖ యొకటి యేర్పడి యున్నది. పైని జూపిన రూపములన్నియు భాషావిపరిణామస్వభావమునుబట్టి పరిశీలించునపుడొకే ధాతువునుండి పుట్టినట్లు స్ఫురించుచుండ వీని కన్నిటికిని భిన్నభిన్న ధాతుజన్యత్వమును గల్పించుట మిక్కిలి యసమంజసము. పై రూపము లన్నియు నన్నయాది లాక్షణికుల కెల్లరకును సమ్మతములే యై యున్నవి. వానిలో 'అగును' మున్నగు వానిలోని గకారమునకు, పగ్గలు, పవ్వలు, ఇత్యాదులందువలె "క్వచిద్గకారో వః" అను దానిచే వకారమురాఁగా సిద్ధించు_అవును మున్నగువానికి 'ఔ'అను నాదేశము వచ్చి ఔను మొదలగు రూపము లేర్పడుచున్నవి. అహోబలపండితాదుల మతము చొప్పున, 'ఔను'మున్నగునవి మొదటిరూపములై వానినుండి, 'అవును మొదలగునవి యుత్పన్నములగు నన్నచో నింక_అగును మున్నగు గకారఘటితరూపములు సిద్ధించుటకు మార్గ మేది ? వకారము గకారముగా మాఱునని యెవ్వరును విధించియుండ లేదే! ఇఁక నెవ్వరైన 'క్వచిద్గకారో వః' అను సూత్రమున 'వః = వకారస్య, గకారః క్వచిద్భవతి' అని యన్వయమును మార్చి గకారాదేశమును విధించి

యహోబలపండితాదుల మతమందలి దోషమును వారింపఁజూతురేమో? కాని యట్లు వీలు లేదు. 'క్వచి ద్గకారో వః' అను దానిలోని క్వచిత్పదముచే విధేయము క్వాచిత్కమనుట సుస్పష్టముగదా! భాషనుబరిశీలించినచోఁ బ్రకృతసూత్ర లక్ష్యములలోఁ గకారఘటితశబ్దములు హెచ్చుగాను వకారఘటితములు క్వాచిత్కముగాను నగపడును గావున వకారవిధానమే నన్నయాభిమతమని తేలుచున్నది. ఇదియే నన్నయమతమైనట్లు ప్రకృతసూత్రమును సవరించుచు నథర్వణాచార్యులు 'ఆద్యగస్యగకారస్య వకారస్తు నదృశ్యతే' అని వ్యక్తీకరించియున్నాఁడు. ఏతత్సూత్రాన్వయమున కితరుల యభిప్రాయము లటుండ నిండు, అహోబలపండితుఁడే "క్వచిద్గకారస్య వకారః స్యాద్వికృతౌ - ప్రేగులు, ప్రేవులు" అని యిట్లు స్పష్టముగా వ్యాఖ్యచేసియున్నాఁడు. ఇట్లుండ నీ సూత్రమున కర్థాంతరమును గల్పించి యహోబలాదుల మతమును సరిపెట్టుట యసాధ్యముగదా! కావున 'వాయిరవుర్వక్రత[సూ]' సూత్రములో ఐఔలు స్థానులన్నచో, అగును, అగుదురు, అగుట మున్నగు రూపములు సిద్ధింపనేరవు. అయ్యవి వాగనుశాసనుని కనిష్టములని యెవ్వరేని నిరూపింపఁగలరా? చింతామణిలో నన్నయ యాంధ్రభాషను సాకల్యముగా సాధించియుండనందున నీ శబ్దములనుగూడ సాధింపకవిడిచెనని యందురేమో! అది యుక్తము గాదు. సరళముగా నున్న యాతని సూత్రమును మనము వక్రమార్గమున నన్వయింప నేల? రూపములు సరసముగా సిద్ధించుచుండ సాధింపక విడిచెనని యాతని గ్రంథమున కనవసరముగ లోపమును గల్పింప నేల?

పై విషయ మటుండనిచ్చి యుచ్చారణస్వభావమునుబట్టి మనము విమర్శించినను అయి, అవులకే స్థానిత్వము స్థిరపడుచున్నది. జనులు సామాన్యముగా నుచ్చారణ విషయమున సౌకర్యాపేక్షులై యుండుట స్వాభావికము. అయి, అవు అను వీనిని విడివిడిగాఁ బలుకుటలోఁ గొంత క్లేశ మున్నది గావున నయ్యవియే మొదటిరూపము లనియు నవి క్రమముగా ఐఔలుగా మాఱియుండుననియు నంగీకరించుట సయుక్తికము.

అఇ-అ ను రెండువర్ణములునుగలిసిఐకారముగాను అ ఉ-అను రెండువర్ణములునుగలిసి ఔకారముగాను మాఱెననియుఁ, గావున ఐ ఔలు సంధ్యక్షరములనియు భాషాశాస్త్రజ్ఞులు సిద్ధాంతీకరించి యున్నారు. ఈసిద్ధాంతముగూడఁ బై యంశమును మిక్కిలిబలపఱుచుచున్నది.

అదిగాక 'వాయిరవుర్వక్రతసూ' అను సూత్రమందలి పదవిన్యాసపద్ధతియు, 'అయియవుల'స్థానిత్వమునే స్ఫురింపఁజేయుచున్నది.

ఇదంతయుఁ బరిశీలించియే కావలయును జిన్నయసూరి 'అచ్చికంబులం దయి యవులకు వక్రతమంబులు బహుళంబుగానగు" అని సూత్రించి తదనుసారముగాఁ బ్రక్రియనంతను నడిపించియున్నాఁడు.

ఈసందర్భమునఁ బ్రసక్తానుప్రసక్తముగ నొకయంశమును జూపవలసియున్నది. వసుచరిత్రమున:

"ఓలంబాలక యోలయోలయన.........
రోలంబాలక యోర్తుగ్రుంకిబసవల్లుల్లుద్ధిన్మ్రి..."

(3 ఆ-162 ప.)

అనుపద్యమునకు వ్యాఖ్యవ్రాయుచు సోమకవి యిందలి రల యతి సాధువగునా కాదా యని చర్చించుచు నహోబలపండితుఁ డద్దాని నంగీకరించి 'రాయంచ కాళ్లఁ దౌలకయు మున్నె' అను రామరాజభూషణుని ప్రయోగాంతరమును జూపెననియు, నిందలి 'తౌలక' అను చో వక్రతమాదేశమును విధించు సూత్ర మెచ్చటను లేదనియు, నద్దానికహోబలపండితుఁడు మార్గము చూపలేదనియు, 'అయిగవుగాదే శౌస్తః క్రమేణ సర్వత్ర వక్రతమయోర్వా' అని సూత్రమున్నది గాని యయియవులకు వక్రతమాదేశమును విధించుసూత్రము లేనేలేదనియు నేమేమో వ్రాసియున్నాఁడు. 'వాయిరవుర్వక్రతమా' సూత్రమునకుఁ దలక్రిందుగా వ్యాఖ్యచేసిన యహోబల పండితుని కీయాక్షేపణము తప్పదు. కాని ప్రసంగవశమునఁ దౌలకయను రూపసిద్ధికై యింత దూరము పెనఁగులాడిన సోమకవి 'వాయిరవుః...' సూత్రమును దాను జూపి దానికి సరియగు నర్థముఁ జెప్పి యహోబలపండితుని సవరించినచో నెంతేని సమంజసముగా నుండెడిది. అట్లుచేయక తత్సూత్ర విషయమునే స్మరింపక చింతామణిలో లేనట్టియు నప్పకవీయమునఁ బ్రక్షిప్తమగునట్టియు 'అయిగవుక్' అను కారికను మాత్రము గ్రహించి తౌలక యనునది సాధువుకాదని తలంచి తాను రలయతి నంగీకరింపనివాఁడు గావున స్వమతోపష్టంభకముగా 'కలహంస కాళ్లఁ దవులకమున్న' అని పాఠమును దిద్దుట కనువుపడునట్లుగఁ బ్రసంగించి యూరకుండుట సరసముగాఁ గానరాదు. ప్రకృత సూత్రమున అయి, అవులకు స్థానిత్వమును గ్రహించినచో 'తౌలక' మున్నగు ప్రయోగములు నిర్బాధకముగా సిద్ధించును.

ప్రౌఢవ్యాకరణము, సమాస - 31 వ సూత్రములోను, శబ్దరత్నాకరము లోను, అవుగాములు, అనుదానినుండి, ఔగాములు- అనునది సిద్ధించెనని నిరూపించుచుఁ బ్రౌఢవ్యాకరణకర్త యిట్టియెడ, అయి యవులే పూర్వరూపములని స్వాశయమును వ్యక్తీకరించియున్నాఁడు.

పైని నిరూపించిన హేతువులన్నిటినిబట్టి "వాయిరవుర్వక్రతమా =అయిః అవుశ్చ వక్రతమా ఐకారౌకారౌ వా భవతః" అనఁగా నయి యవులకు నైకారౌకారములు వికల్పముగావచ్చును. అని సూత్రమును సమన్వయించుట సమంజసమని తోఁచుచున్నది.

పండితులు విమర్శింతురు గాక!

పశ్చాత్తాపము

ఓలేటి వేంకటరామశాస్త్రి గారు

నీకమ్మతావి నెమ్మన, మాకర్షింపఁగఁ బ్రలోభితాత్ముఁడనై యి
ట్లేకోసితి; నకటా! నీ, వీకరణిం జెడుదువనుచు నెఱుఁగ సుమంబా!

ఆ. గీ. నిత్యమును ధరించు నిజభూషణము వీడి, పొలుపువాయుచిగురుబోడి వోలెఁ
దనయమూల్యభూష నినుఁబాసి యీతీవ, చిన్నవోయి యకట! చెన్నుఁదఱిగ.

చ. అడవులయందొ శైలశిఖరాగ్రతలంబులయందొ మానవుల్
నడవఁగరానిచోటుల విలాసవిశేషవిజృంభణంబులే
ర్పడ వికసించి సౌరభపరంపర దిక్కులవెల్లిఁగొల్ప కి
క్కడఁబొడసూపి మాదృశుల కిన్నలు కుట్టఁగనేల పుష్పమా!

తే. నీవిలాసంబు నీసొంపు నీదుకంపు, నింపుసేయుచు నెదుట వర్తింపఁజూచి
తెంపు పెంపూని యెవ్వాఁడు త్రుంపకుండు?, త్రుంపి నీసోయగము చెడద్రొబ్బకుండు?

ఆ. గీ. స్వార్థపరత నీయనర్థంబుఁ దలఁపక, కోసివైచి యొగుఁజేసినాఁడఁ
బరులకీడు నెట్లు పాటింపఁగా నేర్తు, నాత్మలాభలోభినైన యేను?

తే.గీ. భృంగడింభకములకు డప్పికలు దీర్పఁ, గమ్మతావులు దెసలందుఁ గుమ్మరింప
విరిసితివి కాని, మత్తీక్ష్ణతరనఖాగ్ర, హతి ననుభవింప విరిసితివా? సుమంబ!

గీ. సహజసౌందర్య విభవప్రశస్తితోడ, జీవకళ లొప్పఁ జక్కనితీవచివర
నవ్వుచుండఁగఁ జూచి యానందపడక, గిల్లనేటికి నాబుద్ధి పొల్లుగాను?


గీ. కమ్రతరమైన యీలతాగ్రంబునందుఁ, బసరుటాకులనడుమ నొప్పెసఁగునపుడు
గానవచ్చిన సౌభాగ్యగరిమ యిప్పు, డెచ్చటికిఁ బోయెనో చెప్పవే సుమంబ!

సీ. నవనవలాడు సన్ననిఱేకు లప్పుడే, మునిఁగిపోవుచువాడు మొగమువైచె
బరువంపు నూత్నకేసరపాళియప్పుడే, చిందరవందరై చెన్నుదరిగెఁ
బొలపంబుగలకమ్మ పుప్పొడియప్పుడే, యిటుకొంత యటుకొంత యెగిరిపోయె
నిద్దంపుఁదీయ తేనియచుక్కయప్పుడే, తొణఁకి యేవంకకో తొలఁగిజాఱె

గీ. చారుసౌరభ్యమప్పుడే సగముచెడియె, విశదవికసన మప్పుడే వెల్లవోయె
నీదు జీవరహస్యంబు నే నెఱుంగ, నెంతసుకుమారవస్తువవే సుమంబ!

గీ. తప్పుఁజేసితి; చేసినతప్పెఱింగి, యాత్మగతమున ననుతాప మందుచుంటి;
తలఁచికొనకుండఁగాఁ బ్రమాదముననైన, తప్పులకు నింతకన్నఁ గర్తవ్యమేది?

క. పాపంబుచేసిపశ్చాత్తాపముఁ గనుటయును సుజనధర్మమె; కానన్
గోపింపఁబోకు నాయీ, లోపము గుసుమంబ! నీవు లోఁగొనఁగఁ దగున్.



పారనంది జగన్నాథస్వామి గారు, యం. ఏ., యల్. టి.

[గురుతుగా వేసిన అంకెలు ఘట్టమునకు, ఘట్టములో నిపద్యమునకు సూచన. పుటఅయినచోట పుట అనిఉండును.]

ఆంధ్రకవులకు స్వాతంత్ర్యము లేదని విసుగుతూ ఉండేవారి ఆమోదమునకు పాత్రమైన సాహితీ సమితికి అధ్యక్షులు శ్రీశివశంకరశాస్త్రిగారు హృదయేశ్వరి అనే కావ్యమును ఆంధ్రసారస్వతమునకు అర్పించినారు. ఈసాహితీసమితిసభ్యులందరూ నూతనసంప్రదాయముల ను ఆంధ్రసారస్వతములో ప్రవేశబెట్టవలెనని సంకల్పించు కొన్నవారు.

హృదయేశ్వరి ఒకకథకాదు; బాహ్యప్రకృతివర్ణన కాదు; అది కవియొక్క హృదయతత్త్వమును వ్యక్తపరిచే గీతాసాహిత్యము. హృదయేశ్వరియొక్క అంగసౌష్ఠవము గాని, జీవితచిత్రములుగాని కావ్యమునకు ప్రధానము కావు. హృదయేశ్వరియొక్క హృదయ మెట్టిదో, అట్టి హృదయమువలన తనహృదయమందు ఉదయించే భావము లెట్టివో వ్యక్తపరిచే గ్రంథము ఇది. ఆంధ్రవాఙ్మయ ములో సామాన్యమైన ప్రబంధములు గాథాప్రపంచము నకో, చరిత్రప్రపంచమునకో చెందియున్నట్లుగాక, ఈ కావ్యము భావప్రపంచమునకు చేరినదై యున్నది. ఇదే దీనిముఖ్యవిశేషము. అలాగని ఈగ్రంథములో వర్ణించిన భావములు పూర్వగ్రంథములలో నెక్కడా కానరావని చెప్ప సాహసింపను. పూర్వశృంగార కావ్యములలో అక్కడక్కడ ఉన్న వర్ణనావిశేషములను ఏరి, సంకల నముచేసి ఈకావ్యముగా నిర్మించెనని చెప్పే విమర్శనతో ఎంతమాత్రమూ నేను ఏకీభవించలేను. ఒకవేళ అలాగుచేసి యున్నా, గ్రంథమును అంతమాత్రాన నిరసించము; అలాగు చేసినట్లుకూడా కానరాదు. ఈ కావ్యమునకు మూలము చెప్పవలసేవస్తే, మనదేశప్రబంధాలువెతుకుటకంటె పాశ్చా త్యసారస్వతములోని ఒకవిధమైన శృంగారకావ్య మైపు * విమర్శనదృష్టిని మరలిస్తే ఎక్కువ లాభకారి నుండునేమో అని నాకొక ఊహ కల్గుతున్నది. అలాగని హృదయేశ్వరి కేవలమూ భాషాంతరీకరణమనిగాని, అను వాదమనిగాని, పట్టి అనుకరణమనిగాని నా అభిప్రాయ ము కాదు.

ఇంతకూ 'హృదయేశ్వరి' కేవల శృంగారకావ్యమని కూడా నేను భావించలేదు. ఒక స్త్రీవ్యక్తిని చూచి

---

* 1 Dante: Vita Nuova-Beatrice 2 Petrarch: ...... Laure 3 Shakespeare. Sonnets
4 Sydney: Astrophal and stellna 5 Spenser: Amoretti.

ఈవ్యాసమును వ్రాసి పంపినతరువాత Madras Educational Review లో వైష్ణవశృంగారగీతము లనే విషయమై జయంతకుమారదాసుగారు వ్రాసిన వ్యాసము చదువుట సంభవించినది. అందులో రాధాకృష్ణులశృంగార గీతములగురించి వ్రాస్తూ చండీదాసును గురించి కొంచెము వ్రాసెను.

"చండీదాసు ఒకబ్రాహ్మణుడైనా ఒక చాకలిశాలతినిచూచి మోహించి పెండ్లాడినాడు. ఆమెపై గల మోహమును అనేకవిధముల గీతాలలో వర్ణించి తుద కొకచోట ఆమెను 'వేదమాత, గాయిత్రి' అని సంబోధించి నాడు." అని ఉన్నది.

ఇట్టి వైష్ణవశృంగారగీతములుకూడా మన కవికి తెలిసియుండవచ్చును. అట్టివి ఏవైనా ఎంతవరకూ మన కావ్యమునకు మూలము లయ్యెనో నేను రూఢిగా చెప్పజాలను.

మోహించి, ఆమెను పొందుటకొరకు (ఆమె అనగా ఆమె శరీరమేనా?) విరహబాధపడి, ఆమెను పొంది సుఖించిన కాముకుల శృంగారచేష్టలను వర్ణించే కావ్యము ఇది కానే కాదు. ఇది భావప్రపంచమునకు చేరినదైనా, భావనా యోగ్యమైనది అగుటచేత, దీనికొక విశేష మేర్పడుతున్నది. లక్ష్మి యనే ఒక స్త్రీరత్నమును కవి చూచి, ఆమెతో కలిసి మాటలాడి, వివాహముచేసికొని సుఖించుటే కావ్యమునకు ప్రధానప్రయోజనముగా ఎంచకూడదు; లోకవ్యవహారమున సాధ్యమగుటకుగాను కవిహృద్గతమైన ప్రేమ లక్ష్మిఅనే స్త్రీరూపమును (కవి పురుషుడుకాబట్టి) దాల్చెనని నిర్వచించవలెను. లక్ష్మి స్వప్నములలోనూ స్వర్గములలోనూ సంచరించే నిర్మలరూపిణి; (60). నరలోకములో ఉన్నా, భౌతికశరీరము దాల్చినా, ఆకారణమున సంక్రమించే మానవసామాన్యలోపము లేవైనా ఉన్నా, ఆమె నిజముగా భావనాలోకములోనే పుట్టి, పెరిగి, భావశరీరమునే తాల్చి, సంచరించిన ప్రణయరూపిణి. అందుచేతనే లక్ష్మియొక్క నిర్మలతాసహృదయతాదిగుణములు దేవతాసంబంధము లైనవి. మానవభావనలో ఉత్కృష్టపదవిని ఆక్రమించేదంతా దివ్యలోకమునకు చెందినదే అగుచున్నట్లు, లక్ష్మికూడా భావనాసృష్టికి చెందినదగుటచేత దేవతాస్త్రీ కాగలిగినదని నిర్వచించవలెను. ఆకారణముచేత లక్ష్మి ఒకవ్యక్తిగా కాకుండా స్త్రీజాతికి ఉదాహరణముగా కవిభావించినట్లు తోస్తూఉండును. ప్రేమతత్వమును భావపదార్థముగా చర్చించుటకంటె ప్రేమరూపిణియైన స్త్రీ వ్యక్తి సాహాయ్యమున నిరూపించుటలో ఉండేసౌలభ్యము సారస్యము విమర్శకులు జ్ఞప్తికి తెచ్చుకుంటే, ఇట్టిభావనాకావ్యములయొక్క ఆధిక్యమును,విశేషమును చక్కగా ఆమోదిస్తారు. అప్పుడు ఈకావ్యము వట్టి శృంగారరస ప్రబంధముమాత్రమే కాదని స్పష్టమవుతుంది.

కేవలశృంగారకావ్యమే యైతే పుస్తకప్రారంభమున ఉన్నపటము చదువరులకు వింతగా తోచకూడదు; ఆలాగే ఆపటమునకు మూలమైన గ్రంథస్థవర్ణనలుగాని, అందుకు కారణమైన కవిఆదర్శములుగాని ఉద్వేగకారణము కాకుండును. ధీరోదాత్తుడైన నాయకుడు తాను మోహించిన నాయికకాళ్లపై పడుట ప్రాచీనసంప్రదాయముగా శృంగారనాటకములలో చూస్తున్నాము. ఆలాగే మనకవి చేసినవర్ణనలనూ కావ్యోద్దేశములనూ తాత్కాలికముండే చేష్టలుగా కవి తలంచియుండినా చదువరులు సమన్వయించుకొనినా, కావ్యము ఎవరికీ వెగటుగా తోచకపోయియుండును. ఆలాగులేదు. కాబట్టే కావ్యము చదువరులలో ఉద్వేగమునుకలిగించవచ్చునని కవి తనకర్తవ్యములో సందేహించిఉండెను ఉద్వేగకారణము కవి సూచించకపోయినా, చదువరులు ఊహించేటప్పుడు కవి నిరూపించిన కొన్ని ఆదర్శములు అట్టికారణములు కావచ్చునని అందరూ అభిప్రాయపడతారు. (స్త్రీఅనగా తల్లిగాని, తల్లివంటి గురుభార్యాదులుగాని కాకుండా, తనవలపుకు నిలయమైన భార్యయే యైనపుడు) స్త్రీజాతియెడల కవిచూపే ఆదరగౌరవములే పూర్వాచారపరాయణులకు ఛాందసులకు సహ్యములుగా ఉండవు. భార్యను ప్రేమపూర్వకముగా ఆదరించుటే ప్రాచీనగార్హస్థ్యధర్మమునకు వింతగాతోచే స్థితిలో, భార్యను జీవితేశ్వరియని భావించి వర్ణించుట విపరీతముగా ఉండవచ్చు. అంతేకాకుండా భార్యను మహాదేవి రమాదేవి, సరస్వతీదేవి, ముక్తికాంత అనే దేవతాస్త్రీలతో సమముచేసి, తనకు

వివిధభంగుల నిన్ను భావించుకొలది
పొడముచుండు నమస్కారబుద్ధి నాకు!
జాజువారిన నీపదాంభోజయుగళి
వ్రాలు భక్తుని కరుణను నేలుకొమ్మ!

అని నిరూపించేటప్పుడు నాగరికులమని గర్వపడుతూఉన్న కొందరి విద్యావంతుల వీనులుకూడా మూసికొనిపోవును కాబోలు! ఈభావము ఒక్కఅంకితములోనేకాదు, కావ్యమంతటా వెదజల్లియున్నది. దేవీ, జీవితేశ్వరి, బుద్ధిప్రదాత్రి,అనేభావగర్భితవర్ణనలే కాకుండా,

నీప్రేమచేతనే కవినైతిని (128 పుట)
నామతమునందు భార్య మాన్యురాలు (126 పుట)
భార్యావిధేయుడనై యుండెదను (47. 5)

అనే ఆదర్శముల నిరూపణ కావ్యములో చక్కగా కానవచ్చును.శృంగారవికారములో మోహపరవశుడైన కాముకుడు ఏమైనాకొన్ని వికృతచేష్టలు చేసినా చదువరు

లు క్షమింతురు కాని, బుద్ధిపూర్వకముగా తన నిశ్చితాదర్శములని ఇట్టివిపరీతాభిప్రాయములను ఉద్ఘోషించేటప్పుడు ఎంతమంది విశాలహృదయులూ, ఎంతమంది రసజ్ఞులూ సహింతురో కదా!

నిజమే! "న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అని భావించేవారికి ఈనూతనాభిప్రాయము అసహ్యముగా ఉండును. ఈయుగములో స్త్రీయెడల ఆదరము ఉదయిస్తున్నది. స్త్రీ, భార్యయైనా సరే, పురుషునితో తుల్యమైన వ్యక్తియనిన్నీ, అట్టిస్వతంత్రత వ్యక్తమయ్యేటప్పుడే వాస్తవమైన ప్రేమకు అవకాశ ముండగలదనిన్నీ, ప్రేమించుటకుగాని, ప్రేమించకుండుటకుగాని స్వాతంత్ర్యము లేని స్త్రీయెడలఉన్నతప్రణయము ఉదయించనేరదనిన్నీ, ఈయుగమందు ఒకఉద్యమము ప్రజ్వరిల్లుతూ ఉన్నది. ఈనవ్యభావము ఒంటపట్టిన్నీ, ఆచరణలోనికి రానిదన్నీ, పురుషుని హృదయేశ్వరి వాస్తవమైన హృదయేశ్వరి కానేరదు. ప్రతిపురుషునికీ ఒక్కొక్క హృదయేశ్వరి ఉన్నట్లు మోహావశమైయున్నప్పుడున్నూ, ప్రేమసముద్రతీరతరంగములలో ఆడుతున్నప్పుడున్నూ, తోచినా, ఆహృదయేశ్వరి పురుషుని మోహముపైనే ఆధారపడియుండేది కాబట్టి వాస్తవమైన హృదయేశ్వరి కానేరదు. కవియొక్క హృదయేశ్వరి అట్టిభ్రాంతిజాత అయిన హృదయేశ్వరి కాదు; నిర్వ్యాజప్రణయపయోధిలో పుట్టిన లక్ష్మి. కవికిన్నీ లక్ష్మికిన్నీ గల అనుబంధము పూర్ణమైన ప్రేమకాబట్టే, తనగుణములను ఎంచిగాని, తనలోపములను గణించిగాని తనను వరింపవద్దనిన్నీ, తాను నిష్కపటముగా చూపుతూఉండే పూర్ణానురాగమునకు తనను అంగీకరించమనిన్నీ వేడుకొన్నాడు. తానెట్లు ప్రేమ చూపుతాడో అనేకస్థలములలో వర్ణించి వర్ణించి, తుదకు అన్నిటిని ఒక్కదగ్గిర చేర్చినాడా అన్నట్లు 59 గీతములో పదకొండువిధాలచేష్టలను వర్ణించినాడు. ప్రేమే సర్వమున్నూ. ప్రేమలో జీవనమునడిపి ప్రేమలో ఇద్దరూ ఐక్యము పొందుతారు. (16.6) ఇట్టి నిర్మల ప్రేమకు ఆస్పదమైన వస్తువును దేవీసమానముగా ఎంచుటలోనూ, దేవతగా భావించి ఆరాధించుటలోనూ వైపరీత్య మేమి ఉండగలదు?

ఇంద్రియభోగమునే పరమసౌఖ్యముగా భావించని ఆర్యమత సంప్రదాయకులకు ఇట్టి తాదాత్మ్యభావన వెక్కిరింతగా తోచకూడదు. ఈభావన ఒక్కశక్తి మతస్థులలోనే వామాచారసమయమందే వినియోగమవుతూ, ఇతరవ్యాపారము లన్నిటిలోనూఅంతరించిపోవుటఎంతో శోచనీయము. అట్టిదానిని పునరుద్ధరించేవారు వాస్తవమైన ఆర్యతావాసనలుగలవారు; వారందరూ హృదయేశ్వరివంటి చక్కని గ్రంథములకు స్వాగతమిస్తారనుకొంటాను.*

ఈభావనేకాకుండా మరేదైనా ఉద్వేగకారణమున్నదా అని విచారిస్తే మరొకటి నాకు తట్టినది. అది ఒకవైపునుంచి లక్ష్మిచరిత్రతోనూ మరొకవైపునుంచి మనసంఘమర్యాదలతోనూ సంబంధము గలిగియున్నది.అందుచేత కావ్యములో సూచితమైయున్న లక్ష్మిచరిత్రను సంగ్రహముగా చెప్తాను . లక్ష్మి ఒకఅగ్రహారపుపిల్ల అయినా, చక్కగా సాహిత్య సంగీతజ్ఞానమును సంపాదించగల్గినది.

చిత్రశిల్పకళావనాంతర
సీమలందు విహారశీలల
అనిశ మానందాధిగమమున అలరె. (60)

రుచివిశేషము పొందినది ఆమె. ఒకనాడు ఆమె పుట్టింట "సుందరద్వారముకడ" కవి ఆమెను జూచి, మోహించినాడు. కవికూడా అగ్రహారస్థుడే అగుటచేత, ఆమెను పదేపదే చూడగల్గినాడు. దేవతాదర్శనమునకై ఆమె వెళ్లినప్పుడూ, విద్యాలయమునుండి తిరిగి వస్తూఉన్నప్పుడూ, ఇట్లు నాల్గైదుసారులు చూచి తన వలపును తనలో తలపోసుకోవడమే కాకుండా తనమిత్రునికి తెలియబరచినాడు. ఆమెకూడా అతనిని ఒకమారు చూసి వానిప్రేమను ప్రజ్వలింపజేసినది. మరొకమారు చూసినప్పుడు ఆమె సైగచేసిందికూడా. (అ. 3) ఆమె తనప్రేమకానుకను పరిగ్రహించింది కాబట్టి, ఆమె పాణి

* ఈభావనగురించి ఒక స్నేహితునితో ముచ్చటిస్తున్నపుడు, వారు పారిజాతాపహరణమున్నూ ప్రభావతీ ప్రద్యుమ్నమున్నూ ఇట్టిభావనను వర్ణించియున్న వని చెప్పినారు. ఇంకా మరికొన్నిస్థలములు ఉన్నవట.

గ్రహణముకొరకు కవి తపిస్తూఉండేవాడు. ఆవిరహ బాధలో పూర్వము మరచికాబోలు!

తెలిసి నీప్రేమ కావు మాదీనజనుని (31. 4)

అని, ఇదివరకేలక్ష్మిప్రత్యనురాగము వ్యక్తపరిచినా, మొఱపెట్టినాడు. ఎన్నోమార్లు ఆమెను చూడాలని, ఎండా వానా అనకుండా, వేళాపాళా సరకుచేయకుండా ఆమె సౌధమువైపు వెళ్లుతూ ఉండేవాడు. ఒకమారు ఆమెముఖసందర్శనము పొంది, ఒకమారు ఆమెకంఠధ్వనివిని, ఒకమారు ఏలాభమూ పొందకుండానూ, ఈలాగు తనయింటినుండి ఆమె హర్మ్యమునకు తీర్థయాత్ర చేస్తూఉండేవాడు. ఇట్లు నాలైదుమాసములు గడపి జ్యేష్ఠమాసములో ఒకనాడు ఆమెయింటిలోనికి వెళ్లి, ఆమె తల్లిదండ్రులతో మాట్లాడుతున్నప్పుడు, అతనికంఠధ్వని పోల్చినదికాబోలు ఆమె పైకివచ్చి, ప్రియునిజూచి సంతసించినది.

పల్లుగమనమ్ముతో జేరవచ్చినావు
.........నన్నుదగ్యించుకోర్కె

అని అతడు మోహము నిలిపాడు. ఆలాగే అప్పుడప్పుడు తనయింటికివచ్చిన ప్రియుని కిటికీలోనుంచీ, తలుపు సందులోనుంచీ తొంగిచూస్తూ తనమనోరథమునుకూడా వెల్లడిచేసేది. తుదకొకనాడు "కామదేవుడు వారికనుల్ కలపగా" ఆమెతో మాట్లాడి ఆమె ప్రత్యుత్తరము గైకొన్నాడు.

'నన్ను గొనిపొమ్ము, మన్మనోనాథ', యన్న
విసమునందోచె నపుడు నీవీక్షణంబు
మదనదేవుడు నిరుపమ మన్యవర్తి
నిన్ను నర్ధాంగిగా నాకు నిర్ణయించె. (౬౦. 5.)

అని ధైర్యము తెచ్చుకొన్నాడు. "అన్యులకు గానరాకుండ" "గూఢముగ మన్ముఖప్రభల్ గ్రోలినావు" అని సంతోషిస్తూ,

... ..నాయెడ నీకు గాఢానురాగ
మనుమహోహర్ష జనక వృత్తాంతకలన
శాంతి నెలకొనె ...... నాస్వాంతమందు (53.1)

అని హృదయశాంతి కలుగ జేసుకొన్నాడు. ఆశాంతితో విరహము పర్యవసాన మొందలేదు. ఆమెయొక్క ప్రాప్తి కావలసియున్నది.

తల్లిదండ్రుల అనుమతిపై వివాహము కాలేదు. అట్టిపద్ధతి కవికి నచ్చలేదుకాబోలు. వాస్తవప్రణయమునకు ఆవశ్యకమైన స్వాతంత్ర్యము ఒకరుచేసే వివాహములో ఉండదని కవిఆశయము కావచ్చును. అందుకు కన్యే వరించి వివాహము చేసుకోవలసిఉంటుంది. తల్లిదండ్రులఅనుజ్ఞకు లోబడి ఉన్నప్పుడు వారి అభిమతము అవసరము. లక్ష్మివిషయమై అది ఉన్నదనిగాని లేదనిగాని చెప్పుటకు తగినసామగ్రి కావ్యములో కానరాదు. కాని పుట్టిల్లు విడుచుటకు ఆమెకు కష్టముగా ఉన్నట్లునూ, పుట్టింటిఅనురాగమునకునూ, ప్రియునిప్రాయమునకునూ ఆమె హృదయసీమను గొప్పసంగరము జరిగినట్లునూ, అట్లు బహుదినాలు ఎన్నోబాధలుపడి తుదకు "ప్రబలమైన ప్రవిమలప్రేమంబున" ఆమె కాంతునికోర్కె చెల్లించగల్గినట్లునూ కనబడుతున్నది. (పుట 135). పుట్టిల్లువిడిచి, రహస్యముగా ప్రియునితో పోవ కవి వర్ణించినాడు.

నిన్ను గొనిపోవంగ నిదె దృఢ
    నిశ్చయమ్మున నరుగుదెంచితి
వేగముగ ప్రాణప్రియా, యిక
    వెడలి రాగదవే.
సంశయింపకు ప్రియతమా, ని
    శ్చబ్దగమనముతోడ బోదము.

అని మంచి చీకటిరాత్రి "వెడలిరాగదవే" అనే గీతమును (౬8) కవి పాడినాడు. అప్పుడైనా లక్ష్మి వచ్చిందోలేదో స్పష్టముగా తెలియదుగాని, ఊహిస్తే వెడలివచ్చినట్లే తోస్తుంది.

ఇదిగో ఈరహస్యముగా గొనిపోవడము చదువరులందు ఉద్వేగము కలిగించునని కవి సంశయించెనేమో. నాకు ఉద్వేగము కలుగలేదుకాని రహస్యమెందుకో, పలాయనమెందుకో తెలియలేదు. ఇది సాంఘికాదర్శము కానేరదుగదా. ఆ ప్రత్యేకస్థితిగతులలో కావలసివచ్చెనంటే అది వేరేవాదము. ఆలాగు సమన్వయించుటకు ఈ కథ వ్యక్తిసంబంధమైనదే కాకపోవుటచేతనూ, ఆ పరిస్థితులు తెలియకపోవుటచేతనూ ఆ చర్చకు అవకాశము లేదు. అందుచేత ఆదర్శమేదంటే రహస్య పలాయనము కాదనిన్నీ, అందులో వ్యక్తమయే స్వయంవరము అనిన్నీ

చెప్పవచ్చును. లక్ష్మీచరిత్ర ద్వారా దానిని సూచించుటే కాకుండా, తనకూతురి భావిజీవితములగురించి కుటుంబము అందరూ కూర్చుని సావకాశముగా మాట్లాడుతున్నప్పుడు కూడా ఈస్వయంవరమును కవి తన నిశ్చితాభిప్రాయముగా ప్రతిపాదించినాడు. స్వయంవరము స్వాతంత్ర్యము రెండూ పరస్పరమూ ఆనుషంగికములు. అన్ని విషయాలలోను స్వాతంత్ర్యమును స్థాపించేకవి ఈ స్వయంవరమును ఇట్లు వర్ణించుటలో వింత యేమీ లేదు. కాని ఇంత విశాలహృదయుడూ వివాహము నిర్బంధమని నిశ్చయించుటలో సంకుచితమైనదని చెప్పవలసివస్తుంది. ఎట్లంటే,

భార్య: మంచి దొక్కమాట మణికర్ణికా, నీవు
సర్వకాలములను జనకు ప్రోల
నోలలాడుమందు వొక్కొ విద్యలలోన
పెండ్లియూహ విడిచి పెట్టికూడ!

భర్త: కాదుకాదు బిడ్డ గణియించి విద్యల
యందు పటిమ షోడశాబ్దములకు
నరుని యోగ్యుడైన వానిని వరియించి
పెండ్లియాడి చనును ప్రియునివెంట.

... ...

ఎల్లకాల మతివ యెట్లు తల్లిదండ్రుల
సవిధమందు నుండజాలు చెపుమ! (పుట 124)
హృదయనాథుకడకు నేగకమానునే!

అని దంపతులు మాట్లాడుకొన్నారు.

ఈఅభిప్రాయములకు ఉద్వేగము పొందనివారు స్వాదుపరాఙ్ముఖులు కానివారిలోను, వివిధసారస్వత పరిచయము కలవారిలోను, కళాప్రవీణులలోను ఉందురని కవి ఆశించినట్లు తోస్తుంది. ఉద్వేగకారణములు సారస్య సంబంధములైనవైతే ఇట్టి చదువరులను కోరుట సమంజసమగును కాని, సాంఘిక సమస్యల విషయమైన అభిప్రాయములు ఉద్వేగకారణము లైనపుడు సంస్కర్తలను కోరవలసియున్నది గదా. క్రొత్తభావనలకైనా, క్రొత్తకల్పనలకైనా, క్రొత్తకవితాసమయములకైనా ఉద్వేగము పుట్టేటప్పుడు కవి పేర్కొనినగుణములు సాధనములు కావచ్చును. సంస్కారము సారస్వతసంబంధమైనదిగాక సంఘసంబంధమైనది. కాని ఈ రెండింటికి సంబంధము లేదని నా వాదము కాదు. కవిత్వము జీవితధర్మములసమన్వయము అయేటప్పుడు, జీవితధర్మములు సాంఘికములుకూడా కాబట్టి, సంస్కారప్రియుడైన కవికి సంఘసంస్కారము ఇష్టమూ ఆవశ్యమూ అవుతుంది. ఎట్లంటే, లోకానుభవము లోవలెనే సారస్వతములోకూడా అస్వతంత్రస్త్రీ నాయికగా ఉంటే రసము చాలా చప్పగా ఉంటుందికాబట్టి, ఈస్వయంవరము సంఘసంస్కారప్రశ్నే కాకుండా సారస్వతప్రశ్నకూడా అయిందని వాదిస్తే ఇష్టాపత్తే.

కావ్యనిర్మాణముగురించి కొంచెము తెలుసుకొందాము. కావ్యములో ఒకొక్కప్రధానభావము ఒకొక్క ఉచ్ఛ్వాసములో వర్ణితమైనది. స్త్రీరత్నమును చూచినందువలన తనలో గల్గిన 'విభ్రమము'; అందువలన ఉదయించిన (అయోగ) 'విరహవీచి'; ఆమెఅంగీకారముగైకొన్న తరువాత కలిగిన 'హృదయశాంతి';—అనే మూడు ముఖ్యశృంగారావస్థలు క్రమముగా మొదటిమూడింటిలోను వర్ణింపబడినవి. హృదయశాంతి కల్గినా, ఆమె ప్రాప్తికాలేదని ఆమెకొకప్రేమగీతావళి కానుకగా ఇచ్చి, స్వప్నము పొందినాడు; ఈరెండూ మరి రెండుఉచ్ఛ్వాసాలు ఆమెను చూచినది ఆదిగా ఆమెవలన కలిగినసౌఖ్యావధిగాగల ఈచరిత్రను భావచక్రమందు ఐదుఅవస్థలుగా విభాగించి కవి వర్ణించెను. మొత్తముమీద కావ్యమంతా భావములవర్ణనే యైనా, మొదటిరెండింటిలోను వ్యక్తమయే భావోద్రేకము రానురాను కథాసందర్భములో తగ్గి తుదకు సుఖస్వప్నములో ఆదర్శముల నిరూపణకు వినియోగమైనది. భావోద్రేకము తీవ్రముగా ఉన్నప్పుడు భావములు అతివేగముతో పారిపోతూ ఉంటే వాటిని సావకాశముగా ఛందములలో సరసముగా వర్ణించుటకు ఒకవిధమైన సామర్థ్యము ఆవశ్యకము. భావములను జ్ఞప్తికి తెచ్చుకొని నిలిపిఉంచుట; విశిష్టానుభవములను విభజించి నిరూపించుట; ఈమనోగతవృత్తులను మాటలలో చక్కగా వర్ణించుటకు తగినసాహిత్యజ్ఞానము, పదవాక్యనిర్మాణము మొదలైనశక్తి విశేషములు కవికి ఎంతకుశలములుగా ఉంటే, కావ్యము అంతహృద్యముగా ఉంటుంది. భావములను కవి అట్లువర్ణించ ప్రయత్నించి

నట్లు కావ్యములో ఉన్న ఘట్టములవలన తెలుస్తూఉన్నది. స్థూలదృష్టిలో ఒకఘట్టమునకు మరొకదానికి ఉన్న సంబంధము అల్పమని తోస్తుంది. ఈఘట్టము లన్నీ ఈకావ్యములలో ఉన్నవరుసను వ్రాసియుండలేదనిన్నీ, దేనిమట్టుకు దానిని ఆయా అనుభవస్ఫూర్తి సమయాన వ్రాసి, తరువాత ఈక్రమములో ఏర్పరిచెననిన్నీ మనము ఊహించవచ్చును. అందుకే “ఒకపట్టున చదువుటకన్న ఘట్టము ఘట్టముకడను కొంతతడవు నిలుచుచుండుట యుక్తము.” అని కవి తన వక్తవ్యములో వ్రాసెను. ఒకొక్క భావనకు ఒకొక్క ఘట్టము, ఘట్టములో ఎన్నో కొన్ని పద్యాలు; ఒకొక్క పద్యములో నాల్గేసిపంక్తులు. ఈఏర్పాటులో కొంత సౌలభ్యమున్నది. భావనపై బుద్ధి నిలిపి, దానిని పుష్టీకరించి, విస్తరించి వర్ణించుటకు ఏర్పాటులో సులువుఉన్నది. ఈవిశేషము చిన్న చిన్న ఖండకావ్యములలో చక్కగా వ్యక్తమవుతున్నది.

కావ్యము భావప్రపంచమునకే చెందినది కాబట్టినీ, హృదయేశ్వరి భావసృష్టికే చెందినది కాబట్టినీ, లక్ష్మికి వ్యక్తిత్వము లేదు కాబట్టినీ, కావ్యములో లక్ష్మిమాటాడనక్కరలేకుండా, కవే తన భావాలనూ, తన హృదయేశ్వరి భావాలనూ తన మాటలలోనే వర్ణించ నిర్ణయించుకొనెను. కాని ఈఏర్పాటుకు నలుగురిమాటలు కనబడుతూఉన్న ఐదోఉచ్ఛ్వాసములో భంగము వచ్చినట్లు కనుపిస్తుంది. అది స్వప్నము కాబట్టి ఎవరన్నమాటలూ, కవివిన్నమాటలూ స్వప్నములోని చర్యలే అనిచెప్పి ఆదోషమును వారింపజేస్తే, అందులోవర్ణించిన సౌఖ్యాతిశయముకూడా స్వప్నగతమైనదే కావలసి వస్తుంది. అట్లు అనవలదని నా అభిప్రాయము; ఆ సౌఖ్యమునకు అతథ్యము రాకూడదని నా అభిప్రాయము. మిగిలిననాల్గింటివలెనే ఈ ఉచ్ఛ్వాసముకూడా కవి భావముల వర్ణనేఅని చెప్పితే ఎక్కువసరసముగా ఉంటుందని నాతలంపు. అందుకు ఇట్లు వ్యాఖ్యానము చేస్తాను. భార్యాదులమాటలు వారివారిమాటలుగా కాకుండా, కవి భావములప్రవాహముయొక్క జోరును ఆపేటందుకు కట్టిన చిన్నచిన్న అడ్లుగా సమన్వయింపవచ్చును. తనమాటలుగానే చెప్పేటప్పుడు కలిగేసారస్యముకంటె వారివారిమాటలుగా నిర్మిస్తే ఒకవిధమైన రుచివిశేషము కలుగుతుందికాబోలు. వారివారిమాటలవలన ఉదయించే వేర్వేరు రుచులమేళనము ప్రాప్తిస్తుంది. ఆసుఖస్వప్నమునకు అనిర్వచనీయసౌఖ్యమని అర్థముచెప్పి, నిర్మాణలోపము, సౌఖ్యాసత్యత అనే దోషములు రెండూ వారిస్తవి.

ఇట్లు ఎన్నోవిధాల క్రొత్తదైన ఈ కావ్యములో ప్రాతసంప్రదాయము లున్నవి. వాటిలో ముఖ్యమైనది భాష. కవి నావలెనే వ్యావహారికభాషావాది అని వినికిడి. ఆభాషనే వారికావ్యమునకు వాడేఉంటే – ఏలాగూ పఠనీయగ్రంథముగా వేయించుకోవాలనే ప్రయత్నము ఉండదు కాబట్టి–కావ్యము ఎక్కువధారాళముగాను, రసవంతముగాను ఉండిఉండునని నాఊహ. కవిత్వములో పటిమ వస్తుందని కాబోలు సంస్కృతమును బాగా వాడేరు. ఆంధ్రగ్రంథములు అందరిఅందికలోనూ ఉండాలనే ఆదర్శము విజృంభిస్తూఉన్న ఈవేళను నూతనాభిప్రాయాభిలాషియైన మనకవి సంస్కృతపదములు తగ్గించిఉంటే బాగాఉండునుకదా! నూతనాదర్శములో సంఘములో ప్రవేశించాలంటే జనసామాన్యమునకు అడ్డుకాకుండా ఉండేటట్లు భాషను నిర్మించవలెను. భాషలోనే కాకుండా కవితాసామగ్రియైన అలంకారాదులలో కూడా ప్రాచీనరీతి బాగా కనబడుతుంది; పద్మము, తుమ్మెద, మీనము, ఈమొదలైనవి మాటిమాటికి వస్తూనేఉండెను. అతిపరిచితములైన వస్తువులే తరుచుగా కనబడుతూ ఉంటే అవి అలంకారములుగాక అసహ్యములవుతవనే లోకోక్తి కవితారచనలోకూడా వర్తిస్తుందికదా. ఇట్టివేకాబోలు కవిఅన్న ప్రాచీనరీతులు; సరే.

కవిత్వము మొత్తముమీద మృదువుగాను, సరళముగాను ఉంది. గీతావళిగాక మిగిలిన కావ్యమంతా ఒకే ఛందస్సులో ఉన్నా, విసుగురాకుండా రచన సాగింది. కావ్యమంతా పద్యాలలోనే ఉండడముచేత కొన్నికొన్ని స్థలములు గద్యలో ఉండుటకు తగినవైనా పద్యాలలో ఉండుట తటస్థించినది. అవికావు కవిత్వపుసొంపుకు ఉదాహరణములు.

హృదయేశ్వరివలెనే హృదయేశ్వరుడుకూడా కొద్దికాలములో ఆవిర్భవించునని మనము ఆశింపవచ్చును!

ప్రియావియోగము

దువ్వూరి రామిరెడ్డి గారు

జలధరమాలికా మలినశయ్యను మిత్త్రుఁడు గూలె; నేడ్పు లా
ర్పులఁ బులుగుల్ కులాయముల పొంతలకేఁగక కొమ్మలెక్కి ము
క్కులఁ దడిలేక మూర్చె; వడఁగూరిన పోలికఁ బూలతీఁగలుం
దలలనువాంచు; గాలి వెతతాఁకున మూల్గు సహానుభూతితోన్.

చ. మును గనుపండువై తనరు మోహనవస్తువులెల్ల వెల్లబో
యినగతి బాష్పముల్ దొరఁగ నేడ్చుచు నీరవభాషఁ బల్కెడిన్,
"గనుఁగొన, మాకునున్ నెగులుగల్గెడి నీదు ప్రియావియోగ సం
జనిత దురంతతాపమును; శాంతిలుమోయి" యటన్న మాటలన్.

చ. ఇరువురి చిత్తఖండముల నేకముచేసిన ప్రాణకాంత యం
తర విరహాబ్ధిపంకమున నాఁటుకొనన్ నను ముంచిపోయెఁ గ్ర
మ్మఱ ధరఁ జేరరా దనెడుమాట నెఱింగియు నేమొకాని నా
తరుణమనంబు స్వాప్నికపథంబునఁ బోవును బ్రేమవాసనన్.

ఉ. కన్నులువిప్పి చూచితిని గాంతశవంబును, జేతితోడ నే
యున్నలమిన్న కాష్ఠమున కగ్గి రగిల్చితి, నింత చేసియుం,
జన్న తెఱంగెఱింగియును సంశయమొందును బాడుబుద్ధి! యా
పన్నుల చిత్తవిభ్రమపుఁ బాటులు నిట్టివియేమొ యెల్లెడన్.

మ. కలలోనైనఁ దలంపలేదుగద యోకల్యాణి! నీ కింతలో
పల నూఱేండ్లు నిండునంచు, విధి దుర్వారప్రభావంబు మ
ర్త్యులయత్నంబు నధఃకరించుగద! వైద్యుల్ దివ్యసంజీవిఁ జెం
బులఁ ద్రావించియుఁ బూర్వదుష్కృతఫలంబున్ మార్పలేరైరిగా!

చ. ఇరువదియేనువత్సరము లేఁగకపూర్వమె, యౌవనంపు బం
గరుచషకంబులో నురుగు గ్రమ్మెడి యాసవ మింకకుండఁగన్,

సరస మనోనురాగతృష శాంతిలకుండనె, జీవితంపు మా
ధురిఁ దనివార నానకమె తోయ్యలి, పోయితె కాలదుర్గతిన్?

చ. పది పదునొండువర్షములపాటు నిరంతరదుగ్ధకుల్యయై
హృదయతటంబులొత్తి ప్రవహించిన ప్రేమరసంబులింక, నీ
యదనున సార్థవాహము జలాశయహీన మరుప్రదేశ దు
ష్పథమున నెట్లు నే నడుపఁజాలుదు నిర్దయ దీర్ఘయామినిన్.

తే. గీ. దర్పణంబున బింబంబు దనరినటులు, నీదురూపంబు మదిలోన నిలిచియుండు!
ఇదిగో, నెచ్చెలి యని చేతు లెదురుచాపఁ, గఠినసత్యంబు నామోముఁగాంచి నవ్వు!

తే. గీ. గాజులను మెట్టె లెవరివో ఘల్లుమనఁగఁ, దెలియకుండనె కన్నులు తిరిగిచూచు;
నంత దారుణ యాథార్థ్య మాత్మమెఱవ, గుండె జల్లను, నిట్టూర్పు మెండుకొనును.

తే. గీ. ఇరువురకుఁ దప్ప నితరుల కెఱుఁగరాని, మనరహస్యంబు లెవరితో ననుదు నింక?
హృదయ మంజూష నాచేతనిడి యదేల, తాళపుంజెవి నీయొడి దాచినావు?

చ. మఱ పెటుగల్గు నీ నగవుమాటలు, నీ దరహాసచంద్రికాం
కురములు, వచ్చిరాని మృదుకోపము, చామనచాయరూపమున్,
సరసత! మన్మనోనుసరణత్వము, నిర్భరమైన ప్రేమయున్,
మురిపెపుఁ జూపుఁ గావ్యములు, ముద్దులపేటికలౌఁ గపోలముల్.

మ. పరలోకంబున కేఁగువేళఁ బ్రణయవ్యామోహమొక్కండె నీ
పరమై పోయెనటంచు నుంటిఁ; దెలిసెం బ్రచ్ఛన్నసత్యంబు; నీ
కరముల్ నాహృదయంబుఁ, గోరికల, సౌఖ్యంబున్, భవిష్యన్మనో
హర గార్హస్థ్య సుజీవితం బడుగుగాయన్ లాగి గొంపోయెఁగా!

మ. పరలోకంపుఁ గవాటముల్ దెఱచి నాపై నొక్కమాత్రైన నీ
సరసాలోలకటాక్షముల్ నెఱపుమా, సర్వంబు నీ కాత్మగో
చరమా; నన్ గురుతింపఁజాలుదువె యో చానా, నిరంతంబు నీ
కొఱకుం బిచ్చిబికారినై తిరిగెదన్ ఘూర్ణిల్లు చిత్తంబుతోన్.

చ. తెలివి నశించినప్పుడొకతేప నినుం గను కోర్కెతోడ నే
వెలుపలకేఁగి, కాటిదరి వెచ్చగమార్చుచుఁ గూరుచుండి నీ
లలిత మనోహరాకృతి నిలాతలమందునఁ బాఱఁజూడ బొ
గ్గుల మసి భగ్నశల్యములు గోచరమయ్యె నిఁకేమి చెప్పుదున్.

చ. స్థిర మిహలోక, మీతనువు జీర్ణముగాదు, సమస్తసౌఖ్యముల్
మఱుగవటంచు యౌవనపుమత్తున నుండిన నాకు నెంతలోఁ
గఱపితివీవు "సర్వమును గాలవశంబున నంతరించు, న
శ్వర మగు నీ ప్రపంచకము స్వప్నమయం" బను సత్య మంగనా!


మ. కవితాకల్పితలోకమందు మురళీగానంబు గావించుచున్
బవలున్ రేయు సుఖంబుగా నెగురు నాపక్షంబులం ద్రుంచి స
న్నవలీలన్ ధరణీతలంబునకుఁ ద్రోయన్ మేలఁటే కాంత, క
న్గవమోడ్చుం, దిలకింపఁజాల నిలలోఁ గన్పట్టు యాథార్థ్యమున్,

తే. గీ. హృదయమును దొంగిలించిన రీతిగాన, స్మృతిని సైతంబు నీవు హరింపు మతివ,
అంత సుఖదుఃఖములు భేద మరయరాక, భావశూన్యత లీనమై పట్టువిడచు.

శా. చేతన్ జాఱిన గాజుగిన్నె మరలం జేఁ జిక్కునే, వ్యర్థ చిం
తాతాపంబున లాభమేమని ప్రబోధజ్ఞాత తత్త్వండ నై
చేతన్ గ్రంథముఁ బూని యక్షరములం జిత్తంబు లంకింతు; నా
చేతం గా దొకవాక్యమైనఁ జదువం, జిత్రంబుపో తత్కథల్!

మ. అనివార్యం బగు దైవనిర్ణయము; దేహం బొక్కఁడే పంచభూ
త విలీనంబగు; నాత్మకున్ మరణబాధల్ లేవు; లోకంబునన్
జననంబున్ మృతి నైజమంచు నెటు లో స్వాంతంబుఁ జిక్కించుకో
ననయంబున్ యతినింతుఁ గాల గురుపాదాబ్జంబులే దిక్కుగన్.

తే. గీ. వేఁగు మాంసంబురీతి నావిల్లు వాఱు, నుల్లమునఁ దత్త్వబోధ కాలూనఁ గలదె?
యూరడింపులు పుండుపై నుప్పుగల్లు; ఇంక నేకాంతమే నాకు నేడుగడయ.



కొండముది నరసింహము గారు

క్రోధన నామసంవత్సర ఆషాఢమాస భారతీపత్రికయందు 'భాగవతములోని కొన్నియప్రశస్తములు'ని వ్రాసిన వ్యాసమున కించుక ప్రత్యుత్తర మీయబూనితిని. భాగవతమున లోపము లున్నవని తమస్వల్పానుభవమునుబట్టి "సేలనయ్య" వ్రాసితిమనిరి.

చిన్నబిడ్డకు పెద్దశోక మన్నట్లు పోతన మహానుభావునిమీదనే దాడివెడలిరి.

వారు సూచించిన లోపములు భాగవతమున లేవు.

(1) పోతనామాత్యుడు, శ్రీకృష్ణనిర్యాణమునుగూర్చి విచారము నొందుచు నర్జునుడన్ననుసమీపించునపుడు ధర్మరాజు సోదరుని యాదవులసేమము వేరువేరుగ నడుగుట వరకు రసపోషణము గావించి, తర్వాత కొంత ప్రాసపోషణము చేసెననిరి.

క. ఓడితివో శత్రువులకు......
క. తప్పితివో యిచ్చెదనని......
క. అడచితివో భూసురులను...... అని.

ఈ త్రిప్రాసపద్యములు రసవంతములై హృదయమున కుద్రేక మొక్కమారుగా హెచ్చించి కథాజీవము జెరుపక ద్రాక్షయు దేనెయు గలిసిన ట్లతిమధురమై యుండును. అనుప్రాసాదులు రసాంగములని యాలంకారికుల సిద్ధాంతము.

'చిక్కెనురా మిడతంభ ట్లన్నట్లు సేలనయ్యగారికి ఝిల్లి చిక్కెనది.

క. భిల్లీభల్లలులాయక
భల్లుకఫణిఖడ్గగవయ వలిముఖచమరీ
ఝిల్లిహరిశరభకరికిటి
మల్లాద్భుతకాకఘూకమయమగు నడవిన్.

దుష్కరప్రాసబాధానివారణార్థము మహాజీవజంతువులతోపాటు చిమటలను (ఝిల్లులను) గూడ జెప్పవలసినయవస్థ పోతనకు తటస్థించినదట. 'ల్లి'ప్రాస దొరకక ఝిల్లియని ప్రయోగించినటుల నుడివిరి.

పాపము వీరు వ్యాసరచితగ్రంథముల జూచియుండరని తోచుచున్నది. అరణ్యవర్ణనలో ముఖ్యముగా "ఝిల్లికాగణనాదితం" అను ప్రయోగము లున్నవి. ఝిల్లియనగా నీలిపురుగు. ఇయ్యది చెవులు గింగురుబోవ నెప్పుడు ధ్వనిచేయుటవలన వ్యాగాదులకుమున్నే ప్రయోగించుచున్నారు

వ్యాసులు ముందు వ్యాఘ్రమును, తుదను శరభమును, మధ్య వానికన్న నల్పజంతువులను జెప్పినారు. కనుక నిచ్చట క్రమవివక్ష యెందుకు?

"సప్తాంభోనిధిమేఖలా—పారావారహరీ తోదారా"

అనుస్థలములయందు జెప్పినభావమును జెప్పుటయు ననౌచిత్య మనిరి.

ఇందు మొదటివర్ణనకును, రెండవవర్ణనకును, నర్థవైలక్షణ్యమును, నలంకారవైలక్షణ్యమును, భావవైలక్షణ్యమును రసవైలక్షణ్యమును మిక్కుటముగా భాసిల్లుచున్నవి. ఇట్టియెడ వర్ణ్యవస్తుమాత్రసామ్యమున బున రుక్తివలనియనౌచిత్యమువంటి యనౌచితి కలిగినదని దోషమారోపించు టతిసాహసము. అట్టిపోకడలు మహాకవుల కల్పనలయం దెల్లెడల సులభములు.

వనాదివర్ణనలు చేయుతరి బోతన "వృక్ష నామములను మృగనామములను పఠించుట తరుచుగా గలదని" 54 వృక్షములపేరులు 8 పక్షులపేరులు లెక్కించి వ్రాసిరి.

"మందారైః పారిజాతైశ్చ" యనునది మొదలుకొని లెక్కించుచో, వ్యాసమహర్షి భాగవతములో 40 వృక్షములును, 10 పక్షులును వర్ణించి యున్నారు.

మదగజ మదజల మతిగా వర్ణించబడినదని యాక్షేపించుట కది మదగజమదజలమేకాగా నతిగా వర్ణింపబడినదేమి?

"మద్దానాంభః పరిపుష్ట చందనలతాంతచ్ఛాయలం దుండ, నిరాసనిశేల వచ్చితి" యనివిలపించుచో వృక్షశాస్త్ర విషయముల నాగజము జ్ఞాపకమును దెచ్చుకొను టాశ్చర్యమట.

కష్టము వచ్చినప్పుడు సుఖమును దలచుకొను టాశ్చర్యము కాదు. గజమునకు వృక్షశాస్త్ర మేమి దెలియు ననెదరా?

"లోకంబులు లోకేశులు, లోకస్థులు తెగినతుదిన లోకంబగు, పెంజీకటి కవ్వల నెవ్వం, డేకాకృతి వెలుఁగు నతని నే సేవింతున్"

అనునంత బ్రహ్మజ్ఞానికి నిత్యానుభవమైన వృక్షజ్ఞానమే స్ఫురింపకుండునా? వామనమూర్తికి దానమిచ్చుచో శుక్రాచార్యులతో బలి,

"శా. ఆదిన్ శ్రీసతికొప్పుపైఁ దనువుపై
నంసోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపైఁ
బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందు కరంబు క్రిందగుట మీఁ
దై నాకరంబుంట మే
ల్గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయం బనాపాయమే"

యనుచో,

శ్రీసతిదగ్గిర నుపయోగించిన హస్తములను వర్ణింపవలసినంత యవసరమైన శ్రీకరమగుటనే వర్ణింపబడినది. లక్ష్మీప్రదములైన హస్తములే దానమునకు జాపబడినవనుటచే సారస్య మతిశయించుచున్నది.

పరపురుషుడగుదానవుడు లచ్చిపాలిండ్లు తలచుచో గూడా ననౌచిత్య మేమియులేదు. బలిచక్రవర్తి మహాభక్తుడు 'ఆదిన్ శ్రీసతి' యని 'పాలిండ్లని ప్రయోగించుటచే మాతృభావమునే సూచించెనని స్పష్టమగుచున్నది.

"సిరికిఁ జెప్పఁడు...వివాదప్రోద్ధత శ్రీకుచోపరి చేలాంచనమైన వీడఁడు"

ఇందు శ్రీకుచోపరియని యేల పేర్కొనవలసె ననిరి?

రమాసమావేశోల్లాస పరవశ సమయముననైనను, విష్ణువు భక్తసంరక్షణ మేమరియుండ డనుటకును శ్రీకుచోపరి చేలాంచలము విడచినదియు లేనిదియు నెఱుగనంత భక్తవాత్సల్యము గలవాడనియు సూచించుటకట్లు చెప్పబడినది.

హైందవేతరులకు కుచవర్ణనాదులు నీతిబాహ్యముగా తోచి యాక్షేపించెద రని వ్రాసిరి.

హైందవేతరులకు హిందూమతమునందే యసహ్యము, దానికి ఏమి చేయవచ్చును.

పుస్తకములోని స్తనవర్ణనమే నీతిబాహ్యముకాని హైందవేతరులలో స్త్రీపురుషులు దర్శన స్పర్శనాదులతో గలసి మెలసి పండుగలలో నాటలాడుట నీతిబాహ్యము కాదుకదా.

మతాంతరుల పరమతవిషయ గ్రంథాదులయందలి శృంగారాదివిషయము లసహ్యములనుట మెచ్చదగినదికాదు. ఒక గ్రంథమును భాషాంతరీకరణ మొనరించునపుడు మాతృక ననుసరించుట దోషముకాదు. సంస్కృత భాగవతమునందు శృంగారము హెచ్చుగా జెప్పినటుల నొప్పుకొని యున్నారు. కాన నందలి శ్లోకము లుదహరింప మానితిని.

మహాతపస్సంపన్ను లగు ఋషిపత్నులు తాము వండిన పదార్థములు భర్తల కిడక భర్తలయాజ్ఞలైనను గైకొనక పసులకాపరి యగు కృష్ణునికడకు గొనిపోవుటకు నా ఋషులును, వివాహితలగు గోపికలు స్వతంత్రించి శ్రీకృష్ణునితో జేరి రాసక్రీడ లాడుచుండుటకు వారిభర్తలును, బంధువులును వారి నే విధమున నిందింపక మిన్నకుండుటకు భగవదంశాసంభూతు డగు బాలకృష్ణునియందు వారికిగల భక్తిపరవశత్వమే కారణము.

దీనినిబట్టి యీసంభోగాదులకు కేవల శబ్దార్థములనే చూచుకొనక యంతరార్థము గ్రహింపవలసియుండును.

కవిత్వ మాయాకాలములయందలి మతమును భాషను ప్రజాభిప్రాయమును ననుసరించియుండునుగాన, వేరొకకాలమున నభిప్రాయభేదము గలవారిభావములకు సరిపోవని తిరస్కరింపకూడదు.

"వర్ణవృత్తమతాదివ్యవస్థ దొరగి తిరుగు నవనాగరికులు నిందింత్రుగాత" అనినటు లిప్పటికాలమువారికి యిష్టము లేకపోయిన నేమి?



శ్రీకృష్ణవేణుగానము

తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారు

పసులు మేతలఁబాసి పరువులెత్తుచు డాసి,
యింపుతోఁ దమమోర లెత్తినిలువఁ
గనలోక తేజఃప్రదప్రమాణము మాని,
యర్కుఁడు గగనమం దాగిపోవఁ
గావుకావనియేచ్చు కాననాంతరవాస, శబరార్భకులు మనశ్శాంతిఁ బొంద
వేవేగ బిలపంక్తి వెడలి పన్నగకోటి, ఫణము లాడించి సంబరముఁ జెంద
గీ. వినుత బృందాటవీ రమ్యవీథులందు, విశ్వమోహన సంధాన వేణుగాన
రసము వర్షించితివిగదా పసితనాన, భవ్యగుణజాల! వేణుగోపాలబాల!

సీ. ఆలమందలఁ జేరి పాలఁదీయుచు దుగ్ధ, భాండంబు లావలఁ బారవైచి
చనుబాలు గ్రోలు వత్సల లాగి వేవేగ, నుయ్యాలలందుఁ బన్నుండఁ బెట్టి
పొలుపుగా నుడికి వార్పునకు సిద్ధంబైన, యన్నంపు విషయంబు నాత్మమరచి
గమన శ్రమాపనోదము భర్తలకు వీచు, విసనకఱ్ఱలనట్టె విసరివైచి
గీ. తత్తరంబున గోపికాతరుణులెల్ల, వచ్చి నీగాన మాలించి మెచ్చిరిగద
పూతయమునానదీతీరభూజ మెక్కి, యెలమిమై నీవు మురళి వాయించునపుడు.

సీ. కోమలామలఘనశ్యామలాంగముతోడ, ముద్దుఁగుల్కెడు నవ్వుమోముతోడ
శిఖిపింఛపంచమాంచితమస్తకముతోడఁ, జెలువమౌ బంగారువలువతోడఁ
గరుణారసంబొల్కు కన్నుదమ్ములతోడ, నవరత్నమయ భూషణములతోడ
ఘల్లుఘల్లని మ్రోగు పిల్లగజ్జెలతోడ, మరి చిన్ని పంగనామములతోడ
గీ. రమ్య శారద చంద్రికారాత్రులందు, విమల యమునానదీసైకతముల నిల్చి
మురళిఁ బాడిన నీ దివ్యమూర్తిఁ జూపి, ననుఁ గృతార్థునిఁ జేయు మోనందతనయ.

కాళిదాస భవభూతులు

ప్రథమ పరిచ్ఛేదము

ఉపాఖ్యానభాగము

వి. వి. సుబ్బారావుగారు, బి, ఏ., యల్. టి.,

అభిజ్ఞానశాకుంతలము కాళిదాసుని నాటకములలో శ్రేష్ఠమే కాక తత్కృతవికృత గ్రంథము లన్నిటిలోపలను శ్రేష్ఠమని సర్వసాధారణాభిప్రాయము. శాకుంతలము కాళిదాసుని కవితాసర్వస్వమేయనియు నొకానొక రనిరి. (కాళిదాసస్యసర్వస్వ మభిజ్ఞానశకుంతలమ్.) ఈవిధముననే యుత్తరరామచరిత్రయు భవభూతికవితాసర్వస్వమే. ఈయుభయులతులనాత్మకత నరయువా రాయాకవుల కవితాసర్వస్వములగు నానాటకముల బోల్చిచూచిననేకాని పొందజాలరు.

అభిజ్ఞానశాకుంతలనాటక కథాభాగమును, గాళిదాసు మహాభారతమున వర్ణితమగు శకుంతలోపాఖ్యానమునుండి గ్రహించెను. పద్మపురాణమందలి స్వర్గఖండమందును నియ్యది వర్ణింపబడినది. దీనితో గాళిదాసునినాటకమునకు విశేషసాదృశ్యము కలదు గాని, పద్మపురాణము శాకుంతలనాటకానంతరమే రచింపబడెననియు నేతత్కథయే కావ్యరూపమున బరివర్తితమయ్యెననియును బహుజనాభిప్రాయము. కావుననే పద్మపురాణమునందలి శకుంతలోపాఖ్యానము కాళిదాసునినాటకమునకు జీవికయనుటకు నే సాహసింపను.

మహాభారతాంతర్గతమగు శకుంతలోపాఖ్యాన కథాభాగమున శకుంతల మేనకావిశ్వామిత్రుల కూతురనియు, నామెను గారణాంతరముల దల్లిదండ్రులు విడిచిన గణ్వుడామెను బాలించెననియు, దుష్యంతుడు మృగయార్థ మడవికిజని విధివశమున గణ్వాశ్రమము జేరి, యౌవనవతియగు శకుంతలనుగని రూపమోహితుడై గాంధర్వంబున నామెచెట్టబట్టి యొంటిగా రాజధాని కేగెననియు గణ్వుడాశ్రమమునకువచ్చి శకుంతలాకృత్యముల దివ్యదృష్టినీక్షించి గాంధర్వము క్షత్రియసమ్మత మని యాకార్యమున కనుమోదించెననియు, నయ్యాశ్రమమున నే శకుంతల పుత్రునిగనెననియు, అనంతరము కణ్వుడు పుత్రవతియగు సుతనుబతిసమీపమునకనుప దుష్యంతుడు శకుంతలాసంబంధము నెఱింగినవాడయ్యును లోకాపవాదభీతి నొడంబడక మరల నశరీరవాణిచే నామెను బరిగ్రహించెననియును వర్ణింపంబడినది. దీని నే కవి తననాటకమున నీవిధముగా పరివర్తన మొనరించెను.

ప్రథమాంకము

దుష్యంతుడు మృగయార్థ మడవికి జని కణ్వాశ్రమముజేరి శకుంతలనుగాంచుటయు నంతట శకుంతలాదుష్యంతులు పరస్పరావలోకనములచే ప్రేమోదయము నొందుటయు ననంతర మామెసఖులగు ననసూయాప్రియంవదలు శకుంతలను బ్రోత్సహించుటయును;

ద్వితీయాంకము

దుష్యంతుడు విదూషకునితో మాటలాడుటయు వేటయందు నిరుత్సాహుడగు వయస్యునితో రాజు శకుంతలావిషయకప్రస్తావన మొనర్చుటయు సేనాపతి రాజుకు వేటతమిగల్గించుటకు బ్రయత్నించుటయు, వ్యర్థమగుటయును, రాక్షసబాధల నివారణమొనర్ప నిరువురు తాపసులు రాజునుగోరుటయు, తల్లి యానతిం జరుప వయస్యుని పురమునకు బంపుటయును;

తృతీయాంకము

శకుంతలా దుష్యంతుల పరస్పరానురాగ మభివృద్ధి నొందుటయు, గాంధర్వవివాహవిషయక ప్రస్తావన,తద్విషయమై సఖులసమ్మతియును;

చతుర్థాంకము

శకుంతలా విరహము, చెలిమికత్తియల సంభాషణ, దూర్వాసాగమనము, శకుంతలాశాపప్రాప్తి, కణ్వాగమనము, కణ్వుడు శకుంతలను బతిగృహమున కనుపుటయును (విష్కంభము) రాజు శకుంతల కభిజ్ఞానార్థ మంగులీయక మిచ్చియుంటయు;

పంచమాంకము

దుష్యంతుని పేరోలగము. శకుంతలా ప్రవేశము ఆమె తన వృత్తాంతమును దెల్పియు గార్యము గానక నంతర్ధానము నొందుటయు, ధీవర నాగరికులసంభాషణ, అంగులీయకోద్ధారణయును;

షష్ఠాంకము

దుష్యంతుని విరహావస్థ, ఇంద్రుడు దుష్యంతుని బిలువనంపుటయు;

సప్తమాంకము

నగరాభిముఖుడగు దుష్యంతుడు మార్గమధ్యమున హేమకూటమును జేరుటయు, కుమారుని జూచుటయు, అనంతరము శకుంతలా సమ్మేళనమును. మహాభారతము నందలి శకుంతలోపాఖ్యానమునకును గాళిదాసుని నాటక కథా భాగమునకును విశేష తారతమ్యము గానరాదు, కాని కాళిదాసు కటిరెండు మార్పులచేతనే మొదటిగాధను మిగుల రమణీయముగా బరివర్తనము జేసెను.

అందొకటి కుమారోదయము, రెండవది శకుంతలా సంయోగము. ఈరెంటిని మూలగ్రంథమున జెప్పబడిన స్థలముల నుంపక మార్పునొందించి యుండెను. మూల గ్రంథమునందు మొదటిది కణ్వాశ్రమమునందనియు రెండవది రాజసభయందనియు నున్నది. నాటకమునందో మొదటిది రాజుచే గ్రహింపబడక శకుంతల యంతర్ధానము నొందిన యనంతరమనియు రెండవది దుష్యంతుడు కుమారునిజూచిన యనంతరమనియును నున్నది.

మూలగ్రంథమున లేని గొప్పమార్పుల నిక రెంటిని కవి తననాటకమున నుంచెను. ఒకటి–అభిజ్ఞానార్థ మంగులీయకదానము; రెండు–దూర్వాసశాపము.

కాళిదాసు తన నాటకకథాభాగమునకు మహాభారతమునందలి శకుంతలోపాఖ్యానమును మాతృకగా గ్రహించినట్లే భవభూతియు తనయుత్తరరామచరిత్రమునకు మాతృకను వాల్మీకిరామాయణమునుండి గ్రహించెను.

ఉత్తరచరిత్రకు, మాతృకయగు రామాయణము నందలి కథాభాగము:

రావణవిజయానంతరము రాముడు రాజ్యము బాలించుచు జానకీవిషయమగు జనుల దురభిప్రాయముల విని వంశమర్యాద బ్రతిష్ఠింప నెంచి తపోవనదర్శనవ్యాజమున సీత నరణ్యమునకు బంపుటయు, వాల్మీకియాశ్రమమున సీత కుశలవుల గనుటయు, రాము డశ్వమేధము జేయుటయు, శూద్రకవధయు, వాల్మీకి సశిష్యుడై రాముని యాగమునకు జనుటయు, కుశలవు లందు వాల్మీకికృత రామాయణమును గాన మొనరించుటయు. రాముడు వారి యాకారసాదృశ్యముచే కుమారులనియెంచి సీతాపరిగ్రహణమున కనుమతించియు జనసమ్మతికొఱ కామె నగ్ని నురుకుమన నభిమానక్షోభల నామె భూప్రవేశ మొనర్చుటయును,

ఈగాధనే భవభూతి తననాటకమున నిట్లలంకరించెను.

ప్రథమాంకము

అంతఃపురమున సీతారాములుండ నష్టావక్రుడు ప్రవేశించుటయు, రాముడు మునితో ప్రజారాధనార్థము సీతనైనను విడిచెదనని ప్రతిన నొనరించుటయు, అనంతరము సీతారాములు చిత్రపటదర్శన మొనర్చుటయు, నా సమయమున సీత తపోవనముల జూడగోరుటయు, దుర్ముఖుడు సీతావిషయికజనాపవాదముల రామునికి వినిపించుటయు, సీతను విడుచుటకు రాముడు సంకల్పించుటయును;

ద్వితీయాంకము

రాముడు పంచవటిజేరి శూద్రకునివధించి యనంతరము జనస్థానమునకు బోవుటయును;

తృతీయాంకము

వాసన్తితమసాఛాయాసీతలయెదుట రాముడు విలపించుటయు, నావిలాపముననే సువర్ణసీత నిడికొని తా నశ్వమేధ మొనర్చితినని నుడువుటయు, (విష్కంభమున) సీతప్రసవవేదన కోర్వక గంగలోదుమికిన నాగంగయా సీతను రసాతలము జేర్చి కుశలవుల వాల్మీకి కొప్పగించుటయును;

చతుర్థాంకము

కౌసల్యారుంధతులు, జనకుడును విలపించుచు లవుని జూచుటయును;

పంచమాంకము

లవచంద్రకేతువుల యుద్ధము;

షష్ఠాంకము

(విష్కంభము) విద్యాధరీవిద్యాధరుల సల్లాపమునందలి యుద్ధవర్ణన, లవకుశచంద్రకేతులను రాముడు జూచుటయు, కుశునివలన వాల్మీకి రామాయణమును వినుటయు;

సప్తమాంకము

సీతావనవాసాయాసాభినయము, సీతారాముల సమ్మేళనము.

భవభూతి తననాటకకథాభాగమున మూలగ్రంథమునంతగా నాధారపరిచికొని యుండలేదు. వాల్మీకి రాముని వంశమర్యాదను ప్రతిష్ఠింపగోరి యొకమిష గల్పించి సీత నరణ్యముల కంపెను. భవభూతి రాముడట్లొనర్పక ప్రజారాధనార్థమై యేవ్యాజమునుగల్పింపక సీత నరణ్యముల కంపెను. ఈవిధముగా భవభూతి తన రాముని మార్పునొందించుటయేకాక రాముడు శూద్రకుని వధించి యాతనికి దివ్యమూర్తి నొసంగెననియు, ఛాయాసీతను దర్శించెననియు వ్రాయుచు, లవచంద్రకేతుల యుద్ధమును సీతారాముల సమ్మేళనమును నెక్కువగా జేర్చెను. ఈయుభయులును దమనాటకకథలకు జీవికలగు గ్రంథములనుండి కథాభాగముల నేల మార్పులనొందించిరి?

కాళిదాసు శకుంతలాపుత్రుడగు సర్వదమనునివృత్తాంతమున శకుంతలాదుష్యంతుల పునస్సమ్మేళన మొనర్చెను. బహుశః కవి కాసమయమున గుశలవులగాథ జ్ఞప్తియందుండవచ్చును. ఈమార్పును కవి కవితారసపోషణకై కల్పించియుండవచ్చును గాని అభిజ్ఞానము, శాపము యివ్యవి కల్పనామాత్రము లేకాక కవియేదే నొకగురుతరయుద్దేశమున రచియించియుండవచ్చునని తోచెడిని కవి యామార్పుల దనకథానాయకుని దోషరహితునిగా నొనర్పనెంచియే చేసియుండెను.

కాళిదాసు తననాటకమున నెవనిని నాయకునిగా వరియించియుండెనో యానాయకుడే మహాభారతమున బహుపత్నీకుడును స్త్రీలోలుడును నై యొక కుసుమమునుండి మఱియొక కుసుమమునకు మధుపానవశమున బరిభ్రమించుభ్రమరమును బోలియుండెను. అట్టి మనోహరపుష్పగుచ్ఛ సమానమగు నొకానొక బాలికయొక్క కన్యాత్వము నేలగలిపి పారిపోయెనట. అందు ట్టియాశ్చర్యము గానరాదు. మఱియు నాతడు రాజసభయందుగాని, యంతఃపురమునందుగాని, యిట్టిలజ్జాజనకమగు వృత్తాంతమును బ్రకటింపలేదనిగాని, స్వీకరింపలేదనిగాని యెంచుటయు ననుచితమేయగును. కాని కాళిదాసుమాత్రము తనకథానాయకుని ధార్మికశ్రేష్ఠునిగను, కర్తవ్యపరాయణునిగను జేయుట కెంతయో ప్రయాసపడియెను. అందువలననే కవి గాంధర్వము అభిజ్ఞానము శాపము అను మార్పులచే కథానాయకుని కళంకములనుండి సంరక్షించియుండెను. ఈనాటకమున వర్ణితుడగు నాయకుడు మానసికదృష్టి నరయువారికి మిగుల రసికాపతంసునివలె గాన్పించును.

దుష్యంతుడు కణ్వాశ్రమము బ్రవేశించి యతిథిసత్కారము నందుసందర్భమున కవికథతము గాక పోయినను (దుహితరం శకుంతలాం అతిథిసత్కారాయ నియుజ్య) అను వైఖానసవచనమువలననే నాయకుడు రసికశేఖరుడని పాఠకులు గ్రహింపనేమానరు. ఈవైఖానసవచనమందలి యాకాంతమగు శకుంతలాశబ్దమే నాయకునిమనమున నొకానొకకౌతూహలము నుత్పాదించెను. దానికి ప్రత్యుత్తరముగా రాజు చెప్పిన (ద్రక్ష్యామి) అను వాక్యము దాసీనజనితముగాదు. అనంతరము సఖీపరివృతయగు శకుంతల నాశ్రమోపవనమునజూచి (మాధవీకృతాంశిఖలు నుజ్వలైరుద్యానలతావనలతాభిః) అని

యనుకొనుటయును కేవలము కవికల్పితమే కాదు. అయ్యది కల్పితమైననో చెట్టుచాటునడాగికొని దుష్యంతుడు శకుంతలను దర్శింపవలసినంతటి యవసర మగుపడదు. పాపచింతగలవాడే డాగును. కానిచో దుష్యంతుడు పాదపాంతరితుడై యామువ్వురి సల్లాపములవిని శకుంతలను గుర్తించి కణ్వు డీబాలికారత్నమును (ఆశ్రమధర్మేనియుక్తా). తపోవృత్తినవలంబింపజేసెను గావుననే (అసాధుదర్శీ ఖలుతత్రభవాన్ కాశ్యపః) కాశ్యపుడు చక్కగా నాలోచింపలేదనుట కేవలము కరుణారసజనితము కాదా? చెట్టుచాటునుండియే దుష్యంతుడు శకుంతలను జూచి మరల నీవిధమున (ఇదముపహితసూక్ష్మగ్రంథినా స్కంధదేశే స్తనయుగపరిణాహాచ్ఛాదినా వల్కలేన, వపురభినవమస్యాః పుష్యతి స్వాం న శోభాం కుసుమమివ పినద్ధం పాండుపత్రోదరేణ) స్కంధమున ధరించినవల్కలము స్తనమండలమును సంపూర్ణముగా నాచ్ఛాదించుటచే బండుటాకులచే గప్పబడిన పుష్పశోభవలె శకుంతలానూత్న యౌవనము పరిపూర్ణముగా లోచనగోచరము గాదని యనుకొనెను.

నాయకు డిప్పట్టున దేనిని గనుచున్నాడో పాఠకులు చక్కగా గమనింతురుగాక. అనంతరము, (అస్యాం అభిలాషి మేమనః) అని నాయకుడు దనమనోగతమును వెలిపుచ్చినప్పుడైనను మీమనస్సంశయములు దూరములు గాకుండునా? కాని కవి తనకథానాయకు నీవిషమ విషయమునుండి చక్కగా సంరక్షించెను. నాయకుడు కన్యాదర్శన లాలసపరవశుడైనను వివాహచింత గలిగి యుండెను. రాజు శకుంతలయొక్క పుట్టువు గురించియు నామెభవిష్యద్దశను గురించియు నాలోచించుచు (సతాం హి సందేహపదేషు వస్తుషు ప్రమాణమంతఃకరణప్రవృత్తయః). సందేహసందిగ్ధకార్యముల నార్యులమనఃప్రవృత్తియే కారణమనగా నార్యులమన మనుచితమందు ప్రవేశింపదని యనుకొనియెను. దుష్యంతు డెపుడు శకుంతల మేనకా విశ్వామిత్రుల తనూజయని తెలిసికొనెనో యపుడే తన మనమునుండి గొప్ప భారమును దించికొనియెను. వెంటనే, (ఆశంకసే యదగ్నిం తదిదం స్పర్శక్షమం రత్నం) హృదయమా! నీవు దేని నగ్నియని శంకించితివో యదియే యిపుడు స్పర్శయోగ్యమగు రత్నమయ్యెనని యనియెను. కవి తన కథానాయకు నీసమయమున కాముకుగా నొనరించినను మిగుల లంపటునిగా జేయలేదు. ఇట్టి యాలోచనాపరంపరలచే నాయకునిమానుషత్వమునకు భంగమువాటిలలేదు. నాయకుడు మిగుల కామాంధుడైనను వివేకభ్రష్టుడు గాలేదు. రూపపిపాసాపూర్ణములగు దృష్టుల శకుంతలను గని యామె తన కుపభోగార్హయని భావించెననుట వాస్తవమే కాని యాయాలోచనతో గూడను శకుంతలా వివాహమునుగూర్చియు నాలోచింపక పోలేదు. నాయికను కేవలము ధర్మభ్రష్టనుగా జేసియే పారిపోజూడలేదు గాన నాయకుని యాశయ మంత దుష్టము గాదు.

కామోపాసకులగు కొందరుకవులు వివాహపదార్థమును కేవలము గద్యమయముగా నెంచుచున్నారు. అయ్యది స్వర్గీయప్రేమ కొకవిఘ్నమైన బాధకమనియు నయ్యదియనవసరమగు నొకజంజాటమనియును నందుచేతనే దానికి గావ్యమున దావులేదనియును వారి యభిప్రాయము. ఈసందర్భమున గ్రీకుకవియగు ప్లేటో మహాశయుని యభిప్రాయానుసారమునను ప్రేమయందు వివాహమునకు దావులేదనియే. స్త్రీపురుషుల భవిష్యద్దశ వారిప్రేమయందే లీనమగుచున్నదనియే యాతని యాశయము. కాని యెచట ప్రేమగలదో యచట వివాహమపరిహార్యమే యగును. వివాహమే లేనిచో నొకకార్యమును సాగనేరదు. వివాహరహితసమ్మేళనము కేవలము పశుసమ్మేళనమువంటిది. వివాహములేనిప్రేమ కర్తవ్యజ్ఞానశూన్యమై కామసేవారూపకమగును. వివాహసంయోగము క్షణికముగాదనియు సర్వకాలమును నది స్థిరముగా నుండవలసినదనియును దెలుపును. స్త్రీ కేవలము భోగ్యపదార్థమే కాదనియును, సమ్మానయోగ్యయనియును దెల్పును. వివాహసంస్కారము కేవలము కుటుంబసౌఖ్యమునకే కాక సంతానకల్యాణమును, సమాజ మంగళకారణమును నయియున్నది. కేవలము స్వసౌఖ్యమునకే కాక సంఘసౌఖ్యమునకును నయ్యది సహకారిగానున్నది. అయ్యది మిగుల కుత్సితములను రమణీయములనుగా జేయును. అయ్యది యుద్దామకామమునకు శృంఖలము. వివాహము ప్రపంచమును స్వర్గతుల్యమొనర్చును. పశువులలో వివాహములు లేవు. అసభ్యజాతులయందును వివాహములు లేవు. వివాహమే

సభ్యతకు మూలము. వివాహము కుసంస్కారము గాదు. విపత్కారియును గాదు.

వివాహమునకు గావ్యమున స్థానము లేదట. ఇక నుచ్ఛృంఖలమైన కామసేవకును, నగ్నమూర్తిసందర్శనమున నుద్దీప్తమైన లాలసోత్తేజమునకును బశుతుల్యమగు క్షణికసంయోగోన్మాదములకా స్థానముండుట? కావ్యముల వివాహముల వర్ణించుటకంటెను నైవిషయముల వర్ణించుటయే మిగుల నింద్యము. మహాకావ్యములందవి కేవల సూచ్యములేకాని ప్రత్యక్షములు కావు. అట్టివర్ణనలచే బంగాళీకవియగు భారతచంద్రునివంటి కామోపాసకులగు కవులు కొందరుమాత్రమే యానందింతురు. వివాహము లేని వర్ణనము కేవలము వ్యాధిగ్రస్తమస్తిష్కవికారములను, భ్రమత్తప్రలాపములను బోలియుండును.

మహాభారతకర్తయు కావ్యమున వివాహమపరిహార్యమనియే పశుసంగమవర్ణనముల నం దొనరించి యుండలేదు. కాళిదాసుడును నొక మహాకవి. కావనే కర్తవ్యజ్ఞానరహితలాలసము సుందరముకాక కుత్సితమగును గాన సుందరమగు చిత్రమునే లిఖింప సమకట్టెను. అందుచేతనే వివాహమపరిహార్యమని తలంచెను. సుందరములగు చంద్రాకాశనదీకుసుమములును స్త్రీయవయవములును మనుజునంతఃకరణసౌందర్యమునకు సాటిరావు.

భక్తి, స్నేహము, కృతజ్ఞత, సేవ, ఆత్మత్యాగము మొదలగు స్వర్గీయసౌందర్యములను రమణుల సువృత్తములగు బాహువల్లికలయొక్కయు పీనపయోధరములయొక్కయు సౌందర్యములు పోలక్రీడావనములకును. కర్తవ్యజ్ఞానరహితమయ్యును, సుందరమగు వస్తువెద్దియైననుగలదా? ఈ కర్తవ్యజ్ఞానమే కుత్సితబీభత్సములగు లాలసకామములనైనను నలంకరించుచున్నది. వివాహరహితమగు కేవలలాలసవర్ణన మిగుల కుత్సితమే యగును. అయ్యది కామోద్దీపకముగాన కాముకులకుమాత్రమే సమ్మతమగును గాని యది యథార్థసౌందర్యము నందనేరదు.

కవి యీవిధముగా దుష్యంతుని విపులముగా గాపాడెను. దుష్యంతుడు రాజధానికి వచ్చి శకుంతలావృత్తాంతము నేమరచి స్వయముగా నామె రాజసభకేతెంచినను గుర్తింపక జంకులేక తనధర్మపత్నియనియైనను భావింపక సునాయాసముగా దనయసమ్మతిని దెల్పెను. కేవలము కాముకుడై బహుపత్నీకుడగువాడిట్టికార్యమాచరించెననుటయం దాశ్చర్యమేమి? కాని కవి అభిజ్ఞానము, అభిశాపము వీనిచే దుర్యశమునుండి దుష్యంతుని చక్కగా గాపాడెను. అభిజ్ఞానార్థమై స్వనామాంకితముగు నీయంగుళీయకమును దానిచ్చియుండెనో దానినామె యటగనబరచియుండిన దత్క్షణమే యతడామెను ధర్మపత్నిగా గ్రహించియుండును. అభిశాపమువలన రాజు శకుంతలను మరచుటలో కేవలము లంపటుడనితోపక దైవప్రాతికూల్యుడనియే తెలియుచున్నది. శకుంతలాప్రత్యాఖ్యానము కేవలము దైవకృతమేకాని రాజుచే నొనర్పబడినది కాదు. విశేషముగా కవి ధర్మమందలి భయభావమునే శకుంతలాప్రత్యాఖ్యానమున గనబరచెను.

చతుర్థాంకమున విరహపీడితయగు శకుంతల తన ధ్యానమునంతయు దుష్యంతునియందే యుంచియుండెను. ఆసమయముననే దుర్వాసుడాశ్రమద్వారమున, 'అయమహంభోః' యని యరచెను. దానిచే శకుంతలాధ్యానసమాధికి భంగము వాటిలలేదు. కావనే దుర్వాసుడాగ్రహమున (విచింతయంతీయ మనన్యమానసా తపోధనం వేత్సి న మా ముపస్థితమ్; స్మరిష్యతి త్వాం న స బోధితోఽపి సన్ కథాం ప్రమత్తః ప్రథమం కృతామివ) అనన్యమనస్కయై యీమె యెవనిధ్యానించుచు నతిథినైన తపోధనుడను నన్ను దెలియదో యాధ్యానగతుడగు పురుషుడు మధుపానమత్తుడు పూర్వోచ్చరితవాక్యముల దెలిపినను దెలియనట్లు ప్రబోధితుడైనను దెలియకపోవుగాకని శాప మొసంగెను.

ఆశాపమునైనను శకుంతల వినినదా, లేదు. విని యుండిన నేమి సంభవించియుండెడిదో! అనసూయ మాత్ర మాశాపవాక్యముల విని త్వరితగతి జని ఋషిపాదములంబడి 'యార్యా! నా చెచ్చెలి బాలిక. ఆమె తప్పునంతగా గొనక మన్నింపు'మని వేడ నతడు గరుణించి 'యభిజ్ఞానదర్శనమున రాజు స్మృతిపథము నందగల'డని నుడివి చనెను.

కఠోరమగు నీశాపమును దెల్పిన శకుంతల మనస్సంకటము నొందుననియే కాబోలు ననసూయాప్రియంవదలామె పతిగృహమునకు బోవునపుడైనను జెల్పక కేవలము సూచనగా రాజర్షి గుర్తింపనిచో నంగుళీయకము

నొసంగుటనిమాత్రము చెప్పిరి. దుర్వాస శాపమున కంటె నభిజ్ఞానమే దుష్యంతుని దోషములనుండి యధికముగా గాపాడెను.

భవభూతియు నిట్టిచాతుర్యముచే తనకథానాయకుని గనుపఱచెను. వాల్మీకిరాముడు పతిపరాయణయగు సీతను దనవంశమర్యాదను గాపాడుటకొఱకే మరియొకవ్యాజమున నరణ్యమున కంపెను. రాజు న్యాయానుసారిగా నుండవలెననియు, నిరపరాధిని దండించుట మహాపాపమనియు, సీత నిరపరాధినియగుట నామెకు ప్రవాసశిక్ష నొసంగుటవలన వంశమర్యాద నశించుటేకాక వంశము నంతయునొందుననియు, దనకథానాయకు డట్టి యకృత్యాచరణుడై దుర్యశమునొందుట సరికాదనియు భవభూతి యష్టావక్రముని యెదుటనే రామునిచే (స్నేహం దయాం తథా సౌఖ్యం యదివా జానకీమపి; ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తి మే వ్యథా) ప్రజారాధనార్థమై స్నేహమునుగాని దయనుగాని సౌఖ్యమునుగాని లేక జానకినిగాని నిస్సంకటముగా విడువగలనని ప్రతిన చేయించెను. ప్రజారంజనమే రాజకార్యమని కనుపరచి నిరపరాధిని యగు సీతను ప్రజారంజనార్థమే యరణ్యమున కనిపెనని సాధ్యమగువరకును దన కథానాయకుని దోషరహితు జేసెను.

భవభూతి తనరాముని నింక నొక్కస్థలమునందును నట్టిదోషముల నరయకుండ సంరక్షించెను. రామాయణమున రాముడు నిర్దోషుడగు శూద్రకు వధించె. అతియసంభావ్యమనియు దపఃకర్మనిరతుడగు శూద్రకుడు మరణదండనార్హుడాయనియు భావించి దయాపూర్వకముగా శూద్రకుశాపవిమోచనార్థమై వధియించి యతనికి దివ్యమూర్తిత్వ మొసంగెననియు రచించెను.


కాళిదాసభవభూతు లీవిధముగ మూలగ్రంథముల నేలపరివర్తనమొనరించిరన, దమకథానాయకుల దోషరహితులుగాజేయు నభిలాషయేకాక మఱియొక కారణమును గలదు. సంస్కృతసాహిత్యమున నలంకారశాస్త్రమను నది ప్రసిద్ధము. ప్రతికవియును దానిని మన్నింపవలసియేయుండెను. ఆశాస్త్రానుసారముగా నాటకములందలి నాయకులు సుగుణాలంకృతులై నిర్దోషులై యుండవలెననెడి నియమ మేర్పడుచున్నది. కావననే మనకవులాశాస్త్రము ననుసరింపవలసివచ్చెను. కొందఱిట్టినియమ మత్యంతకఠోరమనియు దానిచే నాటకకారుని స్వాతంత్ర్యమునకు భంగము వాటిల్లుననియును భావించుచున్నారు. కాని గానమునకు దాళము, నృత్యమునకు భావము, కవిత్వమునకు ఛందము, సేనకు గతి మొదలగువానివలె ప్రతికార్యమున కేదేనొకనియమ ముండియే తీరను. అట్టినియమముండుటచేతనే కావ్యనాటకములు సుకుమారకళ లనిపించికొని యధికసౌందర్యముల నొందును. అయిన నిపుడు విచారణీయాంశ మీనియమ ముచితమా యనుచితమా యని మాత్రమే.

నాయకుడు సర్వగుణయుక్తుడుగా నుండవలెననెడి నియమము నాటకాధిక్యమునకనియే నాయభిప్రాయము. ఆకారణముననే సంస్కృతనాటకములందలి నాయకులు రాజులుగాగాని రాజపుత్రులుగాగాని యుండుచువచ్చిరి. ఇట్టినియమములను ప్రత్యక్షముగా నొప్పుకొనకపోయినను ప్రపంచమున నాటకకారు లనేకులు గార్యరూపమున స్వీకరించియేయున్నారు. షేక్స్పియర్ మహాశయుని నాయకులు సామ్రాట్టులును, రాజపుత్రులును నయియుండిరి. మాక్బెత్ చివరకు రాజయ్యెను. ఓథేలో కడపటికి సేనానియయ్యెను.

ఇటలీయందలి సర్వోత్కృష్ట చిత్రకారులును (ఏసుక్రీస్తు) యొక్క జీవనచరిత్రమునే తమచిత్రవిషయముగా నెంచికొనిరి. హోమర్. మహాకవి తన ఇలియడ్ కావ్యమున రాజుల పరస్పరయుద్ధమునే విషయముగా గ్రహించెను.


ఆధునికనాట్యాచార్యు లీనియమము నంతగా బాటింపరు. ఇబ్సన్‌మహాకవి వ్రాసిన సామాజికనాటకములందలి నాయకులందఱును సామాన్య గృహస్థులే. సత్యముగా సామాన్యగృహస్థాచరణీయాంశములే సామాజిక నాటకములకు ప్రాధాన్యములై యుండును. స్పెయిన్, పోర్చుగల్, ఇంగ్లండునందలి చిత్రకారులు సామాన్య మనుజులచిత్రములనే చిత్రించి జగత్ప్రసిద్ధులయిరి. అయినను షేక్స్పియర్ మహాకవియొక్క సర్వోత్కృష్ట నాటకములతో ఇబ్సన్ మహాకవి నాటకములు సమానములుగావు. అయ్యవి సమానములని నుడువుట జగత్ప్రసిద్ధ చిత్రకారులగు రుబేన్స్ టర్నర్

చిత్రము 3



3. 941. సిరియాదేశమున చిన్నపిల్లలు తొడుగుకొనెడు కాలి అందె. వెండిపట్టెపై మువ్వలు గట్టబడి యున్నవి. 942. సిరియనులు తలపాగపై నుంచుకొను నలంకారము. గిల్టు చిత్రపుపనిగలది. 943. పందొమ్మిదవ శతాబ్దమునందలి అల్జీరియనుల శిరోభూషణము. పూసలకూర్పు గలదు. ఇందు, 'వేడు' మున్నగు రత్నములును, గ్లాసుముక్కలును చెక్కబడినవి. 944. పందొమ్మిదవశతాబ్దమున ఉత్తరహిందూస్థానమున వాడుకయందుండిన ఉంగరము. 945. గ్రీకులు ధరించెడు బంగారపు చెవిపోగు.

చిత్రము ౪



౪. 946–968, ఆసామునందలి ఆదిమజాతులవారు (అబారిజినులు) ధరించెడు నగలు.

లిఖితములగు చిత్రములతో రాఫేల్, టిశియన్ మికేల్ ఎంజిల్ మొదలగువారిచిత్రముల బోల్చిన ట్లుండును.

సంస్కృతాలంకారశాస్త్రమును సరియనియే చెప్పవలసియుండును. నాటకవిషయ ముత్కృష్టము గానిచో నాటకములయందలి గౌరవ మొకవిధముగా క్షీణించును. అందుచేతనే సామాన్యచిత్రకారుని చిత్రములు రాఫేల్ మహాశయుని మడోనా చిత్రముతో సమానములుగా నట్లే ఇబ్సన్ మొదలగు నాటకాచార్యుల సమాజనాటకములు మహాశయుని జూలియస్ సీజర్ తో సమానములు గావు. ఇట్టిసామాన్యచిత్రములుగాని నాటకములుగాని దర్శకులయొక్కయు శ్రోతలయొక్కయు హృదయములను స్తంభితములుగాగాని స్పందితములుగాగాని యొనర్పజాలవు. అట్టి చిత్రకారులయొక్కయు నాటకకారులయొక్కయు కేవల ప్రకృతివిజ్ఞానమును జూచి హృదయమున సహాస్య విస్మయముమాత్ర ముత్పన్నమగుచున్నది. వేనినిగనుగొనిన వాని రచనయందలి నైపుణ్యముమాత్రమే మనమనముల నాకర్షించునో యవి నిమ్నశ్రేణిరచనలనియే యెంచవగును. వేనినిజూచినను గాని వినినగాని ప్రేక్షకుడును శ్రోతయు జిత్రకారునియొక్కయు నస్తిత్వమునే మరచి కేవల మాతనిరచనయందే మగ్నుడై తన్మయత్వము నొందునో యట్టిదే మహారచనయనందగును. రంగస్థలమున ఇర్వింగ్ వంటి మహానటు డభినయించునపు డెంతటి యభినయమును ఇర్వింగ్ గనబరచుచున్నాడని జను లనుకొనినచో నాతనియభినయ ముత్తమము గానేరదు. హామ్లెట్ అభినయమున జన మెపుడిర్వింగ్ యొక్కయాస్తికతనే మరచునో యప్పుడే యాయభినయ ముత్తమ మనందగును. ఇట్టిగుణమే గ్రంథకారులయందును నుండదగినది. ఏనాటకపఠనమున పాఠకునిమనము గ్రంథకారుని కౌశల్యమునందుగాని క్షమతయందుగాని సూక్ష్మదృష్టియందుగాని సౌందర్యజ్ఞానమునందుగాని స్తంభించునో యట్టినాటక ముచ్చశ్రేణికి జేరదు. ఏనాటకము పాఠకుని తన్మయునిగాజేయునో యేనాటకము పాఠకుని సర్వాలోచనములను, సమస్తానుభవములను సంపూర్ణమనోయోగమును దనయందు లీనమొందింపజేయునో; వేయేల? యేనాటకము పాఠకునిజ్ఞానమునే లుప్తమొందించునో యయ్యదియే యత్యంతోచ్చశ్రేణినాటక మనందగును.

రాజోనర్చెడుప్రేమ, యుద్ధము మొదలగువానియందును నట్టిమోహము గలదు. "రాజు" అనుశబ్దము సంపూర్ణజాతికి ప్రతినిధియనియు, సర్వజనసమ్మాన్యమనియు, కేంద్రమనియును భావము. రాజు వీథినిబోవునపుడును సభయందాసీనుడై యుండునపుడును జను లాతని నాదరభావమున నిమీలితనేత్రముల జూతురు. వానిప్రతి యాచరణమునందును మాటలయందును నొకవిశేషము నిగూఢభావము గలదు. రాజిపుడు మేల్కాంచెననియు, నిపుడు భుజించుననియు, నిపుడు పరుండుననియును జను లాతని కార్యములనే యాదరమున, బరస్పరము భాషించుచుందురు. పసిబాలురును రాజచరిత్రము వినుటకు నుత్సాహాలులై యుందురు. ఈకారణముననే గృహములందలి ముసలమ్మలు తమబాలురకు గథలు జెప్పునప్పుడు "అనగనగ నొకపట్టణముండెను. ఆయూర నొకరాజుండెను. ఆతని కిద్దఱు భార్యలు. ఆతడొకనాడు వేటకుబోయెను. దారిలో నొకరాజకన్య నాతడు గాంచెను..." ఇత్యాదికథలనే సర్వసామాన్యముగ జెప్పుట వాడుక. రాజకన్యక లేనికథ సొగసుగ నుండదు. ఐన నీరాజశబ్దమున కింతటిమోహ ముత్పత్తిల్లుటకు గారణమేమన నెయ్యది మనము స్పష్టముగ దెలిసికొనియుందుమో యావిషయమును నిశ్శేషముగ దెలిసికొనవలెననెడి కుతూహలమే దానికి గారణమగును.

లక్షలకొలదిజనులు యుద్ధమున మడియుటకుగాని సుఖులగుటకుగాని రాజశాసనమే కారణమగునుగదా! కాననే రాజు మిగుల ప్రజాదరణపాత్రుడు. నాటకకారులును రాజులనే తమకథానాయకులనుగ నుంచుట కిదియే కారణము. వారు తమకథావిషయము నిర్బాధకముగ నడుపవలెనని తలంచినచో రాజవృత్తాంతమునే గ్రహింపనొప్పును. సముద్రము లేక కెరటముల నెట్లు చూపవలనుపడదో యట్లే శ్రేష్ఠగుణుడగు నాయకు డుండనిచో గథావిషయము సమంజసము గాజాలదు.

ఐనను నాటకముల కథావిషయము గొప్పదిగ నుండవలయుననెడు నియమ మొప్పదగినదే. కాని, రాజే కథానాయకుడుగ నుండవలయుననుట యేమి? సాధారణగృహస్థులందును మహత్ప్రవృత్తు లుండుటలేదా? సామాన్యగృహమేధులును గార్యముపట్ల వీరత్వము గన

బరమునులేదా? వీరత్వము, సత్యము, సాహసము, కర్తవ్యపరాయణత యనునవి కొందఱు యజమానులందును గనబడుచుండుట లోకవిదితమే కదా! కాన నేసామాన్య గృహస్థుడైనను గథానాయకుడుగ నుండవచ్చును. కాని యజమాని కేవలము మహాపురుషుడుగ నుండవలయును.

కథానాయకుడు సర్వగుణసంపన్నుడును, దోషరహితుడుగా నుండవలయుననెడు నియమము కేవలము దుస్తరమైనది. నాటకములన్నియు నొకేవిధముగ నుండుటయు నతిమానుష్యకమును, నస్వాభావికమును నను రెండుదోషములు దానం బుట్టకమానవు. దోషలేశరహితుడగు మానవుడు కేవల మాదర్శప్రాయుడు. ఆదర్శవాదుల నాటకముల నట్టినాయకు లుందురు. కాని స్వాభావికవాదు లద్దాని నస్వాభావికమని యట్టివారిదమకథానాయకులనుగా గొనక బరిహరింతురు. ఈకారణముచేతనే లంపటుడుగాని దుర్మార్గుడుగాని నాటకములందు నాయకులుగ నుండజాలరు. కేవల మిట్టిలంపటుల జిత్రించుటచే బ్రాపంచికసౌందర్యము వర్ణితము గానేరదు. స్వాభావికమైనంతనే యది మిగుల సుందరము గానేరదు. స్వభావజమే సుందరమనిన బ్రాపంచికపదార్థములలో సుందరముగాని పదార్థమేయుండదు. కాననే యిప్పుడు సుందరశబ్దమునే వాఙ్మయమునకు వెలుపలనుంపవలసి వచ్చును. ఎద్దిసుందరముగాదో యది నాటకమునకు నాయకముగ నుండనేరదు ఏచిత్రకారుడుగాని కవిగాని యట్టివికృతవ్యక్తికి తమరచనలందు బ్రధానత్వమిచ్చుట కొడంబడరు. నాటకమున గుత్సితవర్ణనము గూడ సుందరపదార్థోత్కర్షమునకే. కాని షేక్స్పియర్ యీనియమము నంతగ బాటించలేదు. అమ్మహాశయుని సర్వోత్కృష్ట నాటకవిషయములు గొప్పవియే; కాని, యాతనికథానాయకులుమాత్రము విశేషగుణసంపన్నులు కారు. హామ్లెట్ (Hamlet) యందుండు గుణము పితృభక్తి యొక్కటియే. లియర్ రాజు (King Lear) ఒక పిచ్చివాడు. బిడ్డలకు దల్లిదండ్రులయందలిభక్తి కేవలము ముఖోచ్ఛ్వాసమేకాని యాంతరంగికము కాదని యాతని యాశయము. వానికుమారితలగు 'రీగన్' (Regan) 'గోనరిల్' (Gonerill) అనువారు దమతండ్రిపార్శ్వచరులందఱ విడదీసి యాతని నస్వతంత్రుని జేసిరి. ఆకారణముననే వారి పితృభక్తిభావమునుజూచి "ఓకృతఘ్నతా! నీహృదయము పాషాణసదృశ" ''Ingtati'ude thou marble hearted fie'd'')మని రోదనముచేసెను. వీని యీరోదనము కేవల మున్మత్తప్రలాపమును బోలియున్నది. 'ఒథెల్లో' (Othello) మిగుల నీర్ష్యాపరవశుడు కానిచో ననురక్తయగు తనధర్మపత్నిని నిష్కారణముగ జంపియుండడు. 'మాక్బెత్తు' (Macbeth) స్వామిద్రోహి. 'అంటోని' (Antony) కాముకుడు. జూలియస్ సీజరు దాంభికుడు. కాని కవి ఈపాపప్రవృత్తులకు దగినభయంకరపరిణామము గల్పించెను. పాపమునకు బ్రతిఫలము నిష్ఫలముగాని, యాత్మహత్యకాని యగును.

గెయిథే (Gœthe)మహాశయుని ఫాస్టు (Faust) న గథావిషయ మిట్టిదేకాని షేక్స్పియరు తననాటకముల కథావిషయముల నుత్కృష్టములైనవానినిమాత్రమే కైకొనుటచే నాతనికథానాయకుల నయ్యవియే శ్రేష్ఠులనుగ జేయుచు నాటకములకంతటిప్రతిభ గలిగించెను. 'హామ్లెటు' నాటకమున 'హొరేషియో' (Horatio), 'పాలోనియస్' (Polonius), 'ఒఫీలియా' (Ophelia), 'కెంటు' (Kent), 'ఫూల్' (Fool), 'ఎడ్గార్' (Edgar), 'కార్డేలియా' (Cordelia), 'ఒథెల్లో' నాటకమున సతీమణి 'దశదమోన' (Desdemona), దానిచెలియు, 'మాక్బెత్తు' నాటకమున 'బేంకో' (Banquo), 'మాక్డఫ్' (Macduff) 'అంటోనీ క్లియోపాత్రా' (Antony and Cleopatra) నాటకమున 'ఆక్టేవియస్' (Octavius) 'జూలియస్ సీజరు' నాటకమున 'బ్రూటస్' (Brutus) 'పోర్షియా' (Portia)వీరు తమచరిత్రప్రభావముల గథానాయకులనే యధికరించుచున్నారు.

. ఐనను షేక్స్పియరు ధనమునందును, క్షమతయందును గురుత్వమిడునట్టి యాంగ్లేయుడగుట నట్టికథావిషయముల నొనర్చియుండెనని నాయాశయము. పాశ్చాత్యులకు క్షమతే యాతనికత్యంత లోభనీయములగు పదార్థములు. మహచ్చరిత్రలకంటెను విరాట్చరిత్రల యందే యాతని కెక్కుడభిమానము. క్షమాధిక్యము, బుద్ధ్యతిశయము, విద్వేషవృద్ధి ఈర్ష్యానురాగము, హింసోత్కృష్టత, ఇవియే యాకవి కానందదాయకములు. కేవలము నిరీహుడగుబాలుడును బరదుఃఖా

సహిష్ణుడగు బుద్ధుడును, భక్తాగ్రేసరుడగు చైతన్యుడును నాకవియాశయమునకు నచ్చరు. దీన నాకవికి స్వార్థత్యాగమునందలి మాహాత్మ్యము దెలియదని మేమన జాలము. కాని యామహాశయుడు వీనికన్నను క్షమత, బహిర్వ్యాపారము ఇత్యాదులకే తననాటకముల నాధిక్యము గలిగించెను.

ధర్మపరాయణులగు ప్రాక్కవులు కొందఱు ధర్మమునే యెక్కువగ గణించిరన వారికి గామాదులు దెలియవని కాదు. కాని కథానాయకుని మాహాత్మ్యమునందే బుద్ధినిల్పుటచే గామాదులకంటెను మాహాత్మ్యమునకు నీచస్థానమియ్యక యాకారణముననే రాజుల గథానాయకులనుగ గొని వారిని సర్వగుణయుక్తులనుగ నొనర్చిరి.

మహాకవులగు కాళిదాస భవభూతు లిద్దఱును భరతఖండమందలి బ్రాహ్మణకవులు. వారును దమ కథానాయకుల సర్వగుణసహితులనుగ నొనర్చుటకు మిగుల బాటుపడిరి. కాని సంపూర్ణమనోరథులు కాలేదు. చరిత్రసందర్భమున నాయకీనాయకులయెడల దమకుగల క్రోధానుకంపముల నందందు వెలిపుచ్చిరి. శాకుంతల నాటకమందు బంచమాంకమున శకుంతలా ప్రత్యాఖ్యానమునకు బూర్వము క్రోధప్రకటనమునకు గారణము లేని సమయముననే గౌతమి "ణావేక్ఖిఓ గురుఅణో ఇమాఇ ణహు పుచ్ఛిదో అ బంధు అణో; పక్కేక్కమేవ్వ చరిఏ భణామి కిం ఏక్కమేక్కస్స" అనగా శకుంతల గురుజనములను లక్ష్యపెట్టలేదు. నీవును బంధుజనులసమ్మతి నందలేదు. అందుచే మహర్షియగు కణ్వుడీవిషయమున నేమి చెప్పగలుగునని నుడివెను. ఇది జ్వాలామయమగు వ్యంగ్యోక్తి. శకుంతలా ప్రత్యాఖ్యానానంతరము శార్ఙ్గరవుడు,

"మూర్ఛంత్యమీ వికారాః
ప్రాయే ణైశ్వర్యమత్తానామ్"

సంపదాంధులయం దిట్టి విపరీతాచరణములే యప్పుడప్పుడు కనబడునని, మఱియు నాతడే,

"కృతాభిమర్షా మనుమన్యమానః
సుతాం త్వయా నామ మునిర్విమాన్యః;
ముష్టం ప్రతిగ్రాహయతా స్వమర్థం
పాత్రీకృతో దస్యురివాసి యేన."

[చోరుని దండించుటకుబదులు చౌర్యద్రవ్యము వానికే యిడినట్లు తనయనుమతి గోరకయే శకుంతలా కౌమారవ్రతమును నష్టపఱచిన నీయెడ దయచే నామెను బంపిన మహర్షియెడ నిట్టియవమాన ముచితమా?] యని పల్కెను.

రాజపరిగ్రహణమునంగనిశకుంతల చేలము నడ్డుపఱచి దుఃఖించుచుండగ మఱల నాశార్ఙ్గరవుడే,

"ఇత్థమప్రతిహతం చాపల్యం దహతి"

[అప్రతిహతమగు చంచలత యిట్లే దహించును.] అనగా—అది నీ చాంచల్యమునకు ఫలము. బుద్ధిమాంద్యమున నొనర్చిన ప్రణయఫల మనుభవించుమని పల్కిన నద్దానికి దుష్యంతుడు మాఱుపల్కినవిూదట నాతడే మఱల—

"ఆజన్మనః శాఠ్య మశిక్షితో య
స్తస్యా ప్రమాణం వచనం జనస్య,
పరాభిసంధాన మధీయతే యైః
విద్యేతి తే సన్తు కిలాప్తవాచః."

[అనగా ఎవడు జన్మప్రభృతి ధూర్తతనేర్వడో వానివచన మొప్పిదము గాదు. పరుల మోసగించుటయే యెవడు విద్యగా గ్రహించునో వాడే సత్యవాదియగును.] అని పల్కెను.

ఇది కేవలము వ్యంగ్యము. శకుంతలనువిడిచివెడలునప్పుడు గౌతమీ శార్ఙ్గరవాదులు జూపినరోషము కేవలము కాముకీకాముకులను. శకుంతలాదుష్యంతులను గూర్చియే. ఋషికులోత్పన్నులగు వీరిట్టివాక్యముల నాడుటచే గవి మనోగతభావము స్పష్టమగుచున్నది.

భవభూతియు సీతారాముని విపులముగ గాపాడినను తృతీయాంకమున వాసంతీవచనములచే దన మనోగతము వెలిపుచ్చెను. ఛాయాసీతావిష్కంభమున వాసంతి వ్యంగ్యములగు మర్మభేదకోక్తుల రాముని దూలనాడెను.

త్వంజీవితమ్ త్వమసి మే హృదయమ్ ద్వితీయం,
త్వంకౌముదీ నయనయోరమృతమ్ త్వమంగే,
ఇత్యాదిభిః ప్రియశతై రనురుధ్య ముగ్ధామ్,
తామేవ శాంత మథవా కిమిహోత్తరేణ.

[అనగా నీవు నాజీవితము. నా రెండవ హృదయము. నానేత్రకౌముదివి. నాశరీరామృతమవు. ఇత్యాది ప్రియాలాపముల ముగ్ధయగు ధర్మపత్నిని ప్రసన్నురాలను జేసి—అని చెప్పలేక—చాలు నిట్టిమాటలచే ప్రయోజన మేమి? యనెను]

అనంతరము రాముడు ప్రజాభిప్రాయాను సారము నడిచితిననియు దానికి వారలే యుత్తరవాదు లన వాసంతి—

అయి కఠోర యశః కిల తే ప్రియం
కిమయశో నను ఘోర మతః పరమ్.

[ఓ! నిష్ఠురహృదయమా! నీకు యశము ప్రియమే. కాని యింతకంటె నపయశము దేనివలన బ్రాప్తించును]

అనిపల్కి- రాముని జనస్థానమున దృశ్యపూర్వములగు స్థలదర్శనమున జనించిన సుఖస్మృతిచే మిగుల బాధించెను.

పరపీడితుడగు దౌర్భాగ్యునిజూచి శోకించని కవి యింకను భారతమున బుట్టియుండ లేదు. కావున గవి యట్లు తన నాటకమున శోకమునకు స్థాన మిడి యుండుట మంచిదే యగును. పాపి సంకటము నొందినను కంట నీరుపెట్టని ప్రేక్షకు డుండడు. ఈకారణముననే మైకేల్ మధుసూదనదత్తుమహాకవి రావణుమరణమునుగూర్చి శోకించెను. మిల్టనుమహాకవియును సైతానుని దుఃఖముజూచి యోర్వలేకపోయెను. ఇట్టివిషయమున నిరపరాధురాలై నిష్కారణముగ బాధింపబడు నొకయబలను జూచి దుఃఖించనివా డుండునా? దశదమొనా (Desdemona) మృతినొందిన యనంతర మామె చెలి నోటవెడలిన వాక్యములు నిట్టివే. కాళిదాసునికోపము గౌతమీముఖమున బ్రకటితమయ్యెను. శకుంతల కామపరవశయయ్యెను, నమాయకురాలగు తాపసకన్యకయు బ్రలుబ్ధపరిత్యక్తయు నైనందున గవి యామెకొఱకు శోకింపవలసియుండెను. ఏయబలచరిత మాకసమువలె నిర్వికారమైనదియు, బవిత్రమైనదియో తారకలరీతి తేజస్వంతమో, కోమలకుసుమమైఖరి సుందరమార్దవమో యట్టి సీత-నిస్సమానయగు సీత-దుఃఖమును జూచిన బశుపక్ష్యాదులే శోకించుచుండ గవి యేలశోకింపకుండును? ఆకారణముననే దేవదేవుడగు రామునియందును గవికొకవిధమగు రోష ముత్పన్నమైనది. దానినే వాసంతీముఖమున వెలిపుచ్చెను.

కవి తననాటకమున నాయికానాయకుల బునస్సమ్మేళన మొనరించుట విషాదాంతమునొప్పని కేవల సాంస్కృతాలంకారశాస్త్రనియమానుగతిచేతనే యని తెలియవలయును. సంస్కృతమున ట్రాజడీ (Tragedy) అనగా విషాదాంతనాటకములు లేవు. ఈనియమము పూర్వోక్తనియమములతో గట్టి సంబంధము గలిగియున్నది. నాయకుడు పుణ్యుడుగాననే పుణ్యమునకు ఫలము దుఃఖమగుట యసమంజసము.

ఇట్లు పుణ్యమునకు జయమును బాపమునకు బరాజయమును గనుపఱుపనిచో జను లధర్మవర్తను లగుదురు. కాని యీనియమము నంతగా నేను బాటింపను. క్షుద్రతాస్వార్థతాప్రతారణతామయ మగు నీప్రపంచమును జూచిన బాపపరాజయ మగపడదు. ధర్మమునకు జయమే సత్యమైనచో బ్రపంచమున జనులు నధికాంశము ధార్మికులై యుందురు. కేవలము బ్రపంచధర్మ మిది యేయైనచో ధార్మికత్వమున కంతటిప్రాశస్త్యము లభించదు. ప్రపంచమున ననేకసమయముల ధర్మము మృత్యుపర్యంతము దనతలను వంచి తిరుగుచుండుటయు నధర్మము చివరవఱకు దనతల నెత్తి తిరుగుచుండుటయును గలదు. ఏసుక్రీస్తు జీవనమును దదితరోత్కృష్టస్వార్థత్యాగులజీవనము నిందులకు బ్రబలప్రమాణములు.

ఒకసమయమున నింగ్లండునందును "పొయెటిక్ జస్టిస్ (Poetic Justice) అనగా గావ్యన్యాయ మనెడి సాహిత్యనీతి యుండెడిది. దానివలన సాహిత్యమునకు సముచితమగు వికాసము గలుగకుండుటంజేసి యానీతి నంతగా బాటింపరైరి.

సాహిత్యమునం దధర్మమునకు జయమును, ధర్మమునకు బరాజయమును గనబఱచినచో దుర్నీతికి శిక్ష కలుగనా? అయ్యదియెప్పటికిని గానేరదు. ధర్మమెప్పటికిని ధర్మమే. ఆర్థికలాభనష్టముల నెప్పటికిని సరకుగొనక సుఖదుఃఖముల సమముగా జూచు ధర్మానురక్తియుండువఱకును ధర్మము ధర్మమేయగుచుండును. లాటిమర్ క్రాన్మర్ (Latimer. Cranmer) వీరిద్దఱు నేతేజముతో మృత్యువు నాలింగనముచేసికొనిరో, మహారాణా

ప్రతాపసింహుడు మృత్యుపర్యంత మేతేజమున దుఃఖముల ననుభవించెనో, వారిగరిని కేవలము దర్శకపాఠకుల ముగ్ధులజేయుటయేకాక స్వార్థత్యాగులకును నత్యధికగౌరవనీయమైనదే! స్వర్గాపేక్షచే ధార్మికులగుటయు సంపత్తికాములై సన్మార్గులగుటయు ప్రత్యుపకారచింతచే నుపకారమొనర్చుటయు ధర్మముకాజాలదు. అయ్యది స్వార్థసేవయే యగును. ఏదీక్ష సత్యమును ఖండించి నాశనము చేయునో అయ్యది యాసత్యముతో ఎటు నాశనమొందును? ధర్మానురక్తిచే సంపత్సౌఖ్యములు గలుగవు. విశేషించి దుఃఖములే కలుగుచుండును. కాని దుఃఖములలోనుండు సుఖసమ్ముఖమున దక్కిన సుఖము లన్నియు నిష్ప్రయోజనము లగును. అయ్యదియే నీతిశిక్ష యనబడును. ఎవడు నిజమైన ధార్మికుడో వాడు తనధర్మమునకు నీషణ్మాత్రమైన లాభమును గోరడు. అట్టివాడు ధర్మసౌందర్యమునుజూచి ప్రేమించునే కాని దాని పదవినిజూచికాదు. సత్యరహిత మగు ధర్మము విజయము బడయనేరదు. ధర్మసౌందర్యమును జూచి ప్రేమించినవాడు దాని పార్థివాధోగతిని జూచి వెనుకంజవేయడు; ధర్మమువలన ప్రతిఫల మపేక్షించువాడే వెనుకంజవేయును. [సశేషము]

పాపాయి

[ముద్దు]

నాళము కృష్ణరావు గారు

౧

పాలమున్నీటితరంగలఁ బవ్వళించు
బాలకృష్ణుఁడో యన, వెల్లపాన్పు [మీఁద
చెన్నమీఱఁగ నిదురించుచున్న నిన్న
కంటి నొకరేయి కన్నులకఱవు దీఱ

౨

పండువెన్నెల నీవు పన్నుండి యుండ
తమ్మిపువ్వులఁ దూఁగాడుతుమ్మెద లన
చల్లగాలికిఁ జెదరి నీపిల్లకురులు
మొగుడుకన్నులతోడ దూబూచు లాడె.

౩

మంచుబిందులతాఁకున సంచలించు
చివురుపెదవులమాటున సిరుల నీను
మల్లెమొగ్గలఁ బోలు నీపల్లువరుస
చుక్కగుంపులతో నెక్కసక్క మాడె.

౪

చిఱుతచెమ్మట గ్రమ్మ నీచిన్నిమొగము
చలువమంచున విరిసినకలువవోలె
చెలువు గులుకంగ తమకంబు నిలుప లేక
ముద్దుపెట్టుకొనఁగ నాకు బుద్ధి పుట్టె.

౫

లలిత మగు నీదు నెమ్మేనిలతికయందు
అలరుగుత్తులో యన నొప్పు నంగకములు
మామకోత్సుకమానసమధుకరంబు
నొక్కసారిగ నువ్విళులూరఁ జేసె.

౬

కన్నుదోయియొ, బుగ్గలో, చిన్నముక్కొ,
చివురుపెదవులొ, గడ్డమొ, చిట్టిబొడ్డొ
ఇందు దేనిని ముద్దిడుకొందు ననుచు
నిర్ణయింపఁగ లే కట్టె నిలిచియుంటి.

౭

వదనలావణ్యసరసరోవరమునందు
తేలియాడెడు బేడిసమీల నంగ
చెన్ను మీఱిన నీవాలుకన్నుదోయి
నాదుమానససీమను నాట్యమాడె.

౮

సహజలావణ్యశృంగారచారుకళకు
అన్యవస్తులచాయల ననుకరించు
అద్దముల బెళ్కు సాటియే యనుచు నవ్వ
తళుకుచెక్కులు నామదిఁ దాంపవించె.

౯

మామకస్వాంతకేదారసీమయందు
రాగబీజంబులను నాటి సాగుసేయ [బు
పూన్పు బంగరుహాల మనఁ బొలుపు మీఱు
నీదునాసిక లూటాడె నాదుమనము.

౧౦

చుబుకసోపానపంక్తిచే సొబగు మీఱి
చెక్కుటద్దపుఁగాంతులఁ జెన్ను మిగిలి
ముద్దుదేవికి పవసంపుగద్దె యైన
చివురుకెమ్మోవి నామదిఁ దవులుకొనియె.

౧౧

ముద్దునెమ్మోము నిద్దంపుటద్దమునకు
నమరు చక్కనిపిడి **యన** నలరు నీదు
డంబు మీఱిన చిన్నిగడ్డంబు నాదు
నుల్ల మంతయు నుఱ్ఱూఁత లూఁగఁ జేసె.

౧౨

కనులపై వ్రాలి, గండభాగములఁ బ్రాకి,
నాసతుద నెక్కి, పెదవుల నాట్యమాడి,
గడ్డమున నిల్చి, చంగున గంతువైచె
నాదుమానసభృంగంబు నాభిపైకి.

౧౩

నీదులావణ్యలతికకుఁ బ్రోదివెట్ట
నాలవాలములీలఁ జెన్నారుచున్న
చిట్టిబొడ్డుకు పట్టంబు గట్ట నెంచి
పట్టఁజాలనితము ముద్దుపెట్టుకొంటి.

౧౪

నిదురమబ్బున నట్టిట్టు కదలియాడి
మొలకలేనవ్వు నామీఁదఁ జిలికినావు
నాదుముద్దున కదియె సన్మాన మనుచు
హర్షవారాశిలో నోలలాడుచుంటి.



శాకుంతలనాయకుడు

ఏ. వి. రత్నము గారు

పైశీర్షికతో నొకవ్యాసమును శ్రీయుత గొల్లపూడి శ్రీరామశాస్త్రిగారు మేనెల "భారతి" లో ప్రకటించియున్నారు. వారు దానియుపోద్ఘాతమునందు నిష్పాక్షికముగవిమర్శించుటకష్టమనియు, విమర్శనముచే పాఠకుల మెప్పించుట కష్టతమమనియు చెప్పికొనియున్నారు; కాన పాఠకులమనంబులకు చాలవరకు పరిశ్రమ తగ్గెడిని. అంతియకాదు; విమర్శనములమీద నాక్షేపములు పుట్టినను వానిని చూడవలసినపని లేదన్నట్లు, "విమర్శకునకువలె దాని నాక్షేపించువానికి విశేషపరిశ్రమగాని, విశేషాలోచనగాని యనవసరమని," యుదాహరణపూర్వకముగ నొక సిద్ధాంతమును జేసిరి. ఈ యపూర్వసిద్ధాంతమును పాఠకమహాశయులలో నెంద రాదరింతురో కదా! వీరు పూర్వాభిప్రాయములమీఁద నాధారపడక స్వతంత్రముగ విమర్శనకుఁ బూనుకొన్నట్లు చెప్పియున్నారు; కాని, యెటుచూచినను వీరివిమర్శనముగూడ ప్రతిధ్వనిగనే వినిపించుచున్నది. శాకుంతల నాయకునిగూర్చి యిట్టిపోలికలుగల విమర్శనము లాంధ్రపత్రికలయందు మున్ను గాంచుటంజేసి యిట్లు చెప్పినందునకు శ్రీశాస్త్రిగారు నన్ను మన్నింతురుగాక! ఒకవేళ సత్యము వీరివిమర్శకదృష్టికిగూడ నట్లే కనబడియుండవచ్చునేమో! కాని వీరు నిష్పాక్షికముగ మాత్రము విమర్శించినట్లు కన్పట్టదు. వీరి కట్టిసంకల్పము కలిగియుండును గాని, అక్షరరూపమునకు వచ్చునప్పటికి మఱొకదారిలోనికి పడినది. ఒక్క మనశాస్త్రిగారేకాదు, మఱియెంతటివారయినను నాటకవ్యామోహమున నిమగ్నులయియున్నంతకాలము భారత దుష్యంతునకు న్యాయము సేయజాలరు; భారతశకుంతల యొక్క మహోన్నతమయిన శీలసంపదను కనుగొనలేరు. ఇక భారతకథయందలి యీ నాయికానాయకులను గూర్చి చెప్పునదియు, నాటకపు నాయికానాయకులను గూర్చి చెప్పునదియు అంధపరంపరాన్యాయముగ బ్రవర్తించుచున్నది.

శ్రీరామశాస్త్రిగారి విమర్శనముగూడ పండితాభిప్రాయముతోనే యేకీభవించుచున్నది. అదెట్లన, "...ఈనూతనకల్పనచే కాళిదాసమహాకవి నాయకుని ధర్మచ్యుతినుండి కాపాడి నానాగుణాలంకృతునిగ నొనర్చియున్నాడనుట తెల్లమగుచున్నది." అని. తర్వాత భారతదుష్యంతునిగూర్చిన యభిప్రాయము: భారతదుష్యంతుడు శకుంతలను పాణిగ్రహణ మొనర్చువరకుమాత్రమే నాటక దుష్యంతునకు సాటియైయున్నాడు. ...అటు పిమ్మట చరిత్రమును బట్టి విచారించినచో

భారతదుష్యంతుడు క్రూరకర్ముడనియే చెప్పవలసియుండునట. ఎందుచేతనన అభముశుభము తెలియని కన్యకను స్వప్రయోజనార్థము ధర్మభ్రష్టనుగ జేసి, యామెకన్యాత్వమును భంగపఱచి, 'త్వరలో నిన్ను పట్టణమునకు రప్పించుకొందు నని' చెప్పిపోయి యావల నాస్మృతియే లేకయుండుటచే నెంతయు నీచకార్య మొనర్చెననియే తలంచుట కవకాశము గలదు. అతడు శకుంతలను మఱచినాడనుటకంటె మనుష్యత్వమునే మఱచినాడనుట యుక్తము ఈయమ్మానుషత్వముచే నాతడు స్త్రీలంపటుడనియు శూన్యచిత్తుడనియు నేర్పడుచున్నది. ఇట్టి యవివేకశిఖామణి, యిట్టి క్రూరకర్ముడు విశ్వశ్రేయఃప్రదంబగు నాటకమునకు నాయకుడుగ నుండిన దత్ప్రయోజనము సిద్ధింపదను తలంపుతో మహాకవి తన ప్రతిభావిశేషముచే నొకటి రెండుమార్పులతో నాతని ప్రవర్తనమును సంస్కరించి 'సెబాస్'అని యనిపించినా"డట. కాళిదాసు డిట్టియవివేకశిఖామణిని, ఇట్టి క్రూరకర్ముని తీసికొనకపోతే, మఱియొక ప్రసిద్ధచరితుని నాయకునిగ గీసికొనియుండిన నెంతయో బాగుండెడిదిగదా! అట్లుయ్యేనేగాని కాళిదాసుని ప్రతిభావిశేషము ప్రకాశింపక పోవునుగాబోలు!

శ్రీరామశాస్త్రిగారు కూడ ముందటివారి మార్గమునే యనుసరించిరి గాని యొక్కింత సావధానచిత్తులై రెండుకథలను బరీక్షింప బూనుకొనరైరి. అట్లు చేసియున్నచో భారతదుష్యంతుని నంతకఠినముగ దూషించి యుండరు. మనమైనను కొంచెము లోతుగ విచారించి చూచి భారతదుష్యంతుని శీల మిట్టి తీవ్రఖండనములకు పాత్రమయ్యెడినేమో కనుగొందముగాక! శకుంతలను చేపట్టువఱకు నిద్దఱు దుష్యంతులును తుల్యశీలురని శ్రీశాస్త్రిగారు నుడువుచున్నారు. ఏవిషయముననో! శకుంతలను జూచి మోహించి యంతఃకరణప్రవృత్తిని ననుసరించుటయందా? కాని భారతదుష్యంతునియందు గల సత్త్వసంపన్నత, మహోదారత, ఋజుమార్గప్రవర్తనము నాటకపు దుష్యంతునియందు బ్రకాశించుచున్నవా? ఇది చూడవలెను. అతని ఋజుమార్గప్రవర్తన మాశ్రమమునందు శకుంతలనుజూచినపుడు వ్యక్తమగుచున్నది. ఈసందర్భమున నాటకమునం దట్టి దేమికలదు? చెట్లచాటున పొంచియుండి యామె రూపరేఖావిలాసములను గ్రోలుచు గుటకలువేయుట, పౌరవప్రుడయిన రాజుచేత నియుక్తుడయిన ధర్మాధికారినని యెఱిగించికొనుట, తన కోర్కె నంతఃపురజనములతో విదూషకుడు చెప్పునేమో యని భయపడి, యతనితో మహర్షులయందలి గౌరవముచే నేనాశ్రమమునకు బోవుచున్నానుగాని, మునికన్యకయైన శకుంతలమీద నాకు నిజముగ నభిలాష లేదు సుమాయనిచెప్పిపంపుట—యిట్టి ప్రవర్తనము నాయకుని ఋజుమార్గతను తెలియజేయునేమో విచారింపుడు. మహాభారతమునందీసందర్భమున దుష్యంతుని ప్రవర్తన మెంత ఘనముగ నున్నదో విచారింపుడు! ఇచ్చోట నాటకమున దుష్యంతుడు రసికశేఖరుడు కావచ్చును గాని వీరునివలె బ్రవర్తింపలేదు.

శ్రీరామశాస్త్రిగారు నాయకుని ప్రవర్తనమును కొన్నిపట్ల సంరక్షింపసమకట్టిరి. ఆడిఫెన్సును కొంచెము పరీక్షింతము: 'భవతు. తాం ద్రక్ష్యామి' అనుచోట పండితవర్యు లిరువురిది దుష్యంతు డుదాసీనభావముతో నిచ్చిన జవాబు కాదు. శకుంతలాశబ్దము రాజును ముగ్ధుని జేసె'నని. "దుష్యంతు డట్టి స్వభావముగలవా డయినచో 'అనిర్వర్ణ్యం పరకళత్ర వ్యపదేశ మావిలయిష్యం' లోనగు పలుకులు బూటకములని కదా యెంచదగియుండును" అని మనశాస్త్రిగారు దుష్యంతు డట్టి స్వభావము గలవాడు కాడని చెప్పెదరు. అదే మన్నమాట! ఎప్పటిస్థితి యప్పటిది. 'వృద్ధా నారీ పతివ్రతా' యన్నట్లు నేటికి దుష్యంతుడు చెట్లచాటున నుండి కన్ను వేయుటమాని, ధర్మోపదేష్ట కావచ్చును. దుష్యంతునిశీలము మొదటినుండియు నట్టిది కాదన్నచో, చెట్ల చాటుననుండి పరస్త్రీలను పరికించెడివాడు! 'తాం ద్రక్ష్యామి' అన్నచోట భిన్నాభిప్రాయముల కవకాశ మొసగుచున్నపుడు ఆయిరువురుపండితుల యభిప్రాయమునుగూడ వీ రేల మన్నింపగూడదు? శ్రీశాస్త్రిగారే, "ఇట్లు యీవిమర్శన మసంగతమని నేనన సాహసింపనుగాని, ఈభావము కనిష్ఠికాధిష్ఠిత కాళిదాసుని దనుట మాత్ర మయుక్తమని చెప్పక తప్పినదికాదు." అని సెలవిచ్చిరి. ఇదియేమి ప్రశస్తముగ నున్నదో! మనకిష్టము కానివి మనకాళిదాసు రచింపలేదు! అవి మఱియే కాళిదాసుడో వ్రాసి యీ ప్రసిద్ధనాటకమున జొప్పించినాడు! ఇక విమర్శన మెందులకు? ఆక్షేపము లెందుకు?

తర్వాత, "యావ దేనాం తరుచ్ఛాయామాశ్రిత్య ప్రతిపాలయామి" యని చెట్లచాటున దాగి పరిశీలించుట, ఆతిథ్యము గైకొన వచ్చినవానికి తగదు. రసజ్ఞతకు భూషణము శీలమని శ్రీశాస్త్రిగారే చెప్పియున్నారు. ఇట్టిశీల మాసందర్భమున దుష్యంతునకు బాగుండదు. దుష్యంతు డాకస్మికముగ తెరచాటునుండి వచ్చినట్లు శకుంతలయెదుట ప్రత్యక్షమగుటగూడ సహజముగ దోపదు. "దొంగవలె దాగియుండుట యేమి పెద్దఱికము? అని యడుగుదు రేమో"యని మనశాస్త్రిగారే ప్రశ్నించిఅందులకు వారిచ్చినయీసమాధానమేమయినను తృప్తికరముగ నున్నదేమో విచారింపుడు. "అత డాతిథ్యమునకై వచ్చినవాడు గాన, 'శకుంతల ఫలానా'యని తెలిసికొనుటయాతనికి ముఖ్యకర్తవ్యము"అని. బలే! యిదియాతిథ్యవిధానమండి! అతిథిసత్కారమునకై నియోగింపబడినవారే యతిథికొఱ కెదురుచూచుచుందురు గాని, అతిథియే వీరిని వెదకుకొనుచు బోవునుగాబోలు! భారతమునం దతిథిసత్కార మీవిధముగ నడచినదేమో కనుగొనుడు శాస్త్రిగా రింకనేమి చెప్పినారంటే, "తపోవనము, తపస్వికన్యలుగాన సంకోచము లేక యెకాయెకిని పోయి యడిగి తెలిసికొనగూడదా యని యందు రేమో? వారు వనవాసినులుగాని, యీతడు పట్టణవాసియేకదా! సంకోచ మేలయుండకపోవును? గనుక నొకరికి ముగ్గురు యువతు లెదురుగ వచ్చుచుండుటచే

వారిని దటాలున సమీపింప జంకి, చెట్టు మరుగున నుండి సమాచారమును తెలిసికొందునని తలంచుట యొకతప్పులోనిది కాదు" అని. ఈ డిఫెన్సు శాస్త్రిగారిమనంబున కేమయిన నచ్చినదేమో! ఏదోయొకటి డిఫెన్సు పెట్టకపోయినయెడల బాగుండదని చెప్పుటయా? ఈముగ్గురిలో శకుంతల యెవరని యాతిథ్యమునకై వచ్చినరాజు తెలిసికొననేల? ఆసత్కార మామెయే వచ్చి చేయును; రాజప్పుడే యామె శకుంతల యని గ్రహింపగలడు. రాజు వారిని తటాలున సమీపించినంతమాత్రమున, వారీపట్టణవాసిని జూచి యదేపరుగుపుచ్చుకొందురా? అట్లయిన శకుంతల తన ఢ్యూటిని నిర్వర్తింపగలుగు టెట్లు? అట్టిభీరురాలిని కణ్వమహర్షి యతిథిసత్కారమున కెట్లు నియోగింపగలడు? శాస్త్రిగారీవిధముగ దుష్యంతుని ప్రవర్తనము తప్పులోనిది కాదని సమర్థించుటకంటె, 'రసజ్ఞులగు వారట్టిసమయమునందట్లే ప్రవర్తింతురు. అది సహజముగాన దుష్యంతుడుగూడ నట్టి మనోదార్బల్యమునకు లోనయ్యె' నని చెప్పినచో నెంతయు బాగుండెడిది. అదియెట్లనిన, "స్వైరవిహారధీరలగు సారసలోచన లున్నచోటికిన్, బోరున లాతివారు సొరఁబోయినచో రసభంగ మంచు నేఁ, జేరక పువ్వుఁదీవియల చెంతలనుండి..." యన్నట్లు కాళిదాసుగూడ నాసమయమునకు దగినట్లుగ రాజును రసజ్ఞునిగ జేసెను. కాని యింతకంటె గొప్పదయిన రసజ్ఞత మహాభారతదుష్యంతుని యెడ జూపట్టెడిని. అదియెట్లంటే దొంగతన మేమియు నక్కఱలేకుండగ, శకుంతలసమక్షమున, శకుంతల నాపాదమస్తకమును గన్నులపండువుగ గనుగొనుచు నామె ముఖముననే యతిమనోహరమైన వాక్కులలో నామె నిజవృత్తాంతమంతయు కర్ణరసాయనముగ నాకర్ణించెను. మహాభారతమునందలి యీ మనోహరత్వము, ఇచ్చటి భావసౌందర్యము, ఔన్నత్యము, నాటకమునందు మృగ్యము. నాటకమునందు కేవలము ముగ్ధత్వమే చెన్నొందుచున్నది. అంతియకాని భారతమునందువలె ఆదర్శప్రాయమయిన భావసౌందర్యము కన్పట్టదు. నాటకమునందలి దుష్యంతుని రసజ్ఞత, శకుంతల కోమలహృదయము, ముగ్ధత, భారతమునందు కన్పట్టకపోవచ్చును. కాని, మానవోన్నతికి సంబంధించిన హృదయము, మన స్కృత నాటకమునందు లోపించినది.

భారత దుష్యంతుని మీద శాస్త్రిగారు తీసికొనివచ్చిన గొప్ప యభియోగ మేమన దుష్యంతుడు తా నామెతో చేసిన బాసలు మఱచి, లోకు లేమనుకొందురో యని భయపడి ఆమెగొంతుక కోయదలచె నని; కాని దుష్యంతు డామెను మఱచిపోయిన ట్లెక్కడను భారతమున లేదు; అతడు మఱచియు పోలేదు. అంతయు నెఱిగియుండియే, రాజు ప్రజాభిప్రాయమును పరిపాలింపవలసినవా డగుటచే, ఆమె తనధర్మపత్నియగునో కాదో ప్రజల కెట్లు తెలియుట యనిచెప్పి, యామెను గొప్ప పరిశోధనమునకు బాలుసేసెను. ఆపరిశోధనమున నామెను పిన్నమీదట నెవ్వ డామె దుష్యంతమహారాజు ధర్మపత్ని కాదని

సందేహింపగలడు? మఱియు శకుంతల యెటు వంటి గుణశీలములు కలదో, రాజునకు పట్ట మహిషిగ నుండదగిన రాణి యగునో కాదో లోకము గ్రహింపగలుగు టెట్లు?

భారతదుష్యంతుడు చివర సభ నుద్దేశించి యే మనెను:— "శకుంతల మాటమీద నే యామెను చేకొన్నచో, మా వివాహము యొక్క విశుద్ధతను గూర్చి లోకము సంశ యించును. కావున నామె విశుద్ధతను స్థాపించు టకై యిట్లు పరిశోధించితిని" అని చెప్పెను. అదేప్రకారము శకుంతలతో క్షమాపణపూ ర్వకముగ చెప్పికొనెను.

కావున పర్యవసానమునుబట్టి న్యాయా న్యాయములను నిర్ణయింపవలెను. వాగ్దాన మును చెల్లింపకుండుటయే రాజు యొక్క యుద్దేశమా? లేక, యేయుద్దేశముచే వాగ్దా నమును చెల్లించుట కాయత్తపడలేదు? అను ప్రశ్నలను విచారించి ఫలితమునుబట్టి, యుద్దే శమునుబట్టి నిందారోపణము చేయుటగాని, మానుటగాని ధర్మము. అంతేకాని రాజు యొక్క యుద్దేశ మేమో మనము కనిపెట్ట నిదే నిందించుట న్యాయముకాదు. అదియును గాక ఒకరిగొప్పతనముగాని, కొద్దితనముగాని పరిశోధనసమయమునందే బయటపడును.

శ్రీశాస్త్రిగారొకచోట భారతశకుం తల, అభము శుభము ఎఱుగనట్టి కన్యకయని వ్రాసినారు. అభము, శుభ మెఱుగనిది నాట కపుశకుంతలయో, భారతపుశకుంతలయో, రెం డిటిని లెస్సగ పరీక్షించి చూచినవారికి తెలియును. 'నీవలన నాకుదయించు నందనుని యౌవరాజ్యాభిషిక్తునిగ జేయవలసిన'దని వా గ్దానమును గైకొన్న శకుంతలా, లేక ఉంగ రము తగుల్చుకొన్న శకుంతలా అభము, శుభ ము తెలియనిది ?

ఆ వే గ ము

శ్రీ శేషాద్రిరమణ కవులు

నాకే భాగ్యము కల్గెనేని సుజనానందానుసంధానభా
షాకావ్యంబులతోడ రేయిపవలుఁ సాఫల్యముఁ జేసి వి
ద్యాకాంక్షఁ జరియింపకుందునె దరిద్రక్షుణ్ణ నిర్మాంస శ
ల్యాకారంబుగ నుంటి నెట్టు లిఁక నీ యాంధ్రాళి చల్లారునో.

మహాత్తు

మొక్కపాటి నరసింహశాస్త్రి గారు [సాహితీసమితి]

౧

రాజోలుతాలూకాలో దొడ్డవర మనే చిన్నగ్రామము ఒకటి ఉన్నది. చూపుమేరవరకు ఎటుచూచినా కొబ్బరితోటలు, మామిడితోటలు, పంపనపనస తోటలు, పనసతోటలు కలిగి ఎక్కడా సూర్యరశ్మి లోపలికి చొరకుండా చల్లగా ఉంటుంది. ఆ తోటలమధ్య ఋషివాటికలవలె దూరదూరముగా చిన్నచిన్న ఇళ్లు. అవి చాలవరకు పాశ్చాత్యనాగరికతాసంపర్కము లేని బ్రాహ్మణగృహములు. అందరూ పూర్వాచారపరాయణులు, వేదాధ్యయనసంపన్నులు; ఆంగ్లవిద్యావిముఖులు; సంపన్నగృహస్థులు. ఉదయాన్నే లేచి కాలకృత్యములు తీర్చుకుని, సమీపముననున్న గోదావరిలో స్నానసంధ్యాద్యనుష్ఠానములు తీర్చుకుని, ఇంటికి వచ్చి విభూతిపిండికట్లు ధరించి, నీరుకావిధోవతులు బిళ్లపింజలుపెట్టి కట్టుకుని, వీథిఅరుగుమీద కూచుని, పాఠము నూరుకుంటూనో, జందెములు వడుక్కుంటూనో శిష్యులకు పాఠములు చెప్పుతూఉంటే, మనము ఇరువదవ శతాబ్దములో ఉన్నసంగతి మరచిపోతాము. ఋషులకాలము జ్ఞాపకమువస్తుంది. ప్రపంచకము సంగతంతా ఎలాఉన్నా ఇక్కడ మట్టుకు కాలచక్రము కొన్ని శతాబ్దముల నుంచి తిరగడము మానివేసి తుప్పుపట్టినట్టు కనుపిస్తుంది.

ఆవూళ్లో మాకు దగ్గర బంధువులున్నారు. వాళ్లు చాలారోజులనుంచి ఒక్కసారి వాళ్లఊరువచ్చి పదిరోజులుండి వెళ్లమని బలవంత పెడుతున్నారు. ఒక్కసారి వెళ్లి చూచి వద్దామని బుద్ధిపుట్టింది. అదికాకుండా వేసవికాలములో మావూళ్లో ఎండలు చాలా తీవ్రముగా ఉంటాయి. వైశాఖమాసము వచ్చింది. ఎండలు భరించడానికి శక్యముకాకుండా ఉన్నాయి. పగలు నిప్పులు కురుస్తున్నాయి. రాత్రి రెండుజాములవరకు వడగాలి కొడుతోంది. ఇటువంటి సమయములో ఒక్కసారి దొడ్డవరము వెళ్లి పది పదిహేనురోజులక్కడ ఉంటే ఈవేసగి బాధా తగ్గుతుంది, మనవాళ్లను చూచినట్టూ ఉంటుందని, వైశాఖ శుద్ధ దశమినాడుబయలుదేరి దొడ్డవరమువచ్చాను.

కొంచెమించుమించుగా, నరకమునుంచి స్వర్గములోకి వచ్చినట్లుగా ఉంది. ఎండన్న మాట తెలియడము లేదు. మావాళ్లింటికి నూరుగజములలో వైనతేయమనే గోదావరిపాయ, ఒకటి ప్రవహిస్తూ ఉంటుంది. ఎప్పుడూ దానిపైనుంచివచ్చే చల్లనిగాలి, దాహ

మైనప్పుడు, తియ్యని అమృతమువంటి కొబ్బరి బొండములలో నీళ్లు, మధ్యాహ్నము ఫలాహారములు. ఇంక కావలసిన దేమిటి? కేవలమూ ఇంద్రభోగము అనుభవిస్తున్నాను. సాయంకాలము గోదావరీతీరాన్ని కూచుని, పడవవాళ్ల పాటలువింటూ, చల్లనిగాలి అనుభవిస్తూ, నీటిలో చేపల్ని చూస్తూ, చెట్లపైన పక్షులగానమువింటూ ప్రపంచమును మరచి పోతూ ఉండేవాడిని.

దొడ్డవరమువచ్చి ఆరుదినము లయింది. ఇక్కడ ఎంతసౌఖ్యముగా ఉన్నా పట్నవాసపు సందడి, క్లబ్బు, టెన్నిసు, పేపర్లూ లేకపోవడము మూలాన్ని రోజులు జరగడము చాలాకష్టంగా ఉంది. లేవడము, స్నానము చేసి భోజనము చెయ్యడము, నిద్రపోవడము, ఫలహారము చెయ్యడము, షికారు వెళ్లివచ్చి మళ్లీభోజనముచెయ్యడము, నిద్రపోవడము; ఇట్లా ఎన్నాళ్లి గడపగలము. ఎంతలైనా సరే మళ్లీ మావూరుచేరుదామని బుద్ధి పుట్టింది.

ఆరోజుసాయంకాలము యథాప్రకారముగా గోదావరీతీరానికి షికారు వెళ్లాను. సుమారు ఆరుగంట లవుతుంది. రేవుదగ్గరగా కూచుని ఏరుదాటడానికి వచ్చేవాళ్లను, పైనుంచివచ్చి దిగిపోయేవాళ్లను చూస్తూ కూచున్నాను.

నేనూ కూర్చున్న పది నిముషములకు సుమారు నలుబదియైదు సంవత్సరములు వయసుగల బ్రాహ్మణుడొకాయనవచ్చాడు. ఆయనను నేనదివర కెప్పుడూ చూడలేదు. ఆగ్రామస్థుడో కాదో కూడా నాకుతెలియదు. ఎవరో రేవుదాటడానికి వచ్చారనుకున్నాను. కాని ఆయన పడవకు వెళ్లలేదు. ఒక్కసారి నావైపు నిదానముగా చూసి నాపక్కను కూచున్నాడు. మనిషి కొంచెము పొడగరి. ఆయెత్తుకి తగ్గలావు. తేజోవంతములు, విశాలములైన కళ్లు. చక్కని నుదురు. తీర్చిన ముక్కు. నిమ్మపండువంటి శరీరచ్ఛాయ. కొంచెము నెరుపుజూపిన తల. ఒకవింతయైన "శాంతరసమొలుకు బ్రహ్మతేజము." ఆమనిషిని చూడడముతోనే ప్రతివాళ్లకు ఒక వింతమైన భయభక్తులు కలుగుతాయి.

నేను ఇంగ్లీషు చదువుకున్నవాడి నవుట చేత ఆయన నాపక్కను కూచున్నా నేను ఆయనను పలుకరించలేదు. ఒకక్షణము ఊరుకుని ఆయనే నన్ను పలకరించాడు. మావూరు పేరు మాఇంటిపేరు మొదలైనవన్ని అడిగాడు. ఇంకా ఏవో ఈసంగతులూ ఆసంగతులూ మాట్లాడుతూ కూచున్నాము.

ప్రదోషకాలము సమీపిస్తున్నది. ఆయనా సంధ్యావందనమునకు లేవవలె ననుకుంటున్నాడు. ఇంతట్లోకే ఎక్కడనుంచో ఒక సన్న్యాసిఒకాయన వచ్చాడు. మావెనుకనుంచిరావడముచేత ఆయన మా ఎదుటకి వచ్చేవరకూ మేముచూడలేదు. మాకు కనపడగానే నాపక్కనున్న బ్రాహ్మణుడు లేచి స్వాములవారికి సాష్టాంగనమస్కారముచేసి ఒకటి రెండు దినములు అక్కడ ఉండి తనగృహమును పావనముచేసి తన్ని ధన్యుడిని కావించ

మని, కృతాంజలియై సవినయముగా ప్రార్థించాడు. స్వాములవారు ఉండుటకు వీలుపడదనీ, అమలాపురము వెళుతున్నామనీ, ఈసారి



నా పక్కనున్న బ్రాహ్మణుడు లేచి.........సవినయముగా ప్రార్థించాడు.

మళ్లీ ఆమార్గమున వచ్చినప్పుడు అక్కడ భిక్ష చేస్తామనీ చెప్పి వారికి నారాయణస్మరణతో శలవిచ్చి రేవుదాటి వెళ్లిపోయారు.

ఇదంతా నాకు ఆశ్చర్యముగా ఉంది. ఎవరో సన్న్యాసి కనబడ్డంత మాత్రాన్ని ఈయన ఆయనకు సాష్టాంగపడి తనింటికి రమ్మని అంతప్రార్థేయపడడ మెందుకా అనుకున్నాను. సన్న్యాసి అయినంతమాత్రాన వచ్చిన విశేషమేమి టనుకున్నాను. నేను మట్టుకు లేచి స్వాములవారికి నమస్కారము పెట్టలేదు.

స్వాములవారు వెళ్లగానే శాస్త్రిలుగారు నెమ్మదిగా నాదగ్గర కొచ్చారు. సూర్యాస్తమయము అయినది. పశ్చిమదక్కున ఆకాశము రక్తవర్ణముదాల్చింది. గోదావరీజలము తప్తలోహమువలె మెరుస్తూఉంది. ఆధునిక యువకుల హృదయములవలెనే గోదావరి స్రుక్కిపోయి నెమ్మదిగా సముద్రము వైపు వెడుతూఉంది. మందమారుతం అజ్ఞాతమైన విదేశవార్తలనేవేవో మా చెవిలో ఊదుతూఉంది.

నా ప్రక్కనున్న బ్రాహ్మణుడు నన్ను సంబోధించి "సన్న్యసాశ్రమమంటే మీబోటి వాళ్లకు గౌరవములేదు కాబోలు" నన్నాడు. "గౌరవములేకనేమి లెండి ప్రతివాళ్లూ సన్న్యసివేషం వేసికొని తిరిగే ఈరోజులలో ఎవరు అసలైన సన్న్యసులో తెలిసికోవడం కష్టం. అంతేకాకుండా నిజంగా చూడవస్తే సరియైన సన్న్యసులు ఈకాలములో లేరేమోనని కూడానా అనుమానం అన్నానునిర్లక్ష్యంగాను. "అబ్బాయి! నీవు తొందరపడి ఆలాగ అనకు. హిందూమతము ఉన్నంతకాలము భారతదేశము ఉన్నంతకాలము మహానుభావులు ఉండే తీరుతారు. అటువంటివాళ్లు ఏసక్రుతుగానేనా ఉండబట్టె ప్రపంచము ఈమాత్రముగానేనా

ఉంది. నాస్వానుభవములో ఒకసంగతి చెప్పతాను విను” అన్నాడు.

౨

ఆకాశమున ఎరుపు కాస్తతగ్గి కొంత నలుపుతో మిశ్రమమయి ఉంది. గాలికూడా ఇందాకటికంటె గట్టిగా వీస్తూఉంది. తూర్పు దిక్కున నిండు చంద్రబింబము కొబ్బరితోటల చాటునుంచి తొంగిచూస్తూఉంది. ఆకాశము నిర్మలంగా ఉంది.

“మాది ఈప్రాంతములోనే ఒకగ్రామము. మాతండ్రి చతుశ్శాస్త్రపండితుడు, సదాచార సంపన్నుడు, భూతదయగలవాడు, అందరి చేతనూ చాలా గౌరవింపబడేవాడు. ఇంట్లో ఎప్పుడూ పదిమందికి తక్కువగాకుండా శిష్యులుండేవారు. చాలాసితిపరుడు. అందుచేత ఒక్కరి నాశ్రయించవలసిన అవసరము లేకుండా కాలక్షేపము చేయడానికి వీలుగా ఉండేది. నిత్యమూ గోదావరీస్నానముచేస్తూ, శిష్యులకు పాఠములు చెప్పకుంటూ, వచ్చిన అతిథులకు సత్కారముచేస్తూ, చాలా నిష్ఠగా ఉండేవాడు.

ఆయనకు లేకలేక చిరకాలమునకు నేను పుట్టాను. ఆయనతపస్సు ఫలించి వంశము నిలిచినదని చాలా సంతోషించాడు. కొడుకులు కలగానే సంతోషించడము లేకపోతే విచారించడమేకాని వాళ్లవలన ఎంతసుఖం కలుగుతుందో ఎంతకష్టము కలుగుతుందో ఆలోచించేవాళ్లు ఎవ్వరూలేరు. అతిగారాబంగా మా తలిదండ్రులచేతులలో నానాటికి పెరిగి పెద్దవాడనయ్యాను.

మాతండ్రిగారే నాకు విద్యాగురువులు. పండ్రెండు సంవత్సరములు వచ్చునరికే కొంత కావ్యజ్ఞానముకలిగినది. ఎప్పటికైనా తనంతటి వాడిని అవుతానని మాతండ్రి సంతోషించాడు. కాని మా అమ్మకుమట్టుకు నాకు ఇంగ్లీషు చెప్పించవలెనని ఉండేది. మాబంధువుల పిల్లలని ఇంగ్లీషు చదువుకునే వాళ్లను కొంతమందిని చూసినప్పటినుండీ నాకూ ఇంగ్లీషుచదువవలెనని బుద్ధిపుట్టింది. మాతండ్రికి ఇష్టములేకపోయినా మాతల్లిమాటా నామాటా తీసివేయలేక నన్ను అమలాపురము తీసుకువెళ్లి అక్కడ ఒకబంధువుల ఇంట ప్రవేశపెట్టి ఇంగ్లీషు చదువు చెప్పించమని వారికి వొప్పజెప్పి వెళ్లాడు. సంస్కృతమువలెనే ఇంగ్లీషుకూడా త్వరగానే వచ్చేది. నాల్గోఫారము వరకూ వచ్చాను.

ఇక్కడ యథేచ్ఛగా ఉండేవాడిని. నన్ను అడిగేవాళ్లూ చేసేవాళ్లూ లేరు. ఎప్పుడు ఎంత కావలెనంటె అంతడబ్బూ మాతండ్రి నాకు పంపిస్తూ ఉండేవాడు. దానితోస్నేహితులు చాలామంది చేరారు. డబ్బు పుష్కలముగా నున్నప్పుడు స్నేహితులకు లోపమేమిటి? అందులోనూ నాదగ్గఱ పరిశీలనాశక్తి కొంత తక్కువ. అందుచేత అన్ని రకములవారూ చాల మంది నా చుట్టూ ఎప్పుడూ ఉండేవారు. పదిమంది చేరిన చోట నియమములూ కట్టుబాట్లూ తక్కువ గదా! మిత్రబృందం ఎక్కువైనకొద్దీ విద్యపై శ్రద్ధ తగ్గింది. పేకాటలు హెచ్చినవి. సిగరెట్లు కాల్చడము ఫేషననే ఉద్దేశముతో అభ్యాసముచేశాను. అక్కడనుంచి ఒకదానిలోనుంచి ఒకటి దుర్వ్యాపారములలోకి దిగాను.

ఇలాగుండగా నేనుండే ఇంటాయనకు పదహారుసంవత్సరముల వితంతుకూతురు ఒక అమ్మాయి ఉండేది. ఆ అమ్మాయికి నాకూ ఎట్లాగునో సంబంధం కలిసింది. ఆ అమ్మాయికి సుమారు రెండు మూడువేల రూపాయీల వస్తువులు ఉన్నాయి. ఒకనాడు ఆ అమ్మాయిని వస్తువులసహా తీసికొని రాజమహేంద్రవరము చేరాను. సుమారు ఒక సంవత్సరముపాటు అద్వితీయమైన సుఖము అనుభవించాను.

ఇంటదగ్గర ఆపిల్ల తలిదండ్రులూ నా తలితండ్రులూ మాకోసముపడ్డ పరితాపము, మమ్మలని వెతకడానికి చేసిన ప్రయత్నాలూ చెప్ప శక్యము కాదు. కాని మేముమాత్రము దొరకలేదు. దొంగసుఖములు ఎంతకాలము నిలుస్తవి. ఈశ్వరుడు మమ్మలనిచూసి సహించలేక పోయాడు. హఠాత్తుగా ఒకరోజురాత్రి ఆపిల్ల కలరావచ్చి తెల్లవారేసరికి కాలము చేసింది.

నేను అంతవరకూ కష్టము అన్నమాట ఎరగను. చావు ఎప్పుడూ చూడలేదు. నాకు ఉపద్రవమైన భయమువేసింది. మాతలిదండ్రులను పెట్టిన కష్టాలకు ఇది ఫలితము అనుకున్నాను. నాపాపఫలము ఇప్పుడే అనుభవిస్తున్నా ననుకన్నాను. ఆ అమ్మాయిని ఎట్లో దహనముచేయించి కొంచెము దుఃఖము చల్లారినతరువాత ఒకనాడు రాత్రి మాయిల్లు చేరుకుని క్షమించుమని మాతండ్రి పాదములపైని పడ్డాను. నాతండ్రి నన్ను ఇంట్లోకి రావద్దన్నాడు. ఎక్కడ నుంచి వచ్చావో అక్కడికే వెళ్లమన్నాడు. తులసితోటలో గంజాయి మొక్కవలె తమవంశము పాడుచేయడానికి పుట్టావన్నాడు. బ్రతికి ఉండగా ఎప్పుడూ తనకళ్ల పడవద్దన్నాడు.

ఆయన అన్నంతమాత్రాన్ని ఎక్కడకు పోను? ఆయనమాటలలో అసత్యము ఏమి ఉన్నది? ఆయన అన్నాడని నాకు కోపము వచ్చిన ప్రయోజనము ఏమున్నది? జరిగిన సంగతి అంతా చెప్పాను. ఇకముందు ఎప్పుడూ అటువంటిపని చెయ్యనని చెప్పాను. బుద్ధి వచ్చినదని చెంపలు వాయించుకున్నాను. కన్నకడుపు. పుత్రవియోగము ఎంతకాలము భరింపగలడు? కొడుకు ఎంత దుర్మార్గుడైనా ఏకపుత్రవిషయ మైనప్పుడు అంత్యకాలమున కాసినినీళ్లుపోయడానికి వాడేకదాదిక్కు. నాతండ్రి పెద్దవాడయ్యాడు. మళ్లీఎప్పుడూకళ్లకు కనపడడు అనుకొన్నకొడుకువచ్చి కాళ్లుపట్టుకొని ప్రాకులాడుతూ ఉన్నప్పుడు ఎలా పొమ్మనగలడూ. పోతే ఇక తనకు దిక్కెవరు. ప్రపంచకములో ఎందరు దుర్మార్గులు లేరు. ఎంతమంది పశ్చాత్తాపమున బాగుపడలేదు. ఇకముందు వీడుమాత్రము బాగుపడ కూడదా అనుకొన్నాడు. ఉండమనిగాని పొమ్మనిగాని ఏమీ చెప్పకుండా మాట్లాడకుండా మాతండ్రి లోపలకు చక్కాపోయాడు. తలుపుచాటున కళ్లనీళ్లు గుక్కుకుంటూ నిలబడ్డ మాతల్లి వచ్చి నన్ను కౌగలించుకుని బేరుమని రాగాలెట్టి లోపలికి తీసుకువెళ్లి తలంటి నీళ్లుపోసి భోజనము పెట్టింది.

3

అప్పటినుంచీ ఎక్కడికీ కదలకుండా పొల మూ బట్ట్రా చూసుకుంటూ ఇంటి దగ్గరనే ఉండేవాడిని. మా తండ్రి కళ్లపడడానికి



తలుపుచాటున కళ్లనీళ్లు గుక్కుకుంటూ నిలబడ్డ మాతల్లివచ్చి కాగలించుకొని...తలంట నీళ్లుపోసి భోజనముపెట్టింది.

ఎప్పుడూ భయముగాఉండేది. ఆయన ఎప్పుడు నాతోటి మాట్లాడేవాడు కాడు.

కొన్నాళ్లకు బ్రహ్మచారీ బెండకాయా ముదరకూడదని ఒకసంబంధంచూసి మావాళ్లు నాకు వివాహాను చేశారు. నా పెళ్లికి మండ పేటనుంచి ఒక భోగముమేళము వచ్చినది. భోగముమేళము చూడడముతోనే ఇంతకాల ము నుంచీ బలవంతముగా అణచిపెట్టిన మనో భావాలన్నీ మళ్లీతలలెత్తినవి. పెళ్లి అయిదు రోజులూ అయ్యేసరికి నాసంకల్పములూ వా గ్దానములూ అన్నీ వెనకపడ్డాయి. మనుగుడు పులు కాగానే మండపేట చేరాను. చేతిలో

డబ్బు పూర్తి అయ్యేవరకూ అక్కడ కాల క్షేపము చేశాను. అక్కడనుంచి నెమ్మదిగా రాజమహేంద్రవరము చేరాను. మళ్లీ ఇంటికి వెడితే నాతండ్రి గుమ్మము తొక్కనివ్వడని నాకు తెలుసును. ప్రాణముపోయినా మళ్లీ ఇంటికి వెళ్లకూడ దనుకున్నాను.

రాజమహేంద్రవరములో వెనకటి అవ స్థంతా ఒక్కసారి జ్ఞాపకమువచ్చి అక్కడ ఉండడము కష్టము అనిపించింది. అక్కడ నుంచి కాకినాడ వచ్చాను. చేతిలో ఒక్క దమ్మిడీ లేదు. అప్పటికి భోజనముచేసి రెండు రోజు లయినది. ఏమిచేయడానికీ తోచలేదు. ఎప్పుడూ ఎవ్వరినీ దేహి అని చేయిచాచి అడి గినవాడిని కాను. సత్రములోనికివెళ్ల భోజ నము పెట్టమని అడగడానికి కూడా సిగ్గుగా తోచింది. ఒక షాహుకారు నాశ్రయించి

నేను దిక్కులేనివాడనని చెప్పి ఆతనివద్ద ఒక గుమాస్తాగా ప్రవేశించాను.

ఇట్లా కొంతకాలము గడిచింది. షాహుకారు కొడుకునకూ నాకూ చాలా స్నేహము కలిసినది. అతడూ కొంత దుర్నడత కలవాడని త్వరలోనే తెలిసికొన్నాను. మేమిద్దరమూ కలిసి తిరగడము ఆరంభించాము. ఆకుర్రవాడు పిఠాపురములో ఒకదాసీ మనిషితో స్నేహము చేశాడు. ఆతనితోపాటు నేనూ తీరిక ఉన్నప్పుడు పిఠాపురము వెడుతూ వస్తూవుండేవాడిని. కొన్నాళ్లకీసంగతి షాహుకారికి తెలిసి నన్ను ఉద్యోగములో నుంచి తొలగించాడు.

షాహుకారు కొడుకు నాకు రహస్యముగా కొంతడబ్బు ఇచ్చి నన్ను పిఠాపురములో ఉండమని చెప్పాడు. నేను పిఠాపురములో ప్రవేశించాను. కొంతకాలము జరిగేసరికి నాజీవితము అంతా అసహ్యంగా తోచింది. తలిదండ్రులపైన దృష్టిపోయింది. కాని ఇంటికి పోవడానికి భయముగా ఉంది. ఏమొఖము పెట్టుకుని మళ్లీ యింటికి వెళ్లడము. ఏలాగు తండ్రిఎదట నిలబడడము. ఆయనతోటి ఏమని చెప్పడము. ఏమిచెప్పతేమాత్రము ఆయన ఏమని నమ్ముతాడు. లేకలేక పుట్టినందుకు వారి కళ్లయెదుట ఉండి వారికి సేవచేయడానికి బదులు ఇలా అయిపోయాను కాదా అని అట్టే దుఃఖంవచ్చింది. పాదగయలోపడి కుక్కుటేశ్వరస్వామి పాదసన్నిధిని ప్రాణములు విడుద్దామనుకున్నాను. కాని అందుకూ ధైర్యము లేకపోయింది.

ఆలాగే సాయంత్రమువరకూ కాలక్షేపముచేసి ఏమీతోచక సాయంకాలము అలవాటు చొప్పున నాదాసీ ఇంటికి బయలుదేరాను. తోవలో కొన్ని మామిడిపళ్లూ మిఠాయి కొనుక్కొని వెడుతూ ఉన్నాను. దారిలో కోటగుమ్మముదగ్గర రావిచెట్టు ఒకటి ఉన్నది. ఆరావిచెట్టుక్రిందను ఒక సన్న్యాసి దర్భాసనము వేసుకుని కూర్చున్నాడు. చుట్టూ కొందరు బ్రాహ్మణులు కూర్చున్నారు. తదితరులు కొంచెము దూరములో నిలబడ్డారు.

అంతా నిశ్శబ్దముగా ఉంది. ఆయన ధ్యానములో ఉన్నారు. కళ్లు తెరిచేవరకూ వీరందరూ కనిపెట్టుకుని కూర్చున్నారు. నేనూ వెళ్లి ఆయనను చూడడముతోటే మనసులో ఒకవిధమైన ఆందోళన బయలుదేరింది. నేను ఎక్కడికి వెళ్లవలె ననుకున్నదీ మరచిపోయాను. హృదయంలో ఒకవిధమైన భక్తి బయలుదేరింది. ఆలాగే నిశ్చలుడనై ఆయనకేసి చూస్తూ నిలబడ్డాను.

కొంతసేపటికి ఆయన కళ్లు తెరిచారు. తెరవగానే నాకేసి చూశారు. నాకు ఒళ్లు తెలియలేదు. చేతిలో పళ్లా పొట్లము ఉన్న సంగతి మరచిపోయాను. దానిని క్రింద జారవిడిచి నమస్కరించాను. ఆయన మందహాసముతో "నారాయణా!" అన్నారు. కూర్చోమని సంజ్ఞ చేశారు. కిందనున్న పళ్లా పొట్లము తీసికొని అక్కడనే కూర్చున్నారు. అక్కడ ఉన్న బ్రాహ్మణులు స్వాములవారిని తమఇంటికి రమ్మని ప్రార్థించారు. స్వాములవారు రామన్నారు. క్రమేణా అందరూ శెలవు తీసికొని

వెళ్లిపోయారు. నాకుమట్టుకు కదల బుద్ధి అయ్యిందికాదు.




చేతిలో పళ్లూ పొట్లము..................జారవిడిచి నమస్కరించాను.

స్వాములవారు నన్ను ఉద్దేశించి 'ఎక్కడికి వెడుతూ ఉన్నావు' అన్నారు. ఏమి చెప్పడానికీ తోచిందికాదు. కాని చేసినపాపము చెప్పితే పోతుందని నాసంగతి అంతా ఒక్కసారి వారితోటి చెప్పాను. నేను చెప్పినదంతా విని ఆయన నవ్వారు. నవ్వేటప్పటికి నాకు కొంచెము కోపము వచ్చింది. అయినా యీయనతోటి చెప్పవలసిన అగత్యంయేమివచ్చింది అనుకున్నాను. నాపళ్లూ పొట్లం పట్టుకుని నేను లేచాను.

"ఏం, వెడుతూ ఉన్నావా" అన్నారు స్వాములవారు గంభీరంగా. "చిత్తం శెలవు ఇప్పిస్తే వెడతా"నన్నాను. "మాకు ఫలహారానికి ఆపళ్లు ఇచ్చి వెళ్లవలసింది" అన్నారు. కొంచెము సందేహించాను. దగ్గిర, డబ్బాలేదు. దేవికి ఫలములైనా అర్పించకపోతే ఆగ్రహము వస్తుందేమో. స్వాములవారికి నా అంతట నేను ఇవ్వకపోవడము సరిగదా, ఆయన అడిగినప్పుడైనా ఇవ్వకపోతే ఈయనకేమి కోపము వస్తుందో. అయినా ఈయనకు కోపమువచ్చిమట్టుకు నన్నేమిచేస్తారు. నవ్వుతూ "మీకిస్తె నాకేమి ప్రయోజనము"అన్నాను. "ఇచ్చిచూడు తెలుస్తుంది"అన్నారు. "ఏమి తెలుస్తుంది" అన్నాను. "ఐనా నీవు ఇచ్చి ఈరాత్రి ఇక్కడ ఉండిచూడు. నీకు ఇష్టము లేకపోతే మళ్లీ నీపళ్లు నీకు ఇస్తా" నన్నారు. సన్న్యాసి మాటలవల్ల నాకు కొంత ఆశ్చర్యము కలిగింది. ఉండమని లోపలనుండి ఏదో చెపుతూఉన్నట్టు వినబడింది. వెళ్లిపోదామంటె కాలు ముందుకు సాగడము లేదు. అయినా ఈచిత్రము ఏమిటో చూద్దామని పళ్లూ పొట్లము ఆయనకు ఇచ్చి ఒక్క నమస్కారము చేసి అక్కడనే కూర్చున్నాను.

అక్కడకూర్చున్న కొంత సేపటికి కళ్లకు మైకము కమ్మినట్టు అయింది. ఆపైన నాకు ఒళ్లు తెలియలేదు. నిద్రలో ఈలోకము విడిచిపెట్టి దివ్యలోకమునకు ఎక్కడకో వెళ్లినట్టు



రత్నఖచితమైన తూగుటుయ్యాలలో కూర్చుని దేదీప్యమానమైన.........మహేంద్రభోగము అనుభవించాను.

కలవచ్చినది. అక్కడ బంగారు మేడలో రత్నఖచితమైన తూగుటుయ్యాలలో కూర్చుని దేదీప్యమానమైన నక్షత్ర కాంతులలో అప్సరః స్త్రీలనృత్యము చూస్తూ గానము ఆలకిస్తూ మహేంద్రభోగము అనుభవించాను.

కళ్లు తెరిచేటప్పటికి సూర్యోదయము అయింది. నాప్రక్కని స్వాములవారు లేరు. నేను రావిచెట్టు నానుకుని కూర్చున్నాను. ఎదట కోటగుమ్మము కనబడుతూ ఉంది. నేను అక్కడ అలా ఎందుకు కూర్చున్నానా అనుకున్నాను. రాత్రిసంగతి అంతా జ్ఞాపకము వచ్చింది. స్వాములవారు ఎక్కడకు వెళ్లారు? రాత్రి సంగతంతా కలా, నిజమా? నిజము ఎట్లా అవుతుంది. ఈచెట్టుక్రింద కూర్చున్నవాడిని ఒక్కసారి దేవలోకములోకి ఎట్లా వెళ్లి ఉంటాను. పోనీ కల అనుకోవడానికైనా గడచిన రాత్రియొక్క దివ్యపరిమళము కొంత శరీరానికి అంటుకొన్నట్టుగా ఉంది. శరీరమున కొక వింత తేజస్సుకూడా వచ్చినట్లున్నది. ఏమనుకోవడానికీ తోచలేదు. దారిని పోయే స్త్రీపురుషాదులను చూస్తే ఎప్పుడూలేని అసహ్యము కలిగింది. ఇదివరకు గడచిన జీవితమంతా హేయమనిపించింది. స్వాములవారు స్వర్గసౌఖ్యము రుచిజూపించారు. ఆస్వాములవారిని వెదకి వారిపాదసేవజేసి శాశ్వతమైన స్వర్గపదవి యిప్పించమని వారిని కోరవలెనని నిశ్చయము చేసికొన్నాను.

నేనుఉండే బసకు వెళ్లి అక్కడనుంచి పాదగయకు స్నానానికి వెళ్లాను. స్నానము చేసి దేవాలయములోకి వెళ్లేటప్పటికి స్వాములవారు ఒకప్రక్కను కూర్చుని జపముచేసి

కొంటున్నారు. వారిజపము ముగిసేవరకూ అక్కడనే కూర్చుని వారు కళ్లు తెరవగానే సాష్టాంగ దండప్రణామము చేశాను. నారాయణస్మరణతో నన్ను దీవించి "ఏమి వచ్చావు" అన్నారు. "ఈదుర్మార్గుణ్ణి తమపాదసేవకునిగా తీసుకోమ్మ"ని ప్రార్థించాను. "నేను ఎప్పుడూ ఈఊళ్లో ఉండను. ఈరోజునే వెళ్లిపోతూ ఉన్నాను" అన్నారు. "నేనూ మీవెంటవస్తాను" అన్నాను. "నీవు పిఠాపురము విడిచి పెట్టి ఎట్లావస్తావ"న్నారు. ఇదివరకు ఘోర పాపాలు, చేశాననీ అటువంటి జీవితముపైన విరక్తి పుట్టినదనీ వారి శిష్యునిగా నన్ను అంగీకరించి ముక్తిమార్గము చూపించవలసినదనీ చాలాసేపు ప్రార్థించాను. వారు మొట్టమొదట ఒప్పుకోలేదుగాని చివరకు ఎలాగైతే నేమి వారితో తీసుకువెళ్లడానికి ఒప్పుకున్నారు. ఆసాయంత్రమువరకూ అక్కడనే ఉన్నాము. రాత్రి దేవాలయములోనే పడుకున్నాము. ఒకరాత్రివేళ మహావాయుపథములో పక్షివలె ఎగిరిపోతూ ఉన్నట్లు తోచింది. కళ్లుతెరిచి చూదామంటె రెప్పలు ఊడిరాలేదు. కొంతసేపు అయ్యేసరికి ఉపద్రవమైన చలివేసింది. కళ్లు తెరిచాను. ఇంకా సూర్యోదయము కాలేదు. ఒకపర్వతశిఖరముపైన ఒకఋషివాటికలో మాస్వాములవారి పక్కనున్నాను నేను. చూపుమేరలో మనిషిసంచారముగాని జంతువులుగాని ఏమీఉన్నట్లు తోచలేదు. పక్షుల కలకలారావములు కూడా ఏమీ వినపడడము లేదు. పర్వతప్రాంతమంతా మంచుపడి పిండి ఆరబోసినట్లు తెల్లగా ఉంది. అక్కడక్కడ చిన్నిచెట్లూ పొదలూఉన్నవి. నాపక్కనున్న స్వాములవారు ధ్యాననిమగ్నులై ఉన్నారు. అరుణోదయముఅవుతూఉంది. ఒక్కరాత్రిలో పిఠాపురమునుంచి ఎంతోదూరాన్ని ఉన్న హిమవత్పర్వతాగ్రము పైన ఎట్లావ్రాలానో తెలియలేదు. తెలియవలసిన అవసరములేదు. మహాత్ములకు ఏదిసాధ్యముకాదు? మాస్వాములవారికిని, అప్పుడే ఉదయిస్తూఉన్న ఈశ్వరస్వరూపమైన సూర్యభగవానుడికీ ఒక్కనమస్కారము చేశాను.

పాపాత్ముడను, స్త్రీలోలుడను, ఎప్పుడూ కలలోనైనా భగవన్నామస్మరణ చేయనివాడను, నాకిటువంటి మహాత్ముల సందర్శనము కలగడము వారిపాదసేవ చేసే భాగ్యము కలగడము ఏలావచ్చిందా అనుకున్నాను. నా పూర్వజన్మసుకృతము, నాతలిదండ్రులు మా పెద్దలు చేసిన తపఃఫలము, అయి ఉంటుందనుకున్నాను.

అట్లాగు స్వాములవారి పాదసేవచేస్తూ జ్ఞానదాయకము, ముక్తిదాయకమూ ఐనవిషయము లనేకములను వారివలన ఉపదేశము పొందుతూ, ఇల్లూ, వాకిలీ, సంసారమూ, ఒకటేమిటి సమస్తమూ మరచిపోయి అక్కడ ఆయిదుసంవత్సరములు ఒకక్షణమువలె గడిపాను. అనుక్షణమూ ఈశ్వరసన్నిధానమందున్నట్లు ఉండేది. చీనాంబరములూ హంసతూలికాతల్పములూ షడ్రసోపేతములగువిందులూ లేకపోయినా అక్కడ అనుభవించిన సౌఖ్యమూ ఆనందమూ ఈజన్మలో మరచిపోలేను. వేయి

జన్మములకైనా ఆఆనందముతప్ప వేరు నాకవసరములేదు.

సంతోషము ఎప్పుడూ నిత్యము కాదు. ఆత్మకెప్పుడూ శాశ్వతమైన శాంతి ఉండదు. పౌర్ణమి ఎప్పుడూ స్థిరముగా నిలవదు. స్వాములవారి పాదసన్నిధిని అట్టి నిరుపమాన ఆనందము అనుభవిస్తూ ఉండగా స్వాములవారు ఒక్కరోజున జపముచేసుకుని నాకేసి "నీకు తల్లీతండ్రీ ఉన్నారుకదా" అన్నారు. ప్రపంచము మరచిపోయా ననుకున్నవాడికి ఈసంగతి మళ్లీ ఎందుకు జ్ఞాపకముచేస్తూ ఉన్నారు. స్వామీ, అనుకుని "చిత్తం"అన్నాను "యుక్తవయస్కురాలైన భార్యకూడా ఉన్నదికదా" అన్నాడు 'చిత్తం' అన్నాను. "నాతో ఇదివరకు ఎందుకుచెప్పలే"దన్నారు. "తమకు తెలియనిదేమున్నది? వారెవ్వరియందూ నాకు ఇష్టములేక తమపాదసేవయందే కాలము పుచ్చుదామని వచ్చాను. ఇప్పటికైనా నాకు అది తప్ప వేరే ఏమీ అవసరములేదు" అన్నాను. "ఈఆశ్రమముసన్న్యాసులకుగాని గృహస్థులకు కాదు; నీవుఇంటికి వెళ్లిపో" అన్నారు స్వాములవారు. "స్వాముల కెందుచేతనో ఈదీనుడిపైన ఆగ్రహము వచ్చి నట్లున్నది." అన్నాను. "నాయనా! ఆగ్రహముకాదు. మీ యింటిదగ్గర నీతండ్రికి అవసానం సమీపించినది. ఆయన నీకై చాలా విచారిస్తూ ఉన్నాడు. నీమీద ప్రేమచేత ఆయన ప్రాణము పోలేకుండా ఉన్నది. నీభార్య నీకొరకై విలపిస్తూ ఉన్నది. అజ్ఞానురాలు అమాయకురాలూ ఐన ఆపిల్లను తీసుకువచ్చి నీకు కట్టి పెట్టి ఆ అమ్మాయి గొంతుక కోశానని మీతండ్రి చాలా విచారిస్తూ ఉన్నాడు. నీవువెళ్లి కుమారుడు తండ్రికి చేయవలసిన తుది కార్యము నిర్వహించి నీభార్యతో సుఖముగాకాపురము చేసికోవలసింది." అన్నాడు. "స్వామీ!నన్ను మళ్లీ సంసారములోకి తోయకండి. ఆపాశశాలలో పట్టుబడితే మళ్లీ విడిపించుకు రాలేనేమో అని భయము వేస్తూఉంది. నాకు ఆశ్రమము ఇప్పించి ఇక్కడనే ఉండనివ్వవలసింది" అని చాలా దూరము బ్రతిమాలుకున్నాను. కానివారు నామాటవినక గృహస్థధర్మముయొక్క రహస్యం నాకు బోధించి, ఆధర్మము సరిగా నెరవేర్చలేనివాడు ఆశ్రమస్వీకారమున కర్హుడు కాడనిచెప్పి కొంతకాలము ఐనపిమ్మట వారు నాకు మళ్లీ దర్శనము ఇచ్చిఅప్పుడు ఆశ్రమము ఇప్పిస్తామనిచెప్పారు. "అయితే ఇంతదూరముపవిఘ్నంగా వెళ్లగలను. నాకు మార్గము తెలవివ్వ వలసింది" అని కన్నీరు విడుస్తూ కృతాంజలినై అడిగాను. వారునామీద చేయివేసి "నీకేమీ భయము లేదు. కొంతకాలానికి నేను తప్పక మళ్లీ వస్తాను. కళ్లు మూసుకో మీఇంటిదగ్గర దిగబెట్టి వేస్తా"నన్నారు. చిత్తంఅని కళ్లుమూసుకున్నాను.

౫

అయిదుసంవత్సరముల క్రితము ఇక్కడకు వచ్చిన నాటరాత్రివలెనే వాయుపథములో ఎగిరిపోతూ ఉన్నట్లుగా తోచింది. కళ్లుతెరవవలె ననుకున్నా తెరవలేకపోయాను. కొంతసేపయ్యేసరికి నేల కాళ్లకు తగిలింది.

అక్కడనే నిలిచిపోయాను. కళ్లు మూతలు విడిపోయినవి. సూర్యు డస్తమిస్తూ ఉన్నాడు. పశువులు ఇంటికి చేరకుంటూఉన్నవి. కలకలమని పక్షులు ఆనాటి కబుర్లు చెప్పుకుంటూ గూళ్లకు చేరుకుంటూ ఉన్నవి. నేనూ మాఊరుపొలిమేరను ఉన్నాను. నెమ్మదిగా నేను మాఇంటి వేపు నడవసాగాను. ఇల్లు చేరేటప్పటికి మాఅమ్మ దీపారాధన చేస్తూఉంది. మానాన్న మంచము మీద కళ్లుమూసుకుపడుకున్నాడు. నాభార్య మంచముదగ్గరకూర్చుని సానపైనమందు అరగదీస్తూఉంది. నేను లోపల అడుగుపెట్టగానే నాభార్య తలఎత్తి చూచి అట్లు నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. కళ్లమ్మట నీళ్లు ప్రవాహముగా చెక్కిళ్ల మీదనుంచి ప్రవహిస్తూఉన్నవి. మా తల్లి చేతిలో ఉన్న కిరసనాయిలు బుడ్డి క్రింద విడిచిపెట్టి కెవ్వుమని కేకవేసి నామీద పడి "నాయనా! నువ్వేనా!" అంది. ఆ కేకవిని మాతండ్రి కళ్లు తెరచిచూసి "నాయనా! వచ్చావా, మధ్యాహ్నము కలలో స్వాములవారు ఒకరుకనపడి నిన్ను పంపిస్తామని చెప్పారు. ఎప్పుడువస్తావాఅనికనిపెట్టుకున్నాను", అన్నాడు. నేను వారికి నాచరిత్ర అంతా చెప్పి వారికి విచారమూ ఆశ్చర్యమూ, సంతోషమూ కలుగజేశాను నాకథ అంతా పూర్తిగావిన్న తరువాతను "నాయనా! నేనింక వెళ్లిపోతాను" అని ప్రాణాలు విడిచాడు..................

"అబ్బాయి! నాకథ ఇంక సమాప్తము కావస్తూఉంది. ఇంక చెప్పడానికి అట్టేలేదు. మాతండ్రిపోయి సంవత్సరము కాకముందే మాతల్లికూడా కాలముచేసింది. నేనూ అందరివలెనే సంసారభారమువహించి జీవయాత్ర గడుపుతూ ఉన్నా అందరివలెకాక కుమ్మరి పురుగువలె సంసారపంకిలములో పట్టుపడక దృష్టి ఈశ్వరునిమీదనే నిలిపిఉన్నాను అనడము అహంభావముకాదు. ఇద్దరు పిల్లలు పుట్టి పెద్దవాళ్లు అయ్యారు. స్వాములవారు ఇంకా ఎందుకురాలేదా అని అనుక్షణమూ వారిరాకకై ఎదురుచూస్తూ ఉన్నాను. నానాటికీ వారు వచ్చేరోజు సమీపిస్తూ ఉందని భావము కలుగుతూ ఉంది. కొన్నిరోజులలోనే మళ్లీ మాస్వామిసన్నిధిని చేరి శాశ్వతానందము పొందుతాను.

ఇదంతా నీకోటి తమాషాకు చెప్పాననుకోకు. మహాత్ములు లేరని మన దేశములో నశించారని తోసి వేయకు. నాస్తివాచకము పలకడము బహుసులభము. ఏవిషయములోనైనా హృదయములో విశ్వాసము లేనిదే జీవితము దుర్భరముగా ఉంటుంది. నీవు చిన్నవాడవు. భారతీయులకు సహజమైనటువంటి విశ్వాసము, మహాత్ములయెడల భక్తి పోగొట్టుకోవద్దు" అని నాప్రక్కనున్న బ్రాహ్మడు లేచి వెళ్లిపోయాడు.

చంద్రుడు అప్పటికి బాగా పైకివచ్చాడు. గోదావరికి పోటువచ్చి ఇందాకటికంటే బాగా నిండుగాఉంది. చంద్రకాంతిలో కోటిరత్నద్యుతితో ప్రకాశిస్తూఉంది. ప్రపంచమంతా నిశ్శబ్దంగా ఉంది. దూరమున ఒక పడవవాని పాట వినపడుతూఉంది. ఆబ్రాహ్మడు చెప్పినదంతా నాకు ఆశ్చర్యమూ సిగ్గూ కలిగించింది. ఆయన మాటలు వింటూ ఆయన

ముఖంకేసి చూస్తే ఆయన చెప్పినదానిలో అసత్యం ఏమాత్రమూ ఉన్నట్టు అనుమానము తోచలేదు. మన దేశముయొక్క మహత్తంతా నశించలేదుకదా అని సంతోషించాను. నీటిలో చూస్తూఉంటే హిందూదేశ చరిత్రఅంతా ఒక్కసారి పెద్దపటమువలె నాకళ్లముందు కనపడింది.

"ఏమిరా! ఇంకాఇంటికిరావు. నీకోసము అంతాకనిపెట్టుకున్నారు. ఎక్కడకు వెళ్లావో అనుకున్నాము" అని మామేనత్త కొడుకు వచ్చి నాభుజముమీద చరిచాడు. నేను ఉలిక్కిపడి లేచి ఇంటికి మళ్లాను. చంద్రబింబానికి మేఘము ఒకటి అడ్డువచ్చింది.

ప్ర కృ తి

౧

ప్ర ణ యి ని

ఏల మధుమాసవాసరకాలములను, మరకతంబుల హసియించు మురువు నించి,
పూవుమొగ్గల లేనవ్వు పొలుపుఁ దాల్చి, కవికుమారులహృదయంబుఁ గలఁచె దకట!

తే. కిసలయాంతరనిహ్నుత కుసుమకలిక, శ్రీయుషఃకాంతిచే వికసించి సౌర
భములు వెదచల్లురీతి నోప్రకృతీ! నిన్నుఁ, గాంచి హృదయము నవరసోద్గారమగును.

చ. జలజలమంచు ముత్తెములు జారెడునట్లు పలుంగురాల స
ల్లలితగతిన్ స్రవించు సలిలమ్ములు చల్లనినిస్వనమ్ము వీ
నులఁ దవులంగఁ బ్రేమపువినోదముగా భవదీయమర్మముల్
దెలియఁగఁ బల్కుచుండుఁ బ్రకృతీ! వెతఁబోవనె నీదుమూర్తికై!

చ. జిలుగుఁబయ్యెద జాఱువాపసిఁడివౌ శృంగారపుందీప్తులో
తళుకుంబంగరుటేటితామరలవౌ ధమ్మిల్లపుష్పించులో
అలయింప న్నను నీవు పైఁబరచు ప్రేమాలోకనాలోకపు
న్విలసత్కాంతులో? యంచు నెంతుఁ బ్రకృతీ! విద్యుల్లతారోచులన్.

తే. బహుముఖంబగు ప్రేమప్రభావ మెసగ, విశ్వమంతయు నీలోన వెలయుచుండు;
కరుణఁ బ్రేమరహస్యంపు సరణిఁ దెలుప, ప్రకృతీ! నీలోన నైక్యమై పరగఁగలనో!

[జ్యోతిష్మతి]

ప్రేమసుధ

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

తొలి చినుకు

శ్రీధరుడు చంద్రశేఖరముపంతులుగారియింటికి జేరునప్పటికి వారికొమార్తె యగు లలితాంబకు రెండువత్సరములయిన బూర్తిగ లేవు. వచ్చియు రాని పలుకులతో, తెలిసియు దెలియని చెయిదములతో, నేర్చియు నేరని నడకలతో, లలిత యప్పుడు అందఱకును, ముద్దుబిడ్డగా నుండెను. సహజముగా సౌమ్యహృదయుడును, ప్రేమ స్వభావుడును నగు శ్రీధరునకును లలితకును నత్యల్పకాలముననె మైత్రి కుదిరినది. బడినుండి వచ్చునదే తడవుగ శ్రీధరుడు లలితకై వెదకును. శ్రీధరునిపిలుపు చెవిసోకినదే తడవుగ లలిత "అన్న, అన్న" యని యాతని చేతులపై వ్రాలును. శ్రీధరుని చూచినంతనే లలితకెంతయేడుపైన నిట్టె యెగిరిపోవును. నీలాలకలు ఫాలతలంబున జిందులాడుచుండ, ఆణిముత్తియములవంటి కన్నీటిబిందువులు చిన్నారిచెక్కిళ్లపై తళతళ మెఱయుచుండ, బొమలు కొంత ముడివైచి, మూతి రవ్వంత పొడిగించి, తలను ఇసుమంత వ్రాల్చి, తల్లిపైటచెఱగును బట్టియో, కుచ్చెళ్లబట్టియో, లాగుచు నేయాటవస్తువునకో, ఏతినుబండారమునకో మారాము చేయుచున్న లలితవీనులకు శ్రీధరుని "లలితా" యనుపిలుపు వినబడగనే యాయలుక యేమగునో, యాజగడమేమగునో? క్షణములో మోమువిప్పారి క్షీరదంతములసితకాంతులు బయల్పడ రేఖామాత్రముగనున్న పలుచని కెంబెదవిపై చిఱునవ్వు తొలకాడును. పాలబుగ్గలపై యలుకను దెలిపెడి యశ్రుబిందువులు; కెంబెదవిపై నానందమును దెల్పెడి మధుర మందహాసము; ఆహా! ఎంతమనోమోహనకరము ఆరూపు!

శ్రీధరునియందు లలిత కింతటిప్రేమయేల? లలితకు శ్రీధరు డేమైన చిఱుతిండ్లు పెట్టునా? ఆటవస్తువులు తెచ్చి యిచ్చునా? ఏమియు లేదు. నిర్ధనుడగు శ్రీధరుడు, చదువుకొను నిమిత్తము పేదతనముతో వారియింటికి జేరిన శ్రీధరుడు; ధనికులబిడ్డయగు లలితకు బసదనము లీయ సమర్థుడు గాడు. మఱి యేమి కారణము? శ్రీధరుని సహజసౌజన్యసౌహార్ద ప్రవర్తనమే!

మలు చినుకు

లలితకు మూడేండ్లు వచ్చినవి. శ్రీధరునకు పదమూడువత్సరములు వచ్చినవి. ఇరువురకు పదివత్సరముల వ్యత్యాసమున్నను వారి పరస్పరమైత్రి కెట్టి యభ్యంతరము

గలుగ లేదు. శ్రీధరునకు బడిపాఠములు ముగిసిన వెనుక లలితతో నాడు కొనుట దప్ప వేఱు లోకమే లేదు. వానకాలమున శ్రీధరుడు లలితకు కాగితపుపడవలు గట్టి నీటిమడుగులలో దేలించి వినోదింపజేయును. గాడ్పుదినములు రాగానే గాలిపటములు చేసి యెగురవేయించును. నేలబడిన చింతగింజలు తొలకరికి మొలకలెత్తగనే పెల్లగించి వానినఱుమ పూచికపుల్లల గ్రుచ్చి నును పైనపాలగచ్చుపై బొంగరములు త్రిప్పించను. ఈరీతి నెప్పటి కప్పుడు కాలానుగుణ్యములగు క్రీడావస్తువుల జేకూర్చి యాడించు శ్రీధరుని ఒక్కక్షణమైన నెడబాయక లలిత వెంటాడి తిరుగుచుండును. చంద్రశేఖరముగారు డిసెంబరుసెలవులలో చెన్నపురివెళ్లి లలితకొక చిన్నరంగులపెట్టెను దెచ్చియిచ్చిరి. లలిత యాపెట్టెనిండ వెలలేనిసామానుల జేర్చినది. సంగరరంగమున నవయవవిచ్ఛేదకులైన యోధులవలె లలితతోడి క్రీడాయుద్ధముల తలలు పగిలి, చేతులు విఱిగి, కాళ్లు పోయి, శిథిలమైనబొమ్మ లెన్నియో లలితరంగులపెట్టెలో జేరినవి. అంతియేకాదు, రంగుపోయిన లక్కచిట్లు, పగిలిపోయిన సీసాలబిరడాలు, పోయిన డబ్బాలమూతలు, చిఱిగినగుడ్డపేలికలు పండ్లూడిన దువ్వెనలు, పగిలినయద్దపుపెంకులు, చిట్లినగాజుముక్కలు, గ్రుడ్డిగవ్వలు, గచ్చకాయలు, సుద్దముక్కలు, నాటకపుకంపెనీ కాగితములు, గుడ్డతానులమీది బొమ్మలు శుభలేఖలు, చింపిరి కాగితములు మున్నగునవెన్నియో లలితరంగులపెట్టెలో భద్రమైనవి. ఏచిన్నిడబ్బాకైన మూత దొరకకున్నను లలితపెట్టెలో వెదకినచో నొకటిగాకున్న నొకటియైనసరిపోవును. బొట్టుపెట్టుకొనుటకద్దము గానరాకున్నచో లలితను యాచించిన నేయద్దపుపెంకుతోనైన బొట్టుపెట్టుకొన వచ్చును. ఏ చిన్నివస్తువు కనుపింపకున్నను "లలితపెట్టెలోచూచిలేదనుకోండీ" అనుట యింటిలోసర్వసాధారణమైపోయినది. కించిత్తు వెలజేయని యాసామానులను జూచుకొనిన లలిత కెంతయో సంబరము. "చూదండి; నాలంగుల పెత్తిలో యెన్నివున్నాయో" అని లలిత మురువున బల్కునప్పుడు లలిత మోమున గన్పట్టు సంతసము, తృప్తి, మన యనుభవమున కసాధ్యము! ఎంతయో ధనధాన్యసంపత్తి సేకరించి ఎన్నియో సుఖము లనుభవించి యాయువు తఱుగుచున్నను, నాశలు పెరుగుచు తనివిలేక తల్లడిల్లు లుబ్ధమానవులకు లలిత మోమున గన్పట్టు ఆనందరసము బోధ్యమగునా? గ్రహింపసాధ్యమా?

లలిత రంగులపెట్టెలోనున్న సామానులలో లలిత యమ్మమ్మ తిరుపతివెళ్లి క్రొత్తగా తెచ్చియిచ్చిన చందనపు బొమ్మ యొక్కటే కాలుచేయి విరుగకుండ కొంచెము బాగుగానున్నది. లలిత దానికి అమ్మమ్మ బొమ్మయని పేరుపెట్టినది. లలితకు రంగులపెట్టిమీద ఎంతప్రేమో, అమ్మమ్మ బొమ్మమీద యంతప్రేమ. లలిత యాకొయ్యబొమ్మకు దల్లియై సకలవిధముల పోషించుచుండును. లలిత తనపట్టి కొకప్పుడు శ్రీధరుని బొమ్మనుజేసి పిల్లను చిచ్చికొట్టి నిద్రపుచ్చమనును; తండ్రిని జేసి పిల్లకు

మిఠాయి తెచ్చిపెట్టుమనును; చాకలిని జేసి పిల్లను చల్లగాలికి త్రిప్పమనును; పిల్ల నెత్తుకొను పిల్లనుజేసి పిల్ల నేడ్పించితివా యని చీవాట్లు పెట్టును.

ఇట్లా బాలగృహిణి వేవిధముల వేధింపుచున్నను శ్రీధరుడు మనోజ్ఞ మందహాసముల వానినెల్ల జేయుచుండును. ఒకప్పుడు తానె లలితకు పట్టిమై బువ్వపెట్టించుకొనుట, లాల పోయించుకొనుట, ఆముదము త్రాగుట, మున్నగు శిశూపచారముల నందుచుండును. ఒకదినమున లలిత మేనత్తయు నామెకుమారుడును వచ్చిరి. ఆ బాలునకు నాలుగేండ్లు ఉన్నవి. లలిత నాబాలునితో నాటలాడుచు "బావకు వంతచేసిపెత్తుతాను; పొయ్యిలుపెత్తిపెత్తుమని శ్రీధరుని నిర్బంధించెను. శ్రీధరుడు వెంటనే చిల్లపెంకులతో ప్రొయిల నమర్చి, పూచికపుల్లలను వంట చెఱుగా జేసి లక్కచిట్లను ప్రొయిలమీద నెక్కించి "లలితా, ఇక బావకు వంటచేసిపెట్టుకో" యనెను.

లలిత:—"చీరకత్తూ మఱి" అని ఒకపాత గుడ్డను దెచ్చెను. శ్రీధరుడు పైటవేసి చీరకట్టగనె లలిత పైటచెఱగు దీసి నెత్తిన వేసికొనినది.

శ్రీ:—లలితా! ఆ ముసు గేమిటి?

ల:—మరికత్తుకున్నా. వంత చేయవద్దూ?

శ్రీ:—మరికత్తుకుంతే నెత్తిన గుడ్డెందుకు?

ల:—మన చుబ్బమ్మ వేచుకోరం లేదూ?

శ్రీ:—ఛీ! తప్పు. అమ్మలాగ చక్కగా చీర కట్టుకొని వంటచేయవలె.

లలిత ఒప్పుకొనలేదు. వారి యింటిలో వితంతువగు వంటలక్క నెత్తిన ముసుగు వేసికొనుటచే అది మడికిని వంటకును ఒక లక్షణముగా లలిత గ్రహించినది. శ్రీధరుడు యెంతయో బతిమాలి చెప్పగ చెప్పగ లలిత బూబు ముసుగుతీసినది. పెద్దచిట్టిలో నేచిన కందిపప్పు పోసి, చిన్నచిట్టిలో పచ్చి పెసరపప్పు పోసి ప్రొయిలమీద బెట్టి మలిచి దోపిన చీర చెఱగును చిన్నారి చేతుల మఱి మఱి సవరించుకొనుచు, ఎవరు తగిలెదరో యని యోరయోరల కొత్తిగిలుచు, 'ఉఫ్‌ఉఫ్' మని ప్రొయిలవద్ద తలవంచి యూదుచు, పండిరాలిన రాచయుసిరికాకులతో లక్కచిట్లను పట్టి దింపుచు లలిత వంటచేయ నారంభించినది. ఇంట నందఱదృష్టి లలితమీదనే, లలితవంట మీదనే నిలిచినది. అన్నిపనులు మానుకొని లలితపచనకార్యముల జూచుచు నిలువబడి పోయినారు. లలితపాకము క్షణములో ముగిసినది. బావను పీటవేసి కూర్చుండబెట్టి ముందొకబాదమాకునువేసి లలిత తనపప్పులవంటకమును వడ్డించినది. బావ తినుచున్నాడు. లలిత కొంచెముదూరములో తలుపుమొత్త నానుకొని రవ్వంత వంచినతలతో నమ్రతను సిగ్గును ప్రకటింపుచు, పైట సవరించుకొనుచు, బావదెస యోరచూపులు చూచుచు నిలువబడి నెమ్మదిగా సన్నయెలుగున "కమ్మలు చేయించవూ" అన్నది. గృహిణిచెయిదముల నంతచక్కగా ప్రకటించిన యాబాలగృహిణి మనోహరాభినయమున కంద ఱొక్కమాఱు పకపకనవ్విరి. "నాకన్నతల్లి" యెక్కడ నేర్చి

కొంటెవే యీచిన్నారిచేష్ట లని తల్లియాప లేనిసంతసముతో కూతును ముద్దాడెను.



"లలిత...కమ్మలు చేయించరూ" అన్నది.

చెప్పివైచినది, చంద్రశేఖరముగారికి గూడ నవ్వువచ్చినది. కాని నవ్విన లలిత తమవద్దకు గూడ రాదని గంభీరముగా మౌనము వహించి లలితకును, బావకును తాముఅప్పుడేకొనుక్కొని వచ్చిన యీలలలో నొకటి దీసి "బుయ్" మని యూదిరి. ఆధ్వని చెవులబడగనే లలిత యొక్క పరుగున వచ్చి తండ్రియొడిలో బడి యూదుచున్న యీలను లాగుకొని తా నూదసాగెను. తండ్రి యీ తూతూను బావకిమ్మని రెండవయీలను గూడ లలిత కిచ్చిరి. లలిత బావ కిచ్చినది. ఇద్దఱితూతూలతో చెవులు చిల్లులు వడుచున్నవి.

అంద ఱొక్కమాఱు నవ్వుటచే లలిత కెక్కడలేనికోపము వచ్చినది. ఎక్కడవంటక మక్కడనేవదలి బావగారికి మాఱువడ్డన సున్నచుట్టి అలిగి మూల కూర్చున్నది. నెత్తిమీదివెండ్రుకలు మొగముమీదకు లాగుకొని వ్రేలికి మెలివేసి యొక్కొక్క వెండ్రుకను త్రెంపుకొనుచున్నది. ఎవరు దగ్గఱకుదీసిన రాలేదు. శ్రీధరునకుగూడ లలిత స్వాధీనము కాలేదు. పెద్దగా నవ్వినవారిలో శ్రీధరుడే ప్రథము డైనప్పుడు లలిత యాతనిమాత్ర మేరీతి క్షమించును ?


"బావా! బావా! ఈ బాజాలతో అమ్మమ్మబొమ్మకు పెల్లిచేద్దామా?" అన్నది లలిత. "అట్లాగే" నన్నాడు బావ. వెంటనే అమ్మమ్మబొమ్మను తెచ్చి పీటమీద బెట్టి రెండుచేతులను కాళ్లకు మెలిబెట్టి కూర్చుండి 'జయమంగల' మని పాటలుపాడ నారంభించినది లలిత.

లలితకోప మింకను తీరలేదు. అందఱి నవ్వులు యింకను ఆగలేదు. ఇంతలో చంద్రశేఖరముగారు కచ్చేరినుండి వచ్చిరి. ఏఁగుల కీనవ్వు లనిరి. లలిత ముద్దుచేతలన్ని తల్లి

అంతలో నవ్వులు! అంతలో యేడ్పులు! అంతలో అలుకలు! అంతలో ఆటలు! ఏమిటో! ఈ శైశవచిద్విలాసము!

మూడవ చినుకు

లలిత కైదేండ్లు వచ్చినవి. మాటలకు చేతలకు రూపునకుగూడ కొంచెము పెద్దదైనది. తిరుగుమరుగులు తెలిసికొనుటకును చెప్పుటకును చాలిన గ్రాహ్యాశక్తిగూడ కొంత


రెండుచేతులను కాళ్లకు మెలిబెట్టి కూర్చుండి.........పాటలుపాడ నారంభించినది లలిత.

యేర్పడినది. లలిత కైదవయేడు వచ్చుటచే కొలదిదినముల క్రిందటనే అక్షరాభ్యాసము చేసిరి. శ్రీధరుడు పలక బలపములను చిన్న బాలశిక్షను తీసికొనివచ్చి లలితకు వర్ణపరిచయము గల్గింప తిప్పలుపడుచుండెను. అ,ఆ, లు వ్రాసిన, క, ఖ, లు వ్రాసిపెట్టు మనియు, క, ఖ, లు వ్రాసిన బొమ్మలు వేసిపెట్టు మనియు, బొమ్మలు వేసిన ముగ్గులు వేయుమనియు, ముగ్గులు వేసిన నీకు చేత గాదు నేనే వ్రాయుదు నని పలకనిండ సున్నాలుచుట్టియు, లలిత శ్రీధరుని విసిగింపుచుండును.

శీతకాలపు సెలవులలో నొక్కమాఱు యింటికివచ్చిపొమ్మని శ్రీధరునకు తండ్రి వద్ద నుండి జాబువచ్చినది. శ్రీధరునకు పట్టరాని యానందము గలిగినది. ఉన్నతవిద్యాభ్యాస కౌతూహలముచే తండ్రికి తెలియకుండ బందరు వచ్చి శ్రీధరుడు తండ్రియాగ్రహమునకు గుఱియైనాడు. మూడేండ్లయినను తండ్రి శ్రీధరున కేమాత్రము ధనసహాయము చేయ లేదు సరిగదా యింటికిరమ్మని యొకయుత్తరపుముక్కనైనను వ్రాయలేదు. తన ప్రేమాస్పదులగు తల్లిని చెల్లెలిని చూడవలె నను కౌతూహలము శ్రీధరునకు నానాటి కగ్గలంబగుచున్నను, ధూర్తుడగు తండ్రికి వెఱచి శ్రీధరుడు నిజగృహమున కేగ సాహసింపలేడు. చంద్రశేఖర దంపతులనే జననీజనకులుగ, లలితనే తన బుట్టువుగ భావించి, శ్రీధరుడు ప్రొద్దులు పుచ్చుచుండెను.

నేడు రేపనితలంపుగ తండ్రియొద్ద నుండి యాహ్వానము వచ్చుటచే శ్రీధరునకు మిక్కిలిసంతోషము గలిగెను. తనయొద్ద నున్న పావలాడబ్బులతో చెల్లెలి కొక్కలక్కబరణిని, తల్లికొక్క కుంకుమపు పొట్లమును కొనుక్కొని శ్రీధరుడు స్వగృహమునకు బ్రయాణమయ్యెను. శ్రీధరుడు ఊరికి వెళ్లుట లలిత చూడలేదు. చూచిన తనవెంటపడునని లలితకు తెలియకుండ శ్రీధరుడు వెళ్లిపోయెను.

మధ్యాహ్నమునుండి శ్రీధరుడు లలితకగుపడలేదు. చాలమాఱులు శ్రీధరునికొఱకు వెదకినది. కాని అన్న బడికిపోయెనని తల్లి

చెప్పుటచే బడిత్రోవ వంక తదేకదృష్టితో జూచుచు లలిత వీథి యరగుపై కూర్చున్నది. తల్లియెన్నిమాఱులు లోనికిరమ్మనినను లలిత రాలేదు. సాయంత్ర మైదుగంటలైనది. శ్రీధరుడు రాలేదు. శ్రీధరుడును లలితయు చల్లగాలికై వెడలుసమయ మది. లలిత కెట్లు తోచును? అన్న యింకను రాలేదేమని లలిత తల్లి నడిగినది. తల్లి యేవేవో కల్లబొల్లిమాటలు చెప్పి చిఱుతిండిపెట్టి లలిత ధ్యానమును మరల్పజూచినది. కాని తల్లిదండ్రులవద్దకన్న శ్రీధరునివద్ద నెక్కువగా మెలగనలవాటు పడిన లలితకు శ్రీధరుడు మఱపువచ్చునా?

ఆ రాత్రి యెట్లో గడచినది. ఉదయమైనది. శ్రీధరుడు కనుపడలేదు. లలిత శ్రీధరునికొఱకు యిల్లంతయు గాలించినది. దొడ్డియంతయు వెదకినది. వీథి నాల్గుదెసలపరికించినది కనుపడలేదు. వికసితకమలమువంటిలలిత మోము అస్తమయ సమయపద్మమువలె ముకుళించినది. తల్లి బతిమలాడి యన్నముబెట్ట సగమైన తినలేదు. లలిత శ్రీధరునిపలుమాఱడుగుటచేవిసిగి 'శ్రీధరుడు వూరికి వెళ్లినాడు యెవరితో నైన నాడుకొను'మని తల్లి చెప్పెను. అన్న కొఱకు కొంతసేపు విలపించి లలిత కన్నీరు తుడుచుకొనినది.

ఈవిధముగా రెండుమూడు దినములు గడచిన తరువాత లలిత శ్రీధరుని యడుగుట మానినను బిక్కమొగము వేసికొని యెప్పటివలె యాటలాడక తిండితినక చిక్కి సగమగుచుండెను.

ఏడుదినము లిట్లు గడచినవి. ఎనిమిదవ నాటిరాత్రి లలితకు పెద్దజ్వరము వచ్చినది. తెల్లవాఱగనే చంద్రశేఖరముగారు వైద్యుని పిలుచుకొనివచ్చి లలితకు మందులు యిప్పించిరి కాని జ్వరము తగ్గలేదు. మూడుదినములైనను లలితకు జ్వరము పట్టినపట్టువిడువలేదు. జ్వరతీవ్రముచే శ్రీధరుడు వచ్చెనన్నప్పుడు దప్ప మఱియొకప్పుడు లలిత కన్నైన విచ్చి చూచుటలేదు. ఏలాటి యాహారము పుచ్చుకొనుటలేదు. శ్రీధరుని కొఱకు బెంగపెట్టుకొనుటచేతనే లలిత కిట్టిజ్వరమువచ్చెనని ఎల్లరు తలచిరి. కాన లలితకు చాలజబ్బుగానున్నది. వెంటనే రమ్మని చంద్రశేఖరముగారు శ్రీధరునకు తంతినిచ్చిరి. కాని శ్రీధరుని పల్లెగ్రామమునకు తంతి చేరి శ్రీధరుడు పడవ ప్రయాణముచేసి వచ్చునప్పటికి యెంత లేదనినను మూడుదినములు పట్టును. ఈమూడుదినములు గడచు టెట్లనియెల్లరు విచారించుచుండిరి. నాటిమధ్యాహ్నమునుండి లలితకుజ్వరము తొల్లిటికన్న నెక్కువగుటయేకాక తడబాటుమాటలుగూడపుట్టెను. ఆసంధిప్రలాపములు గూడ శ్రీధరునకు సంబంధించినవే! అన్నా! ఈచింత బెత్తికలతో చేసిన బొంగరాలన్నీనావే! అన్నా! ఈ రంగులకాగితంతో గాలిపటం కడ్తావా? అన్నా! అన్నా! నీకోసం యెన్ని పిప్పిరిమింట్లు దాచానో చూచావా? అమ్మా! అన్న రాడంటివే! బండిమీద యెక్కి వస్తున్నాడు చూడూ!" అని యీవిధముగా లలిత ప్రలాపించుచుండెను. అస్తమానమగు కొలది లలిత కేకలు మఱింత యెక్కువ యగుటయేకాక

లేచిపోవుటకూడ నారంభించినది. 'ఎక్కడి'కని యెవరైన నడిగినచో, 'అన్నవద్ద'కని లలిత జవాబుచెప్పుచుండెను.

ఇంటికి బిడ్డయే వెలుగు. బిడ్డలు నడయాడనికొంప చీకటికొంప. చంద్రశేఖరముగారి గృహదీపము, లలిత, మిక్కిలి విషాదస్థితియందుండుటచే వారియిల్లుచీకట్లుక్రమ్మినట్లుండెను. ఎప్పటివలెనే యింటిలో గాలివీచుచున్నది; వెలుతురు ప్రసరింపుచున్నది; మనుష్యులు తిరుగుచున్నారు; పనులుజరుగుచున్నవి; కాని లలిత మందహాసచంద్రికలు దీపింపమిచే నాయి ల్లంధకారావృతమైయే యున్నది. తమ గృహజ్యోతి; ప్రేమఫలము; హృదయానిక్షేపము; జీవితసర్వస్వము నగు లలిత భయంకర వ్యాధికి లోనగుటచే తల్లిదండ్రుల శోకమునకు పారము లేకుండెను. అందును తల్లి ముఖ్యముగా నాహారనిద్రలేవర్జించి ప్రాచి మొగమైన కడుగుకొనక నొకేవిధముగా శోకింపు చుండెను. శోకోదయముతో తల్లికి ప్రేమోదయ మగుట ప్రకృతినైజము; మొగమునిండ మట్టిమరకలతోడను నాసామలముతోడను నసహ్యముగానున్న బిడ్డనుగూడ తల్లిముద్దాడును. కాళ్లు చేతులు సన్నగిలి, పొట్టయుబికి మొగము పాలి యందవికారముగా నున్న బిడ్డనుసైతము తల్లి ప్రేమతో ముద్దుగొనును. కాళ్లనిండ కర్పాణిలేచి, తలనిండ కురుపులులేచి, ఈగలు దోమలు ముసురుచు రోతగలిగించు బిడ్డనుగూడ తల్లి ముద్దుపెట్టుకొనును. రోగారోగముల, సురూపవిరూపముల, వివేకావివేకముల, హాసశోకముల విచక్షణ తల్లిప్రేమచుంబనములకు లేదు; పెరవారి కామంచిచెడ్డలు. ఆకారులమీదను, అనాకారులమీదను, రోగులమీదను నీరోగులమీదను, వికలాంగులమీదను సుకలాంగులమీదను సమదృష్టితో సమానముగా ప్రవహింపగలది మాతృప్రేమప్రవాహ మొక్కటే! ఆప్రేమవాహినికి సాదృశ్యమున్నదా జగతిని మఱియొకటి? లలిత అందఱముద్దుబిడ్డ. తనజగన్మోహనరూపలావణ్యముచే, తనమనోజ్ఞశైశవ క్రీడాకలాపములచే, తనయవ్యక్తమృదుమధురాలాపములచే లలితపితృగృహమును బృందావనముచేసి బాలకృష్ణునివలె యెల్లరహృదయము లాకర్షించినది. అట్టి లలిత జననీజనకులప్రేమ కొల్లగొనెననుటలో నాశ్చర్య మేమిగలదు? లలితకు జబ్బుచేసినదిమొదలు లలిత యాటపాటలు మఱింత తలపునకు వచ్చి వారినిదుఃఖవివశులనుగాజేయుచుండెను.

ఇంట నేమూలజూచినను లలిత క్రీడావస్తువులే! లలిత చొక్కా పరికిణీలే! లలిత చేతుల నలంకరింపక, లలితమేను శృంగారింపక నామూల నామూల నేలదొరలుచున్న యాటవస్తువులను వస్త్రములను జూచి తల్లిదండ్రులేరీతి భరింపగలరు? ఏగోడను జూచిన లలిత చిన్నారిచేతులతో గీచిన బొగ్గుగీతలే. బిడ్డ ప్రాణాపాయ స్థితియందున్నప్పుడు ఆబొగ్గుగీతలుగూడ తల్లిదండ్రుల హృదయమునకు అంపపుకోతలేగదా! మగవాడగుట తండ్రియేదోవిధముగా దుఃఖమొకింత యాపుకొనినను కన్నతల్లి దానినిజూచి కడుపు పగిలి వాపోవక యెట్లుండగలదు?


ఉదయము కాగానే మరల డాక్టరునుతీసి కొనివచ్చిరి. డాక్టరు వచ్చి నాడి పరీక్షించి, నాలుకచూచి, జ్వరపు పుల్లతో జ్వరమును కొలిచి, పెదవి విరచి, కన్నులు మిటకరించి "నూటనాలుగుడిగ్రీలు; విషజ్వరము; యిరువది యొక్కదినములు గడువు. సీసా పంపండి; మందుపంపుతా"నని చెప్పి వెళ్లిపోయెను. వైద్యుడే నిరాశా వచనములు పలికినప్పుడు యిక ఆశ యెవరికి! అకటా!

త:—రాకపోయిన యింత తీవ్రస్థితిలో ఎన్నాళ్లు గడచును.

బొమ్మ:—టపాపడవలో నెక్కినచో యీదినమే రావచ్చును.

త:—ఏమో! అంత పుణ్యమా! శ్రీమన్నారాయణమూర్తికి మనయందంత కృప గలదా?

అని యిట్లనుకొనుచుండగనే వాడి, డస్సి, కృశించి, మొగమునిండ చెమటలుకారుచుండ



వాడి, డస్సి, కృశించి......శ్రీధరు డెదుట ప్రత్యక్ష మయ్యెను.

నాల్గవ చినుకు

పగలు రెండుగంటలైనది. వడ్లగింజవేసిన పేలగింజ యగునంతటి తీవ్రముగా నున్నది లలితజ్వరము. "అదిగో బండి, దానిమీఁద యెక్కిపోతా"నని లలిత ప్రలాపించుచుండెను. లలిత జీవితాశాలత యేశోషిల్ల ఇంట నున్నవారందరు లలిత మంచముచుట్టు గ్రుడ్లు నీరు గ్రుడ్ల గ్రుక్కుకొనుచు కుప్పలుగూలికూర్చుండిరి. చంద్రశేఖరముగారొక్కరు మాత్రమే లలితపక్కమీఁద బిక్కమొగముతోఁగూర్చుండి యుండిరి.

లలితతల్లి:—మందులు మాకులు పనిచేయవు. శ్రీధరుడువచ్చిన చాలును. లలిత జబ్బు నయమగును.

తం:—నిజమే. నాకు గూడ అదే ఆశగా నున్నది. కాని మన తంతిజేరి ఆ లంకణాలబోటుమీఁద ప్రయాణముచేసి శ్రీధరుడు త్వరలోవచ్చుట సాధ్యమా!

శ్రీధరు డెదుట ప్రత్యక్షమయ్యెను. శ్రీధరుని జూడగనే యందరొక్కమారు బావురుమనిరి. చంద్రశేఖరముగారికి గూడ దుఃఖమాగలేదు. శ్రీధరా! ఈపిల్ల ప్రాణములు నీకొఱకు నిలిచియున్నవి. చూడుమని కన్నీరు జొటజొట కారుచుండ పలికిరి. శ్రీధరునకు నాపరాని దుఃఖమువచ్చినది. కన్నీళ్లు నుత్తరీయాంచలనమున నొత్తుకొనుచు " లలిత "

యని యొక్కమాఱు గద్గదస్వరముతో బలికి శ్రీధరుడు నేల చతికిలబడెను. శ్రీధరుని కంఠధ్వని చెవులబడగనే లలిత చప్పునకన్నులు తెఱచి నలువైపుల చూచెను. చంద్రశేఖరముగారు లలిత పక్కపైనుండి లేచి నిలువబడి "శ్రీధరా? లలిత నీకొఱకు కన్నులు విప్పి చూచుచున్నది. దగ్గఱకు వచ్చి పలుకరింపు" మనిరి. శ్రీధరుడు లలితదగ్గఱకువచ్చి లలితపై చేయివైచి "ఏమమ్మా, జ్వరముగా నున్నదా?" యనెను. "ఊఁ, అన్నా! ఎత్తుకో" అని లలిత రెండుచేతుల నెత్తెను.

"నీకు జ్వరముగా నున్నదిగా! లేవలేవు. రేపు జ్వరము పోయినతరువాత ఎత్తుకొంటాను. నీదగ్గరగా కూర్చుంటాను. సరేనా"

"అయితే బబ్బో!"అని లలితపక్కకొత్తిగిలినది. శ్రీధరుడు నిస్సందేహముగా లలితపక్కలో పడుకొనినాడు. లలిత యాతనిని కోతిపిల్లవలె గట్టిగా కౌగిలించు కొనినది.

నిముసము క్రిందట పిచ్చిమాటలాడుచు మైమఱచియున్న లలిత క్షణములో మంచి పిల్లవలె నింత చక్కగా మాట్లాడుట యెల్లరకాశ్చర్యము గొల్పుటయేకాక లలిత జీవించు నను నాశ యెల్లరహృదయముల నానంద భరితము గావించెను. క్రోల్పోయిన పెన్నిధిదొరకినట్లు గతించిన బాలలబ్ధ జీవ మైనట్లు తల్లిదండ్రులు సమ్మోదమందిరి. కాని లలిత కిది మంచి తెలివి యగునో కాదో, యను సంశయము వారి సింకను పీడించుచునే యుండెను. క్షణక్షణము లలిత యొడలిపై చేయివైచి చంద్రశేఖరముగారు చూచుచుండిరి. క్రమక్రమముగా లలిత శరీరోష్ణము తగ్గుచున్నట్లు గోచరించెను. రోగము తీవ్రముగా నున్నప్పుడు రోగియం దెట్టిమార్పుగలిగినను భయకారణమే కదా. 'లలితయొడలి వేడిమి తగ్గుచున్నది. ఏమిచేయుద'మని యంద రాతురపడిరి. "లలితా!" యని శ్రీధరుడు పిలిచెను. ఆఁ "నీవు ఘారికి పోవ"ద్దని లలిత శ్రీధరుని మరింత గట్టిగా నాలింగన మొనర్చుకొనెను. "లలితకు జ్వరము తగ్గుచున్నది. తెలివిగా పలుకుచున్నది. భయములేదు. తొందర పడకు"డని శ్రీధరుడనెను."ఎందుకైననుమంచిది. ఈకస్తూరిమాత్రలను లలిత నోటిలో వేయు" మని రెండుమాత్రలను చంద్రశేఖరము గారు శ్రీధరునిచేతిలో నుంచిరి. శ్రీధరుడు లలితను 'నోరు తెరువు'మని మాత్రల నోటిలో వైచెను. లలిత గుటుక్కున మ్రింగి పడుకొనెను.

జ్వరము తగ్గినకొలది లలితకు నిద్రపట్టినది. శ్రీధరుడు మెలకువతో నున్ననుతాను లేచిన లలిత లేచునేమోయని యట్లే పడుకొని యుండెను. లలిత శరీరోష్ణమునకు శ్రీధరుని శరీరము స్వేదసిక్తమైనది. శ్రీధరుని తనుస్పర్శచే జ్వరముపోయి లలిత శరీరము చెమ్మగిలినది. ఆయిరువురి శరీరములనుండి వెలువడుచున్న ఘర్మసలిలములచే పక్క యంతయు తడిసి ముద్దయగుచున్నది. లలిత శ్రీధరుని విడువదు. శ్రీధరుడు లలితను కాదని లేవడు. వారిపాలిటి కవి జుగుప్సాకరములగు స్వేదకణజాలములు కావేమొ! ప్రేమసుధారస బిందువు లేమొ!

అయిదవ చినుకు

నాలుగుగంటలకు లలితకు మెలకువ వచ్చెను. కన్నులువిచ్చి చూచెను. శ్రీధరుడు పక్కలోనె యుండెను. లలితకు సంతోషమును సంతుష్టియు గలిగెను. అన్నా! మంచి నీళ్లని లలిత యనెను. వట్టిమంచినీళ్లెందుకని మెలిన్సుఫుడ్డు పిండితో కొంచెము జావచేసి తల్లి యిచ్చెను. శ్రీధరుడు దానిని త్రాగించెను. లలితజ్వరము పూర్తిగాపోయి జావ కొంచెము త్రాగుటచే లలితమోము మబ్బు వీడిన జాబిల్లివలె ప్రకాశించి యెల్లర శోకాంధకారముల బోకార్చెను. "అన్నా! ఎత్తుకో"అని లలిత మరల చేతు లందిచ్చెను. వలదనిన వినక లలిత యేడ్వసాగెను. శ్రీధరుడు యెత్తుకొనెను.

"అక్కడకు తీసుకుపో"

"ఎక్కడకు"

లలితకు మాటస్ఫుటము లేదు. మాటాడు శక్తి లేదు. మాటలు తడబడుచున్నవి కాన మాటచెప్పలేక యేడ్చుచు "అక్కడికే" యనెను. శ్రీధరుడు వాకిలిలోనికి తీసికొనిపోయెను.

"కాదు" అని లలిత గీతరాగము పెట్టెను. శ్రీధరుడు మరల వంటయింటిలోనికి తీసికొని వెళ్లెను.

"అబ్బా! కా"దని లలిత యేడ్చెను. "మఱి ఎక్కడకు తీసికొని వెళ్లనమ్మా! చెప్పు"మని శ్రీధరుడు బుజ్జగించి యడిగెను.

"ఆ గదిలోకి"

"ఈసామాను గదిలోనికేనా?"

"ఆఁ"


శ్రీధరుడు లలితను సామాను గది లోనికి తీసికొనివెళ్లెను. లలిత విశేషముజబ్బుగానుండి మారాము చేయుచుండుటచే యేదియోభీతిచే తల్లిదండ్రులు, బామ్మ అవ్వమ్మ మున్నగువా రందఱు శ్రీధరుని తోపాటు లలిత వెంటనే యుండిరి. లలిత యాసామాను గదిలో నొకమూలనున్న కుండవద్ద కందరను తీసికొని వెళ్లెను. ఆమూలనున్న కుండపై లలిత పలక మూతపెట్టబడి యుండెను. లలిత యక్కడ శ్రీధరుని చంకనుండి దిగి దడదడ లాడుచు నిలువబడి యాకుండపై బెట్టిన పలకమూతను రెండు చేతుల దీసి "అన్నా! తీసికో, తిను," అనెను.

"ఏమి టవి?"

"ఇవిగో, చాలావున్నాయి, చూడు. "నావి నే తిన్నాను; నీవి నీ కుంచాను. చూచుకో, నే నెంత మంచిదాన్నో!" అని లలిత మనోహరముగ నవ్వెను.

చంద్రశేఖరముగా రాశ్చర్యముతో నా భాండమునం దేమిగలదో యని చేయిపెట్టి చూడబోయిరి. "అబ్బా! నీకుగాదు. అన్న"కని లలిత తండ్రి నడ్డగించెను. శ్రీధరుడు చేయిపెట్టి తీసెను, ఏమి! ఆశ్చర్యము! పిప్పిరిమెంట్లు; బిస్కట్లు; కలకండముక్కలు జీడిపప్పులు; చిలగడదుంపలు; మరమరాలు; రొట్టెముక్కలు; కొబ్బరిముక్కలు; పకోడీ ముక్కలు; లడ్డుముక్కలు; ద్రాక్షపండ్లు! లెక్కయేమి? ఆహా దానియందున్న వన్నియు చిఱుతిండి వస్తువులే! శ్రీధరు డూరికివెళ్లిన తరువాత తల్లితండ్రులును యితరులును లలిత

కేమేమి తినుబండారములు పెట్టిరో వాని నెల్ల తనప్రేమపాత్రుడగు శ్రీధరునికొఱ కా కుండయందు బెట్టి తనపలకను మూతపెట్టి భద్రముగా లలిత దాచినది. తనకు తినుటకు కొన్ని ఎండినవి, కొన్ని క్రుళ్లినవి, కొన్ని పాసినవి, కొన్ని చీమలచే చూర్ణమైనవి; కాని యే రూపాంతరమందినను యెట్టి దుర్వాయువుల గొట్టుచున్నను, అందలి ప్రతిపదార్థము లలిత



శ్రీధరుని చంకనుండి దిగి దడదడలాడుచు నిలువబడి యాకుండపై........'అన్నా తీసికో, తిను' అనెను.

పెట్టిన పదార్థములలో చేతితో సాధ్యమైన వానిని చేతితోను, పంటితో సాధ్యమైనవానిని పంటితోను, ఈ రెంటికి సాధ్యముకాని వానిని దేనితోనైన చితుకగొట్టియు, సగము చేసి యన్నభాగమని దాచియుంచినది. లలిత జబ్బు గొడవలోఁబడి కొట్టుకొనుటయేకాని యామూలనున్నకుండను చూచినవారెవ్వరు? కాని యింతటివ్యాధిలోఁగూడ లలిత యాకుండనుమఱచిపోకుండ శ్రీధరున కొప్పచెప్పటాశ్చర్యముగదా! లలిత దాచినయావస్తువులలో యపూర్వప్రేమను ప్రకటించుచునే యుండెను.

శ్రీధరుడా పదార్థములను చేతికి తీసికొనగనె వికసితవదనముతో మధురమందహాసముల వెదజల్లుచు లలిత "అన్నా! నీకోసం యెన్ని దాచానో! చూచావా!" యనెను, లలిత తనయందు చూపినయపూర్వప్రేమకు శ్రీధరుడు విభ్రాంతుడైపోయెను. శ్రీధరుడుగూడ లలితను ప్రేమతో జూచుచున్నమాట వాస్తవమే; కాని యింత అపరూపమైనదా, అమూల్యమైనదా, అకల్మషమైనదా, శ్రీధరుని

ప్రేమ? అగుననుటకు శ్రీధరునిహృదయము జంకినది. లలితయడిగిన ప్రశ్నకు పావుగంటకు శ్రీధరుడు "చూచితిని తల్లి"యని లలితను ముద్దుగొనెను.

శ్రీధరునియందు లలిత కింతటిప్రేమ యుండబట్టియే యంతదిగులు! అంతజ్వరము! ఈప్రేమధనమును శ్రీధరున కప్పగించుటకే కాబోలు లలిత జీవములు నిలిచియున్నవి. "శ్రీధరా నీప్రేమధనమును లలిత నీకొప్పగించినది. నాప్రేమ ధనమును నీవు నాకొప్పగించితి" వని చంద్రశేఖరముగా రానందముతో బలికిరి. లలిత కిక జ్వరము రాలేదని చెప్పవలెనా?

వినిర్మలమును, మధురమును, మనోజ్ఞమును, ననిర్వచనీయానంద సంధాయకమును నగు శిశుప్రేమసుధారస మొక చినుకానినను చాలు ఆనందతన్మయతనందుటకు. ప్రపంచమునందలి యేయనంతప్రేమసుధారసములైన శిశుప్రేమసుధామాధురికి సాటియగునే!

లక్ష్మీపతిస్తవము

మోచర్ల రామకృష్ణయ్య గారు, బి. ఏ.,

సవనాద్యుత్తమపుణ్యకర్మరచనాసౌభాగ్యమున్ గల్గియున్
భవదీయాంఘ్రిసరోరుహద్వయి నెదన్ భావింపకున్నన్ జనుల్
వివిధాభీష్టఫలప్రదానసుగుణస్ఫీతంబు, వైకుంఠవై
భవమున్ గాంతురె? నిత్యనిర్మలకృపాపాథోధి! లక్ష్మీపతీ!

మ. దురితధ్వాంతవిభేదనక్షమకళాస్తోకంబు, నీమూర్తివి
స్ఫురణన్ జూపి, కృతార్థజన్మునిగ, నన్ బ్రోవంగదే! త్వత్కృపా
భరమున్ నాయెడఁ బర్వఁ జేసి, బుధసంప్రార్థ్యంబులౌ సద్గుణో
త్కరముల్ నా కొనఁగూర్పుమీ! పతితరక్షాదక్ష! లక్ష్మీపతీ!

శా. స్వామీ! నిన్ భజియింతుసంతతము మత్స్వాంతంబునన్ భక్తి శ్ర
ద్ధామోదంబులు సాంద్రమై తగ; మహోగ్రాంహస్తరంగావళీ
భీమధ్వానవిభిన్నహృత్సరసిజున్, ప్రీతిన్ భవత్పాదచిం
తామాధుర్యము గ్రోల్చి దాసు నిగ, నన్ రక్షింపు లక్ష్మీపతీ!

ప్రేమపరిణామము

సాహిత్యసరస్వతి సిరిపి ఆంజనేయులు గారు

(భారతి రెండవసంపుటము-ఎనిమిదవసంచిక తరువాయి.)

షష్ఠప్రకరణము

జయపురమున సౌధవాటికలలోఁ గలవరము చాల హెచ్చియుండెను. పౌరు లన్నికడల నెడయిడక గుంపులుగుంపులుగఁ గూడి గజగజలు వోవుచుండిరి. పలువురు పలుదెఱఁగులఁ దమవిచారమును బ్రకటించుచుండిరి. బిడ్డలతల్లులు హేమకుమారుని గుణరాజముల నొక్కటొక్కటిగఁ బేర్కొనుచుఁ గన్నసంతుఁ గోల్పోయిన విధమునఁ గన్నుల నీరునిండ శోకించుచు, మహేంద్రనాథుని మేడపైపు వడివడిగ నడచుచుండిరి. శమ మన నదెచ్చటను లేదు. ఎల్లెడల నిరుత్సాహము, విషాదము నిండియుండెను.

ఆహా; ఆ పాపాంతఃకరణుఁ డెంతపని చేసినాఁడు! ఒక మహోత్తమజీవమును దృణములీలఁ బొలియించినాఁడు. దైవనిర్మితమైన యొక యమూల్య సుందరాలంకారమును త్రుటిలో వికల మొనర్చినాఁడు. దాని రూపనామక్రియల నీ ప్రపంచసౌధమునుండి మాయము చేసినాఁడు. హేమకుమారుఁ డనుపమప్రతిభాశాలి. పరోపకారపారీణుఁడు. మీఁదు మిక్కిలి దయావంతుఁడు. జయపురమునకు దేహము. పౌరమండలికిఁ బ్రాణము. ఆ యుత్కృష్టజీవ మీ భౌతికలోకమును వీడిపోయినది. అయ్యో! జీవరహితమైన దేహ మేమి చేయఁగలదు?

హేమకుమారుఁ డెందఱియెడల సమగౌరవోద్దేశముననే మెలఁగుచుండువాఁడు ఆతఁ డింతవఱకు నెట్టి యల్పజీవినైన నలక్ష్యభావమునఁ జూచియుండలేదు. ఎవ్వరి విషయమున నెట్టివంటి యహితమును దలపోసి యెఱుఁగఁడు. ఆతనిమానస మన్నదో పులుఁగడిగిన ముత్తె మట్టిది. ఆ పవిత్రుని యెడల నెవని కలుషహృదయ మింతటి ద్రోహచింతనమునకు గురియైయుండును? ఎవ్వని ప్రహారహస్త మీ ఘాతుకకర్మము నొనర్చియుండును? ఏ పాషండుని మలినబుద్ధి మీ ఘోరవ్యాపారమునకుఁ గారణమైయుండును? జానపదుల కిది బోధపడలేదు. ఆ విషయమునుగూర్చి యనేకు లనేకవిధముల వితర్కింపఁ జొచ్చిరి. హేమకుమారునిహత్యకు సురేంద్రకుమారుఁడే హేతువనుట బహుజనాభిప్రాయము.

సురేంద్రకుమారుఁడు హేమకుమారుని జ్ఞాతియని మాత్రము వెనుకఁ దెల్పియుంటిమి. శైశవప్రాయముననే యాతని జననీజనకులు కాలప్రవాహమునఁ బడిపోయిరి. అట్టితఱి దేవేంద్రనాథుఁడే యా బాలకునిఁ జేరఁదీసి, పోషించి, యుద్వాహము చేసెను. అనంతరము సురేంద్రుఁడు భార్యకు వశుఁడై యామె యిచ్ఛానుసారముగ వర్తించి, దేవేంద్రనాథున కెదురొడ్డి మాటలాడెను. వెంటనే దేవేంద్రనాథుఁడు సురేంద్రుని భాగధనము నాతనివశము చేసి, యా కుటుంబమును బ్రత్యేకముగ నుంచెను. నాఁటఁగోలె సురేంద్రుఁడు భోగైకతత్పరుఁడై యందుల కనువగు మార్గమునఁ బిత్రార్జితధనమును యథేష్టముగా వ్యయముచేయ దొరఁకొనెను. అంతియకాక సురేంద్రుఁ డతిచారులను జూదరులను ద్రాగుఁబోతులను జేరఁదీసి, విత్తము క్షయమార్గమున వెడల నడుపుచుండెను.

దుర్వ్యయపరున కేది నిలుచును? ఎంతటి మహాత్తరభాగ్యమైన నాతని కేమాత్రము? మహామేరువు సహిత మాచంచలచిత్తుని కరతలమున, నొక పరమాణువువోలె జాఱిపోఁగలదు. సురేంద్రుని యైశ్వర్యము విషయవాంఛలలోను, విలాసవైభవాదులలోను, జూదరుల హస్త

లాఘవములలోను, పానప్రియుల వాచావిడంబనమునను, జారవనితల మోహజాలమునను దగులుకొని, యచిరకాలముననే యంతరించెను. ఇట్లు తనసంపదయంతయు విఱిగి పోయినందున నాతని కావంతయేని విచారము కలుగ లేదు; కాని దేవేంద్రనాథుని సరిపెరుగుట నాతఁడు చూడఁజాలక, మిక్కిలి క్రుంగిపోయెను. క్రమక్రమముగ మాత్సర్యమును హెచ్చెను.

దేవేంద్రనాథునకుఁ గుమారుఁ డొక్కఁడే. ఏ హేతువునకైన నా బాలున కహితము గావించినచో, నిఁక దేవేంద్రనాథుని యైశ్వర్యధామమున కన్యుఁడు నాయకుఁడు కాఁజాలఁడు. ఇది సురేంద్రుని యభిమతము. ఇట్లు తలపోసి యందులకై యనేకతంత్రములఁ బన్నెను. ఆతని ప్రయత్నములలో నొక్కటియు ఫలింప లేదు. మనోరథమును సిద్ధింపలేదు. తనకృషి నిష్ప్రయోగ మగుటయ కాక, సల్పిన వ్యవహారమంతయు బయల్పడుటచే, నాతఁడు పరాభూతుఁడై యటనుండి భార్యతో నెచ్చటికో పాఱిపోయెను. అనంతర మాతనియునికియే తెలియరాలేదు.

గత ప్రకరణమునందలి క్రూరకార్యము నడచిన నాఁటి సాయంకాలసమయమున, రామదేవవర్మ తనగృహమున నాతనిమిత్రుఁ డగు సోమదత్తునితో నీక్రిందిసంభాషణము నెఱపెను.

రామ—అట్టి ప్రాణప్రియుఁడగు నెయ్యుని మన మిఁకఁ జూడలేము. అయ్యో! తనువులు వేఱైనను మనకందఱకుఁ బ్రాణ మొక్కటియే కదా? హేమకుమారుని పాలి కాదౌర్భాగ్యుఁడే చిచ్చుఱ పిడుగయ్యెనని నీవు చెప్పుచుంటివా?

సోమ—ఔను. ఆ నృశంసుఁడే యింతటికర్కశకర్మము నొనర్చినాఁడు. దైవాజ్ఞ నతిక్రమించి యిట్టి ఘోర పాపాచరణ మొనరించిన యా పాషండుఁడు మనకు లభించు టెట్లు?

రామ—అనేకు లాతనిఁగూర్చియే సంశయించుచున్నారు; కాని నాకు నమ్మకము లేదు. సురేంద్రుఁ డిఁకను జీవించియుండఁడు.

సోమ—జీవించియేయున్నాఁడు. నిశ్చయముగ సురేంద్రుఁడు మరణింపలేదు.

రామ—నాఁడు మనచే నియోగింపఁబడిన గూఢచారులంతటను వెదకి, యాతనిఁ గానక తిరిగివచ్చిరి కదా? ప్రాణములతో నుండిన సురేంద్రుఁ డొక్కరికైన నగుపడక యెట్లు తప్పిపోయియుండును?

సోమ—ఆతఁడు వేషధారియయి వెదుకఁబోయినవారి కన్నులఁ గప్పుచున్నాఁడు.

రామ—అట్లు పరిభ్రమించునంతటి ప్రాణాపాయదశ సురేంద్రున కేమి వాటిల్లినది?

సోమ—ఆతనిదీక్ష యొక్కటియె. అది తీఱునందాఁక నాతఁ డావృత్తినుండి విడివడఁడు. చూడుఁడు; ఇఁకఁ గొంతకాలమున కాతఁడు తనంతనే దర్శన మీయఁగలఁడు?

రామ—నేఁటి మధ్యాహ్నమున నేను హేమకుమారుని సందర్శింపఁబోయి యాతనితో సంభాషించుచుండఁగా, నొక పురుషుఁడు మేమున్న మందిరమునకు వచ్చెను. ఆతనిరూప మేవిధమునను సురేంద్రుని యాకృతినిఁ బోలియుండలేదు.

సోమ—ఏలాగైనను మన మాతనిఁ గనుఁగొను విషయమున దృఢతరప్రయత్నమే చేయవలయును. శక్తిసంపన్నులగు జంఘాలుర నెల్లకడలకుఁ బంపి, యాహంతకునిబట్టి తెప్పింపవలెను.

రామ—నే నింతవఱకే పలువురను బలుతావులకుఁ బంపినాఁడను. రహస్యస్థానముల సంశోధింపఁ గొందఱ ననిచితిని. పోయినవారు మాయమర్మములఁ జతురు లగుట నెట్లైన నాధర్మఘాతకుని గొనితేకమానరు.

సోమ—చారులు పూనికతోఁ దమ పరిశ్రమను సార్థకము చేసికొని రావలసియున్నది. దేవేంద్రనాథుఁడు పురిఁ జేరునప్పటికి మనమా రాక్షసుని శల్యఖండముకైన మిగుల నీయరాదు. నేఁటితిథి?

రామ—అమావాస్య.

సోమ—ఐనచో దేవేంద్రనాథుఁడు రెండుదినములకుఁ గాని బయలుదేఱఁ డనుట ధ్రువమైనది. చీఁకటిలోఁ ద్రోవతెలియక కష్టపడెడు నా కిరాతకునిఁ బట్టి తెచ్చుట కీనిశాసమయము మిక్కిలియనువుగ నున్నది.

సప్తమప్రకరణము

ఛిన్నోఽపి రోహతి తరుః; క్షీణోఽప్యుపచీయతే పునశ్చన్ద్రః,
ఇతి విమృశన్తః సన్తః సన్తప్యన్తే నవిప్లుతా లోకే
— భర్తృహరి.

ఆ యమావాస్యరాత్రి స్వభావసిద్ధముగఁ గాఱుచీఁకటులు లంతటను వ్యాపించియుండెను. అందులకుఁ దోడు జలదసంచయ మాకసమునం దన్నియెడల నిబిడముగ నావరించి యుండెను. ఇది హేతువుగఁ జిక్కని తమస్సార మన్నికడలఁ జిమ్మరేఁగఁ గ్రుమ్మరించినపోల్కి నుండెను. విద్యుల్లతావితానము లాకస్మికముగ నందందుఁ బొడకట్టుచు, క్షణక్షణము నదృశ్యము లగుచుండెను. దిశలు మాఱ్మ్రోఁగఁ గాదంబినీముఖాంతరాళముల నుండి భయంకర స్తనితము లతిదారుణముగ, శ్రవణపుటవిదారణముగ, బయల్వెడలుచుండెను. ఒక్కొకతఱి ఘాతుకవన సత్త్వముల భీషణగర్జన లామేఘనిర్ఘోషములలో నైక్య మొందుచుఁ, బ్రాణివర్గమున కాతమస్వినీసమయము ప్రళయకాలముగఁదోపింపఁజాలియుండెను. చేతనాచేతన ప్రకృతియెల్ల, నా గాఢాంధకార గర్భమున నణఁగి యుండెను.

అట్టి భయానక కాళనిశీథినీసమయమున నొక పురుషుఁ డడవులఁబడి వారువముతీరునఁ బరుగిడుచుండెను. ఆతఁ డెందుండి బయలుదేఱెనో, యెచ్చటికి కరుగుచుండెనో, గమ్యస్థాన మతని కెద్దియో, యా పురుషునకే గ్రాహ్యమైయుండదు.

ఆ పాంథున కొక్కపథము లేదు; నిరూపకమగు నొక్కమార్గమును లేదు. మిట్టయనక పల్లమనక వనగిరిప్రాయ విషమప్రదేశములఁ జిక్కినదారి నేగుచు, భీష్మతమంబగు నా నిబిడతిమిరావరణమధ్యమున నెల్లయెడలఁ గ్రుమ్మరుచు, నమ్మనుజుఁ డొక్కచోఁ దటాలున నివ్వెఱపడి నిలిచెను.

ఆ మానవుని యద్భుతగమనవేగము నట్లవరోధించిన దెవరు? అమ్మహాశక్తి యేదియైయుండును? అది యొకానొక యపూర్వవ్యక్తి. హఠాత్తుగ నెదురైన యామూర్తి తెరువరినిబట్టి యాఁపెను. వ్యక్తిస్వరూపము మాత్ర మా మానవునకు వ్యక్తము కాలేదు.

ఆ వివిక్తప్రదేశమున, సాంద్రజీమూతపరివ్యాప్తమగు నా భైరవారణ్యమున, ఆదుర్దినము, అట్టి దుస్సమయమున, ఈ యపూర్వప్రదర్శన మాపురుషుని నిర్విణ్ణునిఁ జేసివైచెను. తత్క్షణమే యాతఁ డపూర్వముఖుఁడై, వికృతస్వరమునఁ గఠోరముగ నఱచెను.

"దిగులుపడవలదు. నా కభిముఖుఁడగు మానవుఁ డెట్టియాపదయుఁ బొరయరాదు. ఈ ఘోరకాంతార మధ్యమున దారితెలియక కిక్కిరల పరిభ్రమించెదవు? ఇది నీకు శ్రేయస్కరము గాదు. నీవిఁకఁ గొన్ని నిమిషములైన నిందే ప్రవర్తించుచున్నచో, నిందలి ఘాతుక వన్యమృగోపద్రవమునుండి తొలఁగి చననేరవు. ఇట్టితఱి క్షేమకరమార్గ మవలంబించుట నీకు యుక్తము; కనుక నను వెంబడింపుము." అని మృదుమధురముగఁ బల్కుచుఁ దనసాధుస్వభావమును వెల్లడించెను. తదుపరి పాంథుని మౌనభావమును గమనించి, యావ్యక్తి ముందునడిచెను. వెనుకంజ వేయఁజాలక, తొలఁగిపోవ నుపాయాంతరము గానక, నిశ్శబ్దముగ నమ్మనుష్యుఁ డావ్యక్తిని వెంబడించెను. ఇక్లెంతదవ్వు త్రోవసాగినదో తెలియదు. కొండొక కాలమునకు వా రొకానొక జనపదము చేరిరి.

పురప్రవేశము చేసి, యావ్యక్తి యున్నతప్రాకార వేష్టితమగు నొకవిశాలభవనముఁ జొచ్చెను. దానితోఁ బురుషుఁడు సహితమనుగమించెను. ఆమూర్తి యాతని నొకగదిలోనికిఁ గొనిపోయి, "నీవిందే వసింపుము. నేను గొన్నిక్షణములలో నీకుఁ దోడిచ్చిపంపెదను." అని యాజ్ఞాపించెను. పురుషుఁ డావాక్యముల నంగీకరించిన మాడ్కి మాఱాడక యం దొక్కచోఁ గూరుచుండెను. వ్యక్తియు నచ్చటనుండి బయలుదేఱి బహిర్ద్వారములను బంధించి వెళ్లెను.

కొంతవడికి గృహప్రాకారకవాటముల నెవ్వరో త్రోసినట్లు లయ్యెను. లోననున్న పురుషునిగుండె జల్లుమనెను. ఆతఁ డచ్చటనుండి పాఱిపోవఁ బ్రయత్నించెను; కాని భయాతిరేకమున నాతని యంగములు పట్టుసడలి యవశములై యుండెను. వామహస్తమున నొకదివ్వెయుఁ గుడిచేత నాహారపాత్రముల దొంతరయుఁబట్టి, యున్నతకాయుఁ డొక్కఁ డాపాంథుని మ్రోలఁ బ్రసన్నవదనమున సాక్షాత్కరించెను.

"నీకై వాహన మాయత్తపఱుపఁబడినది, నాయనా! నీవీయాహారము భుజించి ప్రయాణసంసిద్ధుఁడవు కమ్ము" అని పలుకుచు, నాయాగంతుకుఁడు తానుదెచ్చిన భోజనపాత్రములదొంతి నాయధ్వగున కొసఁగెను. భయవిస్మయములు పెనఁగొనఁ బథికుఁ డద్దాని నందికొని, భీతిసంచలితచేతస్కుఁ డగుటం జేసి, యుపాహారమున నొక్కింత చవిచూచి, గమనోన్ముఖుం డయ్యెను. ఉన్నతమూర్తి పాంథున కభిముఖుండై యాతని కంపితహస్తమును దన దక్షిణకరమునఁబట్టి, యిట్లనెను.

"నాయనుంగుమిత్రుఁడా! నీ వెవ్వఁడవైనను నా కాత్మీయసోదరుఁడవె. నిన్నుఁగూర్చి విశేషము లరయఁ గోరుట నామతము కాదు. ప్రకృత విషమదశయం దొక్కక్షణమైనఁ గ్రొత్తవార లిందుఁ దడయుట ప్రమాదకారణ మగును. నేఁడీయూర నొకభయంకరసంఘటనము సంభవించినది. జలమునకు రసమువలెను, జ్వలనమునకుఁ గాంతివలెను, నెవ్వఁడీపట్టణమునకుఁ బ్రాణసదృశుఁడుగ నుండి యానందదాతయని పేర్వడసెనో, నక్షత్రమండలమున విరాజిల్లు శీతమయూఖునిచందమున నేపురుషుఁడు పౌరులకుఁ దిలకప్రాయుఁడై పాయనిబంధువై యుండెనో, ఎవ్వఁడు నిర్మలకర్మయోగసాధనాన్వితుఁ డగుచు ధర్మమార్గాంచితులకెల్ల ధర్మమూర్తియై వెలింగెనో, ఎల్లవేళలఁ దనవాగమృతవృష్టిచే మిత్రమండలిని దనియించుచుఁ గ్రోధమన నెట్టిదో యెఱుంగక యెవ్వాఁడు శాంత్యైకతత్పరుఁడని విలసిల్లెనో, పారలౌకిక మెవ్వానిప్రాపు మహామేరు నట్లు తలంచి దానిఁ గాంక్షించియుండెనో, ఏకరుణాప్రియుఁ డతిథిదేవతల కాత్మసమర్పణం బైనఁ జేయ సంసిద్ధుఁడైయుండెనో, ఆదయానందదాత, ఆధర్మమూర్తి, ఆశాంత్యైకతత్పరుఁడు, ఆయతిథిపూజాధురంధరుఁడు, ఆహేమకుమారరత్నము, నేఁడొక్క యాత్మీయబాంధవుని నిశితాసికిఁ దనయుష్ణశోణితమును గ్రుమ్మరించి, యైహికవాంఛలనుండి విరమించి, పరమాత్మ కాత్మసమర్పణముం బొనరించెను. స్వీయజీవితానంతరము ప్రజాపక్షమునఁ దనసర్వాభిమతముల నేకపుత్త్రుఁ డొక్కరుండ నెఱవేర్ప సమర్థుండనియెంచి, యెవఁడు నిర్విచారపరుఁడై యుండెనో, ఆ యభాగ్యజనకుఁడగు దేవేంద్రుఁడే తన యతిథిదేవున కిట్టి యనిష్టదాయకవార్తచే విచారముఁ గూర్చుచున్నందులకు, తండ్రీ! కరుణించి క్షమింపుము."

శాంతిస్వభావ ముట్టిపడునట్లు, అమృతధార లొలుకునట్లు, హృదయము కరఁగునట్లు, మృదులముగ, మధురముగ, కరుణారసభరితముగ నట్లు పలికిన యా ప్రశాంతహృదయుఁడే, ఆయున్నతమూర్తియే, ఆదివ్యవ్యక్తియే, హేమకుమారుని పితృదేవుఁడగు దేవేంద్రనాథుఁడని యాయధ్వగుఁడు గ్రహింపఁగల్గెను. ఈ సందర్భమునఁ బాంథునకుఁ దెలియకయే, దేవేంద్రనాథుని నయనయుగళి నుండి, యాకస్మికముగ వేఁడిబాష్పకణము లొకటిరెండు పథికుని కరతలమున నురలెను. ఆపలుకులలో నెట్టి శక్తి యుండెనో, ఆ యుష్ణాంబుశీకరముల నేమి మాహాత్మ్య మావిర్భవించెనో మనకుఁ దెలియదు; కాని తత్క్షణమే పాంథుని రక్తవాహినులలోని రుధిర మత్యంత తీవ్రగతిఁ బ్రచలిత మయ్యెను. ఆతనివదనబింబమున దైన్యవిచారమేఘ మావృత మయ్యెను. ఆ దీనుని మలినాపాంగకుహరయుగ్మమునుండి స్రవించు నుష్ణాశ్రుధారలు, ఆతని భావజలధినిఁ గాచుచున్న చండతరదావాగ్నికిఁ బ్రబలాదర్శ మయియుండెను. ఆ సందర్భమందలి యాతని మనస్స్థితిని గూర్చి యథావిధమున వర్ణింపఁజాలము. తన వృజినకర్మముఁ దలపోయు కొలఁదిని గాఁబోలు, నా పురుషుఁడు నిలువునఁ గంపించిపోవుచుండెను.


ఏ హేతువుననో హఠాత్తుగ నాపురుషుని యశ్రుధారాప్రవాహ మాఁగిపోయెను. ఆతని ముఖబింబమునందలి నీలమేఘావరణము తనంతఁ దొలఁగిపోయెను. దైన్యము, భయము, నందుండి యదృశ్య మయ్యెను. దినావసానసమయ పశ్చిమాకాశముంబోలె, నాతని వదనమండలము రుధిరవర్ణసమాకీర్ణ మయ్యెను. ఆ యధ్వగుఁడు స్థాణువువోలె నిలిచి, దేవేంద్రనాథునివంక నిశ్చలదృష్టి నీక్షించుచున్నట్టే, యా పురుషుని దక్షిణకరము వామపార్శ్వకటిప్రదేశమును దడవుచు, నందు చర్మనలగ్నబంధమునఁ గల యొఱనుండి, శాతకృపాణమును బైకిలాగెను. పథికుఁడు దేవేంద్రనాథున కద్దానిని జూపుచు నిట్లనెను.

"ఓ కృపామయమూర్తీ! ఇదిగో! ఈ శోణితఖడ్గముఁ గొని యీ క్షణమ దురంత దురితకర్ముఁడ నగు నన్నున్మూలింపుఁడు. మీ రింతవఱకు నే లోకహితైక



౫. 969. దట్టీ. బంగారురేకులపై నగిషీపనిగలది. అంచులలో బుటాలు-రత్నములు చెక్కబడినవి. 1484-5 లో బర్మాదేశమున రంగూనులో నొకదేవాలయముయొక్క భూమికలో (Levelling) దొరకినది; 970-971. దుద్దులు; బర్మాదేశపుస్త్రీలు కమ్మలవలె చెవికి వేసికొనునవి. ఒకవిధమయిన పచ్చతో చేయబడినవి; 972. కొక్కెములు, పూసలు కలిపికట్టిన ఏడుపేరులుగల బర్మాదేశపుదండ; 973. బర్మాదేశపు అపరంజిదట్టీ. బుటాలు చెక్కబడియున్నవి. బంగారు పూసలు, ముత్తెములు మొదలయినవానితో చేయబడిన జాలరుగలది; 974. బేయతుదేశపుకంఠాభరణము. గులాబీవంటి అపరంజిపూలు, చంద్రవంకలు, పదకములు మొదలయినవి గొలుసుతో కూర్పబడినవి.

చిత్రము ౬



౬. 975. దట్టీ. గౌరవసూచకమయినది. సానపట్టని కెంపులతో కట్టిన పుష్పములు బంగారు అల్లిక తీగలతో కూర్చబడినవి. బర్మాదేశమునందలి 'ఆవా' రాజుకు సంబంధించినది; 976. గట్టి బంగారుమురుగు. మూడు వరుసలు కెంపులు చెక్కబడినవి. 'ఆవా' పట్టణము, బర్మాదేశము; 977. బర్మాదేశపు బంగారపుకమ్మలు. సాధారకము. 16 వజ్రములతో చెక్కబడినది; 978. బంగారుకమ్మ; మంచిపోగరపని గలది; 979. బంగారుచుట్లతో రేకు తుండ్లతో తయారుచేసి 9 కెంపులు చెక్కబడినమిద్దె ఉంగరము. ఇవి బర్మారాజగృహమునకు సంబంధించినవి.

పరాయణునిఁ గూర్చి సెలవిచ్చితిరో, యా దివ్యదయాధౌరేయుని, ఆ నవకోమలమృదుశరీరుని, ఆ పరమపూజ్యుని, జంపిన దుష్టుఁడను, నిష్ఠురుఁడను, కడు నికృష్టుఁడను, నేనే; నిస్సంశయముగ నేనే. అట్టి పాషండుని, కలుషకర్ముని, నన్ను ఇఁక నొక్కత్రుటికాలమైనఁ బ్రాణములతో వదలవలదు. ఆహా! నా యొనర్చిన మహాపరాధమునకు, ఘోరకల్మష కర్మమునకు, నీ భౌతికప్రపంచమున నిష్కృతిగలదా? ఓ మహాత్మా! ఈ నృశంసుని యంగముల వేర్వేఱ ఖండఖండములుగ నొనర్చి, చిత్రవధ గావించి, ప్రపంచభారముఁ దీర్పుఁడు. అయ్యో! నే నింతకును దగనా? నా కట్టిభాగ్యమును లేదా? నా పాపమునకదియుఁ బ్రాయశ్చిత్తము కాఁజాలదా?"

ఉన్మత్తునిగతి నిట్లు పలువరించుచు, నా పాంథుఁడు, ఆ రుద్రదత్తుఁడు (ఆతఁడు రుద్రదత్తుఁడే) వక్షమును జీల్చుకొని ప్రాణత్యాగ మొనరింపఁ దనకరవాలమును బైకెత్తి, ఱొమ్మునఁ గ్రుచ్చుకొనఁ దివిరెను. దేవేంద్రనాథుఁడు విస్మయవ్యాకులితాంతరంగుఁడై రుద్రదత్తుఁ డెత్తిన కరమునుబట్టి, "ఆఁగు మాఁగుము. వత్సా! ఇట్టి భయంకరవ్యాపారమునకు సాహసింపవలదు. సల్పినది ఁ కృత్యమని తలఁచి నీ వనుతప్తచిత్తుఁడవైతివి; అంతియ చాలును. నేను నా కుమారుఁడు బ్రతికియున్నట్లెంతును. ఆతని ప్రతిబింబమును నీ నిర్మలమనోదర్పణమునఁ జూచి యానందింపఁగలను. అట్టి యాశాకిరణ మిప్పుడు నా శూన్యహృదయాంతరాళమునఁ బొడచూపుచున్నది. పుత్త్రికా! నీ విఁకను దడవు సేయవలదు. వాయువేగమున నినుఁగొనిపోవఁగల వారువము బహిర్ద్వారమున నీకై నిరీక్షించి యున్నది. నీవు దాని నారోహించి యీ రాత్రియే బహుదూరము పొమ్ము" అనెను.

రుద్రదత్తుఁడు మనోవిప్లవముచే రోదనము సేయుచు, పరీతాపభరమున దేవేంద్రనాథుని చరణములపై వ్రాలి, "ఓ దేవా! పరమకరుణాస్వభావా! ఈక్రూరకిరాతకుఁడు, ఈ వజ్రకఠోరహృదయుఁడు, ఇమ్మహాదస్యుఁడు, ఈ మానవాంతకుఁడు క్షమాపణార్హుఁడేనా?" యనెను. దేవేంద్రనాథుఁ డాతనిఁ దనహస్తయుగళములఁబట్టియెత్తి, "కుమారా! నీ యపరాధములు క్షమింపఁబడినవి. ఆ దయాసముద్రుఁడు, ఆ యభయప్రదాత, ఆ జగద్రక్షకుఁడు, నీ హృదయశోధనముఁ గావించిన యాసర్వాంతర్యామి, నిన్నాశీర్వదించెను; కనుక నీ విందుండి సౌఖ్యముగ మరలిపోవుటయే నాకుఁ బ్రథమప్రయోజనము." అని సాదరపూర్వకముగఁ బలికెను.

రుద్రదత్తుఁడు మఱిమాటాడలేదు. తనకలుషకర్మ మొక్కవిధమునఁ దన్ను గ్రసించుచుండ, నాతఁ డత్యంతఁ బరీభూతాంతరంగుఁడై, ఖిన్నుఁడై, మిగుల వినీతభావమునఁ బ్రాంగణమువఱకు నిర్గమించెను. పిమ్మట విచారపూరితస్వాంతమున నాతఁడు దేవేంద్రనాథుని వంకఁ జూడ్కిసారించి, శిరమువంచి, యాత్మాభివందన మాచరించి యశ్వారోహణ మొనరించెను. వెంటనే యాశ్వికుని హస్తసంజ్ఞ నెఱింగిన యాభద్రవినీతము శరవేగమునఁ బరుగువాఱి, యా చిమ్మచీఁకటిలో నదృశ్య మయ్యెను. ఆ భయంకర నిశీథమున, నా దారుణాంధతమస మధ్యమున నా తురంగరాజ మెందేగెనో దేవేంద్రనాథునకుఁ దెలియలేదు.

అష్టమ ప్రకరణము

నిరంతర మతిథిపూజలచేఁ దనరారుచుండెడు దేవేంద్రనాథుని నిశాంతరాజ మెంతయును గాంతిఁదక్కి, మిగులఁ జిన్నవోయి యుండెను. నేఁ డేయతిథియు నా మందిరమును దనపాదరజోలేశమునఁ బావన మొనరించుచుండలేదు. వారి సత్కారప్రాప్తిఁ గోరి పరిచారకగణము ద్వారపార్శ్వముల వేచియుండలేదు. మహనీయు లగు నా యతిథిజనుల చరణపద్మములను స్పృశించు భాగ్యమునకై గృహకాంతలు నిరీక్షించియుండలేదు. ఆహర్మ్యమున మనుష్యసంచారమే లేదు. అద్యది యొకానొక నిర్జనకాంతారమువోలె భయంకరముగఁ జూపట్టుచుండెను. సముజ్జ్వలకాంతుల నీనెడు దీపశిఖలు నేఁ డపూజితములై విన్నఁదనమున మినుకుమినుక్కు మని మెఱయుచుండెను.

అట్లు రుద్రదత్తుని వీడ్కొల్పి, నిరపాయముగ నాతని స్వస్థలముఁ జేర్పఁ బరమాత్మను బ్రార్థించుచు దేవేంద్రనాథుఁ డచ్చోటువాసి, యిలుచేరెను. ఆతఁ డంపలి క్రిందియఱను గడచి మీఁదియంతస్థునకుఁ బోయి, యందలి ప్రత్యేకగృహముఁ జొచ్చెను. గది మధ్యమునఁ జిన్ననిదివ్వె యొకటి వెలుఁగుచుండెను. దాని పార్శ్వ

భాగమున హేమకుమారుని రక్తమయకళేబరము పడియుండెను. అంబికాదేవి దుఃఖవిశీర్ణహృదయయై ప్రియతనూజుని మృదుగాత్రమున నొఱగియుండెను. కొందఱు పురంధ్రులు, పరిచారికలు చుట్టుమూగి, దురంత దుఃఖసాగరమున మునిఁగియుండిరి. గది యెంతయు నిశ్శబ్దముగ నుండెను.

దేవేంద్రనాథుఁ డాభయానకదృశ్యమును జూచుచుఁ జూచుచు స్థాణువువోలె నిలుచుండి, యట్లే కనులు వాల్చి, యచలధ్యానసమాధిం జెందెను. పిమ్మటఁ గొంతొకతడవున కాతఁ డున్మీలితనయనుఁడై ముందునకు దృష్టిసారించెను. తత్క్షణ మాతనివదన మండలమున వికాసమంకురించెను. నేత్రయుగ్మములు ప్రదీప్తము లయ్యెను. ఉన్నట్టుండి తన దృక్పథమున సాక్షాత్కరించిన మహనీయుఁడు శివానందయోగి యని గ్రహించి, దేవేంద్రనాథుఁ డాదివ్యమూర్తికి సాష్టాంగదండప్రణామము లాచరించి, యోగిపుంగవుని చరణయుగళి నానందసలిలధారలచేఁ బరిషేచనముఁ గావించెను.

శివానందయోగి ప్రశాంతమనస్కుఁడై, దేవేంద్రనాథునిఁ దనహస్తమునఁ బట్టియెత్తి, "ప్రియభక్తుఁడా! శత్రువులకు మిత్రుఁడవగు నీకుఁ గష్టపరంపరలు పైకొనుట యస్వాభావికము కాదు. అట్టిచో నిన్నుఁబోలు పురుషవరేణ్యు లెట్టి భావాంతరములను బొందరు. దుఃఖమును దుఃఖముగాఁ జూచుట కొందఱికి మతమగును. సంసారసాగరమునఁ బతితులై, దరిగానకున్నవారి కిది సహజధర్మమే. నీలక్షణ మదికాదు. నీవు దుఃఖస్వరూపము నానందభావమునఁ బూజింతువు. జీవితమహార్ణవమధ్యమున, సుఖదుఃఖతరంగసందోహమున నీస్థిరహృదయ మెట్టి సంచలనమును బరిణామమును బొందుచుండుట లేదు. కనుకనే యేవిపత్తును నినుఁ గారియవెట్ట నోడుచున్నది. నీయట్టి దృఢసంకల్పునకు, అచంచలస్వాంతునకు సంసారమొక్క యల్పకాసారమే కాని మహాసాగరము మాత్రము కాఁజాలదు. వత్సా! నీవు రాజయోగివి. పరమపిత యగు నీశ్వరుఁడు నీ మహత్తరయోగరహస్యము నెఱిఁగి, పరితృప్తుఁ డయ్యెను. నీసుతుఁ డన్ననో వినిర్మల ధర్మకర్మనిరతుఁడు. అట్టి సుగుణనిధి నెవర్కొనెడు దుస్సహాభీలశైలపఙ్క్తులు, అప్రేష్యతూలికాసహస్రమునుంబోలె తేలిపోఁగలవు. కుమారా! పుత్త్రవియోగవ్యథ నీకులేదు. నీ మానస మట్టి విచారలేశమునకు నెడమీయలేదు; కాని యీ హేమకుమారుని లోకసేవ యొక్కటియె నీకాంక్షితార్థ మయియున్నది. నీయాశయ ముదారగుణసమన్వితమైనది. దానికిఁ బ్రతిహతిలేదు. నీతనయుఁడు మూర్ఛావస్థనుండి తొలఁగి యెప్పటిదశను బొంది, నీ సదుద్యమబీజముల నీప్రపంచమున సహస్రముఖముల నెదచల్లుటకు సమర్థుఁ డగును" ఇట్లు సెలవిచ్చి శివానందయోగి యంతర్ధానుఁ డయ్యెను.

ఆపన్నగ్రస్తుఁడై, యంతర్మనస్కుఁడై మూర్ఛనొంది, నిశ్చేష్టితుఁడై పడియున్న హేమకుమారుఁడు, కొంతవడి కించుక చలించి, బాధ సూచించెను. శివానందయోగి సెలవిచ్చినట్లు హేమకుమారుఁడు మృతినొందియుండలేదు. రుద్రదత్తునిఖడ్గము హేమకుమారుని విగతజీవునిగ నొనర్చియుండలేదు. దేవేంద్రనాథుఁ డాత్మజుని సమీపించి, కూరుమండి గాయమునుజూచి, యది ప్రాణాపాయకరము కాఁజాలదని గ్రహించెను. ఆ యపూర్వప్రదర్శన మచ్చటి జనసముదాయము నద్భుతప్రమోదజలనిధిం దేల్చెను.

దేవేంద్రనాథుఁడు శస్త్రచికిత్సయం దెంతయుఁ గుశలుఁ డగుటచే, నత్యంతావధానముతో మిగుల నైపుణ్యముగఁ గుమారున కుచితచికిత్సల నొనర్పసాగెను.

నవమప్రకరణము

అచిరకాలముననే హేమకుమారుని వ్రణము మానెను. ఆతని దౌర్బల్యమును గ్రమక్రమముగ క్షీణించెను. బలవృద్ధికరము లగు నాహారపదార్థములను భుజించుచున్నందున నతఁ డత్యంత శీఘ్రకాలములో, యథావిధమునఁ బుష్టశరీరుఁ డయ్యెను.

హేమకుమారుఁడు పరిపూర్ణారోగ్యవంతుఁ డగుటచే నాతనివివాహమున కుచిత ప్రయత్నములఁ గావించుట దేవేంద్రనాథునకుఁ దప్పనిసరి యయ్యెను. యోగ్యుఁడగు వరుఁడు లభించునేని కాత్యాయనీకుమారికిఁగూడ నుద్వాహ మొనర్చుటకు, దేవేంద్రనాథుఁడు కృతనిశ్చయుఁ డయ్యెను. హేమకుమారున కింకను వధువు నిర్ణయింపఁబడలేదు. దేవేంద్రనాథుఁ డింతకుఁ బూర్వము, గ్రామాం

తరసంచారము పూనియున్న సంసర్గమున, నందుకొఱకై పెక్కుచోట్లు తిరిగెను. కుమారున కనుకూలవతి యగు వధువును, కాత్యాయిని కోరదగిన వరుఁడును దేవేంద్ర నాథున కెందును గోచరింపలేదు. ఉమేశచంద్రుని కుమారీ రత్న మొకర్తుకమాత్ర మాతని యభిమతముల కెంతయును దగియుండెను.

ఉమేశచంద్రుఁడు శ్యామపురవాసుఁడు. ఆతని కోశాగారము రత్ననిధానము కాదు. ఆతఁ డాగర్భదరిద్రుఁడే; కాని యాసుచారిత్రుని దివ్యమానసము మాత్రము విమలగుణరత్నాకరము. ఉమేశచంద్రున కొక్కసూనుఁడు నొక్కసుతయును గలరు. సుత 'ప్రేమపూర్ణ.' ఆ కరుణామయి నిశ్చయముగఁ బ్రేమపూర్ణయే. ఆ కన్యకామణికి రూపమును విద్యయు శీలమును స్వతస్సిద్ధముగ నమరియుండెను. కాని యామె నెవ్వఁడును బెండ్లియాడ సాహసింపలేదు. ఇందులకుఁ గారణ ముమేశచంద్రుని దారిద్ర్యమే.

దిగంతవిశ్రాంతయశోవంతుఁ డగు దేవేంద్రనాథుఁడు తన పర్యటనసమయమున నొకనాఁడు తలఁపని తలంపుగ నుమేశచంద్రుని గృహమున బసచేసెను. ఉమేశుని యాతిథ్యమును బ్రీతిపూర్వకముగ స్వీకరించెను. సుకుమారశరీరయుఁ గేవల కృశాంగియు నగు ప్రేమపూర్ణను గనుంగొనెను. తన పుత్త్రరత్నమున కాసాధుశీల నొసంగవలసిన దని యుమేశచంద్రుని బ్రార్థించెను. ఇవెల్ల నేక కాలముననే తటస్థించెను; కాని యుమేశచంద్రుఁడు మాత్ర మందులకు సమ్మతింపలేదు. ఐశ్వర్యనిధి యగు దేవేంద్రనాథునకుఁ గోడలై యమ్మహనీయుని నుపచరించు భాగ్యము తనకూఁతునకు లేదనియు, నంతటి యదృష్టము నా దురదృష్టవతి నోచుకొనలేదనియు నుమేశచంద్రుఁడు భావించుకొనెను. అందులకుఁ గారణము లేకపోలేదు.

ఉమేశచంద్రుని పుత్త్రుఁడు పెక్కేండ్ల క్రిందటఁ దండ్రితోఁ దగవులాడి దేశాంతరము పోయెను; కాని మార్గమధ్యమున దొంగలకుఁ జిక్కియో యాత్మహత్య గావించుకొనియో యాతఁడు మరణించెనట! జేరులు కొందఱీవృత్తాంత ముమేశచంద్రునకుఁ దెల్పిరి. ఈ విషాదకరవార్త విన్నదిమొదలు ప్రేమపూర్ణ యత్యంత శోకాకులస్వాంతయై యన్నపానములు మాని మిక్కిలి చిక్కిపోయెను. ఇట్టి విషమసమయమందే దేవేంద్రనాథుఁడు ప్రేమపూర్ణఁ గాంచుట, తనతనయున కామె నొసంగ వేఁడుట సంభవమయ్యెను.

అనుంగుసోదరుని చిరవియోగవ్యథాభారమున శుష్కించి భ్రాతకై ప్రాణములను మాత్రము నిల్పియున్న ప్రేమపూర్ణకు మనశ్శాంతి యెక్కడిది? సోదరుని క్షేమోదంతము తెలిసినఁగాని యామెకీ లోకవాంఛయే నిలువదు. ఆ గుణవతికిఁ జిత్తశాంతి కలుగని యంతవఱకు వివాహవార్త స్వప్నగతవృత్తమే యగును. ఉమేశచంద్రుఁడు విచారకరమగు నీసంగతిని దేవేంద్రనాథునకుఁ గష్టముతో నివేదించుకొనెను. దేవేంద్రనాథుఁడు తన కరుణామయ శీతలవాగమృతవృష్టిచే వారి హృదయతాపమును గొంతవఱకుఁ జల్లార్చి, యచ్చటనుండి మరలెను. అనంతరము హేమకుమారునకుఁ గష్టగతి సంప్రాప్తమగుటయు, నందువలన దేవేంద్రునిమానస మన్నివిషయములనుండి యుడిగి తనయుని చికిత్సయందే లగ్నమగుటయుఁ దటస్థించెను.

దశమప్రకరణము

హేమకుమారుఁడు స్వస్థత నొందినపిమ్మట, నాతనికిఁ గన్యక నిచ్చు విషయమునుగూర్చి సంప్రతించుటకై, పలుతావులనుండి పెక్కండ్రు రాయబారులు చనుదెంచి, దేవేంద్రనాథుని సందర్శింపఁ దొడఁగిరి. వరకట్నముల క్రింద వేలతరబడి స్వర్ణనిష్కముల రాసివోయుటకుఁ గూడ ననేకులు సంసిద్ధులై యుండిరి; కాని దేవేంద్రనాథుని యంతరంగమున నేదియు నొప్పిదముగ నుండలేదు. ధనసంపన్నులతో వియ్యమందఁ గోరికగల దగుటచేత, నంబికాదేవి మగని యిష్టమునకుఁ బ్రతికూలముగఁ బ్రవర్తింపఁజాలనిదైన, నాతని దృఢనిశ్చయము నెఱుఁగఁగోరి ప్రాణేశునితో నొకనాఁ డిట్లు సంభాషించెను.

అం—కుమారుని వివాహకాలము నింకను బొడిగింపఁ దలంచితిరి కాఁబోలును.

దే—అవును.

అం—ఉమేశచంద్రుని వియ్యము నుద్దేశించియే మీ రిట్లు తామసించుచుంటిరని యూహింతును.

దే—నిశ్చయము.

అం—ఆతఁడు నిరుపేదయని వినుచున్నాను.

దే—(నెమ్మదిగ) చెప్పుము—చెప్పుము; నీవు చెప్పఁదగిన దంతయు ధారాళముగఁ జెప్పుము.

అం—అట్టివారితో వియ్యమందుట మనపరువున కొక లోపముగాఁ గొందఱు భావించుచున్నారు.

దే—(మధురహాసమున) వారి పేదఱికము మనల నేమి చేయఁగలదు?

అం—దరిద్రులకును ధనికులకును జోత్తుకుదుర దనుట కొందఱి మతము.

దే— ఆలాగునా! వారినుడువులు మనయెడ నిస్సారములై పోఁగలవు.

అం—దేవా! సెలవిండు, అదెట్లు?

దే—నీ కిష్టమైనచో నీధనలక్ష్మి నీవియ్యంకుని నైశ్వర్య సంపన్నునిగఁ జేయఁజాలదా?

అం—క్షమింపుఁడు. మీ రాతనిపుత్రికను జూచివచ్చిన దినమే మనయింట నా ఘోరానర్థము పొసఁగినది.

దే—నిజమే, తరువాత—

అం—అదియొక మహానిష్టసూచకముగ జనులు తల పోయుచున్నారు.

దే—(ప్రేమ ప్రకాశనయనములతో) నెట్టిదానా? ఒక యమాయకురాలు మఱియొకని యజాగ్రత్తకుఁ గార ణము కాఁగలదని నమ్ముచున్నావా? ఇట్టి భ్రాంతి వచనములు శ్రేయోభంగకరములని నీ వెఱుంగవనుట సత్యము. పాపము! ముగ్ధవు; నీవేమి తెలియఁగలవు?

ప్రక్కనున్న చిన్నవియంత్రము కిటకిట ధ్వనిచేసి, వారి సంభాషణమున కంతరాయముఁ గల్గించెను. ఆసూచ నను గ్రహించి యంబికాదేవి యటనుండి లేచిపోయెను. కొన్ని క్షణములలో గృహసేవకుఁడు—రామదాసు—దివ్య సుందరవిగ్రహుఁ డగు నూతనపురుషు నొక్కనిఁ గొని వచ్చి, దేవేంద్రనాథుని సమ్ముఖమున వదలిపోయెను. ఆ సౌందర్యమూర్తి యుమేశచంద్రుఁడని గుర్తించిన దేవేంద్ర నాథుఁ డాశ్చర్యసంభ్రమ సమన్వితాంతరంగుఁడై పర్యం కమునుండి దిగ్గనలేచి, తీవ్రోత్సాహముతో నాతని గాఢా లింగనమాచరించి,యుచితాసనాసీనునింజేసి,కుశలప్రశ్నము గావించెను.

దే—మీ రాకస్మికముగ నిట్లేకుదేరమును బావన మొన రింతు రని, యీ మందమతి తలఁచియుండలేదు. సంపూర్ణకళలఁ దేలు మీ వదనమండల మిమ్మెయిఁ బ్రకాశహీనముగఁ గన్పట్టుచున్న దేమి?

ఉ—మీపవిత్ర జిహ్వాగ్రమునుండి యశుభవార్త లెవ్వి యు వెలువడఁజాలవనుట సహజమేకదా. మహాను భావా! హేమకుమారుని యారోగ్య మెట్లున్నది?

దే—(సవిచారముగ) అయ్యో! ఈవేదనోదంత మంత వఱకు వ్యాపించి మీ కోమలహృదయమునుగూడ బాధించెనా? ఈశ్వరానుగ్రహమున నాతఁ డా విషమదశను గడచి,మీపరిపూర్ణకృపావలోకనమునకుఁ బాత్రుఁడగుచున్నాఁడు. మీ యన్వేక్షణ ప్రయత్న మెంతవఱకు ఫలకారియైనదో వినఁగుతూహలమున్నది.

ఉ—దేశాంతర్గతుఁ డయియున్న యువకునిగూర్చి మీరు ప్రశ్నించుచుంటిరి కాఁబోలు. ప్రపంచమున నా ఖలుఁడు జీవన్మృతుఁడయి యున్నాఁడు.

దే—ఏమీ! జీవన్మృతుఁడా!

ఉ—చిత్తము. ఆ మానవాధముఁడీయైహిక ప్రపంచమును దాఁటిపోయియుండెనేని నామనఃపీడయు నంతటితో నొక్కమొగిఁ దీఱియుండెడిది. సాధువులను బాధించు నృశంసుఁడు జీవన్మృతుఁడుగాక మఱేమి?

దే—మీరు మీకుమారునిఁగూర్చియే సెలవిచ్చుచుంటిరి కదా?

ఉ—ఔను. ఎవనిఁ బ్రాణాధికునిగ భావించుచుండిరి. యే జీవనప్రియుని వ్యథోపశమనార్థ మీ రష్టకష్ట ములకు లోనైతిరో, యా హేమకుమారుని క్షతగాత్రు నిగఁ జేసిన నికృష్టునిగూర్చి, ఖలుఁడని, నృశంసుఁ డని, జీవన్మృతుఁడని—మఱేమని చెప్పవలెనో నాకుఁ దోఁపకున్నది.

దే—(బిచ్చవడి) ఆహా! ఆతఁడే, ఆరుద్రదత్తుఁడే, మీ కుమారుఁ డాతఁడే!

ఉ—(ఖిన్నుఁడై) మహాభాగా! ఆవిషయమై నాకమిత విచారము కలుగుచున్నది. మీముందర తలయెత్తి నిలు చుటకు నే నెంతమాత్రమును దగను. అప్రమత్తచిత్తునిఁ గుమారుఁడని చెప్పుకొనుటకు లజ్జింపవలసి యున్నది.

దే—మీవంటి సువిచారపరులకు నేను విన్నవింపఁ బనిలేదు. మహాభాగా! ప్రపంచమున సమస్తవృక్ష జాతములయందును మధురఫలములే లభింపవు. వాని వలన లోకమున కొనఁగూడఁజాలని మేలు తిక్తఫలములవలనఁగూడ నొదవుచున్నది. మధురఫలములు కేవలము క్షుధాతురతను మాత్రము మాన్పును. తిక్తఫలము లన్ననో రుజలనుగూడఁ బాపుచున్నవి. మహనీయుఁడా! రుద్రదత్తుఁడు నిరంతరాయముగ శ్యామపురముఁ బ్రవేశించెనా?

ఉ—(వికసితవదనుఁడై) ధర్మమూర్తీ! మీ పవిత్రహృదయమునకు సమస్తమును సమానమే. మీరు భేదభావముడిగి శత్రువులనుగూడ మిత్రదృష్టిఁ జూడఁగంటిరి. ఉత్కృష్టమహిమాన్వితమగు నీ శీలసంరక్షణము మహాత్ములగు మీబోంట్లకుఁదక్క నెవ్వరికి సాధ్యము? ఆ నిర్దయుని పాషాణహృదయముగూడ నవనీతము వలెఁ గరఁగిపోవుటకు మీ యమోఘప్రేమైకదృష్టి ప్రసారము గాక మఱేమికారణము కాఁగలదు. ఆహా! పవిత్రవంతమైన ప్రేమ లోకము నెంత సత్వరముగఁ బావనము చేయఁగలదు. ఆ యమూల్యప్రేమ భాగ్యము నన్నికడల సమానవ్యాప్తి నొందించు మహనీయుఁడే మాననీయుఁడుకదా?

దే—ప్రేమ మెచ్చుట లేదు. మీ హృదయకేదారమునఁ బ్రేమామృతము పూర్ణోద్భవించియుండనిచో మీ రిట్లు క్షమగొని యింతదవ్వేల యరుదెంచియుందురు? మీ యాత్మజుని యందు మాత్ర మనురాగము లేదని యెవ్వ రనఁగలరు? లేకుండినచో నాతఁడు నా ప్రార్థన నాలించుటయు, దానిఁ బాలించుటయు నీవిషయ మిమ్మాలోకించియుండుటయు, సంభవమై యుండదుకదా?

ఉ—అయ్యో! ఆ పాపండునిగూర్చి తలఁచుకొలఁది మానసము ఛిన్నాభిన్న మగుచున్నది. అందులకు నేను క్షమాపణఁ గోరఁదలఁచి యుండలేదు. మహాత్మా! మీ కుచితమని తోఁచిన దండనము, మీరాక్రూరునకు విధింపుఁడు. నాకు నది పరమసమ్మతము. అట్లు గావించినఁగాని నా హృదయద్రుమము నలమికొని బాధించుచుండెడు ఖేదలతిక నన్నుఁ బాయఁజాలదు.

దే—(విస్మితుఁడై) మీరు మీ కుమారున కర్హదండన విధింప నాకాదేశించుచున్నారా? అయ్యో! దానిని మీఱుట నాకు భావ్యమైయుండదే! నేను విధించెడు దండనము మిగుల దుష్కరముగ నుండును. మీపుత్త్రుఁ డందువలన జీవితకాల మంతయు మహాబంధమునకు లోనై, యొకానొక దుస్తరజలనిధింబడి తత్ఫలముఁ గుడువవలసి యుండును.

ఉ—అవశ్య మనుభవించును. మీ రతని మహాగాధ పంకకూపమునఁ ద్రోసినను మఱేమి యొనర్చినను నాకుఁ బరమసమ్మతము. ఆదుర్మదుఁ డందుండి దరిఁజేరరాదు.

దే—మీ రాజ్ఞాపించితిరి కాన, దాని నెంతమాత్రమును నే నతిక్రమింపఁజాలను. నేనేమి విధించినను మీరు నామోదించుట యవసరము. నా ద్వితీయ తనయ కాత్యాయని రుద్రదత్తునిఁ జెందును. నే నాకన్యచే, ఆ వీరునిబంధించి యాతని నీక్షణమే కడలేని సంసార సముద్రమునఁ ద్రోయఁ గృతసంకల్పుఁడ నైతిని. మీ సుతున కుచితమగు దండనమిదియే. దీని కాతఁడు గురియై తీరవలెను. ఇది యీశ్వరాదేశము.

ఉమేశచంద్రుని హృదయాంతరాళమున నెట్టి భావముత్పన్న మయ్యెనో—అద్భుతమో, భయమో, సంభ్రమమో, సంతోషమో, మఱేమియో—తోఁపదు. తోడనే యాతని నయనారవిందములనుండి సలిలకణములు కొన్ని జలజల రాలెను. అవి యానందాశ్రువులో దుఃఖబాష్పములో బోధపడుటలేదు. దేవేంద్రనాథుని యమృతమయ వాక్యజాలమున కాతఁడేమియు నుడువ సాహసింపలేక, యనేక నిమిషములకాల మట్టె మౌనభావమున నుండి, యనంతర మిట్లనెను.

"తమపై కర్కశశిలావృష్టిఁ గురియించుచున్నను, వృక్షరాజములు సౌమ్యభావమునఁ దుచ్ఛమానవులకు మనోహరామృతఫలములనే యొసంగుచున్నవి. ఆహా! ప్రపంచమున సజ్జనులధర్మ మీచందమున నొప్పారుచుండు ననుటకు, మిముఁబోలు మహనీయుల సచ్చారిత్రములే యాదర్శప్రాయములు."

హేమకుమారునకుఁ బ్రేమపూర్ణ నర్పించుటలో నుమేశచంద్రుఁడు వెనుదీయ సాహసింపలేదు. యుక్తసమయమునఁ బ్రేమపూర్ణా హేమకుమారులకును, కాత్యాయనీ రుద్రదత్తులకును విభవాభిరామముగ వివాహము జరిగినది.

వెన్నముద్ద కృష్ణుడు

మంగిపూడి వేంకటశర్మ గారు

సొగ మొగంబునందు మృగనాభితిలకంబు
ముక్కునందు నాణిముత్తియంబు
తలను నెమిలిపించె మలరార రార నా
ముద్దుకృష్ణ, వెన్నముద్దకృష్ణ! ౧

చేత వెన్నముద్ద చెన్నుమీరుచు నుండ
లేతనవ్వు చెంగలించు చుండ
చేతముల్లసిల్ల చిందులాడుచు రార
ముద్దుకృష్ణ, వెన్నముద్ద కృష్ణ! ౨

మోముదమ్మిమీద ముంగురుల్ ముసరంగ
మోవిసీమ మురళి ముద్దులొలుక
నాదిపాడరా యొయారంబుగా నిల్చి
ముద్దుకృష్ణ, వెన్నముద్దకృష్ణ! 3

రావిరేక నొసల రంగార, పులిగోరు
పదక మురమునందు భాసిలంగ
చెవుల మద్దికాయ కవ చెలంగగ రార
ముద్దుకృష్ణ, వెన్నముద్దకృష్ణ! ౪

ఘల్లుఘల్లు కాళ్ల గజ్జె లందెలు మ్రోయ
కంకణాలు కేలు గవను మొరయ
పరుగు పరుగువచ్చి బంగారుముద్దీర
ముద్దుకృష్ణ, వెన్నముద్దకృష్ణ! ౫

నిద్దమైన చెక్కుటద్దాలు మెరయంగ
చిగురుమోవి కెంపు చెలువులీన
ముదముమీర చిన్ని ముద్దిచ్చిపోర నా
ముద్దుకృష్ణ, వెన్నముద్దకృష్ణ! ౬

వెండిగిన్నెలోను వెన్న మీగడ లుంచి
పైడిగిన్నెలోను పాలుపోసి
విందుసేయగోరి వేచియున్నానురా
ముద్దుకృష్ణ, వెన్నముద్దకృష్ణ. ౭

తల్లి పెరుగు చిలుకుతరి చవ్వడాలించి
చెంగుచెంగుబోయి చేయి చాచి
వెన్నగొన్న చెన్ను కన్నులజూపరా
ముద్దుకృష్ణ, వెన్నముద్దకృష్ణ! ౮

ఆయశోదనందు లానందమున పొంగ
రాధచిత్త మెలమి రంజిలంగ
ప్రేతలలర గొన్న వేషంబుజూపరా
ముద్దుకృష్ణ, వెన్నముద్దకృష్ణ! ౯

నీలనీలమైన నీకోమలపుమేని
చొక్కటంపు కాంతి పిక్కటిల్ల
భువనమోహనంపు మూర్తి జూపింపరా
ముద్దుకృష్ణ, వెన్నముద్దకృష్ణ! ౧౦

పట్టుదట్టినిత్తు బంగారు తోడుగిత్తు
తియ్యపండ్లు చెండ్లు తేనె లిత్తు
దండలిత్తు మంచి తాయిలం బిత్తురా
ముద్దుకృష్ణ, వెన్నముద్దకృష్ణ! ౧౧

నందతనయ రార నవనీతప్రియ రార
వేణుగానలోల వేగరార
గోపబంధు రార గోవింద రా రార
ముద్దుకృష్ణ, వెన్నముద్దకృష్ణ! ౧౨

నవీన నాగరిక శిఖామణి

వావిలాల అద్వైతబ్రహ్మశాస్త్రి గారు

కొండలరావు నివాసస్థలం గోదావరిజిల్లా పేరూ రగ్రహారం. ఇంటిపేరు కస్తూరివారు. ఈయన తండ్రిగారు, రామారావుగారు రాజమహేంద్రవరం మునసబు కోర్టులో గుమాస్తాపనిచేసి రిటైరైనాడు. ఆయన ఉద్యోగం చేసేకాలంలోనే మనకొండలరావు రాజమండ్రి వీరేశలింగంహైస్కూలులో ఐదవఫారం చదువుతున్నాడు. ప్రతిక్లాసులోను మూడుసార్లు దండయాత్రలు కొట్టినా ఎలాగైతేనేం 9 వ క్లాసులోకి వచ్చానని కొంచెం గర్వం ప్రబలింది. అప్పుడు అయ్యగారికి కట్టు జుట్టు బొట్టు లలో మార్పు కలిగింది. పూర్వం వెనక పిలకవుంచుకొని ముందు వసారా తీయించుకునే వాడు. ఇప్పుడో, వెనక పిల కెగిరిపోయి ముందుకు దూకింది. అంటే మరేంలేదు. క్రాపింగ్‌గా మారింది. క్రాపింగులో మరి యేక్రాపింగు అనుకున్నారు! బెంగాలి క్రాపింగు. సరే! ఇంక కట్టు పూర్వము బట్ట వార గోచీపెట్టినా పెద్దమనిషికొడుకులాగానే కనబడేవాడు. ఇప్పుడు, గూడకట్టులోకి దిగాడు. బొట్టుతీసివేసి ఫేసుపౌడరు అతికిస్తున్నాడు. మరి వేషం మారినట్లు గుణములుగూడ మారుతూ వచ్చాయి. ప్రొద్దున లేవంగానే కాఫీ నీళ్లు తగలాలి. కాఫీ కడుపులో పడడంతోటే ఖారాకిల్లీ బుగ్గలో నుంచుకోవటం, సిజర్సు సిగరెట్టు వెలిగించడం, నలుగురినీ పోగుచేయడం, వాళ్లతో బాతాఖానీ వేయడం; ఇన్ని సాగించాడు. ఈయన చదువుకు తోడు పోలయ్యామేడలో మంచిగాలివచ్చుటకు రోడ్డుమీద వచ్చేపోయేవా రందరు కనబడుటకు వీలైనగది పుచ్చుకొన్నాడు.

రామారావుగారు పింఛను పుచ్చుకోంగానే భార్యతో స్వగ్రామంకు బైలుదేరాడు. ఆయనకి కొండలరావొక్కడే కొడుకు. ఆయనకూ 15 ఎకరాల పల్లం వుంది. సంవత్సరంకు 1500 రూపాయిలకు తక్కువ లేకుండా వస్తుంది. పింఛను డబ్బులు నెలకి 30 రూపాయిలు తీస్తున్నాడు.

రామారావుగారు రాజమండ్రి నుంచి కాపురము ఎత్తెయ్యగానే కొండలరావు హోటల్లో ప్రవేశించాడు. పూర్వం తండ్రిభయమన్నా వుండేది. ఇప్పుడో! అసలు స్కూలులో చదువుతున్నాడని పేరు. కాని, ఒకరోజు వెడ్తే వెడ్తాడు, 10 రోజులు ఫ్రెంచిలీవ్ పెడ్తాడు. ఇలా గడచిపోతూవుండగా మికేటరం

పరీక్షలు వచ్చాయి. అప్పుడు మన కొండలరావు పుస్తకాలుతీసి డస్కుక్రింద పెట్టేనేం, పక్కవాడివద్దచూస్తే నేం, కాపీచేసి పరీక్ష పరిసమాప్తి చేశాడు. కాని, మార్కులు కాపీ చేసేవాడికెలా వస్తాయో అలాగే మన కొండలరావుకు అన్ని సబ్జెక్టులోను వట్టడిజిటు మార్కే!.

రోజులు గడుస్తున్న కొద్ది షోకుకూడా బలుస్తున్నది. నెలకి నాలుగు వేసిలైన్ బుడ్లు, నాలుగు సన్లైటుసోపులు, న్యూయార్కులో నున్న ఇన్వెన్షన్ డెవలపింగు ఏజెంసీలో తయారుకాబడిన ఫేస్పౌడరుటిన్నులు ఒక నాలుగు ఖర్చయ్యేవి. కాని, వీటన్నిటికి డబ్బెక్కడిది అని మీరడుగుతారేమో! పుస్తకములు కొనుక్కుంటానని, బట్టలు చినిగిపోయినయి, కొనుక్కోవాలనని మిషలుపెట్టి వారమున కొకతాకీదును తండ్రికి పంపేవాడు. తండ్రి అమాయకం ముండావాడు అవటంచేత కొడుకు బి. యే., బి. యల్. ప్యాసుచేసి తననెత్తిమీద ఒరిగిస్తాడేమో అని వుత్తరం అందిన వెంటనే మారుమాటాడక మణియార్డరు చేస్తూవుండేవాడు.

ఇల్లా వుంటూవుండగా సాలుసరి పరీక్షలు గడచినవి. వేసంకాలం శెలవులు ఇచ్చారు కొండలరావుకు. శెలవులలో ఇంటికివెళ్లగానే ఇరుగుపొరుగు వుండే అయ్యలు, అమ్మలక్కలు, ఈనవీన పురుషుణ్ణిచూచి ఆశ్చర్యపడ్డారు. ఎందుచేత! కొండలరావు తలనుంచి కాళ్లవరకు పూర్తిగా రివల్యూషను అయిందని.

ఇంటికి రాగానే పాపం! మావాడు కష్టపడి వంటరిగా చదువుకొని వచ్చాడని తల్లి తండ్రి ఆనందసాగరంలో మునిగిపోయారు. 2 నెలలూ ఏదోవిధంగా ఎప్పుడు స్కూలురోజులువచ్చునాఅని గడిపి తర్వాత మూట, ముల్లె తీసుకొని బయలుదేరాడు కొండలరావు రాజమండ్రికి. వెళ్లినతక్షణమేరిజల్ట్సువచ్చినవనిన్ని, కొండలరావు పేరు ప్యాస్లిస్టులో ఎంత వెతికినా గోచరంకాలేదనీ, స్నేహితులు చెప్పారు.

అంతట, ఇక రాజమండ్రిలో చదువుతే సిగ్గుగావుంటుందని దూరదేశయాత్ర చేయటానికి బుద్ధిపుట్టింది. ఏవూరువెడదామని లార్డు బైరన్ పడ్డంత ఆలోచనలోపడ్డాడు. చివరకి మెడ్రాసుమీదికిపోయింది బుద్ధి. అంతట తండ్రికి కార్డురాశాడు. ఏమని? రాజమండ్రిలో మాష్టర్లు అందరు బాగాచెప్పడంలేదనిన్ని చెన్నపట్నంలో చాలా శ్రద్ధగా చెప్తారు కాబట్టి తాను చెన్నపట్నంకి వెళ్లాలని బద్ధకంకణంతో వున్నాననిన్ని.

తండ్రిగారి దగ్గఅనుంచి జవాబు రాకముందే కొండలరావు చెన్నపట్నంలో చేరాడు. ట్రిప్లికేనులో తులసింగపెరుమాళ్లవీధిలో 75వ నెంబరులో మేడమీద ఎలెక్ట్రిక్కుఫిటింగ్సుతోవున్న ఒకగదిని 20 రూపాయిలకు అద్దెకు తీసికున్నాడు. పట్నంప్రవేశించడంతోటే, క్రొత్తవూరుగనుక వినోదములన్ని ఒకటొకటే చూస్తూవచ్చేటప్పటికి నాలుగునెలలు సరిపోయింది. ప్రతిరోజూ, బయూస్కోపులకు, డాన్సింగుపార్టీలకు, డ్రామాలకు హాజరు

రు. ఈ మోస్తరుగా ఇక్కడ కాలం గడుపుతూవున్నాడు.

ఇలా వుంటూండగా పేరూరులో రామారావు గారికి టైఫాయిడుజ్వరం వచ్చిందనీ, కుదరటం కష్టమనీ, వెంటనే రమ్మనమనీ, టెలిగ్రాం వచ్చింది ఒకరోజున కొండలరావుకి. డబ్బు, గిబ్బు లెక్క చూచుకుంటే రెండు రూపాయీలకు మించకుండా వుంది. ఎప్పటి కప్పుడు ఇనసాల్ వెంటు పిటీషనరే! అప్పుడేం చేస్తాడు? తండ్రికి డబ్బుకు రాద్దామంటే ఆయన చావు బ్రతుకులుమీాదున్నాడు. వానికేం వుపాయం తోచలేదు. చివరకి టిక్కట్టు లేకుండానే రాజమండ్రి వరకు వెళ్తామని దృఢనిశ్చయం చేసుకుని ట్రావెలింగు బ్యాగు, బెడ్డింగులతో రాత్రి 9 గంటలు కాగానే ట్రాంమీాదెక్కి సెంట్రలుస్టేషనుకు వచ్చాడు.

చెన్నపట్టం సెంట్రలుస్టేషనులో ఒక గమ్మత్. ప్లాటుఫారంమీాదికి వెళ్లవలెనంటే బేడపెట్టి టిక్కట్టు కొననక్కరలేదు. ఆటిక్కట్టుకలెక్టర్ల చేతులలో అరణాపారేస్తే వాళ్లు మనకాళ్లక్రింద కుక్కలై మన మూాట, ముల్లె మొయ్యమంటేగూడ మోస్తారు. మన కొండలరావు ఆపద్ధతినిబట్టి ఒక రెండుకాలణా డబ్బులు వాడిమొహాన పారేసి లోపలికివెళ్లి సెకండుక్లాసు కంపార్టుమెంటులో ఎక్కాడు. రైలు 9-45కు కదిలింది. గూడూరుస్టేషనులో చెక్కింగు. ఎల్లా తప్పించుకోవడం అని మన కొండలరావుకు పెద్దశంక పట్టుకుంది. ఎలాగైతే నేమి ఈవుద్దేశం సంకల్పించుకున్నాడు.

“మనం గాఢనిద్ర పోవాలె; అప్పుడు మనను లేపడుగదా! అంతగా లేపుతే అప్పుడు ఆలోచిద్దాం” అని మనస్సులో అనుకుని, వేషం మార్చి పూర్తిగా దొరగారివేషం వేసుకున్నాడు. కాని, నిద్రపట్టలేదు. మనస్సులో ‘పట్టుకుంటారేమో నలుగురిలోను అవమానం చేస్తారేమో’ అని పీకుతూవున్నది. ధైర్యం తెచ్చుకుని కాళ్లు పంగచాచుకుని పడుకున్నాడు. గూడూరుస్టేషనుకువచ్చి రైలు ఆగింది సరిగా 3గంట లయ్యేసరికి. చెక్కింగ్ మొదలెట్టారు. క్యారేజిలన్నీ వరసగా చెక్ చేస్తున్నారు. కొండలరావు గారి క్యారేజి దగ్గఱకు ఒక అరవటిక్కట్టు కలెక్టరు వచ్చి లేపినాడు. అప్పుడు వారిద్దరికి ఈక్రింది సంభాషణ జరిగింది.

కొం:—ఏమిటయ్యా! నన్ను లేపుతావ్! నీకేం బుద్ధిఏమైనవున్నదా!

టి:—ఎన్కు తెలుంగు నల్ల తెరియాదు (నాకు తెలుగు సరిగా తెలియదు) ఇంగ్లీషు సొల్లు (ఇంగ్లీషుతో చెప్పు)


కొం:—ఛీ! పో! అరవగోడు ముండాకొడుకా! నీకు ఈవుద్యోగం ఎవరిచ్చారా!

టి:—నీటిక్కట్ ఎంగేఇరికిరది అయ్యా! ఇందకి తీసుకొనిరా!

కొం:—నా టిక్కట్టు ట్రావిలింగు బాక్సులో పెట్టాను. కొంచెంసేపుండిరా. ఇప్పుడు లేదు. నేను మంచినిద్రలోవుంటే నువ్వు లేపడాని కెవడవురా? ఇప్పుడు నీమీాద కేసుపెడ్తాను కబర్దార్! అని చెంపమీాద నాలుగుటపాకాయలు పేల్చినాడు.

టిక్కెట్టు కలెక్టరుకు మంచిదెబ్బ తగిలింది. లబోలబో అని మొత్తుకుంటూ వుడాయించాడు.

రాజమండ్రికి 11½ గంటలకి ప్రవేశించి ప్రొద్దున పడవమీద పేరూరుకు 11 గంటలకు చేరుకున్నాడు.



"నా టిక్కెట్టు ట్రావెలింగుబాక్సులో పెట్టాను. కొంచెంసే వుండిరా............"

ఈగండం గడిచి పిండం బైటపడ్డదన్నట్లు సంతోషపడ్డాడు కొండలరావు.

బెజవాడలో 9½ గంటలకు దిగి దిగంగానే పెట్టెతో ఎదురుగావున్న హోటలులోకి భోజనం చేయడానికి వెళ్లాడు కొండలరావు. ఇక్కడ కూడ ఆ సాంబారు మెతుకులే ఎదురుగా వచ్చాయి. ఎల్లాగో ఆ నాలుగు మెతుకులు నోట్లో వేసుకొని ఇటుఅటు షికారుచేసేటప్పటికి 12 గంటలు వేశారు. అన్నిరైళ్లు వెళ్లినవి. టిక్కెట్టుకలెక్టర్లంతా వెళ్లారు. పెట్టె హోటలులోనే వుంచి వూళ్లోకి ఒకసారి షికారుకు వెళ్లాడు కొండలరావు. వూరంతా దిమ్మతిరిగి సాయంకాలం 6 గంటల బండిమీద

ఇంటికి వెళ్లంగానే తండ్రిగారు పరలోకానికి ప్రవేశించారని తెలిసి కొంచెంసేపు విచారించాడు. 11 రోజులు అయిపోయినతర్వాత స్తిమితముగా ఒకనాడు కూర్చుని తాను ఖర్చుచేసినదంతా లెక్కా డొక్కా చూచుకునేసరికి 3000 రూపాయలకు కొద్దో గొప్పో ఎక్కువైనట్లుతేలింది. అప్పుడుఅయ్యగారుపస్తాయించి వృధాగా ఖర్చుచేస్తున్నామని తెలుసుకొన్నారు. ఆ 3000 రూపాయీల అప్పుకు 3 ఎకరాలమ్మి తక్కిన 12 ఎకరాలైనా బాగుచేసికొందామని, ఇంకబుద్ధివచ్చింది ఏదో ఇక్కడనేవుండి వ్యవసాయం చేసుకుందామని అనుకున్నాడు.

నీ వాఁడ

పువ్వాడ శేషగిరిరావు, చోడవరపు జానకిరామయ్య గార్లు

కనిపింపరావేల ? కవిలోకమోహన, క్షమమైన నీదువీక్షణముకలిమి
వినిపింపరావేల ? విమలరసాంచిత, ప్రాంచితంబైన నీరాగలహరి
చదివింపరావేల ? ఛాత్రసంతతినేఁడు, సాదరంబునఁ గావ్యసంతతులను
నాటఁగారావేల ? నవ్యభావంబుల, దళుకొత్తు కవులఁజిత్తంబులందు

గీ. పూవుఁదోఁటల విహరింపఁ బోయెదేల ? నాదుతలవాకిటను నిల్వరాదె ? బాల !
ఊర్మిపంక్తుల నూయెల లూఁగెదేల ? నాదురసనాగ్రమున నూఁగరాదె డోల.

గీ. త్వన్మనోహర గళరవావాప్తి మధుర, లలితమకరంద ధారావిలాసములను
మోహవార్నిధి నామది మునిఁగి తేలు, నుద్ధరింపుము నన్ను, కేలూఁతయొసఁగి.

గీ. తేనెలొల్కెడి నీపల్కు లాను కలిమి, తోయజోద్భవునానతి డాయనాము;
లోకమెల్లను వేనోళ్ల వాకొనంగ, బాల ! నీనేర్పుఁజూపు మే నోలలాడ.

ఉ. నీకడగంటిచూపు తరుణీ ! కలుగన్ మహనీయసౌఖ్యముల్
జేకురు; త్వన్మనోజ్ఞ సరసీజనిభాస్యము మన్మనంబుఁ జీ
కాకెపలించి సంతత మఖండముదంబున నూఁచుచుండు ! నీ
కే కలదిట్టిశక్తి; దయనేలు; భవత్ప్రియమూర్ధనిన్ ననున్.

గీ. తోడవు లిమ్మని నిన్ను నేనడుగలేదు, జిలుగువలిపమ్ము లిమ్మని కలఁచలేదు
దివ్యరత్నంబు లీయ బాధింపలేదు, కలికి ! ఒండొండు కోర నీవలపుదక్క.

గీ. నీదుసఖ్యంబె నాకముగాఁ దలంచి, నమ్మియుంటినిగాని లవమ్ముగూడ
సంశయించియెయెఱుఁగ; నన్మనస్సనంబు, దెలియ జాలవె ? చాన ; నిశ్చలమెసుమ్ము.

శా. నీకారుణ్యరసాబ్ధివీచికలలో నే నీదుదున్ నిత్యమున్
రాకాపూర్ణిమయామినీధవళ సాంద్రచ్ఛాయలం బండుదున్
కేకీనాట్యవిలోకనోత్సుకుఁడనై నీహారపుంజల్లులో
మూకీభూతుఁడనౌచునిల్చెదను; పూవుంబోఁడి ! నీచెంగటన్.

గీ. అంతరంగమ్మునందలి హర్మ్యములను, గూలఁద్రోసెదె ? చెప్పుమా ! జాలిమాలి
ఎట్లు లీవియోగంబు సహింపఁగలనో ! ఇంచుకంతైన యోజింపవేల బాల !

గీ. ఈవనమ్మున, నీసెలయేటిచెంత, పిల్లతెమ్మెరతుంపురుల్ చల్లుచుండ
నిసుకతిన్నెపరుండి నిన్నెతలంతు, మెత్తనౌభావసమితి నందిత్తునంచు.

గీ. మన్మనోవీథిఁదోఁచి చింతావిలోలుఁ, జేయఁ నేటికి, నన్ను గంజాయతాక్షి ?
నాప్రణయమందు గంటివే లోపమేది, యేని? నిర్మలంబేకద! ఈనిశాంత
యామినీనాథ కిరణవీచీమనోజ్ఞ, మాలికాజాలకంబుల నోలలాడు
భాగ్యలక్ష్మికి వెలినౌనర్పంగనేల? తొగలరాయడు మెలమెల్లఁ దొంగిచూచి
మొగిలుచాటునదాగితో బూచులాడ, నేను బవళించియుండగ నేగుదెంచి
ప్రణయగీతిక నాలపించినవిధాన, కలికిరో! దానిపాడు మక్కజముదోఁప.

శా. నీచెంతన్ వసియింపగానతము నింతీ, యేను కాంక్షించెదన్;
వాచాప్రౌఢిమ నీదుకంఠమున నేఁబాడింతు గీతావళుల్;
నీచాతుర్యము పెంపుచే నెవని నేన్ మెప్పించి లోఁగొందు; సం
కోచంబేది వసించి నానుడుల లోకుల్ మెచ్చఁగాఁ జేయుమా.


గీ. నేను భవదీయకరుణావిహీనుఁడనొకో ? రాగదవె వేగ ప్రణయసంద్రమ్మునీఁద
ఏ సుధన్యతగాంచెద నీద్వితీయ, మంజులారావ మాధురిమంబుఁగ్రోలి.

గీ. సుకవిభోగార్హమైన నీశోభఁగాంచి, ముగ్ధచిత్తుఁడనై యేను మురియుచుందు
మురిసిమురిసియె యీవనాంతరమునందు, నవయు నాహృది, నిజము చానా, తపించి!

గీ. ధరణిజను లాదరించు విద్యావిభూతి, నేను నీకడ సంగ్రహించెద లతాంగి!
ఇంతయేటికి నీవు నే నేకమైన, నతులితానందసౌఖ్యంబు లందఁగలము.

సీ. మందాకినీతరంగములపైఁ గూర్చుండి, తూగుటుయ్యాలల నూఁగియూఁగి
శరదిందుమండల చంద్రికావాహిని, నాచట జలకంబు లాడియాడి
మధుమాసకోకిలా మధురగీతంబుల, వీనులవిందుగా వినిపి వినిపి
చిత్తంబులను వికసింపఁజేయఁగఁజాలు, భూషణంబుల మేనఁ బూనిపూని

గీ నవ్యతారుణ్య మాధుర్యసంపదలతోడ, మమ్ములోఁగొని తన్నిటు స్మరణసలుపుఁ
గలిమిఁజేకూర్చు శారదకప్పురంబు, మాదుతలవాకిళులఁజిల్కు- మనుముఁగాత.



భారతీయ ప్రజాప్రభుత్వము

యనమండ్ర నారాయణమూర్తి గారు

1 ఫిబ్రవరి 1925 నాడు లండన్ భారతీయ విద్యార్థిసంఘమువారి వార్షికోత్సవ సమయమున ఫిలిప్ కెర్ దొరగారు "భారతీయ ప్రజాప్రభుత్వమ"నంశముపై జెప్పిన యుపన్యాసమును ఇంగ్లీషు తెలియని యాంధ్రులకొరకై ఈవిధముగ నాంధ్రీకరించి ప్రచురింపదలచినాను. ప్రజారాజ్యస్థాపనమునకై నేడు మన దేశమందు జరుగుచున్న ఆరంభ సంరంభమునకు ఇందలి హితోపదేశము చక్కని మార్గప్రదర్శకము కాగలదు. ఉపన్యాసకుని యభిప్రాయము లన్నిటితోను, నే నేకీభవించితినని కాదు. పాశ్చాత్యదేశీయుల ప్రజాప్రభుత్వరహస్యము సర్వసమత్వాది ధర్మావలంబన మనిగాని, భరతఖండవాసుల యన్యోన్య జాతిమతాది భేదములు ప్రజారాజ్యసంసిద్ధికి దుర్లంఘ్యావరోధములనిగాని, ఇప్పటి ప్రపంచమందలి నిఖిలదేశముల పరస్పరానుబంధముల బరిశీలించిన నిష్పక్షపాతబుద్ధులు ఎవ్వరును విశ్వసింపరు. జాతివర్ణవైషమ్యములు నేటి రాజకీయములయందు బలవత్తరాంశములని యుపన్యాసకుడే తొలుదొల్ల నుపోద్ఘాతముగా వర్ణించియున్నాడు. కాని యాయాదేశములయు, జాతులయు ప్రజలయు యోగ్యతాయోగ్యతలు చర్చింపక, కేవలము ప్రజారాజ్య స్వరూపనిరూపణము నారసి, తత్సాఫల్యకారణముల నవలంబించి, విఘ్నకారణముల దొలగించి, పరిపాలనక్రమము నిర్వహింప నుంకించు దేశాభిమానుల కీ యుపన్యాసము నాకైన ట్లత్యంత సమ్మతమై వ్యవహారోపయోగము కావచ్చును.

ఉపన్యాసము

ప్రజారాజ్య మనగా వట్టి శాసనములు, శాసనసభలు, రాజకార్య ప్రవర్తకులు, ఓట్లపెట్టెలు కావు. ప్రజారాజ్యక్రమమున కివన్నియు ముఖ్యాంగములే కాని తంత్రప్రేరకశక్తులు కావు. లోకోత్తరమైన మహాయంత్రమును గనిపెట్టవచ్చును. కాని దానినడిపించునట్టి యావిరిశక్తి దానిలోబోయనిచో నది యొకగజము మేర నడువదు. అట్లే ప్రజారాజ్యయంత్రమునకూడ దగిన విక్షేపకశక్తి పోయనిచో బనిచేయదు. ప్రజారాజ్యము మహాకష్టమైన పరిపాలనక్రమము. తెలియనివారి కది చిరకాలసిద్ధముగాను, నిరంతరవిజయశీలముగాను, భ్రాంతిపెట్టుచుండును. ఆభ్రాంతికి గారణ మేమన పూర్వు లెవ్వరును దానికి ప్రాణాధారమగు ధర్మపద్ధతిని గనిపెట్టలేకపోయిరి. పూర్వులందరు ప్రజారాజ్యయంత్రము పన్నిరి గాని దాని నడపించు సూక్ష్మశక్తినిబుట్టించు టెట్లో బుట్టిన దాని బోషించు టెట్లో తెలిసికొనలేకపోయిరి.

ప్రజారాజ్య పూర్వోత్తరములు

ప్రజారాజ్యమును మొట్టమొదట గనిపెట్టినవారు గ్రీసులోని ఏతెన్సు నగరవాసులు. వారిరాజ్య మెంతో కాలము మన్నలేదు. అది చెడిపోవుటకు గారణము, కొంతవరకు పరిపాలకులు పరిపాల్యులను సేవల భృత్యన్యాయముగా బాటించియుండుటయు, మరికొంతవరకు ఆరాజ్యము పట్టిరాజధానీ నగరపరిమితమై పయినుండి వచ్చు శత్రువులకు సులభసాధ్యమై యుండుటయును. ఏతెన్సురాజ్య మంతరించిన కొంతకాలమునకు ప్రజాప్రభుత్వతంత్రము, తిరిగి రోమన్ రాజ్యరూపముగ నావిర్భవించెను. కాని, ఆరాజ్యము నిరవధియైనకొలది దాని సర్వసమస్వభావము క్షీణించి క్షీణించి తుదకు నిరంకుశపాలకాధిష్ఠితమైన సామ్రాజ్యముగ దేలినది. అటుతరువాత మరి 1800 సంవత్సరములు ప్రజాప్రభుత్వము లోకమునుండి యంతరించిపోయెను. దాని పునర్జన్మమునకు బీజము ఇంగ్లండులో "మేగ్నాచార్టా" యను

పేర ప్రజలు రాజునొద్దనుండి తీసికొనిన సర్వస్వాతంత్ర్యదానపట్టా. అటుతరువాత నింగ్లండురాజైన మొదటి యెడ్వర్డు, ప్రజాప్రతినిధులను బిలిపించి రాజ్యపాలనాక్రమమం దాలోచన మడిగియు, దేశముపై వేయదలచిన కప్పములకు సమ్మతింపుడని యడిగియు, జరిగించిన ప్రక్రియయం దప్పటిపునాది మరింత బలపడెను. మరి కొంతకాలమునకు స్ట్యూవర్టురాజుల నిరంకుశాధికారమును నిరోధించుటకై పిమ్, హేమ్డెన్, ఇలియట్ అను దేశాభిమానులు కావించిన యుద్ధములమూలమున మరింత బలపడియెను. ప్రజాప్రతినిధి సంఘమగు పార్లమెంటు అధికారము **1688** సంవత్సరమువరకును సుస్థిరముగా సమకూరియుండలేదు. అప్పుడైనను పార్లమెంటు ప్రజాభీష్టముల సంపూర్ణముగా నెరవేర్చుటకు దగినంతవీలు కలుగలేదు. అమెరికాలోను, ఫ్రాన్సులోను ఇప్పటికొక శతాబ్దముక్రింద జరిగిన రాజకీయోపప్లవములవరకును ప్రజాప్రభుత్వ మనగా "ప్రజలవలన, ప్రజలకొరకు, ప్రజలపరిపాలనము" అను నిర్వచనము లోకమందు సంపూర్ణసార్థక్యము నొందలేదు. ఇంకను అప్పటికైనను ప్రజారాజప్రచారము అతిమందముగానే వ్యాపింప జొచ్చినది. గత శతాబ్దారంభమున ఫ్రెంచిరెవల్యూషన్ సమయమం దొక్కమాటు తళుక్కుమని వెలిగి తిరిగి మాయమయ్యెను. **1848** సంవత్సరమందు మరొక్కమాటు మినుకుమని **1871** సంవత్సరమం దిప్పటి ప్రజారాష్ట్రరూపకముగా నుద్భవిల్లెను. నైసర్గికస్థానబలముచే విరోధిరాష్ట్రములకు స్వాధీనముకాని అమెరికాదేశమందుగూడ **1828** సంవత్సరమందు ఆండ్రూ జేక్సన్‌గారి యధ్యక్షప్రభుత్వమునాటివరకును ప్రజాప్రభుత్వము స్వస్వరూపముతో బరిణమింప దయ్యెను. ఇంగ్లండులో 1832 సంవత్సరపు రాజ్యాంగసంస్కరణశాసనము మొదలుకొని **1917** సంవత్సరపు స్త్రీప్రాతినిధ్యశాసనమువరకును ప్రజాస్వాతంత్ర్యసిద్ధికి గలిగిన మాంద్యము ఇంగ్లండుదేశ చారిత్రము జదివినవా రందరకును విశదమే. సౌతమెరికాలో గతశతాబ్దమందు నామమాత్రముగా ప్రజారాజ్యతంత్రము నెరవేరినది. కాని యా నెరవేరునంతకాలమును దండాధికారము గలిగిన యొక స్వచ్ఛందప్రభుసముదాయముచే ప్రభుత్వము జరిగియుండెను గాని, ప్రజాప్రతినిధులచే గాదు. యూరపునందు **1914** సంవత్సరము మొదలుగా జరిగిన సర్వప్రాపంచక యుద్ధమువరకును రైన్‌నదికి తూర్పున గొప్ప ప్రజారాజ్యములు బయలుదేరనేలేదు. ఈ యుద్ధమును సర్వదేశములందును ప్రజాప్రభుత్వమునకు అపూర్వప్రోచ్ఛలకారి యయ్యెను. కాని యిప్పుడు స్థిరముగా నాటుకొన్నదని భ్రమపెట్టు యూరపుదేశములయందు గూడ తత్ప్రభుత్వ మెంతోకాలము నిలువదని నా మతము.

ప్రజాప్రభుత్వ విఘ్నకారణములు

ప్రజారాజ్యము నెలకొనుటకు రెండుముఖ్యాటంకములు గలవు. మొదటిది పైనుండి యుద్ధము; రెండవది లోనుండి దౌర్జన్యదౌర్బల్యములు. ఇప్పుడు యూరపు తూర్పున క్రొత్తగా నెలకొల్పబడిన ప్రజారాష్ట్రములకు హాని పైనుండి రానైయున్నది. ఆరాష్ట్రములన్నియు నొండొంటితో సఖ్యముకలిగి సాముదాయకక్షేమము కొరకై సంఘీభవించినగాని, యనివార్యముగా యుద్ధము పాలగుదురు. యుద్ధము ప్రజాప్రభుత్వమున కెంతచేటో యెల్లరకును అనుభవసిద్ధమే. ఇంతేకాక రష్యాదేశము స్వచ్ఛందప్రభు రాజ్యముగదా. అచ్చటి ప్రజాస్వామ్యవాదులుకూడ ప్రజలు మూఢులనియు, ప్రజాప్రభుత్వము అసంగతమనియు బహిరంగముగానే విసుగుకొనుచున్నారు. పదమూడుకోట్లజనమును, ఎడతెగని ధనసాధన సంపత్తియుగల యీస్వచ్ఛందరాష్ట్రము ఎప్పటికైనను ఇరుగుపొరుగులనుండు ప్రజారాజ్యములకు వినాశహేతువు కాకమానదు.

ఇవి బాహ్యహానులు. ఇక నాంతరంగిక హానుల మాట యాలోచింతము. జర్మనీలో ప్రజారాజ్యాభిమానము ఈనడుమ నంతరించిన పారంపర్యరాజ్య పునరుద్ధరణమునకై జరుగుచున్న ప్రబల ప్రయత్నముల నడ్డగించుకొనునంతటి శక్తికలది యగునా? బలవత్ప్రభుపాలితములగు ఇటలీ, స్పెయిన్‌దేశము లెన్నటికైనను ప్రజాప్రభుత్వమునకు జోటిచ్చునా? **1911** సంవత్సరమందు చీనాదేశము ప్రజారాష్ట్రమై లోకమంతటికిని ఆశ లూరించినది. అట్టి చీనా నేడేయవస్థలో నున్నది? **1907** సంవత్సరమందు తుర్కిదేశము ప్రజాప్రాతినిధ్యము స్థాపించినది. అటుతరువాత నేమైనదో యోచింపుడు. **1921** వ

సంవత్సరమందు ప్రజాస్వాతంత్ర్యప్రియుడగు వెనిజోలాస్ కావించిన యేర్పాట్ల నామోదింపగలిగియుండియు గ్రీసు దేశీయులు అదివరకు రాజ్యభ్రష్టుడై పోయిన కాన్‌స్టైన్ టైన్‌రాజును మరల రాజు గావించిరి.

కాబట్టి ప్రజాప్రభుత్వము చూపులకు సులువుగా నగపడునుగాని క్రియకు దుస్సాధ్యము. అట్టి పాలనా పద్ధతి సర్వోత్తమపద్ధతియే. కాని క్రియకు మహాకష్ట భూయిష్ఠము. క్రమముగా లోకమంతటను వ్యాపించు పాలనాక్రమ మిదియే. కాని దానిపునాది వేయుట నుండియు నమితకష్టమైన పని.

ప్రజాపక్షవాదులు ఇంగ్లాండునందైన నేమి, యూరపునందైన నేమి, ఇండియా, ఏషియాలనందైన నేమి ప్రజాప్రభుత్వము శీఘ్రముగా నెరవేరకుండుటకు కారణము అధికారుల మాయయు, దౌర్జన్యమనియు వక్కాణించుచున్నారు. ఇట్టివాదను చెప్పుటకు బాగుగ నేయున్నదికాని న్యాయమునకు కట్టుబడినదికాదు. అదివరకు స్థిరపడియున్న యధికారులు తమయధికారము నొక్కుమారు ప్రజాసామాన్యమునకు వదలివేయుట కిష్టపడరన్న మాటనిజమేకాని, రాజులును, అధికారగణములును తమ యధికారమును విడువనొల్లకుండుటకు ఒక్కస్వార్థప్రీతియే కారణము కాదు. ఇందుకు కారణము ప్రాయికముగా నేమనగా, అధికారక్లేశము పడిపడి, అధికారము చేయనివారికన్న నెక్కువగ దానికష్టములు తెలిసి తెలిసి, రాజ్యభారము వహింపదలచిన ప్రజాసామాన్యమునకు దగినంత విద్యయు, వివేకమును గలిగినగాని ప్రజారాజ్యము గందరగోళమై మునుపటికన్న మరింత లోకకంటక మగునని నిశ్చితాభిప్రాయముతో నట్టియూహ చేయుటయును గలదు. నేను పైనిచెప్పిన ప్రజాప్రభుత్వవృత్తాంతమును బరిశీలించి చూచినచో దీనినిజము వెల్లడియగును. ఎన్ని ప్రయత్నములు చేసినను, ఏది ఎట్లయినను, తుట్టతుదకు ఏయే దేశములయందలి ప్రజలు యేయేవిధ ప్రభుత్వమున కర్హులైయుందురో వారి కట్టి ప్రభుత్వమే లభించును. ప్రజారాజ్యమునకు సామర్థ్యము గలప్పుడే యట్టిరాజ్యము సిద్ధించును.

ప్రజాప్రభుత్వావశ్యకత

ప్రజారాజ్య మనగా నేమి? ఎట్టి ప్రభుత్వమును నెరవేర్చుటకు ప్రజలు నడుముగట్టిరో ఆ స్వప్రభుత్వము స్వీయపరిపాలనము. కాని తదాచరణమందు సాధారణముగ స్వీయత్వమునే మన్నించి పరిపాలనాభాగమును గణింపకున్నారు. అదియే ఇంతయనర్థమునకు మూలమయినది. ప్రజారాజ్యము, ప్రజలు తమ్ముతాము వశపగచుకొననేర్చినప్పుడే నిశ్చయముగా నెరవేరును. ప్రజారాష్ట్రములు నిష్ఫలములై పదేపదే అంతరించుటకు గారణము ప్రజలు, తాము నడుపబూనుకొనిన ప్రక్రియను తిన్నగా నడుపునంతటి విద్యావంతులు కాకుండుటయు; విధ్యుక్తముగ పన్నులు చెల్లించుచు, లంచము లిచ్చి పుచ్చుకొనకుండునటుల స్వరాజ్యసంరక్షణమునకు దగినంత యాత్మత్యాగము జేయుచు, న్యాయమైనట్టియు, యోగ్యమైనట్టియు ప్రభుత్వమును నెరవేర్చునంతటి ఇంద్రియనిరోధము కలిగియుండకపోవుటయును, అట్లని ప్రతిమనుష్యుడును ఈసంప్రదాయములు పూర్తిగా దెలిసి కార్యక్రమము నిర్ణయింపవలెనని నామతము కాదు. అట్లే యయినచో, లండన్ పీఠములలో జరుగు దుర్నయములను జూచినవారికి ఇంగ్లాండులోని ప్రజాప్రభుత్వము ఇంతసఫలమైయుండుట యసంగతముగా దోచకపోదు దీని యభిప్రాయ మేమనగా ప్రజాప్రముఖులలో చాలినంతమంది తాము న్యాయమని నమ్మెడి పనులను నెరవేర్చునంతటి ధైర్యసాహసములు, పరిజ్ఞానమును, పరోపకారబుద్ధియును, యోగ్యతయును గలిగియుండవలెనని యోగ్యులును, బుద్ధిమంతులునైన నాయకులను అనువర్తింపనంతటి శిక్షయు, పరశ్రేయోభిలాషయు గలిగియుండవలయునుగాని స్వర్గము కరతలామలకముగా జూపించి మోహపెట్టియు, భయపెట్టియు తప్పుత్రోవల త్రొక్కించి, తత్కాలస్వలాభమును పొందదలచిన ప్రియంవదుల ననువర్తింపకుండుటయని. ప్రజారాజ్యమునకుగావలసిన దిది: దూరదృష్టిగల నాయకులును, యుక్తాయుక్తవిచక్షణము గల్గిన వోటర్లును, చాలినంద రేదేశములో నుండరో, ఆదేశమందు ప్రజారాజ్య మెంతయత్నించినను కొనసాగదు.

స్వరాజ్య పరికరములు

ఇంక నిజమైన స్వరాజ్యమునకుం గావలసిన పరికరముల నాలోచింతము. మొట్టమొదట బైనుండివచ్చు విరోధులకు లొంగకుండవలయును. ప్రతిప్రజారాష్ట్రము స్వసంరక్షణమునకు దగినంతసామర్థ్యము గలిగియుండవలెను. కాని పైనుండివచ్చు నుపద్రవములు కాని, వాటిని నివారించు నాత్మసంరక్షణతంత్రములు కాని, క్రొత్తగా స్థాపింపబడిన స్వరాజ్యమున కధమము కొంత కాలమువరకైనను దుర్భరభారము కాకుండవలయును. మిక్కిలి పురాతనములైనట్టియు, సార్థకము లగునట్టియు ప్రజారాష్ట్రములగు అమెరికా, యింగ్లండు, స్విట్జర్లండు దేశములు పై విరోధులు రాకుండ నైసర్గికసంరక్షణము గలిగియున్నవే.

ఇది సాధించిన తరువాత, మంచిరాజ్యాంగపద్ధతి సమకూర్చుకొనవలయును. క్రమమైన రాజ్యాంగతంత్ర మనగా శాస్త్రసమ్మతమాత్రమై యాచరణానర్హమైనది కాదు. శాస్త్రసమ్మతమైన శాసనకాండము నిర్మించుట సులభమే. కాని యట్టిదానితో బ్రయోజన మేమి? క్రమమైన రాజ్యతంత్ర మన్నప్పుడు దేశకాలపాత్రోచితమై, యాయాప్రజల స్వభావముల కనుగుణమై, రాజకీయములందు వారివారి బలాబలముల ననుసరించి, వారి సామర్థ్యముల వినియోగించుటకును, అభీష్టముల నెరవేర్చుటకును అవకాశము గలుగునట్లు నిర్మించినపద్ధతి. ఇట్లు కావించుట ప్రాయికముగా ప్రజాప్రభుత్వమందు సంభవించు ప్రబలానర్థకకారణములను, అనగా ప్రజాసామాన్యమునకుం గల యభిప్రాయచాంచల్యము, తొందరపాటు లోనగు దుర్గుణములను, నివారించునంతటి సామర్థ్యము గూడ గలిగియుండవలయును. పరమసమర్థమగు రాజ్యాంగపద్ధతి లేనప్పుడు ప్రజాప్రభుత్వము సాధ్యముకాదు సరే కదా, ప్రజాక్షేమమును స్వేచ్ఛయుగూడ సాధ్యములు కావు. అమెరికా సంయుక్తరాష్ట్రముయొక్క రాజ్యసార్థక్యమునకు గారణము వాటి చక్కని రాజ్యాంగపద్ధతియే.

అటుతరువాత సర్వజన సామాన్యముగా విద్య వ్యాపింపవలయును. సర్వజనోపయోగములగు వార్తాపత్రికలు వ్యాపింపవలయును. విద్యాపరిపాకముచే నెప్పటికప్పుడు లోకవ్యవహార స్వభావమును జక్కగా దెలిసికొని పూర్వోత్తరసందర్భములను జక్కగా బాటింపగలిగినవారికే పాలకశక్తి లభించును. ఇతరులకు సాధ్యము కాదు.

కాని యేది యెట్లున్నను, తప్పక లెక్కకువచ్చు పరికరము ప్రజాస్వభావము. ఏదేశమునకైనను జయాపజయములు ప్రజల యోగ్యత ననుసరించి యుండును. స్వరాజ్యసార్థక్యమునకు గావలసిన యోగ్యతలెట్టివి? చాకచక్యము కావలెను. అదిలేనిది ప్రభుత్వక్లేశముల నెవ్వడును చేపట్టలేడు; చేపట్టి జయింపను లేడు. మేధాశక్తి యుండవలయును. అదిలేనిది రాగద్వేషములకు లోనై బుద్ధి వ్యభిచరించిపోవును. కాని యట్టిమేధయును జాలదు. అది మానవగుణచక్రమున కాద్యంతములు కాదు. మనుష్యులందైన నేమి, మనుష్యజాతులందేమి మేధకుదోడుగా నింక నితర లక్షణసంపత్తిగలవారే ప్రధానపురుషులు. ఆ యితరలక్షణములన నేది? అదే సౌశీల్య మనునది. అనగా నొకయుక్తికేకాక ధర్మమునకు లోబడిన సిద్ధాంతములందలి విశ్వాసము. ఒకదెస ధారాళప్రవర్తనము, పరశ్రేయోభిలాష, త్రికరణశుద్ధి, భూతదయ, స్వార్థత్యాగము, పరమతసహనము, అనుకంప, మిత్రప్రియత్వము; మరియొకదెస నీసద్గుణశ్రేణిసహాయమున విప్రియము, అసూయ, ఆత్మాభిమానము, ప్రమాదము, మోహము, మాత్సర్యము లోనగు లోకహానికరములై ప్రజాప్రభుత్వనాశకములగు దుర్గుణముల జయింపగలుగు సామర్థ్యము. ఈ సుగుణావలంబనము, ఆదుర్గుణనిరాకరణమే సార్థక ప్రజాప్రభుత్వమునకు పునాది. ప్రపంచమందలి ప్రజాప్రభుత్వచారిత్రము సూక్ష్మబుద్ధితో బరిశీలించినచో దాని సంసిద్ధి ప్రజలయోగ్యత ననుసరించియుండు నని గోచరింపక మానదు.

ఇట్టి ధర్మపద్ధతిని బోధించి ప్రచురించుటకు ఇండియాలో నేడు గాంధీమహాత్ముడు చేయుచున్న పని యిట్టివల ప్రపంచమం దెవ్వరివల్లను జరిగియుండ లేదు. మొన్నటి యూరపు మహాయుద్ధమును ఇప్పటి లోకులకు గల ధనప్రాధాన్యమును ఇటీవల లోకమందు వ్యాపించిన ధర్మోపేక్షకు మూలములైనవి. ఈసమయమందు మహాత్ముని బోధవంటిబోధ లోకమం దంతటను గావలసి యున్నది.

అమెరికాయందు గావలసియున్నది; ఇంగ్లండునందు గావలసియున్నది; ఆఫ్రికా, ఏష్యాలలో గావలసియున్నది; ఇండియాకు గావలసియున్నది. ధర్మాచర్యము, పుణ్యశీలతయు గలిగిన కొలదిని ఏదేశమునకైనను స్వదేశ విదేశ సంబంధములయం దభ్యుదయమొందుటేకాక స్వరాజ్యము వ్యాపించి క్రమాభివృద్ధిగా బాగుపడును.

ఇండియా

ఇక పైనిజెప్పిన ధర్మము లిండియాయం దెంతవరకు వర్తించునో కొంతసేపు చర్చింపవలదినాను. అట్లు చర్చించుటకు ముందు కొన్నియంశము లుపోద్ఘాతముగా జెప్పవలసియున్నది. లౌకికాటంకముల నెంత వేగిరముగా ద్రోయగలిగితే అంతవేగము ఇండియాదేశీయులు స్వరాజ్యభారము నిర్వహింపగాజూచి యానందింప గోరికగల వారిలో నొకడను నేను. అట్లని ఇండియా రాజ్య తంత్ర నిర్మాణమందు 1920 సంవత్సరమందు జరిగిన ప్రథమ ప్రయత్నము విఫలమైనదని చెప్పువాడను కాను. ఇప్పటి ఇండియా రాజ్యాంగపద్ధతి యొక గొప్ప పొరపాటని ఇండియాలోను ఇంగ్లాండులోనుగూడ అనేకులు వక్కాణించుచున్నారు. నా యభిప్రాయము తద్వ్యతిరేకము. ఇందువిషయమై యెవ్వరికైనను అనుమాన మేల కలుగవలెనో నాకు బోధపడకున్నది. ఇది పొరబాటయితే పొరబాటుగా కుండగ జేయవలసిన పనియేది. ముప్పది రెండుకోట్ల యేబదిలక్షుల జనసంఖ్యగలిగి, అనేక జాతి మతభాషా ప్రకృతిభేదములు గలిగిన యొక పురాతన దేశము, రాగద్వేషము నత్యంతముగ పురికొల్పుచు న్యాయబుద్ధికి జోటియ్యని ఘోరయుద్ధము ముగిసిన తరువాత, పాశ్చాత్యదేశవాసులే యుద్ధావసరమున ఆత్మానందము కొరకై యుచ్చరించుకొను స్వతంత్రత, స్వకార్య నిర్వాహము, లోనగుపలుకులు మాకే మనోహర మధురగాన ప్రాయమున జెవుల విందుచేసి మత్తెక్కించునప్పుడు, ఇదివరకెన్నడును ఏదేశమును యత్నింపని మహోద్యమముతో అవలీలగా స్వరాజ్యసముద్రమునకు తెప్పలు వేయజొచ్చెను. ఇం దాశ్చర్య మేమనగా ఆయవసరము నను సరించి సహస్రముఖములుగ ప్రవహించిన యుత్సాహ ప్రవాహమందు రష్యా, ఇటలీ, స్పెయిన్ దేశములలో ప్రభుత్వనిర్ణయము లన్నియు కొట్టుకపోయినట్లు ఇండియాలోకూడనూతనరాజ్యతంత్రము కొట్టుకపోకనిల్చినది. జరిగిన దేమనగా భారతీయస్వరాజ్యాంగపద్ధతి ఈ గందరగోళమనెడి తనిఖీకి చక్కగా నాగినది స్వాతంత్ర్య మహ్యముపలన గలిగిన యలజడికి చక్కగా నిలబడినది. ఈ పద్ధతి నిర్దుష్టమైనదని నా యభిప్రాయము కాదు; కానే కాదు. కాని తనిఖీ కాగినది. ఇండియా దేశీయుల ఐకమత్యము సమర్థించి నిల్చినది. భారతీయులను, బ్రిటిషు వారును ఒండొరుల యూహలను మతములను మునుపటి కన్న ఎక్కువగా దెలిసికొనుట కవకాశమిచ్చినది. భారతీయులు తమ ప్రతినిధులుగ నెంచుకొనినవారికి రాజకీయాంశములు స్వస్వరూపముతో తెలియుటకు వీలిచ్చినది.

కాని కొందరందురు 'నీవన్నది నిజమేకాని, ఈ నిరంతరద్వేషము మాటేమిటి? ఈ కొట్లాటలు, ప్రజలు దొరతనమువారియెడల నీయుదాసీనబుద్ధి, దొరతనమువారు ప్రజలకు ప్రతిబంధకములు, బెంగాల్ ప్రజలందలి అతివాదుల యాగాత్యములు, హిందూమహమ్మదీయుల వైరములు లోనగునవి?' ఐతే మరేమి జరుగు ననుకొన్నారు?

ప్రజాప్రభుత్వమంటే తన్నులాటలే. ప్రజాస్వతంత్రరాజ్యసిద్ధి యనగా పరమసుఖావహమగు నొక ప్రదేశము గమ్యస్థానముగా చల్లనిసముద్రముపై సునాయాసయానమని ఎవరైనను భ్రాంతిపడిరేని, వారు పూర్వవృత్తాంతములో నొక్కయక్షరము చదివినవారు కారు. వాస్తవ మేమనగా, నట్టిరాజ్యమునకు మార్గమును గమ్యస్థానమునుగూడ పరమసంకటములు. యథేష్టాధికారుల ప్రభుత్వమందు తొక్కిపట్టి తలయెత్తనియ్యని యన్నివిధములకోరికలు, ఎగ్గులు, దెప్పులు ప్రజాస్వరాజ్యమందు పెచ్చుపెరిగి చెలరేగును. వ్యవహారమం దెన్నడును చెల్లనియాశలు మనోరథములును పురికొల్పి లేవదీయును. పూర్వ మధికార బలాత్కారముచే సాధింపబడుచుండెడి కార్యము లన్నియు ప్రజారాజ్యాధికారులు పత్రికాముఖమునను సభాముఖమునను పార్లమెంటు మందిరమునను హేతువాదమూలముగ సాధింపబూని క్రమముగా జనసామాన్యమునకు సర్వోత్తమపక్షము విడిచిపెట్టి అప్పటికి తగిన యూపక్షశ్రేయముల నంగీకరింపుమని బోధ చేయుచుందురు. కాబట్టి, గడచిన ఐదుసంవత్సరముల

ఇండియా దేశపు గందరగోళపు ప్రభుత్వవృత్తాంతమును గూర్చి తలపోసినప్పుడు మూలిగి నిరాశపొందక ఇండియా దేశమును, ఇంగ్లండుదేశమునుకూడ, మా మంచిపని ప్రారంభించినవని మెచ్చి సంతసించుటకు నాకు మనసు గల్గుచున్నది. ప్రజాప్రభుత్వము ననుసరించిన క్లేశమునకు లోనైనాము. వాదప్రతివాదములకు లాగులాటలకు లోనైనాము. కాని పర్యవసానమందు ఇండియాలోనివారును ఇంగ్లాండులోనివారునుకూడ భారతీయ స్వరాజ్యోద్యమము మొదటికన్న నిప్పుడు బాగా ముందరకు వచ్చినదని యంగీకరింపక తప్పదు. ఇందు విశేష మేమనగా ఎంత క్లేశమూలమైనప్పటికి హితకారియైన యీ యనుభవము రాజ్యతంత్రమును భంగముచేయకుండనే యిండియాకు ఘటిల్లినది.

భవిష్యత్తు

కాని మన మత్యంతాకాంక్షతో బాటింపవలసినది భూతముకాదు, భవిష్యత్తు. ఇండియాయందు స్థాపింపదగిన ప్రజాప్రభుత్వమున కింకను విఘ్నములు కలుగనున్నవా? అవి యెట్టివి? ఈ యంశమును మూడు ముఖ్యశీర్షికలక్రిందను వివరించెద. మొదటిది, బాహ్యాటంకము, ఇందువిషయమై ఇండియాకు అంత దుర్నివారమైన కష్టము లేదు. ఇండియాకు పొలిమేర చిక్కులు ఒక యాగ్నేయమూలయందు మాత్రము గల్గుచున్నవి. కాని ఐతే యీ కలిగెడి చిక్కుమాత్రము సామాన్యమైనది కాదు. కైబరుఘాటీపైనెక్కి ఆఫగనుస్థానమునంక దృష్టి నిలిపి యందలి యద్భుతమనుష్యుల లోకోత్తరమైనదేహప్రకృతి చూచినవారికిగాని, వారి ధైర్యసాహసముల ను బరికించినవారికిగాని, ఇంతేకాక వారికలహప్రియత్వము, పరప్రాణధనాపహారవిలాసము గాంచినవారికిగాని మిక్కిలి ఇరుకైన ఆపొలిమేర ప్రాంతమందు ఇండియాకు గావలసిన యాత్మసంరక్షణ యీపాటియాపాటిది చాలదని తెలియకమానదు. అచ్చట భారతీయరక్షక సేనానాయకులను, నిరంతరాపాయములనుండి కాపాడుచు నిలువబెట్టుటకు దగిన యాధిపత్యమును, యుద్ధసామగ్రియును, ఆత్మత్యాగమును గలిగినసేన మేరలేనిది కావలయును.

రెండవది యిండియాయొక్క మహావైశాల్యము. ఇండియా స్వరాజ్యమునకై చేయు ప్రయత్నము ఇదివరకు లోకమందెన్నడును జరిగియుండనంత పెద్ద మొత్తము మీద జరుగుచున్నది. బ్రిటిషువారితో సంబంధమువలన ఇండియాకు గలిగిన మహాలాభ మేమని నన్నడిగినచో నైకమత్యముగా స్వరాజ్యము నడిపించుటకు దానికి గలిగించిన యవకాశమని చెప్పవలసియున్నది. ఈలాభ మెంత గొప్పదో రెండుసంగతు లాలోచించినచో గోచరమగును. రష్యాతీసివేయగా యూరపులో మిగిలినదేశము ఇండియాకన్న పెద్దదికాదు. అందలి జనసంఖ్య యిండియా జనసంఖ్యకన్న హెచ్చుదికాదు. ఇంతజనమునకు జాతిమతాదివైషమ్యమువలన ఎన్నిశతాబ్దములనుండి ఘోరయుద్ధములకు గారణమగుచున్నదో ఆలోచింపవలెను. మరియును అబ్రహాంలింకన్ అధ్యక్షతక్రింద అమెరికాసంయుక్తరాష్ట్రములు ఐకమత్యస్థాపనమునకై పదిలక్షలప్రజను నాశనము చేసుకొని నాలుగుసంవత్సరములు పరస్పరయుద్ధము గావింపవలసివచ్చెను. బ్రిటిషుసంబంధమువలన పైనిజెప్పినలాభము లెన్ని సమకూరినను భరతఖండముయొక్క వైశాల్యము స్వరాజ్యసిద్ధికి ప్రబలాటంకమని చెప్పక తప్పదు. ఇదివరకు లోకములో సఫలమైయున్న ప్రజారాష్ట్రము లన్నియు చిన్నవే. అందులో మిక్కిలి పెద్దదైన యమెరికాసంయుక్తరాష్ట్రము ఇండియాలో మూడవవంతు జనసంఖ్య గలిగి బాహ్యాంతరము లేవియు లేక, ఒక్కభాషనే మాటలాడుచు ఒక్కనాగరకతనే సేవించుచు నూటయేబదిసంవత్సరములు తరిఫియ్యాతు నొంది యున్నది. ఇంకను అమెరికా రాష్ట్రములు పూర్ణస్వరాజ్యసిద్ధికి లొంగనంత పెద్దదేశమని కొందరు చెప్పుచునే యున్నారు. చీనాలో ప్రజారాజ్యము భగ్నమగుటకు నొక ముఖ్యకారణము దాని వైశాల్యమును జనబాహుళ్యమును.

మూడవది ఆంతరంగికవిఘ్నములు. అనగా హిందూ మహమ్మదీయభేదములు. మరియును వర్ణ జాతి భాషా ప్రకృతిభేదములును, 700 సామంతరాజ్యములు లోనగు కష్టములనుకూడ పాటింపవలసియున్నది. వాటిని నేను వివరింపను. వాటి నుదాహరించినమాత్రాన నవి జనుల యైకమత్యమున కెంతభంగకారకములో, వాటివలన స్వరాజ్యసిద్ధి కెంతవైఫల్యమో మీకు గోచరించును. ఈయడ్డముల నన్నిటిని ఏదోయుపాయముచేత నివారింపవలసి యున్నదనిమాత్రము నేజెప్పబూనితిని. ఈయాటంకముల

దలచినంతమాత్రాన అవి యెంతగొప్పవో తోచకమానదు. అవి మిక్కిలి కఠినములగుటచేత కొంతమంది దుర్లంఘ్యములనికూడ నభిప్రాయపడుచున్నారు. కాని తగినంత యోపికగలిగి చక్కగా నివారింపబూనితిమేని ఏయాటంకములును దుర్లంఘ్యములు కావు. ఇండియా యెప్పటికైనను తన్నుదా నేలుకొనగలదని నాకెంతమాత్రమును సంశయము లేదు. కాని యందలికష్టములుకూడ నిస్సంశయములే. వాటిని శాంతముతోను న్యాయబుద్ధితోను పరిగణించి నిర్భయముగా నెదుర్కొన్న గాని వాటిని జయింపలేము.

అన్నిటికన్న కఠినమైన యాటంకము బ్రిటిష్ సామ్రాజ్యమనియు బ్రిటిష్‌వారు ఇండియా వేగిరముగా స్వరాజ్యసిద్ధి నొందుట కిష్టపడరనియు కొంద రనగలరు. ఇదియైనను కనబడినంత కష్టమైన ప్రతిబంధక మని నేను నమ్మను. బ్రిటిష్‌సామ్రాజ్యము 1917 సంవత్సరపుప్రకటనమందును, 1920 సంవత్సరపు రాజ్యాంగనిర్మాణమందును జేసినది యీవిషయమున గడపటి నిశ్చయము. అందునుండి యెన్నడును వెనుదీయదు. సాధ్యమైనంత త్వరలోనిండియా స్వరాజ్యమొందవలెననియే బ్రిటిష్‌వారి సంకల్పమని నాకు దోచుచున్నది. వారిందునుగురించి మందగమనను జేయుచున్నట్లు పైకగుపింపవచ్చును కాని యెందైనను దేశాభివృద్ధి యొకటిరెండుసంవత్సరములలో సమకూరదు. దేశపుమొత్తముపై గావలసిన యభివృద్ధికనేక సంవత్సరము లొకగొప్పకాలముకాదు. ఇండియాయందు పూర్ణస్వరాజ్యము నిర్మింపబడువరకును బ్రిటిష్‌వారు వెనుదీయక తీవ్రదీక్షతో బ్రవర్తింతురని నా నమ్మకము.

విరామము

ఈ యుపన్యాసము విరమింపకమున్న మీ కొక విన్నపము జేయుచున్నాను. మీరు స్వదేశము విడచి ఇంగ్లండువచ్చి భిన్నజనులను భిన్నసంప్రదాయములను విశేషముగా జూచియున్నారు. ఇన్నాళ్లును మీరు పొందిన యీయవకాశమహిమచేత స్వదేశనాయకత్వమున కర్హులైనారు. ఈయనుభవమునువినియోగపరచి పాశ్చాత్యులు ప్రజాప్రభుత్వమందు బొందిన ధన్యతకు హేతువులను దెలిసికొనుడు. ఆ ధన్యతకు మూలము కేవలరాజ్యతంత్రము కాదనియు, ప్రజాప్రభుత్వమునకు మంత్రరహస్యము సౌశీల్యప్రాధాన్యమనియు నిదివరకే చెప్పియున్నాను. ఏమివాటిల్లిన వాటిల్లనీ, సౌశీల్యమే ముఖ్యోపదేష్టయని నమ్మి రాజకార్యములను చక్కబెట్టు సామర్థ్యము గల్గినవారు చాలినందరు బయలుదేరినగాని ప్రజాప్రభుత్వము ప్రబలరాగద్వేషముల కిరవై వాటివలననే నాశమైపోయి, తుదకు ప్రజాక్షేమముకొరకును దేశశాంతి కొరకును ఏదోయొక దుర్దాంతపరిపాలనమును స్థాపింప నవసరము గలిగించుచుండును. రాజకార్యములయందు సుగుణసంపత్తి యేవిధముగా బనిచేయునో నిరూపించుట కష్టము. కావలసినది ప్రతిమనుష్యుడును స్వలాభాపేక్షలేక తాను న్యాయమనినమ్మి నడవడియందు వెనుదీయక రాగద్వేషములకు లోబడకుండుట, దేశకాల పాత్రౌచిత్యముల ననుసరించి నిర్భయముగా గార్యనిర్వాహము గావించుటేకాని తాగోరినట్లు సాగనిసందర్భములన్నిటిపైని పిచ్చివానివలె కత్తిగట్టుట కాదు. ప్రజాసామాన్యక్షేమమునకుగాను ఉద్యోగము, అధికారము లోనగు ఆత్మలాభములను గోల్పోవ సిద్ధపడుట, లోకక్షేమమునకై నిశ్చయముగా కావలసినపనులేకాని,వోటర్లమూకకు అప్పటిమట్టుకు ప్రీతికరములైన పనులు చేయకుండుటకు దగినంతచిత్తదార్ఢ్యము, తనవిరోధులనుండియేకాక, తా నుపకారముచేసి ప్రత్యుపకారము నొంద దలచినవారినుండికూడ దూషణతిరస్కారములొంద సిద్ధపడియుండుట, కక్కుర్తిపనులకు మోహపెట్టి బలాత్కరింపబూనుశత్రువులను అడ్డగించుకొను దూరదృష్టి, స్వార్థత్యాగము, ఇంద్రియనిగ్రహము, ఇవే ప్రజాప్రభుత్వమునకు గావలసిన సద్గుణపరికరము. వీటిని కిప్లింగ్ కవి యీ క్రిందివిధముగా వర్ణించినరీతి మరెవ్వరును వర్ణింపగా నేను చూచియుండలేదు.

“నీ యాశ్రితు లందరు మతులుచెడి,తప్పులుచేసి నీపైబెట్టినప్పుడు నీమతి చెడకుండ గాపాడుకొనగలిగితి వేని;

లోకమంతయు నిన్ను సంశయించినప్పుడు నిన్ను నీవు నమ్ముకొనుచు, పరులసంశయములకును గారణముండవచ్చునని నమ్మగల్గితివేని;

కార్యసిద్ధికి యుక్తకాలము వచ్చువరకును నిరీక్షించుచు, ఆ నిరీక్షయందు విసుగకుంటివేని!

ఒరులు నిన్నుగురించి యసత్యవాదము లాడినపుడు నీ వొరులయెడ నసత్యప్రతివాదము లాడకుంటి వేని;

ఒరులు నీకు విప్రియము జూపినప్పుడు నీ వొరుల యెడ విప్రియము జూపక, లోకమందు నీ వొక్కడవే తప్పుబుట్టిన యోగ్యుడ వట్లగపడక, బుద్ధిశాలివట్లు చెప్పుకొన కుంటి వేని;

దీర్ఘసూత్రముల బన్నగలిగి, యాపన్నిన సూత్ర ములందు బరతంత్రుడవు గాకుందు వేని; మూలాలోచన చేయగల్గి యాయాలోచనలే పరమావధిగా జేసికొనకుందు వేని;

భాగ్యాభాగ్యములు తారసిల్లినప్పుడు రెండింటిని ఒక్కటేవిధమైన నిర్లిప్తతతో జూడగల్గుదు వేని;

నీవాడిన సత్యవాక్యమును దుర్జనులు తలక్రిందు గావించి, యజ్ఞానులను బట్టుకొను బోనుగా జేసినపుడు, నీవు విని సహింపగల్గుదు వేని;

నీవు నీజన్మమంతయు ధారపోసినపనులు నీశత్రు వులు భగ్నము గావించినపుడు చలింపక చూచి చూచి, మొనవిరిగి వంగిన నీసామర్థ్యముతో వాటిని బునరుజ్జీవము గావింప గలిగితి వేని;

నీ సూర్జనమంతయు నొకకుప్పగాజేసి యొక ఘన కార్యముపై నొడ్డి పోగొట్టుకొని, మరల మొదటినుండి యారంభించి దిద్దుకొనుచు నీకువాటిల్లిన నష్టముంగూర్చి నీతోనైన నీవు పలుకకుందు వేని;

నీహృదయము, నాడులు, కండరము, దుర్బల మైనపుడు నీకార్యములయందు బలాత్కారముగా జోర పెట్టుచు, మనోదృఢిమతప్ప నీయందు మరేశక్తియు లేన ప్పుడును, వాటిచే బనిపుచ్చుకొనగలిగితి వేని,

మానవాధములతో గలిసి మెలసి ప్రసంగించుచు, నీ యోగ్యత చెడకుండ గాపాడగల్గితి వేని; రాజులతో జెట్ట పట్టముల వేయుచు ప్రజలతో నీకుగల యనుబంధము సడలింపకుంటి వేని;

శత్రువులుగాని పరమమిత్రులుగాని నీకు చిత్తక్షేప జేయ నేరరేని;

మానవలోకమంతయు నీశరణుజొచ్చినపుడు నీ వందరినమ్మికలును సార్థకముగావింప నేర్చితి వేని;

ఒరులు నీ కపచారము గావించినపుడు నీవ క్షమియుష్వైన యొకనిమిషమును ఆనిమిషమందలి యరువది క్షణికములకు దగినట్లుగా లోపమును బూర్తిసేయ గలి గితి వేని;

ప్రపంచమంతయు నీది, ప్రపంచమందలి భాగ్య ము లన్నియు నీవి. ఇంతేకాదు; నాయనా, నీమానవ జన్మము సార్థకము కాగలదు."

ఇండియాను స్వరాజ్యసంస్థానముగ జేయదగు యోగ్యత లివి వీనివలన గార్యసిద్ధి యగున ట్లితరగుణ ములవలన గాదు—వక్తృత్వము, మేధ, ఆవేశము, ఊహ వలన గాదు. ఈగుణము లన్నియు దమతమవంతుగా బనికి వచ్చునేకాని స్థితప్రజ్ఞ బుద్ధిబలమువంటివి కావు.

కాబట్టి మీకు సామర్థ్యము, ధైర్యము, యోగ్యత చాలినంత కలిగనేని యిండియా యావద్విష్యము మీపై డికిటనున్నపని. ఉత్తమస్వభావము కలిగిన యొక్కమను ష్యుడు తనయావద్దేశపు స్వభావముమార్చి కొత్తతోవను బెట్టగలడని మానవచారిత్ర ముద్ఘోషించుచున్నది. కాబట్టి దీర్ఘదర్శిత్వము, పరమతసహనము, ఇంద్రియనిగ్రహము, చాకచక్యము, లోకజ్ఞానము, యుక్తాయుక్తవివేచనము, పరశ్రేయోభిలాష, రాజకీయమందు ప్రధాన నాయకత్వ మునకు లక్షణము లగుటచే వాటిని మీరెప్పుడు నేర్తురో ఆమరునా డిండియా మీది. వాటిసహాయముతో మీదేశ మిప్పుడు పొందియుండనిస్థితికి దేగలరు. మీయవకాశము లన్నియు జక్కగా వినియోగపరపుడు. మానవచరిత్ర యందలి మార్గదర్శుల వృత్తాంతమును, మాటలు చెప్పక గొప్పకార్యముల నిర్వహించిన మహానుభావుల వృత్తాంత మును వినుడు. ప్రజారాజ్యస్థాపనాచార్యుడగు అబ్ర హాం లింకన్ యొక్క జీవితము ననువర్తింపుడు. ఇట్టి పరి కరములతో మీరు దేశసేవ సేయుదురేని ఇంగ్లండులోను, మరి ప్రపంచమం దంతటనుగూడ మీకు మేలుకోరువా రసంఖ్యాకముగా నుందురు.



మాహేశ్వరీ స్తవము

ముకుంద రామమూర్తిగారు

శ్రీవాణీకమలాసతీమణులు సుస్మేరాస్యలై కొల్చి సం
భావింప న్దివిజాధిపప్రవరగీర్వాణుల్ నతుల్ సేయ సు
శ్రీవాల్లభ్యముల న్గడించి కరుణాచిత్తంబునన్ గూర్చు ని
న్భావాతీతగుణాకరన్ గొలుతు నంబా, తల్లి, మాహేశ్వరీ!

మ. సిరులున్నన్ ఫలమేమి? దీనులను రక్షింప న్వలె న్గాక; య
ట్ల రసోదంచితచారుసత్కవనలీలాసంపద ల్గల్గ సు
స్థిరవాల్లభ్యపదప్రదాయకశుభశ్రీపాదపద్మమ్ము ల
ర్థి రహి న్గొల్చినఁగాక కల్గునొకొ ముక్తిప్రాప్తి మాహేశ్వరీ!

మ. పరనారీమణులన్నఁ దల్లులుగ సంభావించుటే కాక నె
వ్వరిమైశ్వర్యవిశేషము ల్గనిన నావంతేని నాపేక్షణం (?)
బరయన్ బొందకయుండుటె కాక తనకాయం బెట్లు ప్రేమించు న
ట్ల రతి న్సర్వముఁ గాంచు నాతఁడు; జగచ్ఛ్లాఘ్యుండు మాహేశ్వరీ!

మ. మతవిద్వేషము లూని దుర్మతులు సమ్మానాత్ములై పొందితీ
యుతులై సాధుల హేయపూనటులు నన్యోన్యంబు వీక్షింతు రా
దృతి నేనాడి యిదేమి కర్మమొ ధరన్ దేవీ! జగచ్ఛాసనా
తతశక్తి న్వెలయింప వేళ యిది కాదా తల్లి, మాహేశ్వరీ!

మ కుటిలాచారుల సాధుహింసకరరక్షోనాథులం బాపక్ర
ద్భటవిస్తారులఁ జండముండులను నుద్యల్లీలఁ జెండాడి యు
త్కట ధూమ్రాక్షుని సంగరాంగణమునన్ ఖండించి విశ్రాంతి కై
వెట నున్నావొ కటాక్షముంచుతజీ తల్లి, గౌరి, మాహేశ్వరీ!

నురుపూరుకోట-దేవాలయము

కో. నరసింహాచారి గారు

నురుపూరు పాంచాల దేశములో బియాసు నది యొక్క యుపనదియగు నొక చిన్ని ప్రవాహపుటొడ్డున నున్నది. దీనియెత్తు సముద్ర మట్టమునకు 2000 అడుగులు. ఇది పూర్వము పఠానీయు లను నొక రజపుత్రతెగవారిచే పాలింపబడుచుండిన చిన్నకొండ రాజ్యమునకు ముఖ్యపట్టణముగనుండి తత్కాలమున శాలువలవ్యాపారమువల్లను; కాశ్మీర, చంబ, లాడక్ రాజ్యములకు పోవు మార్గమున నేనలుకూడుప్రదేశముగా నుండినందునను ప్రాముఖ్యముగలిగి మొగలుల యుచ్చదశయందున్నతదశ ననుభవించుచుండినది.

విష్ణుపురాణములోను, వరాహమిహిరుని బృహత్సంహితలోను, పేర్కొనబడినయౌదుంబరరాజ్యమిదియె. ఈ పరగణాకు ప్రతిష్ఠానపురము, పైఠాను అను పేర్లు కలవు. పైఠానీయరాజులు రాణా బిరుదాంకితులై త్రిగర్తరాజుల సామంతులై యుండిరి.

మొదట నీరాజులు మైదానములయందుండి యనవరతము శత్రువులదాడికి లోనై యుండినందున వీరు 'పఠాణకోట'కు 6 మైళ్ళ కుత్తరముననుండు 'మాప' అను నొక దుర్గమప్రదేశమును జేరిరి. ఈప్రదేశము కొండలచే జుట్టుకొనబడి కంటక శిలావృతమై యుండినందున శత్రువుల కభేద్యమై, దీనిపై దాడివెడలువారికి మృత్యుసంఘటనము చేయునదియై యొప్పుచుండినందున చండశాసకులగు మొగలులకు సహితము ప్రక్కలో బల్లెమై యుండెను. వసుదేవరాజు దీనిని పాలించుచుండెను. అతడు అక్బరు చక్రవర్తిచే విజితుడై అక్బరుపుత్రుడగు జహాంగీరునకు సహకారిగ నుండెను. వసుదేవునియనంతరము వాని తనయుడు సురాజమల్లుడు సింహాసన మధిష్ఠించెను. జహాంగీరు, తనకు సురాజమల్లునియం దంత స్నేహభావము లేకున్నను, వానితండ్రి తనకొనర్చినతోడ్పాటును మనస్సుననుంచుకొని సురాజమల్లునికిగూడ 'రాజ'బిరుదము నొసగియుండెను. కాని సురాజమల్లుడు మొగలుచక్రవర్తికి తిరుగబడినందున నాతనిచే నోడింపబడి తరుమగొట్టబడి స్వప్రాణరక్షణార్థము చంబారాజ్యమున దాగెను. ఇతని సోదరుడు మాధవసింహుడుగూడ నితనితోనే యుండెను. మొగలుసైనికులు సురాజమల్లునికై చంబాపైకిగూడ దాడివెడలుచున్న సమయముననే సురాజమల్లుడు మరణింపగా తద్వార్తవిని మొగలుసేనాని చేసినయుత్తరువుప్రకారము చంబారాజు సురాజమల్లుని ధనకనకాదులను, సోదరుడగు మాధవసింహుని మొగలుల కప్పగించెను. ఈలోన జహాంగీరు వసుదేవుని మూడవకుమారుడగు జగత్ సింహుని వంగదేశమునుండి (Bengal) రావించి రాజ్యాభిషిక్తుని గావించెను. జగత్ సింహుడు ధైర్యశాలి; తన స్వామిభక్తిపరాయణతవల్లను, ధైర్యసాహసౌదార్యాది గుణసంపత్తివల్లను, చక్రవర్తి కాప్తుడై, 3000 పదాతులకును, 2000 అశ్వికులకును నాయకుడై, 'రాజ'బిరుదాంకితుడై ప్రసిద్ధికాంచెను. ఒకప్పుడు చక్రవర్తినుండి 20,000 రూప్యముల బహుమతికూడ పొందియుండెను.


షాజహాను చక్రవర్తియయిన కాలమునగూడ నితడు తనపూర్వగౌరవమును నిలుపుకొనినవాడై యనేక తరుణములయందు తనసాహసమును జూపుచు చక్రవర్తికి తోడ్పడియుండెను. కాబూలునుండి పారశీకులను పారదోలి జమీాణ్డావరు నాక్రమించుటలో నితడే యగ్రగణ్యుడై యొప్పెను. తర్వాత జగత్ సింహుడు కోహాటు, బంగాష్ ఖుర్రమ్‌లోయలకు ఫౌజుదారుడుగా నియమింపబడెను. తనసోదరుని మొగలుల కప్పగించిన కారణముననేమో చంబారాజగు జనార్దనునిపై పగసాధింప

నెంచినవాడై వానితో బోరి వానిజంపి తానే చంబా కధిపతియై 20 సంవత్సరములు రాజ్యమేలెను. చంబా రాజ్యములో చంబా నురుపూరుల సరిహద్దున నుండు దుర్గమమగు నొకపర్వతశిఖరమున తారాఘర్ (తారాగృహము) అనుకోటను కట్టుకొనెను.

జగత్సింహుడు తనకింతవరకును గలిగిన జయముల వల్ల గర్వించినవాడై బలిష్ఠమగు గిరిదుర్గమునందనుండ తన కపాయమును కలుగదని యెంచి స్వాతంత్ర్యాభిలాష పురికొల్ప తన కున్నతపదవుల నొసగి మన్నించుచుండినను తనకుమారుడు రాజరూపసింహుడుగూడ తన్ను జేర చక్రవర్తిపై దిరుగబడెను. ఇట్లు తిరుగబడిన తండ్రిపుత్రుల శిక్షింపవలెనని మొగలుచక్రవర్తి యపరిమితసైన్యము నంప సర్వవస్తుసమృద్ధిగలిగి శత్రువుల కభేద్యమయి మాసములపర్యంతము ముట్టడిసిని తాళజాలినదయ్యును శత్రుసైన్యము లసంఖ్యాకములై యుండినందునను, దుర్గమమును రహస్యమును నైన కారణమున చక్కగా రక్షింపబడక యుండిన యొక మార్గమును రాజద్రోహి యొకడు శత్రువులకు జూపుటవల్లను, పరసైన్యములు సులభముగా కోటను సమీపింపగలిగినవి. కాని శూరులగు భటులచే రక్షితముగా నుండిన యానురుపూరు కోటను మొగలుసైనికులు తీసికొనజాలకపోయిరి. జగత్సింహుడీకాలమున 'మాప్' అను తన మరియొకదుర్గమున నుండినందున మొగలు లాకోటను ముట్టడించిరి. జగత్సింహుడును 5 దినములు తీవ్రముగ బోరాడి 1400 శత్రుసైనికుల నిహతుల గావించెను. అయినను, దీర్ఘకాల మతడచ్చట క్షేమముగా నుండగలడను ధైర్యము లేనందున మాప్కోటను విడచి బలవత్తరమగు తన తారాగృహదుర్గమున కేగెను. 'మాప్' శత్రువులపాలగుటయు, తండ్రి తారాగృహమున కేగుటయుజూచి రాజరూపసింహుడు నురుపూరుకోటను వదలి తండ్రిసహాయార్థము తారాగృహమునకు బోయెను. ఇట్టితరుణమున చంబారాజగు పృథివిసింహుడు మండి సుకేతులను నిద్దరి సహాయమున చంబాలోని జగత్సింహునిపరివారముల నన్నింటిని బాఱదోలి చంబాను మరల స్వాధీనపఱచుకొనెను. ఇంతియకాక షాజహాను ఉత్తరువుమేరకు తారాగృహమును ముట్టడించునపుడు తన సైన్యములతో చక్రవర్తికితోడ్పడ బోయెను. ఇవిగాక జగత్సింహుని విరోధి మానసింహుడను గ్వాలియర్ రాజుకూడ చక్రవర్తికి తోడ్పడెను. ఇట్లు నలువైపులను నసంఖ్యాకములగు మొగలులచేతను, వీరాగ్రేసరులగు మానసింహపృథివిసింహుల సైనికులచేతను ముట్టడింపబడి, జయముపై నాశవదలుకొని, ధైర్యశాలియు, పరాక్రమవంతుడును, శూరాగ్రేసరుడును నగు జగత్సింహుడు చక్రవర్తికి లోబడి క్షమాపణ వేడుకొనక తప్పదయ్యెను. అడుగుటయే తడవుగా చక్రవర్తియు వానిని క్షమించి జగత్సింహ రాజరూపసింహులకు వారిరాజ్యమును, పదవులను ఇచ్చి గౌరవించెను. తర్వాత పూర్వవైరముల మఱచి కడు కృతజ్ఞతతో జగత్సింహుడు కాంధహార్, బడక్షాన్ మొదలగు దేశములలో చక్రవర్తికి తోడ్పడి యతనికి గౌరవపాత్రు డయ్యెను. ఇతడు ఉష్బెకు లనువారిని దండించుటకై వెడలి యుండగా నారోగ్యముచెడి పెషావరుకువచ్చి యచ్చట సం. 1646 మున మరణించెను. ఇతని ధీరకృత్యము లిప్పటికిని రాజకీయోత్సవాదులయందు రాజభక్త్యుద్బోధకము లగు పాటలుగా పాడబడుచున్నవి. తర్వాత రాజరూపసింహుడును తండ్రివలెనే చక్రవర్తిచే ప్రేమింపబడి 1500 పదాతులను, 1000 అశ్వికులను నాయకత్వము నొసగబడి గౌరవింపబడెను. కాని తారాగృహదుర్గమును మాత్రమితనికియ్యక భావిపర్యాలోచనగలవాడై చక్రవర్తి తన యధీనములోనే యుంచుకొనియుండెను.


రాజరూపసింహుని యనంతరముమాంధాత రాజ్యమునకు వచ్చినట్లు ప్రతీతి కలదు. కాని మహమ్మదీయ చరిత్రకారులు, జగత్సింహుని యనంతర మతని మరియొక కుమారుడగు భావసింహుడు రాజయినట్లును, మహమ్మదీయమతమును స్వీకరించి 'మురీదుఖా' నాహ్వయు డైనట్లును వ్రాసియుండిరి. మాంధాత తన పితామహు డగు జగత్సింహుని శూరకృత్యగీతములందు చాల భాగమును తానే స్వయముగ రచించియుండెను. ఫతేపూరులో నురుపూరు సమీపమునగల దేవాలయమును, నురుపూరు కోటలో నొక భాగమును ఇతనిచే గట్టబడినవి యున్నవి. కోటలో నొకభాగమున మాంధాత చిత్రపటముకూడ వ్రాయబడియున్నది. వీటినిబట్టిచూడ నితడొక గౌరవపదవియం దుండి ప్రసిద్ధపురుషుడైనట్లు తోచు

చిత్రము ౧



నురుపూరుకోటలోని దేవాలయము

చిత్రము ౨



దేవాలయముగోడపై నున్న చెక్కడపుపనిగల సొరుగుబిళ్ల — నురుపూరు

చిత్రము 3



దేవాలయ కుడ్యభాగము:—సురపూరు

మున్నది. ఇతనితర్వాత దయాధాత, పృథివిసింహ, ఫతే సింహులు క్రమముగా రాజ్యాధిష్ఠితులైయుండిరి. వీరి శకము మొగలులక్షీణదశకాలములో చక్కగా జరిగినది. ఫతేసింహునియనంతరము నురుపూరురాజులలో కడపటివాడగు వీరసింహుడు 1805 సంవత్సరమున రాజ్యమునకు వచ్చెను. 1815 సంవత్సరమున రంజితసింహుడను వానిచే నోడింపబడి చంబారాజ్యమునకు వెళ్లి తనబావయగు చరత్ సింహునియండజేరి యచ్చట కొంతసైన్యమును కూర్చుకొని నష్టరాజ్యపునస్సంపాదనకై యత్నించెను. కాని మరల నోడింపబడి భగ్నప్రయత్నుడై యీమారు బ్రిటిషురాజ్యమున తలదాచుకొనవలసినవా డయ్యెను. 1826 సంవత్సరమున వీరసింహుడు మరల తన రాజ్యమునకు ప్రచ్ఛన్నుడై యేగి, తన ప్రజలు తన్ను గుర్తించి రాజభక్తి విశేషముగా వెల్లడిచేయుచు తనకు దోడ్పడినను, దురదృష్టవశమున నీమారుగూడ నోడింపబడి చంబాకు బాఱిపోయెను. చంబారాజన్నను, శత్రువుల బాధవల్ల వీరసింహుని చేవిడచినందున అమృతసరము నద్ద గోవిందఘుర్ (గోవిందగృహము) అనుచోట కారాగృహమున నుంచబడెను. 7 సంవత్సరములు కారాగృహవాసశిక్ష ననుభవించి తనబావచే నమ్ముకొనబడిన 85,000 రూప్యముల పరిహారమునకుగా విమోచనమును బొందెను.

స్వాతంత్ర్యమే తమజీవముల కన్న నెక్కుడుగ గణించు శూరాగ్రేసరులగు పఠానీయ (ప్రతిష్ఠాన) వంశస్థుల నైజమున కనుగుణ్యముగను తననామము సార్థకమై యొప్పునట్లును, వీరసింహుడు మరల తన నష్టరాజ్యసంపాదనమునకై చేసిన యంత్యప్రయత్నమున నురుపూరు కోట వాకిలివద్ద 1846 సంవత్సరమున యుద్ధరంగమునుండి వీర స్వర్గమును జేరెను. కొంతకాలముతర్వాత నురుపూరు బ్రిటిషువారి యధీనమున నుండగా రాజసింహుడను నురుపూరురాజు తన స్వాతంత్ర్యపతాకమును నెలకొల్ప బ్రయత్నింప, బ్రిటిషువారిచే 1849 సంవత్సరమున నోడింపబడినందున రాజ్యము బ్రిటిషువారి లెక్కలలో జేర్చుకొనబడెను.

ఇట్లు శౌర్యవంతులగు నొక రాజపుత్రశాఖవారికి ముఖ్యపట్టణమై పేరుకెక్కిన నురుపూరుకోట వసుదేవ రాజుచే గట్టబడినది. 1622సంవత్సరమున జహంగీరుచక్రవర్తి చూచునప్పటికి కోటలో గొంతభాగమే కట్టబడియుండినది. ఆప్రదేశ రామణీయకమునకు సంతసించి పాదుషా యచ్చట రమ్యములగు భవనముల గట్టుట కొక లక్షరూప్యముల నిచ్చెను. కోటమొత్తమును ఒకరాజుచే గట్టబడక తరతరమునందును కాలానుగుణ్యముగా వృద్ధి పఱుపబడినదై యున్నది. ఇట్లే సురాజమల్లు, జగత్ సింహుడు, మాంధాతయు క్రమముగా కొంత కొంతకట్టి కోటను పూర్తికావించిరి.

మాంధాత కోటలోపడమటిభాగమున నొకయాలయమునుగట్టించెను. దానిపేరు ఠాకుర్ద్వారము. ఇందు చక్కని శిల్పనైపుణ్యము దెలుపు 'వ్రజరాజ' (కృష్ణ)విగ్రహము నల్లరాతితో చెక్కబడినది కలదు. కుడ్యములపై కృష్ణలీలలును, నొకచోట నొక హిందూరాజరూపమును చిత్రింపబడినవి ఇవి ఇప్పటికినిగలవు. కోటలోమఱియొక దేవాలయముకూడ(చిత్రము౧)కనుగొనబడినది. ఇది మొదట భూమిలో పూడియుండి దానిపై నొకయాంగ్లయుద్యోగిని నివేశన ముండినది. ఒకానొకసమయమున నాప్రదేశమున భూగర్భస్థమగు దేవాలయభూమిక (Basement) కనుగొనబడినది. భూమికప్రక్కలయందు కదునంపములగు చెక్కడపుపనులు గలవు. ఆలయము 117 అ. పొడవును 50 అ. వెడల్పును గలిగియున్నది. ఇందు ముఖమంటపము, అంతరాలయము, గర్భగృహము అను 3భాగములు కలవు. గర్భగృహభూమిక అష్టముఖములుగలిగియున్నది. సింహద్వారము దక్షిణదిశను కలదు. పూర్వ పశ్చిమముల యందును ద్వారములును సోపానములును కలవు. మంటపమున పూర్వపశ్చిమభాగములయందు జంట స్తంభముల వరుసలు రెండు కలవు. స్తంభపీఠములపై గల యలంకారశిల్ప (Ornamentation) మింకను మంచిస్థితియందుండి మహమ్మదీయశిల్పము ననుసరించియున్నది. ఆలయ కుడ్యములపై గల యనేకశిల్పచిత్రము (౨, 3 చిత్రములు.) లింకను మంచిస్థితియం దున్నవి. గంగా, యమునా దేవులును, గోవుల మేపు గోపాలకులచేతను గోపికలచేతను పరివేష్టింపబడి వేణుగాన మొనరించు కృష్ణుడు, కాళీయమర్దనము, దశావతారములు, దుర్గాదేవి, సూర్యుడు, విష్ణువు, తపోనిష్ఠ నుండు యోగులుమొదలగు చిత్రములు కలవు.

మూగినోము

అధికార్ల సూర్యనారాయణ రావుగారు, బి. ఏ., బి. యల్.,

1. నోముపట్టితే
నోములఫలమా,
నోముపట్టితే
చెప్పవే, సఖి,
నోముపట్టితే, చెప్పవే.

2. కరమున గుంకుమ
బరిణ నుంచుకొని
తిరిగెద విండ్లకు
జవ్వనీ, యిటు
తిరిగెద విండ్లకు, జవ్వనీ.

3. బొట్టులుపెట్టిన
బొట్టెలమోదము
పట్టుకుపోదువె
బాలికా, వడి
పట్టుకుపోదువె, బాలికా.

4. వ్రతముపేరు నీ
వలచినఫలంబు
బ్రతిమాలుదునే
తెల్పవే, చెలి,
బ్రతిమాలుదునే, తెల్పవే.

5. మగని రాకయో
మనసున వలపో
మరియేశుభంబు
కోరితే, సఖి,
మరియేశుభంబు, కోరితే.

6. ముసిముసినగవుల
మోము త్రిప్పెదవు,
మూగినోమటే
జవ్వనీ, యిది
మూగినోమటే, జవ్వనీ.

7. చెక్కులగులాబి చిన్నెలుండుటకో
కన్నుల బ్రణయపుకళలురగులుటకో,
పసతోనలవలె తనయుల గనుటకో,
పట్టినదెల్లను బంగారౌటకో.

ఏమికోరితే
భామామణి? యీ
నోమెందులకే
తెల్పవే, సఖి,
నోమెందులకో, తెల్పవే.

సర్ టి. ముత్తుసామి అయ్యరుగారి జీవితచరిత్రము

'మౌద్గల్య'

దక్షిణ హిందూదేశమున జననమొంది తమ కీర్తిచే భారతమాత కెంతయు సంతోష మొనగూర్చిన వారిలో నిశ్చయముగ ముత్తుసామి అయ్యరుగా రగ్రగణ్యులు. వారు మదరాసు హైకోర్టు ప్రధానన్యాయాధిపతిగా కీర్తినొందినదే కాక చిన్నప్పటినుండియు వారు తమ బుద్ధికౌశలముచేత గొప్ప యూరోపియనులచేగూడ మెప్పుల నందియుండిరి. ఇంగ్లీషుభాషయం దొకసామెత గలదు. "Some men are born great; some men achieve greatness and some men have greatness thrust upon them" 'కొంతమంది పుట్టుకలోనే గొప్పవారుగా పుట్టుదురు; కొంతమంది తమకృషిచే గొప్పవా రగుదురు; మఱికొంతమంది స్వప్రయత్నము లేకయే గొప్పవా రగుననుటలు సమకూడును.' ముత్తుసామిఅయ్యరుగారిందు రెండవపద్ధతిచేత నౌన్నత్యమొందిరి.

తంజావూరుజిల్లా వాచువాడి గ్రామమునందు 1832 వ సంవత్సరము జనవరినెలలో ముత్తుసామి అయ్యరుగారు జన్మించిరి. వారి యింటిపేరు తిరువారూరు వారు. వారి కేడెనిమిది సంవత్సరములు నిండునప్పటికి వారి నాయనగారికండ్లకు జబ్బు గలిగినందున సంసార భార మంతయు వారే భరింపవలసివచ్చినది. వారికి నాలుగయిదు సంవత్సరముల పెద్దగానుండిన సహోదరు లొక రుండిరి. వారితల్లి చాల సుగుణవతియు చదువుకొన్నదియు. ముత్తుసామి అయ్యరుగారు పెద్దవా రయినతర్వాత చాల బుద్ధిశాలురుగ నుండి రన నదియంతయు వారితల్లివలనఁ గలిగినఫలమని తెలియకపోదు. ఆమె తంజావూరు జిల్లాలో నొక మిరాసిదారుని కొమార్తె. ముత్తుసామి అయ్యరుగారికిచదువుకొనుయీడురాగనే వారితల్లి వారిని తంజావూరుకు పిలుచుకొనివచ్చెను. అచ్చట వారికి విద్య నేర్పింపవలెనని యామె యభీష్టము. ముత్తుసామి అయ్యరుగారి బుద్ధికౌశలమును గనినవా రొక్కరయినను నచ్చెరు వందనివారు లేరు. వారి తల్లిగూడ ఈబాలుడు తనగర్భమునం దుద్భవించినందుకు ఎప్పుడును తనమనమునం దపరిమితానందము నందుచుండెడిది.

కాని హిందూదేశమున నీనాడు ఒక్కొక్కబాలుడు అనుభవించు దురదృష్టమును ముత్తుసామిఅయ్యరుగారుగూడ తప్పించుకొనలేరైరి. వారు విద్య నభ్యసించుకాలమంతయు తాము పెద్దవారైన తర్వాత యెట్లు నాలుగుడబ్బులు సంపాదించుకొని తమ పొట్టబోసికొన గలము అనుజుగుప్స వారిని పీడించుచుండెను. దీని నటువంటివారుగూడ తొలగించుకొనలేరైరి. వారు హైకోర్టునందు న్యాయాధిపతి యయినతర్వాత వేడుకగా తమ స్నేహితులతో నొకకథ చెప్పుచుండెడివారు. "బాల్యమునందు తంజావూరిలో గ్రామమునిసిపు గుమాస్తాగా నుండినప్పుడు నెలకొకరూపాయ సంపాదింపగలిగినను గూడ చాలగర్వము నొందెడివారట. నెల దాటినతర్వాత తన యధికారి జీతమని చెప్పి వారిచేత నొకరూపాయ వేయగనే వారు తన తల్లికడకు పరువున చని 'అమ్మా, ఒక రూపాయి సంపాదించితిని చూచితివా' అని గర్వముతో పలికెడివారట. అప్పుడు వారికి దేవేంద్రపదవి నందినంత సంతసము గలిగెడిది. కొన్ని దినములకు వారికొక రూపాయనుండి మూడురూపాయలకు ప్రమోషనయినది. అప్పుడు అయ్యరుగారికి గలిగిన గర్వము వర్ణింపనలవి గాదు. ఈగర్వ మీక్రిందివిధముగా వారు చూపుచుండిరి. ఒక పండుగరోజు బందుగు డొక పెద్దమనుష్యుడు వారికి పంచనొకటి కొని బహుమానము చేసిరట. అది మంచి వెలగలిగిన పంచగాదని కనుగొనిన అయ్యరుగా రది తన యంతవారు ధరింపదగినది గాదని తలచి యెందు కటువంటి పనికిమాలినపంచను గొనియిచ్చిరని యా బందుగను ప్రశ్నించిరట. దానికాబంధువు: 'ఓహో! నీయంత పెద్ద మనిషి కీమాత్రము పంచచాలదా? చాలకున్న నచ్చట పాఱవేసి పొమ్ము?' అని ఘర్షణగా మాటలాడిరట. అంత అయ్యరుగా రాపంచను తుత్తునియలుగా చింపి

దాని నొకచుట్టుగా చుట్టి యాబందుగుమొగముపై విసరివైచి పాఱిపోయిరట.

కాని యిట్టివంటి పోకిరిపనులు చేయగలిగినందుననే వారంత గొప్పవారయిరనియెంతమాత్రమును తలంపగూడదు. ఇది ఆత్మగౌరవమును గాపాడుకొనుటయేకాని యొరులను నిందించుటగాదు. కొంచెము వారియెడ పోకిరితన ముండినను తమ బుద్ధిచాతుర్యముచేతను, పెద్దలయెడగల భక్తిచేతను వారు దానిని కప్పిపుచ్చుచుండిరి. వారికి పదునైదు పదునారుసంవత్సరముల వయసుగా నుండినప్పుడు తంజావూరియందు ముత్తుసామినాయకను అను తహసీలుదారు డొక డుండెను. అయ్యరుగారి తెలివితేటల నొకసంభాషణతోనే ఆతడు గ్రహించెను. అంత వారిని పెద్దపెద్దకార్యములను చేయుటకై ప్రోత్సాహపరచి వారిబుద్ధికుశలతను మంచిత్రోవయందు త్రిప్పుటకై వీరు చాలవరకు ప్రయత్నించుచుండిరి. ఏడెనిమిది వత్సరముల వయసునందే తండ్రిని గోల్పోయిన అయ్యరుగారికి నాయకనుగారు ఇప్పుడు పితృసమాను లయిరి.

అయ్యరుగారు ముత్తుసామి నాయకనుగారిప్రేమ నెట్లు సంపాదింపగలిగిరి అనువిషయ మీక్రింది కథవలన దెలియగలదు. ఒకనాడు సమీపమునందు నదియొడ్డు తెగినదనియును ప్రవాహము తప్పుదారియందు పాఱుచున్నదనియు నెవరో తహసీలుదారునికి తెలియజేసిరి. దాని సంగతి పూర్తిగా తెలిసికొని వచ్చి చెప్పుటకై తహసీలుదారుడు తననౌకరును రమ్మని వార్తనంపెను. కాని యప్పుడు కచ్చేరియం దెవరును లేనందున ముత్తుసామిఅయ్యరుగారు ధైర్యముతో తహసీలుదారునికడకేగి వారి యుత్తరువునకై వేచియుండిరి. నాయకను గారంత వారిపోర్టు నయ్యరుగారిచేత నుంచి వారికేమైన దానికి సంబంధించిన విషయము తెలియునాయని ప్రశ్నించిరి. అయ్యరుగారు తనకాసంగతి తెలియదనియు, తెలియకున్నను సులభముగానే కనుగొనివచ్చెదననియు, ధైర్యముతో బదులు చెప్పిరి. అంతవారియనుమతి గైకొని బాలుడయినను తానావిషయమున నెంతకష్టము గానున్నను నిర్వహింపగలనని ధైర్యము గలిగినందున తత్క్షణ మాయేటిదగ్గఱకు బోయి యెంతదూర మాయొడ్డు తెగినదనియు నేవిధముగా దానిని సరిపఱుపవలసినదియు నెచ్చట దానికి సామానులు దొఱకునదియు అంతయు పూర్తిగా తెలిసికొని తహసీలుదారుని కొప్పజెప్పెను. మొట్టమొదట అయ్యరుగారు తెలిపినది నిజమని నాయకనుగారు నమ్మకపోయినను అప్పటితొందరలో నాకాగితమునందు సంతకము చేసి పంపివేసిరి. కొంతసేపటికి గుమాస్తా రాగనే తహసీలుదా రాయనను ఏటిసంగతి యేమయినదని యడిగెను. దానికి గుమాస్తా ముత్తుసామిఅయ్యరుగారు గనుగొని వచ్చినది చాలసరిగా నున్నదని ప్రత్యుత్తర మిచ్చెను. తహసీలుదారునికి గలిగిన యాశ్చర్య మింతింతగాదు. మఱియొకసమయమున మిరాసిదారు డొకడు తహసీలుకడకు వచ్చి తా నెంతశిస్తు కట్టవలసినదియు, తెలుపగోరెను. తనకావిషయము సరిగా తెలియదనియు నది కచ్చేరియందు విచారించి కనుగొనవలసినవిషయ మనియును తహసీలుదారు చెప్పెను. అప్పుడయ్యరుగారు తహసీలుదారునిప్రక్క నిలుచుకొనియుండిరి. వారికేమైన నాసమాచారము తెలియునా యని తహసీలుదారు వారి నడిగెను. అంత నయ్యరుగారు దానిముందే యన్నియు చూచివచ్చిన యూరివలెనే చాలసిద్ధముగా నంతయు వాక్రుచ్చిరి. పిమ్మట విచారించిచూడగా వారు చెప్పినది కొంచెమైనను తప్పులేదని తెలిసినది. ఈ రెండువిషయములచేతను నాయకనుగారి మనసునందు అయ్యరుగారియెడ దృఢమైన యనురాగము నాటుకొనెను. అంతవా రయ్యరుగారిని తన కచ్చేరియం దొక గుమాస్తాగా నియమించిరి.

కాని వారికేమియు కచ్చేరియం దెక్కువ పని లేనందున మధ్యాహ్నము పదునొకండు గంటల మొదలు రెండుగంటలవఱకునుదగ్గఱనుండు నొకపాఠశాలకేగి చదువుకొనుటకు నాయకనుగా రనుమతి నొసగిరి. అదియును గాక యెప్పుడైన తీరికగానుండినయెడల తహసీలుదారే అయ్యరుగారికి యింగ్లీషు నేర్పుచుండిరి. మఱికొన్ని దినములకు నాయకనుగారికి అయ్యరుగారి బుద్ధిచాతుర్యములు బాగుగా తెలియగనే వారిని కచ్చేరియం దుంచుకొనుట సరిలేదనితలచి తనతమ్ముడు నివాసము చేయుచుండు నాగపట్టణమునకు వారినంపి యచ్చటి మిషనుస్కూలునందు వారిని చేర్చుటకు ఏర్పాటు చేసెను. అయ్యరు



సర్ టి. ముత్తుసామి అయ్యారు గారు



పంతంగి వేంకటరావుగారి కుటుంబము—కర్నూలు

గారు నాగపట్టణమునందు దగ్గఱదగ్గఱ నొకటిన్నర సంవత్సరకాలము చదివిరి. అంత నాయకనుగారు వారిని మదరాసుకుపంపి యచ్చట చదువుకొనుమని చెప్పిరి. మదరాసులో సర్ హెన్రీ మాన్టుగామెరీగారు(Sir Henry Montgomery) వారి క్షేమలాభములను విచారించుచుండిరి. పాఠశాలాధిపతి యగు పావెలుదొరగారు గూడ ముత్తుసామి అయ్యరుగారు చాల తెలివితేటలు గలవారని గ్రహించి వారి కప్పుడప్పుడు సహాయము చేయుచుండెడివారు. మదరాసు ఉన్నతపాఠశాల (Madras High school)లో చాలవయసు చెల్లినపిమ్మట చేరిన కారణమున విద్య పూర్తి యగునప్పటికి అయ్యరుగారికి ఇరువది నాలుగు సంవత్సరములవయసు వచ్చినది. ప్రతి తరగతియందును అయ్యరుగారు బహుమానముల నందుచుండెడివారు. కట్టకడపట పాఠశాలనుండి వెడలునప్పుడు ఇంగ్లీషు పాటీపరీక్షయందు నెగ్గుటగని విద్యాధికారుల సమితి (Council of Education) వారివలన రూ 500 ల బహుమానము గైకొనిరి. దీనిని వినిన హాలోవేగారును (Halloway) సర్ అలెగ్జాండరు అర్బత్నట్ (Sir Alexander Arbuthnot) గారును 'ముత్తుసామి అయ్యరుగారికి మదరాసుప్రభుత్వశాఖయందు దేయుద్యోగమయిన చేయగలశక్తిగలద'ని తమమనఃపూర్తియైన నమ్మకము నా సంవత్సరమునందు ప్రకటన చేసిరి.

మదరాసు హైస్కూలునందు ముత్తుసామిఅయ్యరుగారు చదువుచున్నప్పుడు అర్బత్నటు,హాలోవే, పావెలు గార్లతో వారికి గలిగినస్నేహిత మెంతమాత్రము వారి యభివృద్ధికి తోడ్పడినదో, యెంతమాత్రము వారు తమ గుణములను వారిస్నేహితముచే మంచిత్రోవలందు సంచరిందునట్లు చేయగలిగిరో యీక్రింద కొంతవరకు విచారించెదముగాక! అర్బత్నట్గారికిని అయ్యరుగారికిని సంబంధము చాలతక్కువ. అర్బత్నటుగారు రాజకీయ వ్యవహారములం దాటితేజినవారు. ముత్తుసామిఅయ్యరుగారన్నతో నెంత తెలివిగలవారయినను చాలచిన్న విద్యార్థి. వారి కియ్యవురకును చాల కలయిక యుండజాలదు. కాని పాఠశాలాధిపతి (Hedmaster) యైన పావెలు (Powell) గారికిని అయ్యరుగారికిని మిక్కుటమగు స్నేహము. అర్బత్నటుగారుగూడ అయ్యరుగారికి విద్యయందుగల కుతూహలమును మెచ్చుకొనుచుండిరేకాని వారియ్యవురకును పావెలుగారికిని అయ్యరుగారికిని గలిగినంత స్నేహితము గలుగలేదు కొన్ని దినములకు పావెలుగారియందలి గౌరవముచే నింగ్లీషువారందఱుగూడ మహాత్ములని అయ్యరుగారు నమ్ముచుండిరి. ఈస్నేహిత మయ్యరుగారికి కొన్ని విషయములయందు చెడుపుగా పరిణమించెను. పావెలుగారు విద్యావంతులగుటచేత నెంత అయ్యరుగారికి మంచిదేయయినను వారి తోడివిద్యార్థులతో కలసిమెలసియుండనిది గొప్పదురలవాటు. తనవయసునకు తానెట్లు ప్రవర్తింపవలసినదియు అయ్యరుగారికి తెలియలేదు. వారు తమతోడిబాలురతో చేరుటయేలేదు. ఎంతసేపయినను ఒకమంటపములోనో ఒకచెట్టుక్రిందనో అయ్యరుగారు తన పుస్తకమును చదువుచు నొంటరిగా కూర్చొనియుండెడివారు. కాని కొన్ని సమయములందు వారు పావెలు హాలోవేగార్లను చూచినప్పుడు తా మెప్పుడు వారియంతవారగుదుమో యని కుతూహలపడుచుండెడివారు.

ముత్తుసామి అయ్యరుగారికి రూ 500 బహుమాన మొసగినది వారికి యౌవనమునందే గలిగిన గొప్ప గౌరవమని వారును వారి స్నేహితులును తలంచుచుండిరి. పిమ్మట కొన్ని దినములకు వారుయింగ్లాండునకు హైందవోద్యోగపరీక్ష(I C.S)కు చదువుటకై పంపబడుదురని వదంతిగా నుండినదేకాని యట్టివంటి దేమియు జరుగలేదు. కొన్ని దినములకు అర్బతునటుగారు వారిని తంజావూరు పాఠశాలలకు డిప్యుటీ ఇన్స్పెక్టరుగా నియమించిరి. అప్పు డయ్యరుగారికి రూ 150 లు జీతము వచ్చుచుండెడిది. హాలోవేగారికి అయ్యరుగారు స్కూలు ఇన్స్పెక్టరుగా నెచ్చుటనో పడియుండుట ఇష్టము లేదు. వారి బుద్ధిచాతుర్యము లను న్యాయపరిపాలన శాఖయందే విరాజమానముగా ప్రకాశింపజేయవలయు నని వారికి దృఢమైనకోరిక. అందువలన చాలదినములు కాకమునుపే వారు తంజావూరుజిల్లా ప్రధాన న్యాయాధిపతి యగు బ్యూషాంపుదొరగారికి సిఫారసుచేసి అయ్యరుగారిని ట్రాంకిబారు మునిసిపుస్థానము నంగీకరింపజేసిరి. ముత్తుసామి అయ్యరుగారు తమ కచ్చేరి విషయముగా నొక నిమిషమైన నజాగ్రతగా నుండి యెఱుగరు. తాము

జరుపవలెనని తమ యధికారులు నియమించిన కార్యములను తమకు తృప్తియగునటులును తమయధికారులకు తృప్తి యగునటులును శ్రద్ధతో నిర్వహించుచుండిరి. ఈ విషయమై వారు కీర్తిశేషులయిన పిమ్మట 'మదరాసు స్టాండర్డు' పత్రిక యీవిధముగా వ్రాయుచున్నది.*

'బ్యూషాంపు దొరవారు ముత్తుసామిఅయ్యరుగా రెట్లు తమపనులను నిర్వహించుచుండిరో పరీక్షింపవలయునని కుతూహలపడి వారికి వచ్చుచున్నామని తెలుపకయే ట్రాంకిబారు కేతెంచిరి. సాధారణముగా ప్రధానన్యాయాధిపతులు మునిసిపుకోర్టులకు తనికీచేయుటకై వచ్చినచో వారు తమయెడ నేమితప్పులు కనిపెట్టెదరోయని మునిసిపులు అదరుచు బెదరుచునుందురు. కాని ముత్తుసామి అయ్యరట్లుగాక బ్యూషాంపుదొరగారు వచ్చియుండిన సంగతి వినినతోడనే దొరగారు బసచేసియుండుచోటికేగి యామఱుదినమే తమకచ్చేరికి వచ్చి యంతయు తనికీచేసి పోవలయునని యాహ్వానముచేసిరి. అదియునుగాక వారెట్లు కేసులను విచారణచేయుచుండిరో అదికూడ వారిప్రక్కననే కూర్చొని పరీక్షింపవలయునని కోరిరి. దానిప్రకారము బ్యూషాంపుగారు మఱుసటిరోజె మునిసిపుకోర్టునకు చని యచ్చట పరికించిచూచి కేసులను తీర్పుచేయుటయందును, రిజిస్టరులను జాగ్రతగా నుంచుకొనుటయందును, అయ్యరుగారి కసమానమైన చాతుర్యము గలదని దొరగారు మెచ్చుకొనిరి. వారు తంజావూరునకు మరలవచ్చినవెంటనే అయ్యరుగారిని చూచితిననియు, వారికి తనతోకూడ కూర్చొని న్యాయతీర్మానము చేయగలశక్తి యున్నదనియు నుడివిరి.'

ఇటువంటిపొగడ్తల నందిన ముత్తుసామి అయ్యరుగారికి తగుమైన వ్యాయామమేది? యెవరేర్పఱుపగలరు? అనుసంగతులు గొప్పగొప్పయుద్యోగస్థులు ఆలోచింపవలసినవిగా నుండెను. అప్పటి మదరాసు ప్రభుత్వాధికారి (Governor)గా నుండిన సర్ చార్లెస్ ట్రెవెలియను (Sir Charles Trevelyan) గారు ముత్తుసామి అయ్యరుగారినామము చాటింపబడుటను విని వారెంత సామర్థ్యము గలవారో తెలియగోరి వారిని తంజావూరు డెప్యుటీకలెక్టరుగా నియమించిరి. అచ్చటినుండి వారిని ఆర్కాటుజిల్లాకు మార్చిరి; గాని మరల కొన్నిదినములకే తంజావూరుకు పంపిరి. అచ్చట అప్పటికలెక్టరుగా రయ్యరుగారి చాతుర్యమును గ్రహించినవారగుటంజేసి యొక సావుకారికి సంబంధించినకేసు నొకటిని నిర్ణయింప నియమించిరి. అప్పుడు జాన్‌బ్రూస్ నార్టన్ (John Bruce Norton) గారును అక్కడికి ఆ కేసు సంబంధముగనే పోయి యుండిరి. ముత్తుసామి అయ్యరుగారికి న్యాయచట్టములయందు గల సంపూర్ణమైన జ్ఞానమునకు నార్టనుదొరగారికి గలిగిన యాశ్చర్య మపరిమితము. వారు మదరాసుకు వచ్చినతర్వాత అడ్వకేటు హాలోవేగార్లతో "అయ్యలారా! ముత్తుసామిఅయ్యరుగారు న్యాయచట్టములం దతీతులు. వారిజ్ఞానమంతయు నా రివిన్యూశాఖయం దడవినిగాచిన వెన్నెలవలె నిరర్థకమగుచున్నది. మీ రెట్లయినను వారిని న్యాయపరిపాలనశాఖకు కొనిరావలయును. మీరట్లు కావించినచో వారి చాకచక్యమంతయు మంచివిధమున నుపయోగపడును." అని విన్నవించిరి. పిమ్మటకొన్నిదినములకు అయ్యరుగారు దక్షిణకనరా సహాయన్యాయాధిపతి (Sub Judge) గా నియమింపబడిరి. దానితర్వాత మూడు సంవత్సరములకు వారికి మదరాసుపోలీసు మేజిస్ట్రీటుయుద్యోగ మయినది. ఈయుద్యోగమం దయ్యరుగారు చాలదినము లుండలేదు. కొద్దికాలముననే వారు స్మాలుకాసుకోర్టు న్యాయాధిపతిస్థానము నంగీకరింపవలసి వచ్చెను.

ఇటు లందఱిచేతను మెప్పులువడయుటవలనను తమ యుద్యోగమున చాల సులభముగా నున్నత పదవి గ్రహింపగలిగినందువలనను వారికి చాలగర్వమును, అహంభావమును గలిగియుండునని తలంచుట సాజము. వారివలెనే స్మాలుకాసుకోర్టు న్యాయాధిపతులుగా నుండి యప్పుడే వారికంటె కొంచెము హెచ్చుపదవి నంది యుండిన రంగనాథశాస్త్రిగారును, బిస్టీడు దొరగారును సందేహములు గలిగినచో తమ కంటె నెన్నియో సంవత్సరములు చిన్నవారుగా నుండు అయ్యరుగారిసలహాను పుచ్చుకొనుచుండెడివారు; కాని

*దీనిని మేము తర్జుమాచేసికొనినాము. దీనియందు యింగ్లీషులో ప్రతి వాక్యమునకును సరియగు నట్లు తెలుగునందు తర్జుమా చేయలేదు. భావము తెలిసినతర్వాత మా స్వంతవిధముగానే వ్రాసితిమి.

దీనివలన అయ్యరుగారి కించుకంతయు నహంభావము కలుగలేదు. వారు ప్రధానన్యాయాధిపతు లయినపిదప గూడ వారిసహోద్యోగులతోడను వారికడనుండు చిన్న చిన్న ప్లీడరులతోను చాలధారాళముగా మాటలాడుచుండెడివారు. తాము పెద్దన్యాయాధిపతియగుటచేతను, వారు చాలదినములు వకీలులగుటచేతను వారితో సాధారణముగా మాటలాడకూడదని తలంచినవారు కారు. చాల చిన్నయుద్యోగమునుండి మెల్లగా నౌన్నత్యము బడసినందున వారి కన్నిసంగతులును సంపూర్ణముగా దెలిసియుండెను. వారు బాల్యమునుండి పేరు పొందిన న్యాయవాదులసాంగత్యముచేత నన్నియు నేర్చుకొనియుండినవారగుట నేయేయుద్యోగమునం దేయేకష్టములుండునదియు వారెఱిగియుండిరి. అందువలన వారు తమ క్రిందియుద్యోగులయెడ చాలదయాళువుగ నుండెడివారు. గొప్పపదవికి వచ్చియుండినను తమకు చిన్నప్పటినుండియు ప్రియముగానుండిన సంగతులలో విశేషమైన కుతూహలముతో పనిచేయుచుండిరి. స్త్రీవిద్య, మలబారువివాహచట్టము మొదలగువిషయములందు వారొసంగిన యుపన్యాసముల తిలకించి చదివినచో వా రన్నివిషయములందును ఎంతపర్యాలోచనగలవా రైనదియు తెలియగలదు. రాబోవువ్యాసమున వారియొక్కమన స్తత్త్వములును అభిప్రాయములును వివరించెదము.

వారు కీర్తిశేషులయినతర్వాత కొన్నిదినములకే వారియందుగల గౌరవమువలన యూరోపియనులును హిందువులును చేరి ప్రయత్నముచేసి వారిశిలావిగ్రహము నొకదానిని హైకోర్టునందు నిర్మించిరి. దానినిప్పటికిని క్రొత్తవకీళ్లు చూచినచో వారివలె తా మెప్పుడు గొప్పవారగుదుమోయని తలంచుచుందురు. అనిర్వచనీయమైన భక్తి వారిమనములం దప్పుడును జనించుచుండును.

పాఠకమహాశయులారా! ఈవిషయములం దంతయు మన దొరతనమువారు సాధారణముగా తెల్లవారే చాలసూక్ష్మబుద్ధిగలవారనియు, వారివలె మనదేశస్థు లీ కార్యమును చక్కగా నిర్వహింపజాలరనియు నొకవెఱ్ఱి తలపు తలంచుచుందురు. దీనివలననే కొన్నిదినముల క్రింద బెంగాలు ప్రభుత్వాధికారిని నియమించుపట్టున మనదొరతనమువారు మహమ్మదీయు లొకరుండినను ఆసాము ప్రభువుగ నొక తెల్లదొర నేర్పాటుచేసిరి. ముత్తుసామి అయ్యరువంటి మహనీయులు మనయం దుండినను వారింకను తమ దుర్భ్రమను తొలగించుకొని మంచిత్రోవకు తిరుగజాలకున్నారు.

క్రోధమూర్తి

పంద్యారం వెంకటసుబ్బయ్య గారు

(భారతి రెండవసంపుటము - ఎనిమిదవసంచిక తరువాయి)

సత్యవతి

ఈ వీఁపించు నంగనకు నెక్కిన సాల్వమహీశు పాలికిం
బోవఁగ నిమ్ము దీని నిది వోసినసేస లనర్థకమ్ములై
భావిశుభంబు లేర్పడనిభంగి నమర్చెడునో! గతు ల్మరు
చ్చైవలినీతనూజ! పరుషంబులు దీనివచఃప్రకారముల్.
"ననుఁ గసిరికొట్టనేటికి, వినుఁడీ పెద్దలు! విచిత్రవీర్యునకంటెఁ
మునుముందు వహ్నిభర్తగ, నొనర్పుఁడీ నాకు" ననెదునోయి, కుమారా!

నాపు డభీష్ముఁడున్ మనమునం దలపోసి విరక్తకంబకుం
బోవ ననుజ్ఞ నిచ్చె జనముల్ తనమేవడి నుగ్గడింప; నా
నా వెరవర్లుగూడ నరయం గొఱవిం దలఁ గోకికొన్నచో
నీవసుధాతలమ్మున ఘటిల్లవ యెందును దారతమ్యముల్.

సాల్వరాజు

అతఁ డతిదీర్ఘబాహుఁడు సహఃపతితేజుఁడు సంబుజచ్ఛదా
యతనయనుండు నానృపుని యంతికమం దొక ప్రాయపుం గళా
వతి నిలుచున్న దశ్రుజల వాహినిధౌతపయోభృదంశు కా
చ్ఛత లుడిగించి కజ్జలపుఁజాయల నచ్చట గ్రుమ్మరింపగన్.

అటులొక్కింతయు సద్దు లేనియెడ నేఁ డాతండు "నీలాలకా!
పటుదోస్సారుఁడు జాహ్నవీసుతుఁడు చేపట్టెంగదా వెండి న
న్నెటు గొమ్మందువు పొమ్ము వానికడకే యేద్వాం బనేమున్న ది
చ్చట నేనుండఁగరాదు పోదు"నని పోసాగెన్ గృపాశూన్యుఁడై.

కుసుమవతి యాలతిక తనకు సరియైన, తరుణభూజము దానియండ రహిఁ జొచ్చి
కొన్నినాళులు తలదాఁచుకోఁదలంప, భీష్మవాతూల మేపున విసరికొట్టె.

ఆపెనయనాంతముల నపు డగ్నిదోఁచె, మోము చెమరించెఁ గస్తూరిబొట్టు గరఁగి
పోయి నుదురంతయు న్నల్లనాయె; ధాత, వ్రాతయును నల్లనగును కాదా తలంపఁగ!

'అకటా! యింతకు నానదీసుతుఁడ కాదా కారణమ్మంచు నా
నికృతి స్ఫీతకృశానుతప్త చనియెన్ సీరంధ్ర వన్యాంతరో
ర్వీకి దుర్జంతువు లుండునం చెఱుఁగదో, రేకొత్తెనో వెఱ్ఱి, హా
నికు లేద్యుల్ తినఁ గట్ట నిచ్చి కరుణానిష్ఠాపరుల్ కాతురో!

హోత్రవాహనుఁడు

"కుముదినీకాంత కాంతోపలములమీఁద, నెలబారలమీఁద నడువంగనలయు నీవు
కఠినపాషాణకలితమార్గముల నడచి, కొమరుబిడ్డవు నెవ్వగఁ గూరినావు.

తనయ! యెఱుంగవో తరుణతాకుసుమాసవ మిట్లు కాన పా
లొనరుపరాదు, నిక్కడనయుండుము భార్గవరాముఁ డెల్లి వ
చ్చును మముఁజూడ నిందులకుఁ జొప్పడ నింతయుఁ జెప్పికొన్న నీ
మన మెరియించునెవ్వగను మానుపు నాతఁ డవంధ్యుఁ డన్నిటన్.

అనియె రాజర్షి తన మన్మరాలి కచట, నలమికొన్న పయోదంబు లల్లనల్ల
విరిసిపోవగ వనలతా విసరములును, తొడిగిచూపఁగ నాశామధురకళికలు.

దొరకిన యుపన్యాసము

[శ్రీ భారతీ పత్రికాధిపతీ! నమస్కారములు.

ఈనడుమ నా సొంతపనిమీఁద నేను దణుకు వెళ్లి యచ్చట నొక్కదినముండి తిరుగఁ బీఠికాపురమును జేరుటకై నిడదవోలునొద్ద రైలుబండిలో నెక్కఁబోవుచుండఁగ, కొందఱు స్త్రీలు పురుషులు లోకగదినుండి దిగఁబోవుచుండిరి. వారు వారిసామగ్రితో దిగినపిమ్మట నేను గదిలోనికిఁబోయి కూరుచుంటిని. రైలు నడవనారంభించెను. కొంతసేపు కునికిపాట్లు పడిపడి పండుకొనుటకై యెంచి లేచి బల్లపైనున్న మెత్తని యుత్తరీయముతో దులుపుచుండ క్రిందిమెత్తకును, వెనుకనున్న మరియొక మెత్తకును నడుమనున్న యవకాశమున నొక కాగితములకట్ట నాకంటఁ బడినది. దానిని గ్రహించి చూచితిని. అదియొక కాంతారత్నము వ్రాసిన వ్రాఁతవలె నాకుఁ దోఁచినది. ఈకాగితములు పోవుటచే నాకాంత యెంత పరితపించుచుండునో యని కొంతసేపు విచారించితిని. ఆవనితామతల్లి ప్రకటింపనెంచిన యభిప్రాయములను బ్రకటించుటయే మంచిదని నేనూహించుకొని యాకాగితములకుఁ బ్రతివ్రాసి దానిని మీయొద్దకు బంపితిని. మీరు ప్రకటించినయెడల దానిని వ్రాసిన నారీమణి సంతోషించునని నావిశ్వాసము. ఈక్రిందిదియే దాని ప్రతి.

చిత్తగింపవలయును,

పానుగంటి లక్ష్మీనరసింహారావు.]

ప్రారంభోపన్యాసము

"సోదరీమణులారా! మీ యందఱతో నొక ముఖ్యాంశమును ముచ్చటింపనెంచి మిమ్మిట కాహ్వానించితిని. ఆయంశము మీతో నెంతకాలమునుండియో చెప్పఁదలఁచితినిగాని మీ మనస్సులకు స్ఫురింపని యంశము నామనస్సున కేల తట్టెనో యని నాకే సందేహముగా నుండుటచే మానివైచితిని. ఇప్పు డన్నిసందేహములను మించిన యాతురత నన్నుఁ బ్రేరేప, నా యభిప్రాయమును మీకు వెల్లడించి హృద్భారమును బాపుకొన నిశ్చయించుకొంటిని."

"కాంతలస్థితిగతులు కొంతకాలమునుండి యభివృద్ధిదశలోనే యున్నవి. ఇట్టి మనయభివృద్ధికి మనమే కారణము కాని మగవాఁడు కాఁడని లోక మెఱిఁగియేయున్నది. మగవాని వలన మేలు జరుగునని మన మెన్నఁడనుకొని యుండలేదు. ఆతఁడు మనసందర్భమునఁ గేవల నిరుపయోగుఁ డనియే నిశ్చయపఱచితిమి. ఆతఁడు నిరుపయోగుఁడైనంత మాత్రమున మనము విచారింపవలసిన పనిలేదు. సమర్థతాశూన్యత క్షంతవ్యము కాని యాతఁడు మన యభివృద్ధికి మొట్టమొదటినుండియుఁ బ్రతిబంధకారుఁడై పరమశత్రుఁడై ప్రత్యక్షమారకుఁడై ప్రవర్తించుటచేతనే మన మాతనిని నిందింపవలసివచ్చినది. ఆతనిపాపమున నాతఁడే పోవునని మన మూరకుండక మన బానిసతనమునకుఁ బరితపించి, మన విద్యాశూన్యతకు విచారించి, మనవ్యక్తిరాహిత్యమునకు వ్యసనపడి యాతని లక్ష్యపెట్టక, యవసరానుసారముగ నాతని కెదురుతిరిగి, స్వయంకృషిని నమ్మి,

యాత్మవిశ్వాసమునుగల్గి, మన పురోభివృద్ధికి మన పాటులేవో పడుటచేత నేకదా ప్రొయ్యి యొద్దఁ గట్టెల పొగనడుమ గూలఁబడవలసిన మన ముపన్యాసపీఠములపైఁ గరతాళముల నడుమ నిలువఁబడుచున్నాము! పేడనీళ్లతో నట్టిండ్లలికినమనము నవరసములతోనాటకములను సృష్టించుచున్నాము! పిల్లల తొట్టెల యొద్ద జోలపాటలు పాడిన మనము న్యాయసభలందు ధర్మవాదము లొనర్చుచున్నాము! లోడితెడు సంసారములో గుడుగుడుగుంచములాడవలసిన మనము లోకోపకారమునకై భారతదేశమం దంతటఁ బర్యటన మొనర్చుచున్నాము!

మగవాఁ డనువాఁ డాఁడు దానిని వీధి గుమ్మమునొద్దకుఁ గొలఁదికాలము క్రిందటి వఱకు రానిచ్చినాఁడా? చీపురుకట్ట వదలి Briefbag ను బట్టనిచ్చినాఁడా? తన సేవ మఱచి దేశసేవమాట నెన్నఁడైనఁ దలఁపనిచ్చినాఁడా? ఎంతసేపు తాను, తనవిద్య, తనసుఖము, తనకీర్తి, తనవృద్ధియే కాని సృష్టిలోఁ దన సాటిదైన యొఁడు దున్నదనిమైన మనసునఁ బెట్టినాఁడా? ఇతరదేశస్త్రీల యభివృద్ధి వినియైనను రవంతదయ, కాసంతదాక్షిణ్యము, నిసుమంత సమభావము మనయెడలఁ గనఁబఱచినాఁడా? తరతరములనుండి యుగయుగములనుండి కార్కొని ఘనీభవించిన యజ్ఞానాంధకారమునుండి స్వప్రయత్నముచేత నతిశీఘ్రకాలములో జ్ఞానతేజఃప్రపంచమున కుబ్బెత్తుగ నుబికినజాతి సర్వప్రపంచచరిత్రమం దొక్కయార్యనారీజాతి తక్క మఱియొకటి యున్నదా? బ్రాహ్మణులేమో తమ్మజ్ఞానమునఁ బడఁద్రోచిరని యబ్రాహ్మణులు వారి కెదురు తిరిగిరి. కాని నారీసంఘమంతయు నీ యనారీసంఘము నేల యెదుర్కొని త్రొక్కివేయఁ గూడదో నాకుబోధపడుటలేదు. మగవాఁడంత స్వార్థలోలుఁడు, నసూయాపరుఁడు, నధర్మశీలుఁడు నహంభావదూషితుఁడు ప్రపంచమున లేఁడని మనచరిత్రవలన స్పష్టపడినదా? పాపము పండిపండి బ్రద్దలుకాక మానునా? ఎగిరియెగిరి యెగసియెగసినవాఁ డధఃపతితుఁడు కాకతీఱునా? చౌటిపడియలనితా ననుకొనినవే కాదా యిప్పుడు సుక్షేత్రఖండిక లైనవి! రాక్షసిబొగ్గుదిబ్బలని తా ననుకొనినవే కాదా యిప్పుడు రత్నాలగను లైనవి! ఎండి, మెలికలు పడి, పిట్టతలలువైచి కంపతొడుగైన తీఁగలే కాదా యిప్పుడు ప్రసవఫలబంధుర పరిమళప్రాంచితము లైనవి! వంటయింటి పడుకటింటి బానిసలే కాదా యిప్పుడు భారతదేశ సౌభాగ్యదేవతలై ప్రకాశించుచున్నారు! చిరకాలనాగరకత, చిరకాలవిద్య, చిరకాలాభ్యాసము, చిరకాలాహంభావము కలిగిన మనవాఁ డిప్పుడు మనకు వెనుకఁబడినాఁడా లేదా? భారతదేశసమస్తకార్యభారవహన క్రియాకలనయందు ముందుబుజము మనదా యాతనిదా? మనము పాడినపాటనుబట్టి తనగొంతు సవరించుకొను చున్నాఁడు. మనము వేయుచున్న యడుగునుబట్టి తనయడుగు నిప్పుడు సర్దుకొనుచున్నాఁడు. మార్గదర్శక వ్యాపారమున మగువ నిల్చి మగవానిని వెంటఁద్రిప్పుకొనుచున్నప్పుడే కదా నాగరకత శిరోనక్షత్ర మంటినట్లెంచవలసియున్నది!

ఇట్టిస్థితిలో మన ముండుటచేత భగవంతు నెంతయైనఁ బ్రార్థింపవలసి యున్నది. మనము మనల నెంతయైన నభినందించుకొనవలసి యున్నది. మగవాని నెంతయైన నిందింపవలసి యున్నది. కాని యింతసంతోషమందుఁగూడ నొకటి రెండు విచారహేతువులున్నవి కాని లేకపోలేదు. ఒకదానిని గూర్చియే యిప్పుడు చెప్పెదను. నేను జెప్పఁబోవు నంశముల మీ రెఱుఁగనిది కాదు. మీ రేల యింతకాల ముపేక్షచేసి యూరకుంటిరోయని నా కాశ్చర్యముగా నున్నది. ఈ యంశముకూడ మగవాని దుష్టవ్యాపారముతో సంబంధించినదే. ఈ దోష మేదో వెల్లడించి దీనిని దిద్దుబాటు చేయుటకుఁ బ్రథమానకాశము భగవంతుఁడు నాకుఁ గటాక్షించినాఁడు కదా యని నేను సహేతుకమైన గర్వమొందుటలోఁ దప్పులేదని యనుకొందును.

సోదరీమణులారా! మనము కంటికి జోడుపెట్టుకొన్నప్పుడు కొలఁదికాలము క్రిందటఁ దానెంత వెక్కిరించినాఁడో మీకు జ్ఞప్తిలేదా? అక్షిరోగమునకేకాక యాస్యసౌభాగ్యమునకుఁగూడఁ నద్దములను దాను ధరించునప్పుడు వానిని మనమేల ధరింపఁగూడదో? అది తన యనుకరణమఁట! మనము కంటితోఁ జూచుటకూడఁ దన యనుకరణమే యగును గావున మనము కన్నులు మూసికొనవలసిన దని తన యభిప్రాయము కాఁబోలు. అరుంధతినాఁడో ఆదిశక్తినాఁడో కల్పింపబడిన యందమాకారము లేని యూప్రాంతయొడ్డాణమే మనము ధరింపవలయునుగాని నడుమునకుఁ బటకాపెట్టుకొనఁగూడదఁట. ఈ యధిక్షేపణములో హేతువున్నదా? నీతియున్నదా? మనుష్యధర్మమైన యున్నదా? పరాయి తొడిగికొని చర్మపాదరక్షలు మనము ధరించినపుడు తానెంత వెకవెకలాడెనో మీ రెఱుఁగనిదా? అంత వెకవెక లెందులకు? అదేమి హానియా, అపకీర్తియా? తన్ను మన మెంతమాత్ర మనుకరింపఁగూడదఁట! ఆ ప్రధానరోగమునకు బాహ్యలక్షణములే యీతలయూఁపులు, నీ వెకవెకలు, నీ సకిలింపులు, నీ కటకటలు! ఎన్ని నవ్వులు నవ్వినసరే యెన్ని యేడ్పు లేడ్చినసరే మనము మానఁ దలఁచుకొన్నప్పుడుకదా యాతఁడువిధిలేని వైరాగ్యమును వహించి యూరకుండినాఁడు. మనము సైకి లెక్కఁగూడదని సంఘమర్యాద, వ్యాకరణమునఁ గ్రియాపరిచ్ఛేదమునఁ బ్రథమసూత్రము వ్రాయుటకుఁ దానెవఁడు? ఇది మనవారి పంచమహాపాతకములలో నొక్కటా? ఏసుక్రీస్తువారి పది యాజ్ఞలలో నొక్కటా? ఇది కాక మన డబ్బిలోనిది ముక్కుపొడి, తనడబ్బిలోనిది శ్రీపాదరేణువునా? ముక్కు భగవంతుఁడు తనకే ఇచ్చినాఁడా? ఇంత తెగనీలు గెండైన నున్నదా? మన జేబులోనివి సిగరెట్లా! తన జేబులోనివి తులసికట్టలా? ఇంతకు నో సోదరీమణులారా! కారణము చెప్పియే యుంటిని. ఆఁడుది మగవాని ననుకరించుటకంటె మగవానికి రోతవేఱొక్కటి లేదు. మన కుచితమైనదియు, నుపయోగకరమైనదియు, నర్హమైనదియు, నవసరమైనదియు మనము చేయుచున్నాము కాని

తన్ననుకరించునుద్దేశ మెంతమాత్రము మనకు లేదని తానేల యెఱుఁగడు? తా నెవరి ననుకరించి యిన్ని వేసములు తెచ్చుకొనినాఁడు? ఆ మాత్రపు టూహ తన కేల యుండఁగూడదు? అతనికి మొదటినుండియు మనయెడల సదూహ యేయున్న యెడల మనకిన్ని పాటు లెందులకు? తనకిన్ని తిట్లెందులకు? మనము తన్నెంత మాత్ర మనుకరింపఁ గూడదు కాని తాను మనలఁ బూర్తిగా ననుకరింప వచ్చును గాఁబోలు. అది తప్పులేదు కాఁబోలు. అందులకు మన మాతని నేమియు ననఁగూడదు కాఁబోలు! నాటకములలో స్త్రీపాత్రములను ధరించి తాను మనల నేల యనుకరించుచున్నాఁడో చెవిపట్టుకొని జో కాయించి నిలువబెట్టి యే॥ యడుగరాదు? ముంగురులు వింతమైన సొగసుగా నుండునని మన మీఁ చెంపనా చెంప నొక్క యంగుళముమాత్రపు వెడల్పున వెండ్రుకలు కత్తిరించుకొన్నప్పుడు తానెంత యల్లరి పెట్టినాఁడో! తలవెండ్రుకలు పూర్తిగా తీయించుకొనినట్లుగా నింటి పెంకు లెగిరిపోవున ట్లెంతహంగామా చేసినాఁడో! అట్టియాతఁ డిప్పుడు మీసములు పూర్తిగా గొరిగించుకొని సవరములు నెత్తికిఁ గట్టుకొని నాటకరంగమునఁ బోఁతుపేరఁటాలై నిలువఁబడినప్పుడు "నీకిది యెవఁడు చెప్పినాఁడురా" యని మన మాతని మూతిపై నేల యీడ్చి కొట్టరాదు? కోటులాగున నుండునెడల గ్రమ్ముదలకుఁ గ్రమ్ముదల, సొగసునకు సొగసుగా నుండునని రైకకు బ॰త్తాము లంటించి చేతులు రవంత పొడుగుచేసి ధరించి సహజమైన సిగ్గుతో నూత్నమైన శోభతో మనము ప్రకాశించుచుండఁ దన కన్నులలోఁ జీలలు కొట్టుకొనినాఁడే! అట్టివాఁ డిప్పుడు మన రైకతొడిగికొని దానిలో మఱేవో తగులఁబెట్టుకొని సిగ్గులేక, యుభయభ్రష్టత్వపుఁ బాడురూపములతో రంగమున మగముత్తైదువై నిలువఁబడి మనలఁ బరాభవించుచున్నప్పు డాతని నేమిచేసిననైనఁ బాపమున్నదా? కట్టుపడి యొడలిపై నడ్డుకట్టుకోకతో, నడ్డుచీలల ముంజేతుల కదికింపుగాజులతోఁ, గండలపై జేరు బొంగులవంటి నరము లుబికిన మొఱకు కంఠమున గాజుపూసలతోఁ, జుట్టపొగచేఁ బొక్కమాడి చచ్చిన పెదవులపై లత్తుకతో, గూటీ తీయుటచేఁ గాయలుగాచి గీఁతలుపడిన దౌడలపై బూడిదెతో, వేంకటేశ్వర పాదములపైఁ దుమ్మకాయ గొలుసులతో, నాడుదాని తలకంటెఁ సహజముగఁ బెద్దదైన తలపై సవరములజవునుకూర్పుచే భయంకరముగ నగపడు రాకాసితలతో, రంగముమీఁద సంకరస్వరూపమున నవతరించిన యీ జగన్మోహినీ దేవతనుజూడగ నార్యావర్తదేశమంతయు నొక్కపెట్టున నేడువవలసి యున్నట్లున్నదే! తానాఁడుదానిని బూర్తిగ ననుకరించినట్లు లోలోపల నుత్సాహమున నుబికి యుబికి పోవుచున్నాఁడు కాఁబోలు! తానా? ఆఁడుదాని ననుకరించుటా? తనతరమా? సహజ లావణ్యము గల యాఁడుదానిని గనులకు సూటిగ నొక్క జేనెడు చూచి టంగున(Tangent)కు మఱలిన చూపుగల యాఁడుదానిని—నెగుడు దిగుడుగఁ దరంగ పక్కిగఁ జూడఁగల యాఁడుదానిని—

నింద్రధనుస్సువలె లోకమునకంత నొక్కసారి మంగళపుటారతి నీయఁగల యాఁడుదానిని, పాముమెలికల జిగజిగలతో మెఱుపు గప్పిన మెఱసి చప్పన మాయమైనట్లు చూడఁగల యాఁడుదానిని, దానా? అనుకరించుటా? మతి యుండియే యీ పని చేయుచున్నాఁడా? పెదవులపై లకు చందమామల పండువెన్నెలల కలకలతోఁ గానఁబడవలసిన మందహాసమును బెదవులపై మాటుపఱచి దానిని గంటికొనలో నొక్క Geometrical point లోఁ గేంద్రీకరణ మొనర్చుట కొక్క నిజమైన యాఁడుదియే తగునుగాని యీఁకొజ్జ స్వరూపమే—యిందులకుఁ దగుఁనే! చచ్చి యాఁడుదియై పుట్టినప్పటిమాట కాని యిప్పటి మాటయా?

సోదరీమణులారా! ఇంత యసాధ్య కార్య మాతనివలనఁగాదు, పోనిండు! ఆఁడుది నిలువఁబడినట్లయినఁ దాను నిలువఁబడలేనప్పుడు తన మొగము, తన మీసర, యిఁకననుకరణ మెందులకు? చనవు ప్రేమ, రవంత మోతాదు మించినవా ల్లభ్యము గనఁబఱుపవలసిన భర్త యెదుట నాఁడుది యెట్లు నిలువఁబడునో, కాసంతమాత్రమే గౌరవము గానఁబఱుపవల సిన పెద్దబావగారి యెదుట నెట్లు నిలువఁబడునో, యధికభయగౌరవములు గనఁబఱుపవల సిన మామగారియెదుట నెట్లు నిలువఁబడునో, యనిష్టముగ గౌరవింపవలసిన యత్తగారి యెద్ద నెట్లు నిలువఁబడునో, యీ భేదముల లో నొక్క భేదమైనఁ దాను గనఁబఱుపఁ గలఁడా? నాభర్త యీనడుమ నాటకము లోనికి వెళ్లెదనని చెప్పుటచేఁ బొమ్మంటిని. "నీభర్త కీరాత్రి నాటకములో వేసమున్న ద"ని మాయింటి పొరుగమ్మ లక్కలలో నొక్కతె నాచెవి నూదెను. నాభర్త వెడలి పోయిన కొంత సేపటికి నేను నాటకశాలకుఁ బోయితిని. అభిజ్ఞానశాకుంతలమున నాభర్త ప్రియంవద వేసము కాఁబోలు వేసినాఁడు. కణ్వమున్యాశ్రమములోని మొక్కలకు నీళ్లు పోయుటకై శకుంతలతోఁగూడఁ జేతిలో నొక యిత్తడిచెంబును బుచ్చుకొని నాభర్త రంగ మునకు వేంచేసినాఁడు! నేనప్పుడు కొంత సేపు డిల్లపడి కొయ్యనైపోయితిని. నాకప్పుడు మన స్సునఁ గోపమే కలిగెనో, రోఁతయే పుట్టెనో, నవ్వేకలిగెనో యేడుపేవచ్చెనో నే నేమియుఁ జెప్పఁజాలను. ఒక్కనిమున మట్లున్నపిమ్మట నాభర్త నిట్టిస్థితిలోఁ జూచుటకంటెఁ జచ్చిపో వుటయే మంచిదని ప్రపంచవాంఛా నిస్పృహ తను జెందితిని. అంతలో సున్నపుగుల్లపొంగు వలె రోస మెక్కడనుండియో గుబగుబలాడుచు నుబికి నన్నుఁ గంపితురాలిఁగఁ జేసెను. రంగస్థలమునకుఁబోయి యాతనియెదుటఁ బడి నెత్తిపైనున్న సవరపుబుట్టలాగి "నీకువచ్చిన యేం డ్లెవనికి వచ్చినవి? నీకీ దిక్కుమాలిన సంకరపువాలక మేల" యని యా బుట్టతో నెత్తిపై నాల్గు వాయింపవలయునని బుద్ధి పుట్టినది. కాని యారోసమును గష్టపడి శాంతిపఱచుకొని, పండ్లుగొఱుకుకొనుచు లో లోపల నెన్నితిట్లయినఁ దిట్టుకొనుచుఁ గూరు చుంటిని. రంగమున నాభర్త యెట్లు నిలువఁ బడెనో చెప్పనా? అయ్యయ్యో! ఇంక నా

భర్త యేమి? నానవతియో నాయాఁడుబిడ్డయో యైన యీ పురుషసువాసినీస్వరూపము నిలువఁబడిన తీవి యెట్లున్నదో చెప్పనా? ఎడమచేయి నడుముమీఁద వైచికొనినాఁడు. అభ్యాసము లేకపోవుటచే నది కడుపుమీఁదికి జారిపోయినది. కుడిచేత నిత్తడిచెంబు పట్టుకొని ప్రక్కతెరనుండి పాఠము చెప్పువాని వంకఁ జూచుచున్నాఁడు. అప్పుడు నా కాతఁడెట్లుండినట్లు తోఁచెనో చెప్పనా? లెట్రీనులో నెవఁడో యుండుటచేత గుమ్మమువంకఁ జూచుచు నాతురతతోఁ గనిపెట్టుకొన్నవాఁడువలె నాకుఁ గానఁబడినాఁడు. ఛీ, ఛీ, నడుము మీఁదఁ జేయివైచుకొన్నయెడల నాఁడుదాని ననుకరించినట్లే! బుగ్గమీఁద వ్రేలుపెట్టుకొన్నయెడల నాఁడుదాని ననుకరించినట్లే! పైఁట మాటిమాటికి సవరించుకొన్నయెడల నాఁడుదాని ననుకరించినట్లే. వెఱ్ఱివెఱ్ఱిప్రక్కచూపులు చూచి ముసిముసినవ్వులునవ్వి ముడుచుకొనిపోయినట్లయిన నాఁడుదియై పోయినట్లే! ఇంతయే యాతని యనుకరణము. కాంతల బాహ్యలక్షణములనే యనుకరింపలేని మగవాఁ డీక నంతరంగలక్షణముల ననుకరింపఁగలఁడా? కల్ల. నాటకకర్తలే యాఁడువారిని చిత్రింపనెంచి మగతనముచెడిన మగవారిని సృష్టించుచున్నారే. అట్టిచో నాటకకర్తలమాటల ననుసరించి మిడుకవలసిన నటకులా యాఁడువారి ననుకరించుట? అసాధ్యము.

కాని, దమయంతి దమయంతియే యైపోయె ననియుఁ జంద్రమతి చంద్రమతినిగూడ దాటినదనియుఁ బండితుల ప్రచురణములకు లోపములేదు. పాత్రధారుల బంగారుపతకములకు లోపములేదు. మగవారు మగవారిని స్తుతింపకమానుదురా? ఏదీ! జంఘాలశాస్త్రి యెందఱనో యధిక్షేపించినాఁడుకదా! కాంతల నధిక్షేపించుటలో నేమి, వారిచేఁ దిట్లు తినుటలో నేమి గట్టివాఁడేకదా! నిష్పక్షపాతముగ విమర్శింతు నని యనేకపర్యాయములు చెప్పిన యాతఁడు సైతము- మగవాఁ డాఁడువేసము వేసి జాతికంత కప్రతిష్ఠ తెచ్చుచున్నాఁడన్న యంశమును విమర్శించినాఁడా? ఆతఁడు మగవాఁడు. అల్లలచేయును?

పక్షపాతస్వభావముచే బుద్ధిపూర్వకముగ నాతఁడు విడిచిపెట్టిన యీ యంశమును నేను విమర్శింపనెంచితిని. మగవాఁడు మగువ ననుకరింప లేఁడని నాసిద్ధాంతము. అనుకరింపఁగలవాఁడైనను ననుకరింపలేనివాఁడైనను ననుకరించుటకుఁ బ్రయత్నించువాఁరెల్ల జాతికి ద్రోహియని చెప్పకతప్పదు. అందులోఁ గొలఁదిగా ననుకరించువానికంటె బాగుగా ననుకరించువాఁడే జాతికిఁ బరమద్రోహి. మగతత్త్వము నాఁడుతత్త్వము నొక్కమందడినే యంటియున్నవైనను దానికి దీనికి నత్యంతభేదమున్నది. ఒకటికఠినము, రెండవదిమార్దవము. ఒకటి హేతుబద్ధము, రెండవది రస ప్లుతము. ఒకటి చంచలము, రెండవదిస్థిరము. ఒకటి బలీయము, రెండవది దుర్బలము. ఒకటి మలీమసము, రెండవది పరిశుద్ధము. ఇంకను మఱియెంతయోభేద మారెంటికున్నది. ఈ రెండుతత్త్వములు నింత భిన్నములుగ సృష్టిలో నుండుటచేతనే స్త్రీపురుషులకన్యోన్యాకర్షణము నన్యో

న్యానురాగము నున్నవి. విజాతీయవిద్యుచ్ఛక్తి యుక్తములగు వస్తువుల కన్యోన్యాకర్షణము కాని సజాతీయ శక్తియుక్తము లగువానికిఁ బరిపూర్ణమైన ప్రాతికూల్యమేకదా! కావునఁ బురుషుఁడు పొలఁతి ననుకరించు నెడల నన్యోన్యానురాగము లేక ననుస్వారములు; సంసారములును చట్టుబండలు; బ్రతుకులు; వ్యర్థములు.

ఇదికాక! కప్పకూఁత నిత్యము కూయు వానికిఁ గప్పకున్న గొంతువంటిగొంతు రాకున్నను బురుషునికుండవలసిన తన గొంతులో మాత్రము కానంతమార్పు కలుగక తప్పదు. ఆఁడుదానివలెఁ జూడఁదలఁచి చూడఁదలఁచి పట్టుదలతోఁ బ్రయత్నించిన మగవానికాఁడుదానిచూపు లలవడకున్నను మగచూపులో మార్పుకల్గుట సిద్ధాంతము. ఆడుఁదాని కంఠరవము ననుకరింపదలఁచి విశాలమైన గంభీరమైన తన గొంతును సన్నపఱచుకొని కుదించుకొనిన మగవానికి సహజలలిత మధుర మృదులమగు స్త్రీకంఠము రాకున్నను మగగొంతు చెడుట నిశ్చయము. అట్టె సిగ్గుపడిన యాఁడుదానిబుగ్గ యెఱుపులు, కంటిప్రాలుటలు, తల వోరలు, మొగపుఁదళుకులు, నొడలి ముడుపులు సంతతము ననుకరింపఁదలఁచి ప్రయత్నించిన మగవానికి లలనాజనసహజలజ్జాసౌభాగ్యలీలాకలాపము పట్టుపడదు. కాని మగయొడలిపొంకములు ధ్వస్తములగుట తప్పదు.

మనసే సర్వసృష్టికిఁ గారణమని పెద్దలనినమాటలో సత్యము లేకపోలేదు. చూడవలయును జూడవలయునని మనస్సు వాంఛించుటచేతనే కదా శరీరమునకుఁ గన్నులుకలిగినవి! తినవలయును తినవలయునని సంతతవాంఛకలుగుటచేతనేకదా శరీరమునకు నోరువచ్చినది! ప్రాతిపదికమగు జంతువున కివి యేమియు లేవుకదా! తరువాత మనస్సులోని సంచలనములవలననేకదా దేహమున కవయవ వైవిధ్యము కలిగినది. మనఃప్రవృత్తులు శరీరమందలి మార్పుల కెట్లు కారణములో, సంతతాభ్యాసమున దేహము నందు కలిగించుకొన్ని మార్పులు మనస్సులో మార్పుల నెందులకుఁ గలుగఁజేయఁగూడదు? నుదుటఁ బూసికొన్న విభూతిరేఖ శివదర్శనమునకై బుద్ధిపుట్టించుచున్నది. ఒడలిపై ధరించిన మల్లదండ భోగమువీథికై మనస్సును లాగుచున్నది. యోగశాస్త్రానుసారము దేహమున కిన్ని ముద్రలు, నాసనములు, కఠినము లగు గరిడీపద్ధతులు నేలకలిగినవి? మనశ్చాంచల్య నివృత్తికేకదా! ఐహికతుచ్ఛవాంఛాలంపటతనువీడి వైరాగ్యజ్ఞానసంపత్తిని మనస్సు గ్రహించుటకే కదా! దేహపరిణామ భేదములు చిత్తవృత్తులలో మార్పులు కలుగఁజేయకుండునెడలఁ బాతంజల యోగశాస్త్ర మంతయుఁ బారిశుద్ధ్యసంఘమువారి బండితుక్కువలెఁ బరశురామప్రీతి కర్హమేకాదా? దేహములోని మార్పులు మనస్సులో మార్పులు కలుగఁజేయక యెట్లుండఁగలవు? తా నాఁడుదానని యనుకొని యనుకొని, పరపాత్రచే నాఁడుదివలె సంబోధింపఁజేసికొని, యాఁడుదానిపోడుములు తెచ్చిపెట్టుకొని, యాఁడుదానివలెఁ జూచి మాటలాడి, తక్కితారి యుగిలించి, త్రిప్పుకొని యేడ్చిన మగవానిదేహములో సంతతాభ్యా

సమువలనఁ గలిగినమార్పు లాతనిమనస్సులోఁ దదనుగుణములగు మార్పులను గలుగఁజేయక తప్పదు. అందుచేత నాఁడుదాని మనస్తత్త్వ మాతనికి రాదుకాని మగవాని మనస్తత్త్వము మట్టిలోఁ గలసిన దనుట నిశ్చయము.

నా యనుభవములోనున్న యొక చిన్న యంశమును జెప్పెదను. నేనొకరోజున వీధిగుమ్మములో నిలువఁబడితిని. ఆవీధి నప్పుడొక్క స్త్రీపాత్రధారి బజారులోఁ గొనిన కూర లంగవస్త్రమున మూటఁగట్టుకొని యామూటఁ జేతితోఁ బట్టుకొని, యొడలిపైఁ జొక్కా లేకుండఁ గట్టుకొన్నబట్టతో మాత్రమే యింటికిఁబోవుచుండెను. ఆతని నే నెఱుఁగుదును. ఆతఁడు జన్మమున నాఁడారివాఁడు కాఁడు కాని పదిసంవత్సరముల నుండి స్త్రీపాత్రముల ధరించుచున్నాఁడు. ఇంతలో నాతని కెదురుగ నొక పెద్దమనుష్యుఁడు వచ్చుచుండెను. ఆతఁడొక నాటకసంఘమున కధికారి. ఆతనిఁ జూచుటతోడనే యీ మందభాగ్యుఁడట్టెసిగ్గుపడి, యట్టెముడుచుకొని, మూటగట్టగా మిగిలిన యంగవస్త్రపుఁ గొనను రవంత పైటగ వేసికొనఁబోయి యది చాలకపోవుటచేఁ దహతహపడి రెండుచేతులను గత్తెర మాదిరిగ ఱొమ్ముపై వైచుకొని తలవంచుకొని నిలువఁబడినాఁడు. ఆహా! అతఁ డెంతలో మగరూపమును మఱ్నచేసికొనినాఁడో యని నా కెంతయైన జాలికలిగినది.

ఎంతకాల మలవఱచుకొన్నను స్త్రీపాత్రధారి కాఁడుదానిబహిరంత స్తత్త్వములు రావు కాని మగతత్త్వము భగ్నమగుట నిస్సందేహము. అందుచే నిప్పు డాతఁ డెట్టివాఁడు? మగతనము చెడినవాఁడు. ఆఁడుది కానివాఁడు. ఆతఁడు పూర్తిగా నాఁడుదియే యైనయెడల నేమో మనతోపాటు తాను గూడ నుండియేయుండును. ఇంటిలో వంటకుఁ బెంటకుమనకుఁ జేదోడుగ నుండియేయుండును. అటుకాక యిటుకాక యిప్పుడాతఁడు నడుమ నూగులాడుటచేత గిజగిజ లాడుచున్నాము. ఆతఁ డాఁడుది కాని హేతువుచేఁ జేపట్టనా? మగతనము మాసిపోవుటచే వదలిపెట్టనా? అడుగంటిన యనురాగము లడుగంటనేయుంటినవి. పోనీ! ఏలాగుననో సృష్టితంత్రము జరుగుటకై యేయెడ మొగము పెడమొగముగనో సంసారములో శేషభాగ మీడ్చివేయుద మని సిద్ధపడినయెడల మాకింకఁ బుట్టఁదలఁచినపిల్లల మాట యేమి? మగవాఁడు కాకుండ నాఁడుది కాకుండ నడుమనున్న సంకరస్వరూపములను గని వారి నేడ్పించి మేమేడ్చుట కంటె బడుకగది కొక్క నమస్కార మర్పించి వంట యింటిలోఁ బ్రత్తి బుట్టముందో, సీతానగరములోనుపన్యాస పీఠమందో తనువు వెడలఁబుచ్చుకొనుట సర్వశ్రేయము కాదా? ఇప్పటి పరిస్థితులలో భారతదేశ మెట్టి కొడుకులను గనవలయునో యెవ రెఱుఁగరు? ఇనుపకండలవారిని, ఉక్కునరములవారిని, వజ్రహృదయముల వారిని, శాంతచిత్తులైనవారిని, దేశభక్తులైనవారిని, విద్యాశాలులైనవారిని మనమిప్పుడు కనవలసియున్నదికాని లంగా కట్టుకుని నాట్యమాడు మగరంభను, గోవులపంచెకట్టుకొను పోతు

చిత్రము ౧



పైభాగము:—గౌతముని సంగీతగోష్ఠి.

క్రిందిభాగము:—గౌతముడు నిద్రాసక్తులగు భార్యాపుత్రులను త్యజించి వెడలుట. పరిచారకులు, గాయకులు నిద్రితులై యున్నారు.

గౌతముడు బుద్ధుడై చేయు ఉపదేశము



క్రిందిభాగము:—బుద్ధుడు ఎనమండ్రు శిష్యుల కుపదేశము చేయుట.

మధ్యభాగము:—బుద్ధుడును ఆయనను పూజచేయు జనులును.

పైభాగము:—బుద్ధుని భిక్షాపాత్రమును జనులు పూజించుట.

బుద్ధుని పీఠమున కడుగునగల చక్రమును దాని కిరువైపులగల మృగములను చూడుడు. బుద్ధుడు కురంగారామ మను (సార్నాదులోనిది) చోట న్యాయచక్రమును ద్రిప్పుట అను ప్రథమ మతబోధను దెలియజేయు కురంగ చక్రలాంఛన మిది.

వితంతువును మనమిప్పుడు కనవచ్చునా? ఇప్పుడున్న స్త్రీ పాత్రధారులు చాలరా? అదిగాక జన్మముచే నాఁడౌరి పెద్దమ్మ లెందఱున్నారో? వీరుచాలక, యింక నిట్టి యర్ధపురుష సృష్టికి మనము పూనుకొనుట బుద్ధిహీనత కాదా, దేశద్రోహము కాదా?

"నీవాఁడు వేసము వేసితివి కావున నీతో నేనుగాపురమొనర్ప"నని స్పష్టముగ నేను నా భర్తతో—అదే అర్ధ భర్తతో—ఆఁడుమగనితోఁ జెప్పితిని—"నేనిప్పుడే పైచితినా? ఆఱు మాసములనుండి వేయుచున్నా"నని యాతఁడు వెకవెకలాడెను. సోదరీమణులారా! చూచితిరా! ఆతని దుర్నయము! ఆతనిదురాగతము! తాను జెడనే చెడినాఁడు; జాతిని సంకర పఱచుటకుఁగూడసంకల్పించుకొనినాఁడు. ఇది నీకు నీతిగాదని మనము మందలింపఁబోఁగ మనలను బరాభవించుచున్నాఁడు. ఇంతకంటె నాఁడు దానికి విచారకారణ మేమి యుండఁగలదు? ఇది మనము సహించి, నోరుమూసికొని పడి యుండవలసినదేనా? నే నట్టినీచత కంగీకరింపను. విద్యావతులు, మానవతులు, దేశభక్తియుక్తలైన నా సోదరీమణులందఱు నా యభిప్రాయముతో నేకీభవింతురని నమ్మియున్నాను. ముందు జరిగింపవలసినపని యొకటి యున్నది. ఆంధ్రదేశమున నున్న నాటకసంఘాధికారుల కందఱకు మనయొక్క యాజ్ఞాపత్రమంపవలసి యున్నది. దానిలోని యంశములిట్లుండవలయును.

"మీరు మాభర్తలచే మీనాటకములలో నాఁడు వేసములను వేయించుచున్నారు. మగవాని కనర్హమైన స్త్రీపాత్రధారణమువలన వారు చెడిపోవుచున్నారు. వా రట్లుపాడై జాతినిగూడ భ్రష్టపఱచుటకు సంకల్పించుకొని యున్నారు. వ్యక్తివినాశకమైన, జాతి వినాశకమైన యీకృత్యమును మీరు ప్రోత్సహింపఁదగదు కావున మాభర్తలను మీసంఘములనుండి బహిష్కరింపవలయును. ఇంతటినుండి పురుషులచే స్త్రీవేషములను వేయింపమని మీరు శాసన మొనర్చుకొనవలయును. నాట్యకళాభివృద్ధి మాకిష్టమే. స్త్రీలకే స్త్రీపాత్రములిప్పించి మీరాకళను బరిపోషించి, పరిపూర్ణకీర్తి నొందవలయును. నాగరకత గల యన్ని దేశములందుఁగూడ నదియే పద్ధతి. మీరు దానికి విరుద్ధముగ నడవఁదగదు. సహేతుకమైన మా యాజ్ఞాపత్రమును మీరు సన్మానింపవలయును."

ఇట్లు వ్రాసి స్త్రీ లందఱచే సంతకములు చేయించి వారికిఁ బంపవలయును. అటుపిమ్మటఁ గూడ మనభర్తలు చీర రైక సొగసు చిత్తగించుట మానకపోవునెడల నింక నంతే-వారికివారే, మనకుమనమే; వారితో మనము పూర్తిగ విడిపోవలసినదే. రాజకీయ ప్రపంచమున Non Co-operation యెట్లు పుట్టినదో శృంగారప్రపంచమున నిప్పుడు Non Co-operation అట్లు పుట్టవలసి యున్నది. మనకు జాతిపరిశుద్ధి ప్రధానముకాని సంసారవృద్ధి కాదు. దేశసేవ ప్రధానముకాని భర్తసేవ కాదు. భారతదేశసేవ ముందుఁ బతిసేవ యెంత? మనకుఁ బతులు శాశ్వతులు కారు. వారికిష్టత తప్పినను బోవుదురు. మన కిష్టత తప్పి

నను బోవుదురు. కాక మృత్యువున కధీనులై పోవచ్చును కాని భారతదేశము శాశ్వతము! ఆమె యిప్పుడు పుత్రపుత్రికాసేవ నపేక్షించుచున్నది. పూర్వసౌభాగ్యము, నాగరకత, విజ్ఞానము సంపత్తు, స్వాతంత్ర్యము, గౌరవము నశించుటచే దీనమై, శోభారహితమై, దాస్య శృంఖలానిబద్ధమై పరితపించుచున్నది. శీత జ్వర మారికాది మహావ్యాధులచేతను, గూటికి గుడ్డకుగూడఁ గఱవైన దారిద్ర్యముచేతను, రక్తపాతములకుఁ గారణము లగుచున్న వర్ణ వైషమ్యములచేతను జాతియంత యధాయధ లగుటవలన, నీకంటి కొలికినీరు బంగాళాఖాత ముగ, నాకంటి కొలికినీరు పశ్చిమసముద్రము గ మహాసంక్షోభ మొందు భారతదేశమును సేవించి పూజించి మన తనువులు కృతార్థము లగునట్లు చేసికొనవలయును.—సు. స.

[భారతీపత్రికాధిపతీ! ఈకాంత వ్రాసిన సాహసపు వ్రాఁతలలో నొకటిరెం డంశములు నేను విమర్శింపవలసి యున్నది ఆవిమర్శనము త్వరలోఁ బంపెదను. ఆశ్వీయుజమాసమునఁ బ్రకటింపఁబడు భారతిలో దానిని బ్రకటింపఁ గోరుచున్నాను.

చిత్తగింపుఁడు,

షా. ల. నరసింహారావు.]

వాసంతికవినోదము

మిత్తింటి నరసింహమూర్తి గారు

[కవితా నికేతనము]

ఆఁటుమామిడి గున్న నధివసియించి
లేతచిగుళ్లను లెస్సగమెసవి
కంఠంబు సవరించి కలకలగూయు,
గండుకోయిలకును పండువునాడు
విరివిగ పుష్పించి విలసిల్లునట్టి
మల్లెల జైత్రుడు మనకుగా దెచ్చి
కాముపాన్పపయిన గలయంగ బోసి
సరసంబులాడెడు సమయంబులందు
చల్లనిగాలిని జాయగ బంపి
తొంగిచూచియు తాను తొలగినయట్టి
తొలుతటిరోజుల తోచు నీయంద
మబలరో, నాఁడెంద మెకట్టియుండె.

వేంగిచాళుక్యులు

మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు

(భారతి రెండవసంపుటము - ౭ వ సంచిక తరువాయి)

౪

విజయాదిత్యుని సర్వ సైన్యాధిపతియైన పాండురంగప్రభుని తోడ్పాటు మూలమునను, సామర్థ్యాతిశయముల మూలమునను చాళుక్యరాజ్యమున శాంతి సంస్థాపింపఁ బడియెను. నెల్లూరు మండలమందలి కందుకూరు దక్షిణమున చాళుక్యరాజ్యము యొక్క సరిహద్దులను గాపాడు ప్రధానస్థానమై బెజవాడ తరువాత ప్రముఖమైన నగరమయ్యెను.

ఈవిధమున వేంగిచాళుక్యరాజ్యము అభివృద్ధి నొందుచున్నసమయమున రాష్ట్రకూట రాజ్యమునకు అకాలవర్షుఁడు, శుభతుంగుఁడు అనుపేర్లుగల రెండవకృష్ణభూపతి రాజ్యమునకు వచ్చెను. ఈతఁడు (మొదటి) అమోఘవర్షుని కుమారుఁడు. అమోఘవర్షుఁడు ఇటు చాళుక్యులతోను, అట పశ్చిమగాంగులతోను, గాంగపల్లవులతోను—ఇంక పెక్కుమందితో బహుకాలము యుద్ధములు చేసి చేసి, దేశశాంతికిని, దేశాభివృద్ధికిని సౌమనస్యమును, మిత్రభావమునే కారణములు కాని యుద్ధములును, శత్రుభావమును కారణములు కావని తనవార్ధక్యదశయందు రమారమి అఱువదిరెండుసంవత్సరములు రాజ్యమును పరిపాలించిన మీఁదటఁ గలిగిన స్వానుభవమువలనఁ దెలిసికొన్నవాఁడై తనకంతవఱకు నత్యంతము శత్రువులుగా నుండినవారితో మైత్రిని బాటించి తద్రఢబంధముగ వారితో సంబంధబాంధవ్యములు నెఱపెను. గాంగ పల్లవప్రభునికిని, పశ్చిమగాంగప్రభువైన రెండవరాజమల్లసత్యవాక్యభూపతికి సోదరుఁడును, యువరాజునైన బూతరసనామాంతరముగల బూతగేంద్రునికిని దనకొమార్తెలనిచ్చి పరిణయముఁ గావించెను. ఈపద్ధతినే యీతఁడు వేంగిచాళుక్యులయెడఁ గూడ నవలంబించినట్లు మన మెఱుఁగియేయున్నాము.

ఈవిధమున రాజ్యమున శాంతిని సంస్థాపించి తన రాజ్యపరిపాలనాధికారమునకు మైత్రిని ప్రధానాధారము చేసికొని రాజ్యభారమంతయుఁ దనకుమారుఁడైన కృష్ణవల్లభుని భుజాస్కంధములపై నుంచి అమోఘవర్షుఁడు తన రాజ్యమున నానాఁటికి వృద్ధి నందుచున్న జైనమతము నాదరించి, తన్మతాచార్యులయొద్ద మత రహస్యములను దెలిసికొనుచుఁ దన చరమదశఁ గడపెను.

నూతనముగ రాష్ట్రకూట సింహాసనము నధిష్ఠించిన కృష్ణవల్లభుని కాలమున మఱల రాష్ట్రకూట, చాళుక్యవంశములు రెంటికి కలహములు రేఁగెను. ఉభయ వంశములకు నావిధమున మఱల యుద్ధములు సంభవించుటకూడ కృష్ణవల్లభుఁడు తన తండ్రి నడచిన శాంతి మార్గమున నడవలేదేమో యని తోఁచును. ఆతఁ డుత్తరమున హైహయవంశజులకు ప్రధానస్థానమైన చేది దేశమునకు ప్రభువగు కోకల్లదేవుని కూఁతురిని బెండ్లియాడి తనరాజ్యమునకు బలముఁ గలిగించుకొనెను. దక్షిణమున పశ్చిమ గాంగులతోను, వైదుంబులతోను మైత్రి పాటించి తన రాజ్యము యొక్క దక్షిణపుసరిహద్దులను కట్టుదిట్టముగావించుకొనెను. ఈవిధమునఁ దన బలమును దాను పరీక్షించుకొని రాష్ట్రకూటాధిపతి మఱల విజయాదిత్యునితో కయ్యమునకు కాలు ద్రవ్వెను. ఈవిధమున కొంతకాలమునుండి చాళుక్య రాష్ట్రకూట వంశములకు రెంటికి నివురు గప్పియుండిన వైరానలము మఱల నింకొకమాఱు ప్రజ్వరిల్లెను.

ఈవల రాష్ట్రకూటులేకాక యొకవంక నోలంబ పల్లవులును చాళుక్యులతోఁ దలపడిరి.

ఇట్లు మూఁడవవిజయాదిత్యుని పరిపాలనాంత్యకాలమున దేశమంతయు ప్రచండసంగ్రామములతో సంక్షోభించి పోయెను. ఇందులకుఁ గారణములు మాత్రము మనకుఁ దెలియరావు కాని చాళుక్య రాజ్యమునందలి పరిస్థితులను గుఱించి కొంత తెలిసికొనినచో నీకలహకారణము కొంత బోధపడవచ్చును.

విజయాదిత్యునికి విక్రమాదిత్యుఁడనియు, యుద్ధమల్లుఁ డనియు, నృపకాముఁడనియు ముగ్వురు సోదరు లుండినట్లు మన మీవలఱకే యెఱుంగుదుము. ఈ సోదరులు మువ్వురిలో నృపకాముఁడు విజయాదిత్యునికి విధేయుఁడైనవాఁడు. ఆతనిమీఁది ప్రేమచేత నాతనికోరికను మన్నించి విజయాదిత్యుఁడు అగ్రహారములనుగూడ దానము చేసినవాఁడు. ఇఁక విక్రమాదిత్య, యుద్ధమల్లు లిరువురిలో విక్రమాదిత్యుని విజయాదిత్యుఁడు తనకు సంతానము లేనికారణమునఁ గావచ్చును యౌవరాజ్యమున కభిషిక్తునిం గావించెను. యుద్ధమల్ల, విక్రమాదిత్యు లిరువురిలో జ్యేష్ఠుఁ డెవ్వరో తెలియరాదు. ఎవ్వరైననేమి యువరాజైనవాఁడు విక్రమాదిత్యుఁడు. అసలు తనకురాజ్యము లేకపోయినందులకే హృదయమునమఱుఁగుచుండినయుద్ధమల్లుఁడు తనసోదరుఁడు తన్నువిడిచి విక్రమాదిత్యుని యౌవరాజ్యమునకు పట్టముఁ గట్టెనన్న క్రోధావేశమున నేమి చేయఁజాలఁడు? రాజ్యసంపాదనమునకై ప్రయత్నము చేయువార లేదారి త్రొక్కరు? ఏమిచేయ సాహసింపరు? మూఁడవవిజయాదిత్యుని పరిపాలనకాలమునందలి యీసంగ్రామములకు ఈయుద్ధమల్లుఁడు కొంతవఱకుఁ గారణమైనఁ గావచ్చును.

నోలంబ-చాళుక్యయుద్ధములు

ఈవిజయాదిత్యునికాలముననే నోలంబులకు, చాళుక్యులకుఁ గూడ కలహములు రేఁగెనని యీవఱలోఁ జెప్పఁబడినది. చాళుక్య మూఁడవవిజయాదిత్యునికి సమకాలికుఁ

డైన నోలంబరాష్ట్రాధిపతి పోలల్చోరనోలంబాధిరాజు[1]. ఇతనికుమారుఁడు వీరమహేంద్రుఁడు. నోలంబాధిరాజు పశ్చిమగాంగులకు విధేయుఁడైన సామంతుఁడుగ నుండి, గాంగులతో సంబంధబాంధవ్యములు నెఱపినవాఁడు. అతఁడు గాంగులతో సంబంధములు గావించినను ఏమాత్రము వీలు చిక్కినను స్వాతంత్ర్యమును బ్రకటింపవలె ననియే ప్రయత్నించుచుండెను. స్వాతంత్ర్యమును, రాజ్యమును సంపాదించుకొను నీ ప్రయత్నములలోనే నోలంబులకు చాళుక్యులకు యుద్ధములు సంభవించియుండును. ఒకవైపు మధురానగరపుపాండ్యులు, మఱియొకవైపు తంజావూరు-చోళులు, ఇంకొకవైపు గాంగపల్లవులు, వేఱొకవైపు వైదుంబులు, బాణులు, పశ్చిమగాంగులు వీరలెల్లరు తమతమరాజ్యములను విస్తరింపఁ జేసికొనుటకుఁ బ్రయత్నించుచుండినకాల మది. భయంకరమైన యాపోరాటములలో నేదియో యొక గొప్ప రాజ్యమును స్థాపించుకొని బలముగలవారు మహారాజు లగుట కవకాశము గలదినము లవి. ఉండిన గొప్పరాజ్యముగనుండవలె, లేనిచో రాజ్యమే లేకుండపోవలె నన్న పట్టుదలతో ఆనాఁటి ప్రభువులు తీవ్రముగఁ బోరాడినకాల మది. అందువలన నెల్లరివలెనే నోలంబులును విజృంభించిరి.

విజయాదిత్యుఁడు మహాభయంకరమైన యుద్ధరంగమున ఉప్పటూరు వాస్తవ్యుఁడును, కౌశిక సగోత్రుఁడును, ఆపస్తంబసూత్రుఁడు నైన దామోదరశర్మ పుత్త్రుఁడగు వినయడి శర్మ యొక్క యద్భుతాదేశము ననుసరించి నోడంబరాష్ట్రాధిపతిని నిర్జించి నోలంబులనోడించెను. వినయడిశర్మ యొక్క సలహా మూలమున నోలంబులను జయింపఁగలుగుటచేత ఆతని యద్భుతాదేశమునకు సంతుష్టుఁడై విజయాదిత్యుఁ డా బ్రాహ్మణునికి చంద్రగ్రహణ నిమిత్తమున గుద్రవారవిషయములోని 'ట్రండపట్టు' అనుగ్రామమును దానము చేసెను. ఈ విధమున విజయాదిత్యుఁడు జయించిననోడంబరాష్ట్రాధిపతిపేరు మంగిరాజని చాళుక్యశాసనములు తెలుపుచున్నవి. కాని విజయాదిత్యునికి సమకాలికులని మన మెఱింగిన నోలంబప్రభువులలో మంగిరాజను పేరుగలవారు కానరారు. అందువలన పోలల్చోరనోలంబాధిరాజునకో, వీరమహేంద్రునికో మంగిరా జను నామాంతర ముండవలెను. వీరమహేంద్రుఁడు విజయాదిత్యునితో జరిగిన చాళుక్యయుద్ధములలో నిహతుఁడైనవాఁడు కాఁడు. ఈతఁడు పశ్చిమగాంగప్రభువైన యువరాజ బూతరసు కుమారుఁడైన ఎఱెయప్ప అనునతనికాలమువఱకు నుండి పశ్చిమగాంగులకును నోలంబులకునైన యుద్ధములలో నతనిచే వధియింపఁబడినవాఁడు. అందువలన విజయాదిత్యునిచే నిహతుఁడైనవాఁడు వీరమహేంద్రుఁడు కాఁడనుట స్పష్టము. ఇఁక నాతనికి సమకాలికుఁడైనవాఁడు పోలల్చోరనోలంబాధి రాజు. ఇత

1. నోలంబులనుగుఱించియు, పశ్చిమగాంగులనుగుఱించియు నిందు వ్రాసినవిషయములకు రైస్‌దొరగారు వ్రాసిన వ్రాతలను, రావుబహద్దరు ఆర్. నరసింహాచారి, యం.యే., గారు వ్రాసిన వ్రాతలను ఆధారము చేసికొనియున్నాను.

నికే మంగిరాజను నామాంతర ముండియుండ వచ్చును. నోలంబులలో పూర్వుఁడైన యొక నోలంబాధిరాజునకు మంగళుఁడను నామాంతర ముండినట్లు వారిశాసనముల ననుసరించి తెలియుచున్నది. అట్లే పోలల్చోరనోలంబాధిరాజునకు కూడ మంగళుఁడనునామాంతరము కలదేమో? మంగి యనునది మంగళ శబ్దము యొక్క హ్రస్వరూపమై యుండునేమో. ఈ విషయము నిదమిత్థమని తేల్ప నాధారములు లేవు. ఈపైనిచేసినవన్నియు నూహలు. విజయాదిత్యుఁడు జయించిన మంగిరాజు నోడంబ రాష్ట్రాధిపతి యని శాసనములందుఁ జెప్పఁబడి యుండుటచేతను, విజయాదిత్యునికి పోలల్చోర నోలంబాధిరాజు సమకాలికుఁడును, నోలంబ రాష్ట్రాధిపతియు నగుటచేతను ఈ నోలంబాధి రాజునకే మంగిరాజను నామాంతర ముండి యుండునని యూహింప నవకాశము కలిగెను. పోలల్చోరనోలంబాధిరాజే మన మీవఱలో నూహించినట్లు విజయాదిత్యుని ఖడ్గమున కాహుతియైన మంగిరాజైనయెడల నింకొక్క విషయమునుగూడ మనము నిశ్చయింప వచ్చును.

మూఁడవ విజయాదిత్యుని సమకాలికులు

పశ్చిమగాంగులు

మొదటిసత్యవాక్య రాజమల్లుఁడు
- మొదటి నీతి మార్గపెర్మనడి
  - రెండవరాజమల్ల కొంగుణివర్మ సత్యవాక్య పెర్మనడి
  - యువరాజ బూతరసు (అమోఘవర్షుని కూతురిని పెండ్లియాడెను)
    - ఎఱెయప్ప (వీరమహేంద్రుని జంపినవాఁడు)
- జాయవ్వ

నోలంబులు

పోలల్చోరనోలంబాధిరాజు (జాయవ్వను పరిణయమాడెను) (నీతిమార్గపెర్మనడి సామంతుఁడు)
- వీరమహేంద్రుఁడు (బూతరసుతోడను, ఎఱెయప్పతోడను బహుయుద్ధములు చేసినవాఁడు)

రాష్ట్రకూటులు

మొదటి అమోఘవర్షుఁడు
- కృష్ణవల్లభుఁడు (చేది కోకల్లదేవుని కూతురిని పెండ్లియాడెను)

నోలంబాధిరాజు పశ్చిమగాంగ ప్రభువైన మొదటిసత్యవాక్యకొంగుణివర్మధర్మమహారాజాధిరాజ పరమేశ్వర 1 రాజమల్లుని యల్లుఁడు; అనఁగా మొదటిసత్యవాక్యరాజమల్లుని కూఁతురైన జాయవ్వను పరిణయ మాడినవాఁడు; మొదటిసత్యవాక్యరాజమల్లుని కుమారుఁడైన మొదటినీతిమార్గపెర్మనడిప్రభునికి సామంతుఁడుగ నుండి గాంగమండలము నందలి కొంతభాగమును పరిపాలించినవాఁడు. ఈ మొదటినీతిమార్గపెర్మనడియు, ఆతని కుమారులైన రెండవసత్యవాక్యకొంగుణివర్మరాజ మల్లుఁడును ఆతనిసోదరుఁడు యువరాజబూతరసునుకూడ మూఁడవవిజయాదిత్యునికి సమకాలికులే. నోలంబాధిరాజును, ఆతనికుమారుఁడైన వీరమహేంద్రుఁడును స్వాతంత్ర్యసంపాదనమునకై సమయమునకు వేచియుండినను అది వీరమహేంద్రునికాలమునఁగాని తటస్థింపలేదు. వీరమహేంద్రుఁడు తండ్రియనంతరము రాజై, కొంతకాలము యుద్ధములు చేసినపిదప ౮౭౮ ప్రాంతమున స్వతంత్రుఁ డయ్యెను. అందువలన విజయాదిత్యుఁడు పోలల్చోరనోలంబాధిరాజును జయించినది క్రీస్తుశకము ౮౭౮ సంవత్సరమునకుఁ బూర్వమే యని నిశ్చయింపవచ్చును. అప్పటికి గాంగులకును, నోలంబులకును మైత్రి చెడియుండలేదు. కావునఁ దమకు రక్తసంబంధమును, అర్థసంబంధమును గలిసిన పోలల్చోరనోలంబాధిరాజును విజయాదిత్యుఁడు రణరంగమున వధియించుట పశ్చిమగాంగులకు క్రోధకారణ మయ్యె ననుటకు సందియము లేదు. కాని వారికి వేంగీచాళుక్యులపై క్రోధము రేఁగినను ప్రత్యేకము తాము యుద్ధమున వారి నెదిరింపఁగలిగినంత సమర్థులు కాకపోవుటవలన వారు ఏమియుఁ జేయలేక మిన్నకుండవలసినవారైరి. ఈసందర్భముననే కావచ్చును. పశ్చిమగాంగులు చాళుక్యులపై దండెత్తిపోవనున్నయెడల తప్పక తాను తన బలములతో వారికిఁ దోడ్పడెదనని బాసట యిచ్చి రాష్ట్రకూట కృష్ణవల్లభుఁడు వారిని ప్రోత్సహించి చాళుక్యులపైఁ బంపి, చాళుక్యులను సమరమున కాహ్వానించియుండును.

గంగ, రట్ట-చాళుక్యయుద్ధములు

కృష్ణవల్లభుని ప్రోత్సాహమున గంగ, రట్ట (రాష్ట్రకూట) బలములు అనతికాలముననే తండోపతండములుగ చాళుక్యుల వేంగీరాజ్యముపై దాడివెడలెను.

విజయాదిత్యమహారాజును, ఆతనిసర్వసైన్యాధిపతియైన పాండురంగవిభుఁడును చారదృష్టిని వల్లభాధిపతిచేయు తంత్రములను బరికించుచునే యుండుటచేత వారు నిరంతరము అత్యంతము జాగరూకులై యుండిరి. కృష్ణవల్లభుని యొక్కయు, గాంగుల యొక్కయు సైన్యము లెప్పుడు చాళుక్యరాజ్యముపై నెత్తివచ్చెనో యప్పుడే పాండురంగవిభుఁడు వేంగీచాళుక్యవాహిని నంతయు గలియఁజేర్చికొని రణభేరి మ్రోయించి శత్రుసైన్యముపైఁగవిసెను.

1. సాధారణముగ పశ్చిమగాంగప్రభువులు కొంగుణివర్మ ధర్మ మహాధిరాజు లని కాని మహారాజాధిరాజ పరమేశ్వరులని కాని పేర్కొనంబడుదురు.

కృష్ణవల్లభుఁడు గాంగులను మాత్రమే గాక వైదుంబులనుకూడ చాళుక్యులపై దండెత్తఁ బ్రేరేపించినట్లు కనఁబడును. వైదుంబులకును, చోళులకును సమరము సంభవించు నట్లుండుటచేత వారు రాష్ట్రకూటులతో మైత్రి పాటించి తమబలమును వృద్ధిచేసికొను చుండిరి. అందువలన కృష్ణవల్లభుఁడు ప్రేరేపింపఁగానే వైదుంబులు చాళుక్యుల నెదుర్కొనుట కంగీకరించియుందురు. కృష్ణవల్లభునికి సమకాలికుఁడైన వైదుంబరాజు గండసంకిలుఁ డనువాఁడని తెలియుచున్నది[1].

వేంగీచాళుక్యరాజ్యమునకు దక్షిణమున గాంగబలములును, వైదుంబబలములునువిజృంభించుచుండ పశ్చిమదిశను రాష్ట్రకూటులును ఉత్తరమున చేదిదేశాధీశులును చెలరేఁగిరి. చేది హైహాయ వంశజుఁడైన కోకల్ల దేవుఁడు బాంధవ్యమును పాటించి కృష్ణవల్లభునికిఁ దోడై చాళుక్యులపైఁ గత్తిఁగట్టెను. ఈకోకల్లదేవుఁడే చాళుక్యశాసనములందు డాహలాధీశుఁడని పేర్కొనంబడి యున్నాఁడు. చేదిదేశముయొక్క పశ్చిమభాగమునకు డాహలమనియు, పూర్వభాగమునకు మహాకోసలమనియుఁ బేళ్లు. ఈమహాకోసలమునే దక్షిణకోసల మందురు. డాహలమండలమునకు జబ్బల్‌పురముదగ్గఱనున్న 'త్రిపురి' రాజధాని.

ఈవిధమున శత్రువులు తన రాజ్యమును ముట్టడించినను విజయాదిత్యుఁడు ఎంతమాత్రమును అధైర్యము చెందలేదు. పాండురంగవిభునివంటి సైన్యాధిపతులు, వినయడిశర్మ వంటి మంత్రులు నుండగా నతనికి జంకేల? గొంకేల? దక్షిణమున శత్రుసైన్యములపైకి ప్రతాపవంతుఁడును, విక్రమాక్రాంతశాత్రవుఁడును, రణరంగమున రెండవభీభత్సుఁడు నైన పాండురంగవిభునిబంపి, విజయాదిత్యుఁడు పశ్చిమోత్తరదిశలను విజృంభించినశత్రుసేనపైకితానుస్వయముగఁ బోయెను. ఈ యుద్ధములలో యువరాజైన విక్రమాదిత్యుఁడును, ఆతని కుమారుఁడైన చాళుక్యభీమాధిపతియు, నృపకాముఁడునువిజయాదిత్యమహారాజునకుఁ జాలతోడ్పడిరి. పశ్చిమగాంగబలములకు యువరాజైన బూతరసు నాయకత్వము వహించి యుండవచ్చును.

మొదటి నీతిమార్గపెర్మనడిపిదప రాజ్యమునకు వచ్చినపశ్చిమగాంగప్రభువైన రెండవ

1. గండసంకిలునికాల మిదియని నిర్ధారణగాఁ దెలుపుశాసనము లేవియు దొరకలేదు. కాని సంకిలుని శాసనములందలి యక్షరముల పోలికనుబట్టి యాతఁడు క్రీస్తుశకము తొమ్మిదవశతాబ్దము కడపటిభాగమం దున్నవాఁడని గవర్నమెంటుశాసనశాఖవా రూహించుచున్నారు. క్రీస్తుశకము తొమ్మిదవశతాబ్దము కడపటిభాగమందున్న చాళుక్య మూఁడవవిజయాదిత్యుని శాసనములలో ఆతనిచేత నోడింపఁబడినవాఁడును, రాష్ట్రకూటులకు మిత్రుఁడుగ నున్నవాఁడును అగు నొక్క సంకిలుఁడు కనఁబడుటచేత ఈవైదుంబ గండసంకిలుఁడే విజయాదిత్యునిచే నోటువడినసంకిలుఁడైయుండవచ్చునని శాసనశాఖవారు తేల్చియున్నారు (Ep Rep. 1923. Para 20). ఈనిర్ణయము సరియైనది కాదని చెప్పుటకు ఇతరాధారములేవియు లేవు. అందువలన శాసనశాఖవారు తేల్చినయభిప్రాయమునకు వ్యతిరేకముగ నాధారములు దొరకిననేతప్ప లేనిచో వారిసిద్ధాంతమునే యంగీకరించుటయుక్తమని వారి యభిప్రాయమునే పైన పొందుపఱచితిని.

రాజమల్ల కొంగుణివర్మ సత్యవాక్యపెర్మ నడి యనంతరము గాంగసింహాసనము నధిష్ఠించినవాఁడు యువరాజగు బూతరసుకాక ఆతనికుమారుఁడైన ఎఱెయప్ప యగుటవలన బూతరసు ఈసమకాలికయుద్ధములలో యువరాజుగ నుండఁగనే నిహతుఁ డయ్యెనని శంకింప వలసియున్నది. అట్లే చాళుక్యులలో మూఁడవ విజయాదిత్యుని యనంతరము వేంగీ సింహాసనము నధిష్ఠించినది యువరాజైన మొదటివిక్రమాదిత్యుఁడుకాక ఆతనికుమారుఁడైన మొదటి చాళుక్యభీమరాజగుటచేత ఈయువరాజవిక్రమాదిత్యుఁడును ఈ యుద్ధములలోనే ప్రాణములు గోలుపోయి యుండవచ్చును.

విజయాదిత్యుని విజయములు

వేంగీచాళుక్యశాసనములలో నీ మూఁడవ విజయాదిత్యుని విజయధాటియు, పరాక్రమమును జాలగా వర్ణితము లైనవి. ఈతఁడు పాండురంగవిభుని తోడ్పాటుతో గంగబలములను నిర్జించెను. కృష్ణుని సంకిలుని భీతిచేత ఆర్తులగునట్లు చేయుటయేకాక వారిపురమును గూడ కాల్చివైచెను.[1] కాల్చివైచినపట్టణము పేరు కిరణపురమని చాళుక్యశాసనములు తెలుపుచున్నవి. గాంగులను సంకిలుని ఓడించుట, కిరణపురమును దహనము గావించుట- ఇవి పాండురంగవిభుని వీరకృత్యములే. పాండురంగవిభుఁడే కిరణపురమును దహించిన ట్లొక చాళుక్యశాసనము వక్కాణించుచున్నది.[2] కృష్ణునితోఁ గూడి కిరణపురమున నుండిన సంకిలుని భీత్యార్తునిం గావించెనని యొక చాళుక్యశాసనము[3] నుడువుచుండుటచేత- నీ సంకిలుఁడే హైదుంబరాజగు గండసంకిలుఁడైన యెడల-కృష్ణవల్లభుఁడును, ఈతఁడును గలిసి తలదాచుకొనిన కిరణపురము బళ్లారిమండలము వైపుగాని, లేక హైదుంబరాజ్యప్రాంతమునఁగాని యుండునని యూహింపవచ్చును. అంతియకాని కొందఱు తలంచునట్లు ఈయది రాష్ట్రకూట రాజధానియైన మాల్యఖేటమై యుండదు. విజయాదిత్యుఁడు రాష్ట్రకూటకృష్ణవల్లభునోడించి అతనిరాజ్యములోని ముఖ్యపట్టణములలో నొకటియగు అచలపురమునుతగులబెట్టెను. తుదకు మాల్యఖేటమును గూడ ముట్టడించెనేమో మనకుఁ దెలియదు. కృష్ణవల్లభునిగూడ బందీకృతునిం గావించెను. అయినను ఆతఁడు ప్రార్థింపఁగా నతనిచే సమభ్యర్చితుఁడై[4] మఱల నతనిని రాజపదమునం దుంచెను.[5] డాహాలాధీశుని జయించెను.[6] ఇతనిని శిక్షింపఁ బోయి నప్పుడు కావచ్చును విజయాదిత్యుఁడు చక్రకూటమును గాల్చివైచెను. ఇయ్యది బస్తరు రాజ్యములోనిది.[7]

డాహాలదేశాధీశునిపై నడపిన విజయయాత్రా సందర్భముననే కావచ్చును కాళింగులనుకూడ జయించి విజయాదిత్యుఁడు త్రికళింగమును స్వాధీనపఱుచుకొనెను. విజయాదిత్యునికి సమకాలికుఁడై కళింగమును బరిపా

1. S. I. I. Vol. I. P. 39 ll 24-27.
2. Ep. Ind Vol. IX P. 47 ll 43-44
3. Ep. Ind Vol. IV P. 226 Verse 10.
4. Ep. Ind. Vol. VII P. 177
5 Ep. Ind. Vol. IV P. 226, Verse 10.
6. Ep. Ind Vol. IX P. 47 ll 14 16..
7. Ep. Ind. Vol. IV P. 226

లించుచుండిన రాజెవ్వరో తెలియరాదు. కాని కళింగ దేశమును గంగవంశపురాజులు పరిపాలించుచుండినట్లుమాత్రము మనకు స్పష్టముగఁ దెలియును. ఈకళింగగంగులనే పూర్వగాంగులందురు. వీరిశాసనములు అనేకములు దొరకినను అందు శకసంవత్సరములు లేకుండుటచే నాయాయిరాజులు ఫలాన కాలపువారని నిశ్చయించుటకు వీలులేకున్నది. ఈకళింగ గంగ వంశపురాజులు ప్రత్యేకముగఁ దాము గాంగ శకమని యొకశకమును గల్పించుకొని యాశక వర్షములందుఁ దమ శాసనసంవత్సరములను దెలుపుదురు. కాని యీగాంగశక మెప్పటినుండి ప్రారంభమయ్యెనో స్పష్టముగ వివాదమున కవకాశములేకుండ ఇంతవఱకుఁ దెలియరాలేదు. అందువలన కళింగగాంగశాసనములందు గాంగశకవర్షములిచ్చియున్నను ఆయాయిరాజులకాలమును నిర్ణయించుట కష్టమగుచున్నది. ఈకారణముననే మన మూఁడవ విజయాదిత్యునికి సమకాలికుఁడైన కళింగగంగ ప్రభు వెవ్వరో తెలియరాదు.

జయసింహవల్లభునిపిదప త్రికళింగమును సాధించిన చాళుక్యభూపతి యీమూఁడవ విజయాదిత్యుఁడే. మఱల నింకొకమాఱు ఈ విజయాదిత్యుని కాలమున కళింగము చాళుక్యాధిపతుల పరిపాలనముక్రిందికి వచ్చెను.

విజయాదిత్యుఁడు నెల్లూరు పురమును గూడ దహించినట్లు చాళుక్యశాసనములు దెలుపుచుండుటచేత నెల్లూరుపురము విజయాదిత్యునికాలమువఱకు శత్రువుల స్వాధీనములోనే యుండినట్లు భావింపవలసి యుండును. విజయాదిత్యునికి శత్రువులై నెల్లూరునగరమున కధిపతులైనవారు మనమీవఱలో నూహించినట్లు గాంగపల్లవులు కాని, వారికి సామంతులు కాని యైయుందురు. అందువలన విజయాదిత్యుఁడు గాంగపల్లవులనో, వారికి సామంతులనో జయించి వారికి ఉత్తరమున ముఖ్యదుర్గమైన నెల్లూరును దహించియుండును.

ఈవిధమున నీతఁడు పశ్చిమగాంగులు, కళింగగాంగులు, డాహలదేశాధీశుఁడు, కృష్ణవల్లభుఁడు, సంకిలుఁడు-వీరినందఱిని జయించి, శత్రువుల సుప్రసిద్ధనగరములైన అచలపురము, నెల్లూరు, కిరణపురములను దహించి, త్రిపురాసురుల త్రిపురములను దహించివైచిన యీశ్వరునివలెనే మూఁడు నగరములను గాల్చినవాఁడగుటచేత 'త్రిపురమర్త్య మహేశ్వరుఁ'డని బిరుదమునుం గాంచి ప్రసిద్ధిఁ జెందెను.

విజయాదిత్యుని తరువాత వేంగీచాళుక్య సింహాసనము నధిష్ఠించిన యువరాజ విక్రమాదిత్యతనయుఁ డగు మొదటి చాళుక్య భీమరాజు యొక్క యొకానొక శాసనమున నీవిజయాదిత్యుఁడు ఇట్లభివర్ణింపఁబడి యున్నాఁడు :

ఇతఁడు కిరణపురాది త్రిపురములను గాల్చి త్రిపురమర్త్యమహేశ్వరుఁడని బిరుదమును గాంచెను. కళింగగాంగులయొద్దనుండి వెండి మొదలగువాటిని, కోసలరాజులయొద్ద నుండి యేనుఁగులు మొదలగువాటిని, పాండ్యులనుండియు, పల్లవులనుండియు బంగారము మొదలగువాటిని గ్రహించెను. గాంగులు

గంగకూట మెక్కునట్లు చేసెను. మంగి తల ద్రుంచెను. కృష్ణవల్లభుని రణమున నోడించెను.


పైనుడివినవారిలో కోసలరాజనఁగా చేదిలోని యొకభాగమైన మహాకోసలమునకు రాజనియే తలంపవలెను. దీనినిబట్టి మహాకోసలాధిపతిని, పాండ్యులనుగూడ నీతఁడు జయించినట్లు విశద మగుచున్నది. పల్లవు లనఁగా నోలంబపల్లవు లనియు, గాంగపల్లవు లనియుఁ గూడ నర్థము చేయవచ్చును.

ఈ విధమున మూఁడవవిజయాదిత్యుఁ డత్యంతపరాక్రమశాలియై ఎందఱెందఱెన్నెన్నివిధముల విజృంభించినను తనసర్వసైన్యాధిపతియొక్కయు, తక్కుంగల రాజభక్తితత్పరులైన మంత్రిపుంగవులయొక్కయు సాహాయ్యమున శత్రుకోటినెల్లరిం జించి చెండాడి చాళుక్యులకీర్తికి భంగము రానీయకుండ, వేంగీరాజ్యమున కాపద కలుగకుండ సమర్థతతోఁ గాపాడి వన్నెయు వాసియుం గాంచెను. ఇంతటి కష్టకాలమున నీ విజయాదిత్యుఁ డుండుటవలననే చాళుక్యుల వేంగీ రాజ్యము సురక్షితముగనుండెను. ఇతఁడు మహాపరాక్రమవంతుఁడై విరోధిభూనాథుల నెల్లరిం జించి చక్కాడి త్రిభువనాంకుశుఁ డనియు, రణరంగశూద్రకుఁడనియు, పరచక్రరాముఁ డనియు, విక్రమధవళుఁడనియు, నృపతిమార్తాండుఁ డనియు, మనుజప్రాకారుఁ డనియు, బిరుదాంకభీముఁడనియు, అరిసంకకేసరియనియు మేటి బిరుదము లందెను. ఈతఁడు మహాశౌర్యధనుఁడు. నిర్వక్రపరాక్రమాన్వితుఁడు. మహోదార హృదయుఁడు. తనయొక్క సద్గుణములచేత ప్రజాహృదయమును రంజింపఁజేసి గుణక్కెనల్లాతండు (గుణములచేతమంచివాఁడు) అనియు, గుణగాంక లేక గుణక లేక గుణగ విజయాదిత్యుఁ డనియుఁ బేర్వడసెను. ఈతఁడు పెక్కు తులాభారములు తూఁగినవాఁడు. దానధర్మనిరతుఁడు. గొప్ప శైవ మతాభిమాని. మహావ్రతులకు వలెనే శంఖధ్వని విరాజితుఁడు.

ఈతఁడు క్రీస్తుశకము ౮౪౪ మొదలు ౮౮౮ వఱకు నలువదినాలుగు సంవత్సరములు జనరంజకముగ నాంధ్రభూమిని పాలించి దివంగతుఁ డయ్యెను. ఆంధ్రదేశమునఁ జాళుక్యసామ్రాజ్యమునకు మూలస్తంభాయమానులైన కొలఁదిమంది చాళుక్యప్రభువులలో నీతఁడు చాలముఖ్యుఁడని ఎన్నవలసియున్నది. ఈతని కాలమున శత్రువుల దండయాత్రలకు చాళుక్యరాజ్యము సంకుచితము కాకపోవుట యేకాక యీతని నాయకత్వమున నాల్గుదెసలకు విస్తరించి వృద్ధినొందెను.

ఈ విజయాదిత్యునికాలము ఆంధ్రవాఙ్మయమునకు అత్యంత ముఖ్యమైనది. ఏలయన మొట్టమొదటి మాటు ఈతనికాలముననే తెలుఁగున పద్యకవిత్వము కన్పట్టుచున్నది.

మనకుఁ దెలిసినంతవఱకు ఇప్పటికి క్రీస్తుశకము ౧౦౩౦ ప్రాంతమున రచియింపఁబడిన శ్రీమదాంధ్రమహాభారతమే ఆంధ్రమునందలి మొట్టమొదటి పద్యకావ్యము. క్రీ.శ.౧౦౩౦కి పూర్వము రచియింపఁబడిన ఆంధ్రగద్యకావ్య


76
78
80
82
84
24
22
20
18
16
14
12
10
74
చేదిహైహయులు
రత్నపురము
కళింగగాంగులు
బంగాళాఖాతము
వేంగీపురము
బెజవాడ
పిష్టపురము
కల్యాణపురము
కందుకూరు
అనంతపురము
నెల్లూరు
కాంచీపురము
తంజావూరు
మధుర
పాండ్యులు
లంక
గుణక విజయాదిత్యుని నాంటి
దక్షిణాపథము.
(క్రీ.శ. ౮౪౮-౮౯౨)

ములుకాని, పద్యకావ్యములుకాని ఇంతవఱకు మన కేవియు లభింపలేదు. అందువలన నన్నయభట్టకృతమైన శ్రీమదాంధ్ర మహాభారతమే మొట్టమొదటి యాంధ్ర గ్రంథమనియు, అందు ముఖ్యముగ మొట్టమొదటి పద్యకావ్యమనియుఁ జెప్పవలసియున్నది. ఇందుపై నన్నయభట్టునకుఁ బూర్వము తెలుఁగునఁ గవిత్వ ముండెనా లేదా, నన్నయభట్టే తెలుఁగుకవిత్వమునకు రూపము దిద్దిన ప్రధానాచార్యుఁడా యని యాంధ్ర దేశమునఁ జాలకాలము తీవ్రమైన వాదోపవాదములు జరిగెను. ఇప్పటికి జరుగుచున్నవి. తెలుఁగున రచియింపఁబడిన గ్రంథములు లభింపకపోయినను తుదకు కాలము గడచినకొలఁది చరిత్రకారుల శాసన పరిశోధనవలన, ౧౦౩౦ కి పూర్వపు శాసనములలోఁ దెలుఁగుపద్యములు కానంబడుటచేత నన్నయభట్టునకుఁ బూర్వముకూడ తెలుఁగుకవిత్వ ముండెనని తేలినది. అట్టి నిర్ణయము చేయుటకు వీలిచ్చిన తెలుఁగు పద్యములు గల మొట్టమొదటి శాసనములు ఈ విజయాదిత్యునినాఁటివే. విజయాదిత్యుని సైన్యాధిపతియైన పాండురంగప్రభుని శాసనములలోఁ బద్యములు కలవు. ప్రాసయతులతోఁ గూడిన యందలి కవిత్వమును బరిశీలింపఁగా అప్పటికే తెలుఁగుకవిత్వము నియమనిబంధనములతో వర్ధిల్లుచు సలక్షణమై విరాజిల్లుచున్నట్లు తెలియఁగలదు.[1]

కవి—శారిక

నాదెళ్ల వెంకట్రావు గారు, బి. ఏ.,

'బహుళదుఃఖార్తిభరితప్రపంచమందు
మానవునిజన్మ మధమజన్మంబుసూవె
చేరవను జామిచెట్టునఁ గూరుచుండి
చారుఫణితిని గేరు నాశారిక నయి
యిలను జన్మించియుండిన నింతకంటె
నధికసుఖమందియుందు'నం చనుకొనియెద
వెంత వెఱ్ఱివి సత్కవీ! అంతముదము
నీయఁజాలిన, ఆశ్రవఃపేయమైన
శారికాకూజితమునకుఁ గారణంబు
పట్టరానట్టి సంతోషపరవశతయొ?
కడుపుచిచ్చున కీనాఁడు కానలోనఁ
బండుఫలమేమి దొఱకక యుండుకతనఁ
బడెడు బాధయొ? తెలియంగఁబడుటయెట్లు.

1. పాండురంగప్రభుని శాసనములలోఁ గనఁబడు పద్యములు దేశీయఛందములలో వ్రాయఁబడినవి. దానం జేసి సంస్కృతమునకు సంబంధించిన ఉత్పలమాలాదివృత్తములను దెలుఁగునకుఁ దీసికొనివచ్చి తెలుఁగున వృత్తకవిత్వము నారంభించిన ప్రథమాంధ్రకవి నన్నయభట్టే యని కొందఱి మతము.

ద్వాదశలింగములు—విశేషవిమర్శనము

ఒంగోలు వెంకటరంగయ్య గారు, బి. యే., బి. యల్.

ద్వాదశ లింగములు అనుపేర గడచినఫాల్గుణ మాస భారతియందు ప్రకటింపబడిన వ్యాసమునందలి శ్రీశైల సింహాచలములగూర్చిన విషయములగొని శ్రీమాన్ తి. న. చక్రవర్తి శ్రీనివాస రంగాచార్యులవారు జ్యేష్ఠమున వెలువడిన శ్రీవైష్ణవ పత్రికయందు గొప్ప విమర్శనను ప్రకటించిరి. * ఆచార్యులవారు పండితులు. బహుగ్రంథశోధకులు. వ్యాసరచనాదక్షులు, ప్రౌఢవాదచతురులు, వారితో వాదప్రతివాదములు సలుప నుద్దేశములేకున్నను వారివిమర్శములోని కొన్నియంశములకు యథాశక్తి సమర్పణను జెప్పవలసియుండుట ఈప్రత్యుత్తరచాపల్యమునకు గారణమైనది.

2. ద్వాదశలింగవ్యాసోద్దేశము అందలి తుదిభాగమున సూచింపబడియున్నది. "భూగోళ శాస్త్రశోధకులీవిషయమున దిగి పురాణేతిహాసాదులలో ప్రశంసింపబడియుండు పుర గిరి నద్యాదివిమర్శ చేయుట దేశచరిత్రకు గొప్ప సహాయముగనుండును." అని.

3. తిరుపతిదేవస్థానము ప్రివికౌన్సిలువరకెక్కినది. తత్సంబంధివిషయములకు ప్రాఙ్న్యాయసిద్ధి (రెస్ జూడికేటా) (Resjudicata) యాపాదించి యుంపగలదు. శ్రీపేయాళ్వారు లెట్లుపాడినను శ్రీశంకరు లెట్లు స్తుతించినను ఇప్పటి స్థితి లోకవిఖ్యాతమై యున్నది. ప్రాచీనప్రమాణైకసాపేక్షమని తలంప నక్కరలేదు.

4. శ్రీవేంకటేశ్వరులు శివుడైనను విష్ణువైనను "శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే" యని పఠించువారి కొక్కడేయగును. "పరతత్త్వము హరిహరంబగు రూపముదాల్చి" నటుల దిక్కయజ్వ యాంధ్రలోకమున కుపదేశించి యున్నాడు. శ్రీవేంకటేశ్వరులు కేవల శివస్వరూపమని సాధించు నభినివేశముతో ద్వాదశలింగప్రసంగ ముపక్రమింపబడినదిగాదు. దానివా రున్న నాపని వారు చూచికొనుదురు.

5. ఈప్రకరణమున విషయవాక్యములు ముఖ్యమగునవి రెండు. అందొకటియగు శాంకరోక్తినిబట్టి శ్రీమల్లికార్జునుడు శేషాద్రిశృంగమునందు నివసించువాడను నర్థమున కవకాశము గలదా లేదా? "శ్రీశైలశృంగే వివిధప్రసంగే శేషాద్రిశృంగేఽపి సదా వసంతం" ఇత్యాది. అవకాశ మున్నయెడల వ్యాసమున దప్పేమియు లేదు. అనౌచిత్యమును లేదు. "వివిధప్రసంగే" యనగ వృషభాద్రి, అంజనాద్రి ఇత్యాద్యనేకనామములచే వ్యవహరింపబడు శేషాద్రియనియు, శ్రీకాళహస్తియు శేషాద్రిశ్రేణిలో జేర్చి తచ్ఛృంగమని నిర్ణయింపబడియున్నది. కాన శ్రీకాళహస్తీశ్వరులనే మల్లికార్జునునిగ శ్రీశంకరులు స్తుతించిరనియు సమన్వయవిధానమును శ్రీమానాచార్యులవారు నిర్ధేశించినారు. "అప్రాక్ పృష్టః కోవిదారానాచష్టే" సకలనిగమాగమసారహృదయ బిరుదాంకితులగు జగద్గురు శ్రీశంకరభగవత్పాదాచార్యులు 'పురారిపాదార్పితచిత్తవృత్తిమై యలనాటి గోపకన్యవలె "మోహవశాత్" యిటుల బలికి రనదరమా! శ్రీశైలశృంగమందును శ్రీకాళహస్తియందును వసించు దేవునిపేరు మల్లికార్జునుడనుట ప్రకృతవిషయము గాదు. కాళహస్తిలో నుండు

* శ్రీఆచార్యులవారుగావించిన విమర్శనమును భారతియందే ప్రకటించియుండిన బాగుండెడిది. వారివిమర్శనమున కిదియొకవిధముగ ప్రత్యుత్తరమే యైనను పూర్వవ్యాసమున కనుబంధముగ భారతియందే ప్రకటించుట యుక్తమని తోచినది.

దేవునిగూర్చి యేరికైన సందేహము గలిగియుండిన తన్ని వారణార్థము కాళహస్తిలోని దేవుడును మల్లికార్జును డని చెప్పనక్కరకలిగియుండును. కాళహస్తీశ్వరుడును మల్లికార్జునుడే యని చెప్పుటకంటె శివుడు శివుడే యని జెప్పిన బాగుగనుండును. కాళహస్తిలోనుండు దేవుడును మల్లికార్జునుడే యనుటయందు నూత్న విషయోపదేశ మేమియు లేదు. అంతియగాక "అపి" "సదా" శబ్దముల కే ప్రయోజనము లేకపోవును. తిరుపతికొండమీది దేవుని గూర్చిన ప్రబోధమున కక్కరగలిగి యుండినది. పేయాళ్వారు లామూర్తినిజూచి ఆశ్చర్యము (ఆల్)ను జెందిరి. ఆశ్చర్యకారణము శివకేశవచిహ్నధారణమేగదా. తొండమాన్ చక్రవర్తి శంఖచక్రముల గొనిపోయె. పరిశిష్టన్యాయమున శివచిహ్నములు మిగిలినవి. కాబట్టి స్వరూపనిర్ణయము గావలసిన దిట్టిమూర్తికగునా లేక నిర్వివాదముగ శివస్వరూపముగు శ్రీకాళహస్తీశ్వరుని కగునా? ప్రమాణ విరుద్ధమయిన వాద మెందుగలదు?

6. మరియు విమర్శకు లాశ్రయించు శ్రీవేంకటాచలమాహాత్మ్యగ్రంథమున స్కాంద మొక ప్రమాణముగ గ్రహింపబడియున్నది. శ్రీశంకరు లవతారపురుషు లని స్కాంద ముద్ఘోషించుచున్నది.

"శివే మదంశసంభూత శ్శంకర శ్శంకరోత్తమః,
చతుర్భి స్సహశిష్యైశ్చ కలా వవతరిష్యతి."

అవతారపురుషు లగు శ్రీ శంకరులవాక్కు అమోఘము గాకున్న పురాణప్రామాణ్యమునకు హాని వాటిల్ల జేసినట్లగును.

7. శ్రీవేంకటేశ్వరులు శివుడా విష్ణువా యను సంశయము శ్రీరామానుజులవారికాలమువరకు నిర్ణీతము గాకయుండినది. వారికాలమున నెటు లీవివాదము పరిష్కృతి బొందినదియు ఉత్తరగ్రంథమున దెల్పబడియున్నది. కాళహస్తి, శేషాద్రిపర్వతశ్రేణియొక్క శిరోభాగమనియు, వేంకటాద్రి ఫణామణిభాగ మనియు, అహోబిలము పక్షమనియు, శ్రీశైలము పుచ్ఛమనియు తెలియజేయు బ్రహ్మాండపురాణవాక్యముల విమర్శకు లుదాహరించి, శేషాద్రిశృంగమనగ శిరోభాగమనియు, ఆశిరోభాగము శ్రీకాళహస్తియనియు వ్యాఖ్యానము చేసియున్నారు. కంఠమున కూర్ధ్వభాగము శిరస్సని వ్యవహారముగలదు. ఫణము శిరోభాగమా తదధోభాగమా? అధోభాగ మగునెడల కంఠమో కబంధమో గావలయు. కాళీయఫణిమాణిక్యరంజితశ్రీపదాంబుజము తాండవమాడినది శిరోభాగమందురా, తదధోభాగ మందురా?

ఈప్రకరణమున శిరశ్శృంగములు ఏకవస్తువాచకములా లేక పృథగ్భాగముల నామధేయములా యని విచారింపవలసియున్నది. అమరుడు శిరఃపర్యాయములలో శృంగమును శృంగపర్యాయములలో శిరమును బఠింపలేదు. శిరః పర్యాయములు:—

"ఉత్తమాంగం శిరశ్శీర్షం మూర్ధా నా మస్తకో ౽స్త్రియాం"

శృంగపర్యాయములు: "కూటో౽స్త్రీ శిఖరం శృంగం"

నానార్థవర్గములో శృంగమునకు "ప్రాధాన్యము" "సానువు" అని యర్థములు చెప్పబడియున్నవి. "శృంగం ప్రాధాన్య సాన్వోశ్చ".

ఇరుగప దండాధినాథుడు శృంగనానార్థములలో పర్వతాగ్రమును జెప్పియున్నాడు.

"శృంగం విషాణే ప్రాధాన్యే సానౌ క్రీడాంబుయన్త్రికే; పర్వతాగ్రేచ"

ఉదాహృత కోశద్వయమునను ప్రాధాన్య శబ్దమునకు ప్రభుత్వమను నర్థము చెప్పబడియున్నది.

శిరశ్శృంగములకు సామ్యము చెప్పబడకుండుటచే శేషాద్రి శిరోభాగమగు శ్రీకాళహస్తి శిరోభాగముగ నుండగలదేకాని శృంగపదవి నందజాలదు. కాళహస్తి శేషాద్రిశృంగమని యోగరూఢమయి యున్నదియా?

బహుశః కవులు నిరంకుశప్రవాహమున సమయసిద్ధముగ శిరశ్శృంగముల నేకార్థమున బ్రయోగించియుండిన నుందురు.

వారాహపురాణము నందలి ౪౮వ యధ్యాయమున నుండు శంఖణరాజన్వృత్తాంతమున వేంకటాద్రి (శేషాద్రి) శృంగమున శ్రీవేంకటేశ్వరస్వామి వారున్నట్లు దెలియజేయు గొన్ని శ్లోకము లీక్రింద నుదాహరింపబడుచున్నవి.

అశరీరా జగా దైనం(శంఖణం)తదానీం శోకపీడితమ్;

* * * *

ఇతఉత్తరదిగ్భాగే క్రోశమాత్రే మహాగిరిః;

వేంకటాచలఇత్యేవ ప్రథితః పృథివీతలే.

* * * *

తత్ర స్థితం వేంకటేశం భావయిత్వా చ బుద్ధితః;

* * * *

నివసత్వంమహాబాహోస్వామిత్వం ప్రాప్స్యసి ధ్రువమ్;

తచ్ఛ్రుత్వా వచనం తస్యా గతశోకః ప్రసన్నధీః.

ఆరురోహ గిరేః శృంగం పుణ్యం పరమపావనమ్;

* * * *

ఏవం మనోహరం శృంగం ఆరుహ్య కనకోపమమ్

* * * *

[ఇత్యాది.

ఇంతియకాక శ్రీవైష్ణవులు నిత్యానుసంధానమున పఠించు శ్రీవేంకటేశమంగళాశాసనమున మూడవశ్లోకమున "శ్రీవెంకటాద్రిశృంగాగ్ర మంగళాభరణాంఘ్రయే"యని యున్నది. ఈ దృష్టాంతములందలి "శృంగము" శ్రీకాళహస్తికే యన్వయించునని జెప్పుదురేని "యేడుకొండల వాడు" కన్నప్పకొండపై గాపురము చేయవలసియుండును. పైశ్లోకములలోని శృంగము శ్రీనివాసదేవుని నివాసస్థానమగు శ్రీవేంకటాద్రి (శేషాద్రి)కె యన్వయించుచున్నదను నాశయము స్థూణానిఖననన్యాయమున స్థిరపడి "శేషాద్రిశృంగేఽపి సదావసంతం" అనుటలో శ్రీశంకరాచార్యులు వేంకటాద్రినే లక్ష్యముచేసికొనిరని నొక్కి పలుక వలనగుచున్నది.

ఈసందర్భమున నింకొకవిషయముగూడ గలదు. పర్వతములలో శ్రేణితలమునకుమించి యాకసమును భేదించుకొనునటుల పెరిగియుండు భాగము శిఖరము లేక శృంగమనిపించుకొనును. శేషాద్రిసర్పసామ్యముననున్నది. ఈ పెనుబామునకు శృంగస్థానమెద్ది? వేంకటాద్రి ఫణామణిస్థానము అనగ "పడగమీది మాణిక్యముగనుండునది" యని విమర్శకులు దెలిపియున్నారు. సర్పము పడగవిప్పునపుడు పడగ మొదలు నాసాగ్రమువరకు సమతలముగనే యుండును. ఈ సమతలమున శృంగమును జూడవలయు నన్న పడగపై బుడుపువలెనుండు మాణిక్యస్థానమే యగపడుచున్నది. ఇదియె శ్రీవెంకటాద్రి యగుగాడల "శేషాద్రిశృంగేఽపిసదా" వసించువారెవరో వారినే శ్రీశంకరులుద్దేశించిరని చెప్పుట సాహసము కాజాలదు.

౬. విషయవాక్యముల రెండవది శ్రీపేయాళ్వారుల పాశురము.

తాఴ్శడైయుమ్ నీణ్ముడియుమొణ్మఴువుమ్ శక్కర
శూఴరవుమ్పొన్నాణు న్తోన్ఱుమాల్-శూఴుమ్[ముమ్
తిరణ్డరువిపాయుమ్ తిరుమలై మేలెన్దైక్కు
ఇరణ్డురువు మొన్ఱాయిశైన్దు.

శ్రీవైష్ణవగ్రన్థముద్రాపకసభ (లిమిటెడ్) వారు 1901 సంవత్సరమున ప్రకటించిన ప్రతియం దీపాశురమున కన్వయక్రమ మిటుల వ్రాయబడియున్నది.

"శూఴుమ్ తిరణ్డు అరువిపాయుమ్
తిరుమలై మేల్ ఎన్దైక్కు తాఴ్శడయుమ్
నీళ్ ముడియుమ్ ఒణ్ మఴువుమ్
శక్కరముమ్ శూఴ్అరవుమ్ పొన్
నాణుమ్ ఇరణ్డురువుమ్ ఇశైన్దు
ఒన్ఱాయ్ తోన్ఱుమ్ ఆల్"

ఈయన్వయసరణి ననుసరించి వారు వ్రాయించి ప్రకటించిన తెలుగు అర్థము :—

"చుట్టుపారుచున్న సమృద్ధములైన కొండకాలువలు ప్రవహించుచున్న తిరుపతియందుండెడిస్వామికి వ్రేలుచున్న జటలును, పొడగైన కిరీటమును, సుందరమైన గొడ్డలియు, చక్రంబును, నడుమును చుట్టుకొని యుండెడి సర్పమును, స్వర్ణమయమైన మొలత్రాడును ఈరెండు హరహరిరూపములు చేరి యొకటియై తోచుచున్నదె; ఆశ్చర్యము" అన్వయక్రమమున కడపటిదియగు "ఆల్" యనుమాటకు ఆశ్చర్యమని యర్థముకు ద్రవిడవ్యాఖ్యానములలోగూడ నున్నది.

శ్రీపేయాళ్వారులు శ్రీవేంకటేశ్వరులయందు శైవచిహ్నములు జూచిరిగాని శ్రీస్వామివారిని శివుడని స్తుతించియుండలేదని విమర్శకులు సమాధానము చెప్పిరి. శ్రీయాళ్వారులు చేసిన దద్దియో పాశిపద్యమందే కలదు. ముంజేతి కంకణమున కద్దమేల. వారి యాశ్చర్యమునకు గారణము కావలయునా?

9. శ్రీవెంకటేశ్వరులవారిశంఖచక్రములకు గ్రంథస్థమగుచరిత్రముగలదు. శ్రీపేయాళ్వారుల కాలనిర్ణయము స్పష్టముగ తెలియలేదు. అయినను వారితో ప్రారంభింతము. వారు శ్రీస్వామివారినిసేవించినపుడు శంఖముండినదో లేదో వారు ప్రస్తావింపలేదుగాని చక్రముండినటుల జెప్పినారు. చక్రముతోగూడ శంఖముగూడ నుండినదని గ్రహింపనచ్చును.

పిదప శ్రీవేంకటేశ్వరభక్తుడగు తొండమాన్‌చక్రవర్తి శత్రురాజులదాడి నోర్వజాలక శ్రీ స్వామివారి శరణుజొచ్చెను. శ్రీస్వామివారు, భక్తునిపై జాలిగొని నిజశంఖచక్రముల నాతనికిచ్చి శత్రుసంహార మొనర్తువని మంగళాశాసనము దీర్చిరి. ఇందుల కాధారములగు వాక్యముల విమర్శకులే బ్రహ్మ బ్రహ్మాండాదిపురాణములనుండి యుదాహరించియున్నారు. ఈవిధమున శంఖచక్రముల బొందిన యారాజు తన కార్యసిద్ధి అయినపిదప ఆదివ్యాయుధముల దిరుగ శ్రీస్వామివారి కర్పింపక

"మమాయుధ ప్రదానస్య ఖ్యాత్యై దేవోత్తమ, ప్రభో!
అర్చాబింబే శిలాబింబే చక్రశంఖౌ న ధారయ".

యను వరమును వేడినందున భక్తపరాధీనుడగు నాస్వామి (బ్రహ్మపురాణాను సారముగ)

"ఇతి సంప్రార్థితో దేవో న దధార పునశ్చతౌ"
(బ్రహ్మపురాణము)

ఈ విధమున శంఖచక్రములు చక్రవర్తిగారికి దత్తము లయినవి. పేయాళ్వారులు చూచిన శైవచిహ్నములు నిలిచియుండినవి: కాకతాళీయముగ, శంఖచక్రరాహిత్యవైభవమున శ్రీశంకరాచార్యులు శ్రీస్వామివారిని సేవించిరి కాబోలును. శ్రీశంకరులకు వెనుక కొన్ని వందలసంవత్సరములకు శ్రీమద్రామానుజుల వారవతరించిరి. వారికాలమున శ్రీవేంకటేశ్వరస్వామి వారు శివుడా విష్ణువా యనువాదము విస్తారమై ఆనాటి దేశాధిపతియగు యాదవరాజు సమ్ముఖమున శైవులు తమవాదమును, శ్రీవైష్ణవులు శ్రీరామానుజపురస్సరముగ తమ వాదములను బ్రకటించిరి. అనపేక్షితములు అప్రస్తుతములును నగు వాదముల నవలి ప్రసంగ విషయమునకు గావలయు వాదములుమాత్రము శ్రీవేంకటాచలేతిహాసమాల నుండి * యుదాహరింపబడుచున్నవి.

శైవపక్షమున అయిదవ వాదము:—

"అస్య దేవస్య విష్ణురూపత్వే తదసాధారణ శంఖచక్రాది దివ్యాయుధ రాహిత్యం దేవతాంతరసాధారణ జటిలత్వ నాగాభరణధారిత్వం చ దృశ్యమానం కథంచిద ప్యుపపద్యతే."

ఇతిహాసమాల, స్తబకం ౧, వాక్యము ౫.

శ్రీరామానుజులవారి సమాధానము:—

(౯౬) అస్య శ్రీనివాసభగవతఃశంఖచక్రాద్యాయుధవిహీనపాణికత్వంతు తొండమాంశ్చక్రవర్తినే దుర్విషహవైరినిషూదనకాంక్షిణే నిజాయుధదాన సూచకం భగవతైవ సంకల్పిత మితి పురాణవచనేష్వేవ స్పష్టం.

అంతట నుభయులకు వాదప్రతివాదములుపొడమై జటిలత్వనాగాభరణత్వాదులు విష్ణువున కసాధారణచిహ్నములు గాకపోయినను(ఇతిహాసమాల, స్తబకం 3, వాక్యము ౨౭౮) కారణాంతరములచే ఆయన కొన్ని సందర్భములందు వాని నంగీకరించెనని భగవద్రామానుజుల వారు పురాణప్రమాణముల జూపినను అవి చాలక ఇంకొక విషమపరీక్షను బూనుకొనిరి.

౨౮౧ వ వాక్యము:—

తతశ్చోభయేఽపి వాదినః స్వస్వదేవా సాధారణ చిహ్నభూతాన్యాయుధాని నిర్మాప్య కస్మింశ్చిద్దివసే రాజ్ఞాసహ శ్రీ వేంకటాచల మారుహ్య రాత్రౌ దివ్యాలయ గర్భగృహే భగవత స్సన్నిధౌ తాని నిక్షిప్య కవాటబంధనం కృత్వా రాజకీయ ముద్రాంచ కారయిత్వా ప్రభాత పర్యంతం దివ్యాలయపరితః సావధానం జాగరూకా ఏవ సంచరంతో విజయాయ స్వంస్వం దేవం సంతతం అనుచింత యంత ఏవావతస్థిరే.

తాము సమర్పించినవానినే శ్రీస్వామి వా రంగీకరింతురని శ్రీమద్రామానుజాచార్యులవారికి స్పష్టమైన

* శ్రీవేంకటాచలేతిహాసమాల యను గ్రంథము దాదాపు నలువదివత్సరములక్రిందట మహంతు శ్రీభగవాన్ దాసుగారచ్చువేయించిన శ్రీవేంకటాచలమాహాత్మ్యమునగలదు. (శక 1807 నందు ప్రకటింపబడినది.)

నమ్మకము మున్ముందుగనే గలిగియుండినట్లుల ఈక్రింది వాక్యములవలన స్ఫురింపగలదు.

శ్రీవేంకటాచలేతిహాసమాల 3 వ స్తబకం ౨౭౯ వ వాక్యమున

శ్రీమద్రామానుజ వచనము:—

* * * * *

"తదానీ మిదం కర్తవ్యం. బ్రహ్మాండపురాణైకాదశాధ్యాయే కలౌ విమానాదీనామివ శంఖచక్రాది దివ్యాయుధానా మపి భక్తకల్పితానాం స్వీకరణస్య ప్రాగేవ ప్రతిజ్ఞాతత్వాత్. అస్మత్పరికల్పిత సమర్పిత దివ్యాయుధానా మస్వీకారనిర్బంధాభావాచ్చ, ప్రసహ్యావాసంప్రార్థ్య స్సంప్రతి ప్రసక్తదేవతాంతర తాపత్తి లక్షణమహానర్థ ప్రసంగపరిహారాయ శంఖచక్రే భగవంతంధారయిష్యామి. ఆశ్రితవాత్సల్యజలధిః భక్తపరాధీనో భగవా నస్మత్ప్రార్థనయాఽవశ్య మస్మత్సమర్పితే శంఖచక్రే స్వయమేవ స్వీకుర్యాదేవ. తదిహాశంఖచక్రే నిర్మాప్య సమర్పయామి."

పైవాక్యమున స్మరింపబడిన ప్రతిజ్ఞ బ్రహ్మాండ పురాణమున నిట్లున్నది:—

కలౌ కశ్చి న్మహాభాగ శ్శంఖచక్రేతు కృత్రిమే;
కారయిత్వా స్థాపయిత్వా విమానాదీంశ్చ మే పునః;
తత స్తద్భక్తివశగ స్సర్వప్రత్యక్ష గోచరః.
ఆకల్పం నివసిష్యామి వరాభయదహస్తదః;
ఊర్ధ్వాభ్యామపి చానాభ్యాంహస్తాభ్యామతిసుందరే;
దధాన శ్శంఖచక్రేచ కల్పితే లోకతుష్టయే.

బ్రహ్మాండ.

ఈశ్లోకములను విమర్శకులుగూడ నుదాహరించి యున్నారుగాని కృత్రిమశంఖచక్రముల స్థాపింప జేసిన మహాభాగునిమాత్రము పేర్కొనలేదు. విమర్శకాప్పేర ప్రస్తుతమనియభిప్రాయమైయుండగలదు. అధ్యాహారము నిప్పుడు పూరణముసేయ సులభమైయున్నది. ఇందేమియు సమస్యగాని ప్రహేళిక (Riddle) గాని లేదు. ఇంత సరకైనది. శంఖచక్రము లెట్లుల శ్రీవారిహస్తముల నలంకరించినదియు ఇతిహాసమాలావాక్యమున తెల్లమగుచున్నది. ఇతిహాసమాల తృతీయస్తబకము ౨౭౦ వ వాక్యమున ఉభయవాదులునుజాగరూకులయిప్రహరము (పారా) జరుపుచుండినట్లుల జెప్పబడియున్నది. ౨౭౧ వ వాక్యమునకు బోవుదము:—

"భగవాన్ రామానుజమునిరపి స్వయోగమహిమ్నా భగవంతం శ్రీనివాసముపసృప్యసమ్యక్సాష్టాత్కృత్య "భగవన్ భగవత్కృతప్రాక్తన ప్రతిజ్ఞానురోధేన భవ దసాధారణ శంఖచక్రాది దివ్యాయుధాని ధృత్వాఽస్మాన్‌సంరక్షేతి సంప్రార్థయన్ శంఖచక్రాది దివ్యాయుధధారణ మంగీకారయామాస."

శ్రీరామానుజులవారు నిత్యసూరియగు నాదిశేషావతారము. శ్రీస్వామివారు శేషి – "ధారయిష్యామి" "స్వయోగ మహిమ్నా" "ఉపసృప్య" "అంగీకారయామాస" యనుమాటల ననుసరించి యందలిధ్వని ననుసరించిన న్యూనాతిరిక్తము లన్నియు సమన్వయము కాగలవు. బ్రహ్మాండపురాణైకాదశాధ్యాయగత భావికాల సూచన శ్రీ రామానుజులవారిలో పర్యాప్తము. ఆగమప్రమాణములవలన శ్రీస్వామివారు విష్ణువేయని శ్రీ రామానుజుల వారు నిరూపించినను ప్రత్యక్షప్రమాణముగూడ కావలసియుండి పూర్వోక్తవిధమున నిర్వర్తింపబడినది. విష్ణువును విష్ణువనిసాధించుకొనుట యుక్తమేకదా.

శ్రీశంకరులు శ్రీవెంకటేశ్వరులను "శ్రీశైల శృంగేపి సదావసంతం" అని నుతించుట తప్పని పూర్వోక్త శంఖచక్రకథాపఠనానంతరముగూడ యనదగునా?

బ్రాహ్మమున:—

"ఇతి సంప్రార్థితో దేవో న దధార పునశ్చ తౌ"

బ్రహ్మాండమున—"దధాన శ్శంఖచక్రే"

10. ఒకటిరెండు శివచిహ్నములు గలిగియున్నంత మాత్రమున విష్ణువిగ్రహము శివవిగ్రహము గానేరదని ఆచార్యులవారొక యాక్షేపము జేసియున్నారు. లీలాలోలుడగు రమేశుడు వినోదమునకై శివచిహ్నముల ధరించెనని శ్రీపేయాళ్వారులు చెప్పియుండిన, నట్టిపై వాదమే పోసగదు.

11. పామరులు శివచిహ్నమని తలంచు మూడవకన్ను కొన్నిస్థలములందు శ్రీ నృసింహమూర్తి గూడ ధరించియున్నట్లుల విమర్శకులుదెలిపిరి. ఈమూడవనేత్రము శివునికేకాక ఆదిశక్తికిని గాయత్రికిని ఉన్నది. (ఆళ్వారు

లలోనొకరికటాకాలియందుగలదట.) ఫాలాక్షునితపోభంగమును సాహసింపవలదని రతీదేవి నివారించినను వినక "ముక్కంటి యని నీవు మోహించెదే జలకరకంబుజూడ ముక్కంటిగాదె"యని శ్రీకుమారాభ్యుదయము* నందలి కుసుమాయుధుడు దీని టెంకాయబుర్రకడకుదేర్చినాడు.

12. శేషాద్రిశ్రేణికి వృషపర్వతమను నామముండినమాత్రాన శైవసిద్ధి గలుగజాలదని విమర్శకులాక్షేపించి వృషభశబ్దమునకు ధర్మమని యొక యర్థమును వృషభాసురపరముగ నొకయర్థమును గలవని తెలిపినారు. ఈరెంటితోగూడ వృషభపర్యాయమగు (ఎద్దు) నర్థమును జేర్చినమూడగుచున్నది. వృషభము శివునివాహనముగ నుండుదనుక, వృషశైలము శైవసూచకముగ నుండనొప్పును. స్వామిపుష్కరిణి షష్ఠీతత్పురుష మగునెడల కుమారస్వామి పుష్కరిణి యగునేమో యనుభీతిచే దీనికి కర్మధారయమును సాధించుచుండువరకును, శ్రీశబ్దము బిల్వపర్యాయమయి యుండువరకును, శ్రీవేంకటేశ్వరస్వామివారికి కోదండమాసమున (ధనుర్మాసము) బిల్వార్చన జరుగుచుండువరకును, "శిరింబిఠస్య"(ఋగ్వేదము, అష్టక 8. అధ్యాయము, 8 వర్గము. 13 పరిశిష్టమునుజూడుడు.) యను నార్షప్రయోగమునకు"శ్రీంకిఠస్య=శ్రీనివాసస్య" యను నర్థము సాధ్యముగ నుండునను నను వృషభము ఎద్దుగనే యుండగలదు.

13. "శివునికి వాచకమైయున్న యీశ్వరశబ్దముతో అనగా వేంకటేశ్వరుడని వ్యవహరింపబడుటచే వేంకటాద్రినాథుడు శివుడేకాని విష్ణువుకాడట" యని యొక వ్యంగ్యార్థసూచనమును విమర్శకులు చేసియున్నారు. ఇందు కవకాశమిచ్చు ప్రతిజ్ఞ యొద్దియు ద్వాదశ లింగవ్యాసమున నున్నట్లలేదు. అయినను ప్రస్తావవశమున దీనికొక చిన్నిమందలింపు కావలసినట్లే యున్నది. ఈశ్వరశబ్దము శివునికి ముద్రవేయబడియుండలేదు. కాని యెప్పటనైనను యేవైష్ణవునకైనను ఈశ్వరాచార్యులు †ఈశ్వరఅయ్యంగార్ అనుపేళ్లుండినట్లుల వినినది గనినది లేదు. నామకరణసంస్కారమున నీశ్వరు డేల దుస్సహుడాయెనో? లక్ష్మికున్నంతగౌరవము మహాలక్ష్మికిని వారు చూపుటలేదు. ఈనామద్వయ మేకవ్యక్తిద్యోతకమే కదా? మహాలక్ష్మమ్మ యనుపేరు శ్రీవైష్ణవ స్త్రైణమున మృగ్యముగనున్నది. ఇక నీశ్వరమ్మగతి చెప్పవలయునా? పలుమారు సిద్ధాంతములకును అనుష్ఠానములకును పొత్తుగుదురుట లేదు.

14. వైఖానస పాంచరాత్రాగమములు లక్ష్మిదేవికి శుక్రవారాభిషేకములు విధించియుండుటచే శుక్రవారాభిషేకమాత్రమున శ్రీవేంకటేశ్వరులను "శక్తి"విగ్రహ మనజనదని యొక యాక్షేపము. లక్ష్మిదేవి విష్ణువక్షస్థలము నధిష్ఠించియుండుటచే వీరికి "సహవా ప్రవృత్తి స్సహవానివృత్తిః" దప్పినదిగాదు సమవాయ సంబంధముండుటచే అమ్మవారిని విడదీసి యామెకు వేరుగ నభిషేకము చేయవలనుగాక శ్రీస్వామివారికిని శుక్రవారాభిషేకము జరుగుటకు గారణమైనదని విమర్శకులు సెలవిచ్చినారు. ఈయూహ బాగుగనే యున్నదిగాని శ్రీస్వామివారికొరకు సంకల్పింపబడు అభిషేకములును శుక్రవారములందే జరుగుచుండుటకు గారణమిది యనపాయినీత్వము గాజాలదు.

శరన్నవరాత్రుల బ్రహ్మోత్సవమునకును కొంచెమించుమించుగ పైన్యాయమే యనువర్తించును. తిరుపతిలోగాక మరియు గొన్ని విష్ణుస్థలములలోగూడ నవరాత్రములందు బ్రహ్మోత్సవములు జరుగుచున్నవని విమర్శకులు చెప్పియున్నారు. అచటిపురాణగాథ లెట్టివియో విచారించినగాని తత్త్వము దేటపడదు. బిల్వార్చనాదుల నీగణమున జేర్పవచ్చును.

15. "బాలాజీ" వాదము వినోదముగ నున్నది. "రామారావు, రంగారావు, సుబ్బాశాస్త్రి మున్నగునవి

---

* బ్రహ్మశ్రీ ఆంధ్రవాల్మీకి వావిలికొలను సుబ్బరావుగారురచించిన శ్రీకుమారాభ్యుదయమున(ఆ.1 ప.229) మూడవకంటి వైభవ మిట్లున్నది.

† శ్రీనాథమునుల తండ్రిగారి తిరునామము "ఈశ్వరముని" యని చెప్పుదురు. వీరు శ్రీరామానుజుల కంటె ననేక తరముల ముందుండినవారు. ఆకాలపువారి మతాధ్యవసాయముల నిర్ణయింప గురుపరంపరలవంటి యర్వాచీన ప్రబంధములు చాలవు.

ఆకారాంతములుగ నున్నను నాశబ్దములెట్లు స్త్రీవాచకములు గావో యట్టులే 'బాలాజీ' పదమందలి "బాలా" యనునదియు స్త్రీవాచకముగా"దని యొక యాక్షేపము. కృష్ణమాచార్యులుగూడ నీగణమున జేరగలరు. పదవిభాగమున కృష్ణమ + ఆచార్యులుఅని తేలినను వీరు యెట్టులు పురుషవాచకముగ గ్రహింపబడుచున్నారో యటులే "బాలాజీ"కిని పుంలింగమర్యాద సిద్ధముగుచున్నదనిన నీ యాక్షేపమునకు ద్విగుణితమగు బలము గలిగియుండును. రావులసాహచర్యమున 'బాలా'కు పుంస్త్వప్రాప్తిసాధించుటకంటె "సుబ్బిశెట్టి" "రామిరెడ్డి" "అంకినీడు"లతోడు గల్పించిన కార్యము సులభతరముగ నుండెడిది.

మనదేశమున మగవారి కాడుపేళ్లును, ఆడువారికి మగపేళ్లును సాధారణములుగ నున్నవని యొక సమాధానమునుగూడ జెప్పవచ్చును. 'యశోదరావు' 'సీతయ్య' 'భవానప్ప' యను పురుషనామములును 'రాఘవమ్మ' 'ఆళ్వారమ్మ', 'లక్ష్మీనరసయ్యమ్మరావు' లోనగు స్త్రీనామములును దృష్టాంతములు.

బాలుడు, ఔత్తరుల దుర్వచోదుష్టుడై "బాలా"త్వము నొంది యదిచాలక "జీ"నంటించుకొని మనుటకంటె లీలామాత్రముగనో కారణాంతరముననో యా దేవదేవుడు జగన్మోహనమగు స్త్రీరూపమునుగూడ నంగీకరించె ననుట యపరాధము గాజాలదు. మోహిన్యవతార మొకటి శరణ్యముగ నున్నది.

16. శ్రీశంకరస్తుతి ద్వాదశలింగముల నుద్దేశించినది గాన సర్వావయవములతో గూడిన శ్రీవేంకటేశ్వర విగ్రహమున కన్వయము గాజాలదని యొక ప్రబలమయిన యాక్షేపము. దీనికి ప్రత్యుత్తరము దుర్లభముగాదు. లింగమన వృత్తాయతమగు శిలయని రూఢియై యున్నదిగదా? ప్రాయికముగ శివాలయములలోని శివబింబము లిటులున్నను ఈయాకారమునను, సావయవములగు శివ విగ్రహములు గలవని కొందరు శోధకులు చెప్పియున్నారు. కీర్తిశేషులగు టి. గోపీనాథరావుగారు రచించిన "హిందూ ఐకొనగ్రఫీ" [Vide p. 63 to 70 of Gopinadha rao's Elements of Hindu Iconography, Vol II Part III. (విగ్రహతంత్రము)] యను గ్రంథముయొక్క రెండవ సంపుటపు రెండవభాగమున విగ్రహరూపము గల శివలింగములకు రెండుదాహరణములు గలవు. (Instances of Siva Carved on Linga) ఒకటి లక్నో మ్యూజియము (Lucknow museum)న నున్నది. రెండవది తిరుపతిసమీపముననుండు రేణిగుంటస్టేషనుకు ఆరుమైళ్ల దూరముగల గుడిమల్లంగ్రామములోనున్నది. దీనికిపూజానైవేద్యములు జరుగుచున్నవి. ఈరెంటి ప్రతిబింబములను గోపీనాథరావుగారి గ్రంథమున చూడవచ్చును.

అంతియకాక "లింగ"మన శివమూర్తికిని పేరని నానార్థరత్నమాలయందు గలదు. "లింగంస్యాత్ సాఙ్ఖ్యగమకే శేఫచిహ్నే శమూర్తిషు."(ద్వ్యక్షరకాండ గాంత శబ్దములు) కానస్నిగ్ధశ్లక్ష్ణవృత్తాయత శిలాస్వరూపములందే లింగశబ్దము పర్యాప్తమయినదని చెప్పనలవిగాదు. మరియు సామాన్యముగ " లింగ " శబ్దమునకు దేవతావిగ్రహము (Image of a God, an idol) అనునర్థము గలదని వామన్ శివరామఆప్టేగారి సంస్కృతాకారాది నిఘంటువు (డిక్షనరి)నందు జెప్పబడియున్నది. కావున శేషాద్రిశృంగము నధివసించియుండుదేవుడు మల్లికార్జునుడే యగునెడ శేషాద్రివాసునకు కరచరణాద్యవయము లుండుటచే ద్వాదశలింగస్తోత్రప్రతిజ్ఞకు భంగములేదని చెప్పనొప్పును. ప్రమాణవిరుద్ధ మగునట్టియు, న్యాయదూర మగునట్టియు వాద మిందేమియు లేదు.

ఇక సింహాచలవిషయము:—

"సింహాద్రినాథుడు విష్ణువే యని యెల్లవారికి విదితంబయ్యే యున్నదని విమర్శకులు వ్రాసిరి. ఇపుడు విష్ణువుగనే ఆరాధింపబడుచుండుట యెల్లవారికి విదితంబే. శ్రీమద్రామానుజాచార్యులకాలమునకు పూర్వపు స్వరూప మెట్టిదియో విచారింపదగును. ఈక్షేత్రము నేయాళ్వార్లును బాడినటులులేదు. శ్రీరామానుజులకాలమునకుపూర్వము ఇది శైవక్షేత్రముగనుండిన దనుప్రతీతియైన లేదని చెప్ప నలవికాదు. ఆ ప్రతీతియే సంశయమున కాధారము. అంతియకాక పండితవర్యులగు శ్రీమాన్ పరవస్తు రామానుజస్వామి M. A. (Vice-Princepal Maharajaj's Sanskrit College, Vizianagaram) గారు సింహాచల శ్రీకూర్మముల ప్రాక్తనచరిత్రమును లెస్సగ శోధించి యవియొకపుడు శైవక్షేత్రముగ నుండినటుల నింగిలీషున వ్రాసినవ్యాసముల నాధారపరచికొని బ్రహ్మశ్రీ

శేతవరపు వేంకటశాస్త్రిగారు లక్ష్మీప్రసాదమను తెలుగునవలయందు 3 వ ప్రకరణమున సింహాచలపూర్వవృత్తాంతమును సూక్ష్మముగ దెలిపియున్నారు కల్పనాకథయని నవలనొక్కపెట్టున నామూలాగ్రముగ నిరాదరణ చేయదగదు. కథాంశములు పదసన్నహ్యములుగ నుండిన నుండునుగాని చిరంతనవ్యపదేశములుగల పురగిరి పద్యాదిగాథల “కర్తుమకర్తుమన్యథా కర్తుం” సాహసము దుష్ప్రతిపన్నము. ఒకరాత్రిలోపల యొకశివలింగ మెంతవరకు పురుషాకృతిగల విగ్రహముగ మార్పబడుట కవకాశముండునో అంతవరకు యెట్లో యథాసంభవము లగు భంగములతో తల మొదలు మోకాళ్లక్రిందివరకు మలుపబడినటులను తదధోభాగమునకు వ్యవధి చాలమి యనుట నాశిల్పి నేర్పు స్తంభించినటులను ఆగ్రంథమున జెప్పబడియున్నది. సింహదంష్ట్రికరాళముల జెక్కుటకన్న ద్విబాహులవును, క్రోడముఖమును సులభసాధ్యములు. లింగాకారమున నొకభాగము పాత్రపరివర్తనమున కనుకూలముగ నుండును. శ్రీవరాహమూర్తి కసాధారణమగు ధరాదేవి సాన్నిధ్యమందు మృగ్యముగ నున్నది. చందనలేపవిరహితమగు శ్రీ సింహాద్రినాథుని రూప మీపటమున జూడనగును. ఈరూపమున కనుగుణమగు స్తోత్రము లున్నను యథాస్థితి దాగనోల్లక త్రినేత్రముల బయలువెడలినది. ఇందుకు

> “కుందాభ సుందరతనుః పరిపూర్ణ చంద్ర
> బింబానుకారి వదనో ద్విభుజస్త్రినేత్రః;
> శాన్తస్త్రిభంగి లలితః క్షితిప ప్రసాదః
> సింహాచలే జయతి దేవవరో నృసింహః.”

ఇత్యాది ధ్యానశ్లోకము సాక్ష్య మిచ్చుచున్నది. మూడవకన్ను పరమశివున కసాధారణ చిహ్నమైనను ఇచటి వరాహమూర్తియు లీలావినోదార్థము త్ర్యంబకుడయినాడనవచ్చును. గాని అందుకు సహేతుకమగు ప్రమాణము గావలసియుండును. చందనలేపన మయినపిదప స్థాణాకారముగ నుండును.

“సింహాద్రినాథుని నిజస్వరూపము చిదంబరరహస్యమును బోలియున్నది” యనుట విమర్శకులకు సహ్యముకాలేదు. చిదంబరసామ్య మేమనః—ఒకపాత్రకాలమున నెద్దియో దుష్టకలాపము చిదంబరముపై దాడివెడల నచటిదేవుని గాపాడుకొనుటకై ఆరాధకులు గర్భగృహమున కడ్డముగ గోడను *(కర్టెన్) గట్టించిరనియు, నిజస్వరూప మాగోడవలన తిరోధానమైయున్నదనియు, అమరుడు ‘ఆకాశం గగనం శూన్యం’ అని పర్యాయపదముల ప్రసాదించియుండుటచే యచటి శూన్యత్వము “ఆకాశలింగము”గ పరిణామము నొందింపబడియు గొందరు చెప్పెదురు.



సింహాద్రి నరసింహస్వామి

చరిత్రాంశముల విమర్శించునపుడు వారివారి యిష్టానిష్టములకును అభిమానములకును అనుకూలములగు విషయములే (facts) సర్వదా లభింపుటలేదు. తత్త్వాన్వేషము పరమార్థము.

పరిశిష్టము

పై 12 వ వాక్యావళియందు “శిరింబిఠస్య” అను ఋగ్వేదపదము లుదాహరింపబడినవి. అవియుండుమంత్రమును, దానిపై శ్రీ వేంకటాచలేతిహాసమాలలో వ్రాయబడి యుండు వ్యాఖ్యానమును, సాయనాచార్య భాష్య

* రాతితెర (Stone curtain)

ము యీక్రిందజూడనగు. వీనిలోని స్థూలసూక్ష్మముల విజ్ఞులు కనుగొందురు.

శ్రీ వేంకటాచలేతిహాసమాలా వ్యాఖ్యానము: ౧౦—౧౫౫-౧ ఋగ్వేదే అష్టమాష్టకే త్రయోదశవర్గే

అరాయి కాణే వికటే గిరిం గచ్ఛ సదాన్వే శిరింబిఠస్య సత్వభిః తేభిష్ట్వాచాతయామసి.

ఏషా ఋక్ శ్రీవేంకటాచలవిషయతయా ఉపబృంహితా భవిష్యోత్తర పురాణాంతర్గతే శ్రీ వేంకటాచలమాహాత్మ్యభాగే చతుర్థాధ్యాయే:

అరాయి కాణే వికటే గిరింగచ్ఛేతి తంవిదుః;ఏవం వేదమయ స్సాక్షాత్ గిరీంద్రః పన్నగాచలః. ఇతిశ్లోకేన.

అస్యాశ్చ శ్రుతే రేవం వివృతి ర్బోద్ధవ్యా; వేదపురుషో హి తమత్రోపదిశతి చేతనం పురుషార్థకాంక్షిణం సంబోధ్య-త్వయీతి శేషః - పూరణీయోత్ర సందర్భవశాత్-త్వయి అరాయి ఐహికాముష్మికైశ్వర్య రహితే-రైశబ్దో హ్యైశ్వర్యవాచీ, కాణే బాహ్యే నాభ్యంతరేణవా చక్షుషా విరహితే, వికటే విశిష్టాధ్యాత్మికాధిభౌతికాధిదైవికతాపత్రయశాలిని - కటశబ్దోహిదాహపరః; సదాన్వే దానవైః ఐహికాముష్మికాపేక్షిత పురుషార్థవిరోధిభి స్సహితేవాసతి, దారవశబ్దస్యదార్వేతివత్ దానవశబ్దస్య దాన్వేతివ్యత్యయ శ్ఛాందసః. శిరింబిఠస్య - శ్రీంపీఠస్య, శ్రీనివాసస్యేతి యావత్ - త్ర్యంబకశబ్దస్య త్రియంబకేతివత్,స్వరితి శబ్దస్య సువరితి వచ్ఛ్రీమితి లక్ష్మీబీజస్య లక్ష్మీవాచకః, శిరిమితి వ్యత్యయః; పీఠశబ్దస్య బిఠేతి వ్యత్యయశ్ఛ ఛాందసః, యద్వా- విశేషేణ తిష్ఠం త్యస్మి న్నితి విఠో నివాసః; బిభ్రాజ మాన ఇత్యత్రేవ వబయో రభేదాద్బిఠః; గిరిం వేంకటాచలం - శిరింబిఠస్య,సత్వభిః సత్త్వైః ప్రాణిభిః శ్రీనివాసభక్తైః సహేతియావత్, శిరింబిఠస్యే త్యస్యాకాంక్షా సామర్థ్య దుభయత్రాన్వయః. గచ్ఛపురోవక్ష్యమాణసర్వానిష్ట పరిహారార్థం ప్రాప్నుహి, తత్రగమనే కథం తత్పరిహార ఇత్యత్రాహః:— తేభిరిత్యాది- తేభిః తైః శ్రీనివాసభక్తైః, త్వా - త్వం - 'సహస్రశీర్షం దేవ' మిత్యాదిష్వివ అత్రప్రథమార్థే ద్వితీయా ఛాందసి, శిరింబిఠశబ్దోఽత్రాకాంక్షా సామర్థ్యాత్ ద్వితీయాంతస్సన్ అనుషజ్యతే. శిరింబిఠం-శ్రీనివాసం, చాతయామసి- చాతయితుంప్రార్థయితుం అర్హసి; చతేచదేయాచనేచేతిహి ధాతుః యద్వా ధాతో రనేకార్థత్వాత్ సమర్పయితు మర్హసీత్యర్థః; ఇదానీంతు త్వాశబ్దో యథా స్వవిభక్త్యైవార్థవాన్, శిరింబిఠస్యేతి షష్ఠ్యంతస్యైవచానుషంగః. తథాచ యథోక్తానిష్టప్రసంగే శ్రీనివాసస్య గిరిం తద్భక్తైస్సహ గత్వా తద్భక్తముఖేనైవ స్వాత్మానం తస్య సమర్పయితుమర్హసీతివా వేదపురుషోపదేశః ఫలితోభవతి. అత్ర శ్రీనివాసగిరే శ్శ్రీనివాసస్య చ శ్రీనివాసభక్తద్వారేణోపసదనీయతాయా స్స్పష్టతరం శ్రూయమాణతయా వైష్ణవక్షేత్రత్వమేవాస్య దురపహ్నవం సిద్ధ్యతీతి.

ఉదాహృతమంత్రమునకు సాయనభాష్యము—

అరాయీతి పంచర్చం సూక్తం భరద్వాజపుత్రస్య శిరింబిఠస్యార్ష మానుష్టుభం—

హే అరాయి-అదాయిని దానవిరోధిని, హే కాణే కుత్సితశబ్దకారిణి-కుత్సితదర్శనేవా, హే వికటే వికృతగమనే-వికృతాంగేవా, సదాన్వే సదానోనువే, సర్వదా క్రోశకారిణి దుర్భిక్షాధిదేవతే, గిరిం పర్వతం నిర్జనదేశం గచ్ఛ; అస్మాన్ మాబాధిష్ఠాః శిరింబిఠస్య - బిఠం అంతరిక్షం శీర్యతే బిఠే అంతరిక్షే ఇతి శిరంబిఠో మేఘః తస్య; సత్వభిః అంతర్వర్తమానై రుదకైః తేభిః తైః త్వాత్వాం, చాతయామసి చాతయామః-వినాశయామః; యద్వా శిరంబిఠస్యైతత్సంజ్ఞికస్య భరద్వాజపుత్రస్య తేభిః తై రనుష్ఠితైః సత్వభిః కర్మభిః హే లక్ష్మి! త్వాం వినాశయామః ఇతః త్వమేవ శీఘ్రం గిరిం గచ్ఛ—

ఈమంత్రమునకు గ్రిఫితుగారు జేసిన ఆంగ్లేయ పరివర్తనము :-

Arayi, one eyed limping hag, fly, ever-screeching to the hill.

We frighten thee away with these, the heroes of Sirimbitha

* * * *

Note :

Sirimbitha; the Rishi of the hymn.

మేలుకొనుమోయి పాంథుఁడా మేలుకొనుము

పానుగంటి విజయరాఘవరావు గారు

గున్నమామిడికొమ్మపైఁ గూరుచుండి
మధురముగ మంజులముగను మార్దన
గూయుచుండెను కోయిల; హాయిమీఱ (ముగ
మేలుకొనుమోయి, పాంథుఁడా! మేలుకొనుము!

చెట్టుపైనుండు గూటిలోఁ జేరియున్న
పావురపుదంపతుల ప్రేమపలుకు లవిగో!
చెవిని జేరగ నిన్నెట్లు చేరె నిదుర?
మేలుకొనుమోయి, పాంథుఁడా! మేలుకొనుము.

చల్లనగు పిల్లవాయువు లుల్లమలర
విరులగుత్తులపై నుండి వీచుచుండె
గాలి సోకగ మేనెల్ల గగుఱుపొడిచె
మేలుకొనుమోయి, పాంథుఁడా! మేలుకొనుము.

గూడులను వీడి పక్షులు పాడుచుండి
చెవికి నింపగుధ్వనులను జేయుచుండె
నెమ్మి నీకీర్తనములను నేర్చికొనుము
భరతమాతను గీర్తించి పాడనగును.

పూలచెంతకు మధుపముల్ పోవుచుండి
క్రొవ్వి తేనెను గడుపాఱఁ గ్రోలుచుండి
జుమ్మటంచును పక్షిరవమ్ములకును
శ్రుతులు వేయుచునుండెను కుతుకమునను
మేలుకొనుమోయి, పాంథుఁడా! మేలుకొనుము.

పచ్చనగు నాకులందునఁబడిన యట్టి
మంచుముత్తెంబులను లేచి కాంచుమయ్యా!
అదిగో సంద్రమునుండి యా యుదయభానుఁ
డుదయ మందుచునున్నాఁడు ముదముతోడ
కన్నబిడ్డల మఱలను గాంచుటకును
మేలుకొనుమోయి, పాంథుఁడా! మేలుకొనుము.

తనదుపుత్రుల కెవ్వియో పనులఁజెప్ప
నబ్జనాభునికరమట్టు లంధతమస
మొక్కమారుగ మాయము నొందె నయ్యా
మేలుకొనుమోయి, పాంథుఁడా! మేలుకొనుము.

కాలము పరిపక్వదశను గ్రాలుచుండె
వేగ లేచి పనుల నెరవేర్చికొనుము
పోటుసమయాన నీటిపైఁ బోవకుండి
పాటుసమయానఁబోయిన భంగమగును
మేలుకొనుమోయి, పాంథుఁడా! మేలుకొనుము.



శివపదార్థ విచారణము

పారనంది సర్వేశ్వరశాస్త్రి గారు

సృష్టి స్థితి లయ కర్తయగు భగవంతుని శివ కేశవాది పదములచే తమ తమ భక్తికొలది జనులు స్మరింతురు. అనగా శివభక్తులు శివుడనియు, విష్ణుభక్తులు విష్ణువనియు మొదలగు విధముగ స్మరించి ప్రార్థనలను చేయుచుందురు. అందు శివుని విషయ మీదిగువ కొంచెము వ్రాయతలంచితిని. వాని చరిత్ర మతివిచిత్రము. సమస్త వేదములు, శాస్త్రములుగూడ నప్పరమవస్తువును ప్రశంసించుచున్నను నాతడవాఙ్మానస గోచరుడు. అట్టిమహానుభావుని పేరునయిన కొంతవరకు దెలిసికొనుట యావశ్యకము. అతనికి వేనవేలు నామములు (పదములు) కలవు. అందుముఖ్యమగునది "శివః" అనుపదము. ఈ శివపదమున కనేకార్థముల నిట్లు చెప్పవచ్చును.

1. "నిస్త్రైగుణ్యతయా శుద్ధత్వాత్ శివః"

(సత్వరజస్తమోగుణములు లేక శుద్ధుడగుటవల్ల శివుడు అని యర్థము.)

2. "స్మృతిమాత్రేణ పావనాద్వా శివః"

(తనను స్మరించిన మాత్రముచే పాపములను పోగొట్టువాడు.)

(అని విష్ణుసహస్రనామ భాష్యము)

3. "సర్వాత్మనా కల్యాణశ్శివ స్సుప్రసిద్ధః... అభ్యుదయని శ్రేయసాఖ్యకల్యాణ కారిణ్యపి శివశబ్దోగుణ వృత్త్యావర్తతే... యథా శివః పంథాః ఇతి.. తథాదేవ శ్శివంకరత్వాచ్చ శివఇతి"

(మంగళస్వరూపుడు అనియు ధర్మార్థకామమోక్షములను మంగళములను కలుగజేయువాడనియును.)

(అని నమకభాష్యము)

పై యభిప్రాయముల ననుసరించు పౌరాణిక వచనము.

శ్లో. "శివనామని భావితేఽంతరంగే మహతి
జ్యోతిషి మానినీమయూఖే, దురితా న్యప
యాన్తి దూరదూరే ముహురాయాన్తి
మహాంతి మంగళాని" (అని)

4. "శామ్యతీ (నిర్వికారోభవతీ)తి శివః"

(వికారములు లేనివాడని భావము)

5. "శేరతే సజ్జనమనాంస్యస్మిన్నితివా" శివః

(సజ్జనుల మనస్సు లీతనియందు నిద్రించు(హాయిగనిలచు) నని యర్థము.

6. "శేతే సజ్జనమనస్స్వితివా శివః" (శీఙ్ స్వప్నే)

(సత్పురుషుల మనసులయం దుండువాడు)

7. "శివప్రదత్వాద్వా శివః"
(శుభముల నిచ్చువాడగుటచే శివు డని.)
(అని గురుబాలప్రబోధిక)

8. "హింసధాతో స్సింహశబ్దో వశకాంతౌ శివ స్స్మృతః......పశ్యకః కశ్యపోయథా."

(హింసధాతువుయొక్క వర్ణవ్యత్యయము వల్ల సింహపదము సిద్ధమగునట్లును, పశ్యక పదవ్యత్యయమువల్ల కశ్యపపదము సిద్ధించునట్లును కాంతిని చెప్పునట్టి వశధాతువునుమార్చినయెడల శివపదము నిష్పన్నమగును. అపుడు ప్రకాశించువాడు శివు డని తాత్పర్యము.)

9. "పంచాక్షరీ శివపదేన విభాతిరుద్రాధ్యాయ స్తయాస్ఫురతి తేన చతుర్థకాండః, కాండేన సర్వయజురేవ విభాతితేన ఋక్సామ మధ్య మణినాచ విభాంతి వేదాః"

(శివపదముచే పంచాక్షరియు, పంచాక్షరిచే నమకము, నమకముచే నాలుగవకాండము, దానిచే యజుర్వేదమంతయు, నిట్లొకదానితో నొకటి కలిసియుండుటచే నివియన్నియు ప్రకాశింపుచుండ ఋగ్యజుస్సామము లను మూడు వేదములలో నట్టియజుర్వేదము మధ్యను విరాజిలుచుండగ (మధ్యమణి న్యాయము చేత) వేదత్రయముగూడ ప్రకాశించుచున్నది) అని ఆర్యవచనము. శివపద సంపర్కమువల్లతుదకు వేదత్రయమునకు బ్రసిద్ధి గల్గెను.

10. "పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం, ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" (భగవద్గీత)

సజ్జనులను రక్షించుటకై, దుర్జనులను శిక్షించుటకొరకును, ధర్మమును నిల్పుటకును ప్రతియుగమునందు నే నవతరించుచున్నా నని భగవద్వాక్యము గాన మీదవ్రాయబడిన శివపదముచే స్మరింపబడు భగవంతుడు భక్తుల ననుగ్రహించుటకై యనేకవిధములుగ నవతరించి గొప్పగొప్ప కార్యములను నిర్వహించినట్లు సంఖ్యాతీతములగు పురాణగాథలుకలవు. వాటి నన్నిటిని వ్రాయ తరముకాదు. కాని యాశ్చర్యావహములగు కొన్ని యంశములను మాత్రము వ్రాయగలుగుచున్నాను.

ఒకానొకసమయమున శివుడు యక్షరూపముచే నవతరించి దేవతలను మోహపెట్టెను. ఒకప్పుడు విటవేషమును ధరించి ఋషులను ఋషిభార్యలనుగూడ వ్రతభ్రష్టులగావించెను.

మరొక్కపర్యాయము కిరాతవేషమును పూని మధ్యమపాండవుని (అర్జునుని) తో క్రీడించెను. భైరవబీజశరీరముదాల్చి దేవితో గూడ విఘ్నేశ్వరుని పుట్టించెను. వేరొకకాలమున చిన్నబాలుడై పార్వతియొక్క తొడపై గూరుచుండె. ఇంకొకపుడు గుడ్డగూబయై యొకానొకమునికి జ్ఞానోపదేశము జేసెను. పదియోతప్పుచేసిమరణమునకుసిద్ధపడిన యొక భృత్యుని బ్రతికించుటకుబట్టలనుతుకురాతినుండి ప్రత్యక్షముగ నవతరించె. ఒకభక్తుడు తన కివ్వదలంచినహవిర్భాగము ప్రమాదవశమున నేలబడి భూవివరమునబోవుచుండ నాహవిర్భాగము నచటనే తానుకనుపడి భుజియించె. ఇంతియ కాక యనన్యసాధారణములగు సద్భుతకార్యము లెన్నియో నెరవేర్పబడినవి.

ఇట్టి భగవదవతార కథావిశేషములు చరాచరాత్మక మగు ప్రపంచ మంతయు భగవత్స్వరూపమేయని బోధించు చున్న నమక వాక్యముల కనువాదకము లగును. గనుక 'భజమన శ్శివమేవ నిరన్తరమ్'అని మనసును బోధించుట ప్రతివారికిని ముఖ్య కర్తవ్యము.

ఆంధ్రుఁడా!

శతావధాని వేలూరి శివరామశాస్త్రి గారు

తెలివికి సంస్కృతమ్మె మఱి, కలిమికి నాంగ్లేయమో యిఁకం దురకంబో
విలువ యిడి నేర్చి యీ నీ, తెలుఁ గెవ్వరిపాలు చేసి తిరిగెద వాంధ్రా!

చ. చదివెద వింగిలీ పది విసర్జనచేయు మటంచు నే నన్
జదివెదు సంస్కృతం బదియుఁ జాలు నటంచును బల్కె—నీ వొగిన్
వదలితి మాతృభాష యిది పాడియె? యంచును జేతు లొగ్గి నీ
యెదుటను నిల్చి వేఁడెదను నించుక తెల్పు జవాబు నాంధ్రుఁడా!

ఆ. ఒక్కభాష కాదు చిక్కిన భాషల, నన్ని గూడ నేర్వు మయ్య యాంధ్ర!
నీదు మాతృ భాష నిఖిల పుష్పరసమ్ము. చేతఁ దేనెపెరను జేయు మయ్య!

చ. పరనరపాల సేవలకుఁ బొల్పడ కన్యులభాష నేర్వ కి
త్తఱి మఱపొట్ట నిజమియ తథ్యముకాని తెలుంగు బాసనున్
మఱచితివేని నీదయిన నాలుక పాయక పాయసాన్నముల్
మాఱిమఱి యారగించుటకు మాత్రమె పాత్రము నమ్ము మాంధ్రుఁడా!

సీ. వాక్కుండియును మాతృభాష రాకుండుచోఁ, గడుమాటలేల? మూకుఁడవు సుమ్ము
వినఁగల్గియును నీదు విమలభారతి వినఁ, బడయవేనియు బధిరుఁడవు సుమ్ము
చూడఁగల్గియు నీదు శుభసరస్వతిఁ జూడ, దొరకొనవేని యంధుఁడవు సుమ్ము
దేశ్యుండవేని నీదేశభాషను నేర్వకుండుచో నన్యదేశ్యుఁడవు సుమ్ము
గీ. నడువఁగల్గియు నీ తెల్గునాఁడు నెల్ల, నడువకుండిన యెడలఁ బంగుఁడవు సుమ్ము
మఱి నెసంగియు దేశాభిమానమందుఁ, జూడ్కి లేదేని పిచ్చివి చుమ్ము యాంధ్ర!

శా. అన్నప్రాశము హోటలందున స్వవిద్యాభ్యాసముల్ కాలెజీ
తిన్నం బేరిమి దేశసేవయును బస్తీముంద రాఫీసులం
దన్నన్నా మన చిన్నవారలకు దుష్టావస్థ యిట్లాయె నీ
యన్నాయంబున కూరకుండఁ గలవయ్యా! యాంధ్రదేశీయుఁడా!

సుగంధ ద్రవ్యములు-పరిమళ తైలములు

వి. యస్. చిన్నస్వామి గారు, బి. ఏ.

ప్రకృతిశాస్త్రము లభివృద్ధి గాంచిననేకాని జీవిత పరిమాణమునం దాసక్తియు, భోగములయం దాపేక్షయు కలుగవనుట యెల్లరకును తెలిసినవిషయము. ప్రకృతిలో దొరకెడు వస్తువులనెల్ల సంగ్రహించి కొన్ని కొన్ని మార్పులవలన వానిని సంఘమున కుపయోగమైన పదార్థములనుగా తయారుచేయుటచేతనే పరిశ్రమ లభివృద్ధి గాంచినవని చెప్పనగును.


హిందూదేశమువంటి వ్యవసాయజీవితముగల దేశమందు పరిశ్రమాభివృద్ధి యెంతవరకు గలదో తెలిసికొనుటకు నాగరికమునకు చిహ్నమైన సుగంధద్రవ్యములను పరిమళతైలములను తయారుచేయుటగూడ నిదర్శన మగును. పరిమళతైలములయొక్కయు, విత్తులయొక్కయు, సుగంధద్రవ్యములయొక్కయు యెగుమతికంటె దిగుమతి చాల తక్కువ. సువాసననిచ్చు విత్తులు ముఖ్యముగా యెగుమతి చేయబడునవి(Caraway=సీమసోపు) సోపువంటివి, (కేకువిత్తులు =Ajwan) (ఓమము = Coriander) (ధనియాలు=Cuimin), (జీలకఱ్ఱ = Fennel), (పెద్దజీలకఱ్ఱ= Niger), (నల్లజీలకఱ్ఱ=Aniseed). పది సంవత్సరముల క్రిందకంటె యీవిత్తులయొక్క యెగుమతి దాదాపు రెట్టింపైనది.

సుగంధద్రవ్యములను తయారుచేయుట హిందూదేశమున మిక్కిలి పురాతనపరిశ్రమ. ప్రస్తుతము ఉత్తర హిందూస్థానమున ఆపరిశ్రమ మిక్కిలి వన్నెకెక్కినది. జాన్‌పూరు, గాజీపూరు, హత్రాసు లీపరిశ్రమకు ముఖ్యస్థానములు. ముడిపదార్థములను సంగ్రహించుపద్ధతి సరిగా లేకపోవుటవలనను తయారుచేయుపద్ధతులు పురాతనమైనవగుటచేతను యీపరిశ్రమ కిప్పుడు చిక్కులు కలిగినవి. కొద్దిగా బట్టీ పెట్టువారెవ్వరును పరిశుభ్రముగా లేనటువంటి చమురును పరిశుభ్రము చేయవలెనని ప్రయత్నములు చేయుట లేదు. పరిశుభ్రముగా నున్నగాని దాని కెగుమతివర్తక ముండజాలదు.


తయారుచేయువిధము

తయారుచేయుటలో రెండుపద్ధతు లవలంబింపబడుచున్నవి. మొదటిది బట్టీపెట్టుట. ఒకప్పుడు పరిమళతైలము నీటియావిరితో కలిసి మిక్కిలి వేడిగా నున్నప్పుడు యావిరిరూపము దాల్చును. అప్పుడీబట్టీపద్ధతి పనికివచ్చును. ముడిపదార్థమును సన్నగా ఛేదించి దానిగుండా నీటియావిరిని పంపుదురు. అప్పుడు తైలముగూడ యావిరిరూపముదాల్చి మరొకచోటికి ప్రవేశించినంతనే చల్లార్పబడును. నీరును తైలమును కలిసియుండుటచే కొంతసేపు తేరనిచ్చి వాటిని వేరుచేయుదురు. తక్కువవేడితోనే యావిరిరూపమును దాల్చు తైలములవిషయమున రెండవపద్ధతి యవలంబింపబడును. అన్ని దేశములలోను హిందూదేశమున చాలదినములనుండియు నీపద్ధతియే యవలంబింపబడుచున్నది. పుష్పములనుండి తైలమును తీయునపుడెల్ల ఈపద్ధతి తప్ప మరొకటి పనికిరాదు. పుష్పములుగాని మరియేయితరమైన ముడిపదార్థముగాని క్రొవ్వులోగాని లేక క్రొవ్వుపదార్థములలోగాని ఒకటిరెండుదినములు ముందు నానబెట్టబడును. ఆసమయములో సుగంధద్రవ్యమునంతను క్రొవ్వుపదార్థము లాగుకొనును. అప్పుడు ఆల్కహోలునుగాని యీథరుద్రావకమునుగాని దానితో కలిపినయెడల సుగంధద్రవ్యము దీనిలో కలిసిపోయి క్రొవ్వు వేరగును. ఆక్రొవ్వును మరలమరల నుపయోగింపవచ్చును. ఇదియే రెండవపద్ధతి.

ఎగుమతివ్యాపారము చేయవలెనను ఉద్దేశ్యముతో హిందూదేశమున తయారుచేయబడుచున్న ముఖ్యమైన పరిమళతైలము లేవనగా (1) పశ్చిమతీరమున నిమ్మ(గడ్డి) నూనె; (2) నీలగిరులమీద యూకలిప్టసునూనె; (3) సంయుక్తరాష్ట్రములందు పన్నీరు, గులాబిఅత్తరు; (4) మైసూరులో చందనపు (కఱ్ఱ) నూనె (సంపనఘృతి).



1. మైసూరు చందన తైల పరిశ్రమాలయము—బెంగుళూరు



2. మైసూరు చందన తైలపరిశ్రమాలయమునందలి బట్టీల తాలూకు బ్యాటరీలు—బెంగుళూరు

నిమ్మ (గడ్డి) నూనె

ఈతైలమునందు పరిశ్రమ ప్రథమమున తిరువాన్కూరులో ప్రారంభమై పిమ్మట మలబారుకు వ్యాపించెను. యుద్ధమునకుపూర్వ మీతైలము లండను, న్యూయార్కు, హాంబర్గులకు పంపబడుచుండెను. స్థానికనివేదికములను చూచినట్లయిన సాలుకు 5000 పెట్టెలు పంపబడుచున్నట్లు తెలియును. ఒక్కొక్క పెట్టెయందు 24 ఔన్సులుగల సీసాలు పండ్రెండుండును. ఈతైలము నాణ్యమునుబట్టి మొత్తముగా పౌను 4షిల్లింగులనుండి 9 షిల్లింగుల 6 పెన్నిలవరకు (అనగా రూ 3 నుండి 7-2-0 వరకు) అమ్మబడుచుండెను. కాని యిప్పుడు సరియైనముడిపదార్థములను సమకూర్చుటయందు ఒకపద్ధతి లేకపోవుటచేతను, తయారుచేయుటలో గూడ సరియైనపద్ధతు లవలంబింపబడకపోవుటచేతను నాణ్యమైనతైలము తయారగుట లేదు. అందువలన యిప్పుడిప్పుడు వర్తకము మందగించినది. మట్టిరిటార్టు (Retort ధృతితీయు యంత్రము)లతో తయారుచేసే పూర్వపద్ధతులు నిమ్మగడ్డి సమృద్ధిగా దొరుకునటువంటి అడవిప్రదేశములయం దిప్పటికిని అవలంబింపబడుచున్నవి. జావాతైలముతో పెద్దపోటీగానున్నను యీతైల పరిశ్రమ మిప్పటికిని సాగుచున్నది. ముడిపదార్థములను పండించుటలోను ఉపయోగించుటలోను శాస్త్రీయపద్ధతు లవలంబించిన యెడల నాణ్యమైన తైలమును తయారుచేయవచ్చును. అందువలన పెద్దఅమ్మకమునకును పెద్దధరను సంపాదించుటకును అవకాశము లేర్పడును.

యూకలిప్టసు


యూకలిప్టసు అనేవృక్ష మితరదేశములనుండికొనిరాబడిన మొక్కలలో నొకటి. ఇది నీలగిరులలో చక్కగా పెరుగును. పరిశ్రమయం దనుభవములేని పనివాండ్రతో పురాతనపద్ధతులమీద నేయీతైలము నీలగిరులమీదయెన్నియో సంవత్సరములనుండి బట్టీపెట్టబడుచున్నది. సం॥ము పొడుగునను బట్టీపెట్టుయంత్రాలయము లెన్నియోలేవు. ఆధునికపద్ధతుల ననుసరించి మంచియంత్రాలయము నొకదానిని స్థాపించి సంవత్సరముపొడుగునను పనిచేసిన గాని యీనీలగిరితైలము ఆస్ట్రేలియా తైలముతో పోటీకినిలువజాలదు. ప్రత్యేకమైన బట్టీలనేర్పరచి అనుభవశాలురగు పనివాండ్రతో విరివిగా పనిచేయించుచు, సమర్థులైనవారు తనిఖీ చేయుచున్నయెడల యీతైలమును మంచిధరలకే ఎక్కువగా యెగుమతిచేయవచ్చును.

పన్నీరు తీయుట


పన్నీరు ముఖ్యముగా గాజిపూరు, జానూ్పరు, హత్రాసులలో తీయబడుచున్నది. ఈ మూడుప్రదేశములందును పెద్దపెద్దగులాబితోటలు కలవు. కాని యీపరిశ్రమ అచ్చటనే యుండుటచేత ఒక్కపన్నీరును, కొంచెముగా గులాబియత్తరును మాత్రము తీయబడుచున్నది. కానూ్పరులోనున్న టెక్నొలాజికల్ యిన్‌స్టిట్యూటు (Technological Institute) వారీవిషయమై పెక్కుపరిశోధనలు సల్పి బట్టీపద్ధతిని, పుష్పములు మొదలగువానిని క్రొవ్వులో నానబెట్టుపద్ధతిని సమ్మేళనమొనర్చిన నాణ్యమైనఅత్తరువచ్చునని చెప్పుచున్నారు. అట్లుతయారుచేసినయెడల విరివిగా ఎగుమతి వర్తకమును సాగింపవచ్చును.

చందనతైలము-చందనధృతి

మంచి నాణ్యమైనదానినిగాను విరివిగా అమ్ముడుపోవుదానినిగాను ఒకపదార్థమును తయారుచేయవలెనన్న క్రమముగా ప్రయత్నములుచేసినట్లయిన లాభ మున్నదో లేదో తెలుసుకొనుటకు చందనపుతైలమే నిదర్శన మగుచున్నది. మైసూరుప్రభుత్వమువా రీతైలమును మైసూరు బెంగుళూరులందు జయప్రదముగా తయారు చేయుచున్నారు. చందనపుతైలమును తయారుచేయుట యుద్ధసమయమున సమకూర్పబడిన పారిశ్రామికాభివృద్ధికి సంబంధించినది. ఈతైలమును బట్టీపెట్టుట అనాదిగా వచ్చుచున్న దేశీయపరిశ్రమయైనను యిందవలంబింప బడుచున్న పద్ధతులు చాల పురాతనములైనవి. అందువలన కర్రలోనున్న చమురంతయు రాకపోవుటయేకాక దానికొఱకెన్నియొకట్టెలుగూడ వ్యయమగుచుండెను. మైసూరు నందు పారిశ్రామికశాఖ స్థాపింపబడగానే చందనపుకర్రకుగిరాకి తగ్గిపోయెను. అందువలన చమురును తీయుటకై బట్టీలను స్థాపింపవలసివచ్చెను. హైందవశాస్త్రసంస్థ (ఇండియను ఇన్‌స్టిట్యూటు ఆఫ్ సైన్సు)ను స్థాపింపగానే, అచ్చట



3. మైసూరు చందనతైలపరిశ్రమాలయము-నిప్పుతోనే కాక చేయబడు బట్టీ—బెంగుళూరు



4. మరియొకరకపు బట్టీ. గింజలు, కాయలు, ఆకులనుండి ఘృతితీయుట కుపయోగించునది

జరుపబడు పరిశోధనల వలన మైసూరు ప్రభుత్వము వారు రెండు చందన తైలపు ఫ్యాక్టరీలను స్థాపింపగలిగిరి. ఈపరిశ్రమ నుండి వచ్చు లాభము మాత్రమే యీ సంస్థకు కావలసిన ఖర్చులను భరించుచున్నదని చెప్పబడుచున్నది. ఈతైలము మిక్కిలి నాణ్యమైనది. దీనిలో నూటికి 90 నుండి 94 పాళ్లవరకు చమురుపదార్థ ముండును. ఇది (బ్రిటీషు) ఔషధయోగ పుస్తకపరీక్షలకు నిలుచును. ఈతైలము విశేషముగా యునైటెడుకింగ్డము, ఫ్రాంసు, జపాను, అమెరికాలకు ఎగుమతి చేయబడుచున్నది. చందనపుకర్రను సన్నపొట్టుగా ఛేదించి అడుగున రంధ్రములుగల రిటార్టులలో నుంచి, ఆపొట్టుగుండా నీటియావిరిని పోనిచ్చినట్లయిన తైలము ఆవిరిరూపముగా నీటియావిరితో కలిసి యీవలకు వచ్చును. అప్పుడు దానిని చల్లార్చి నీటిని తైలమును వేరుచేయుదురు. ఒకపౌను చందనతైలమును తీయవలెనన్న ఒక టన్ను చందనపుకర్రయు, 8 టన్నుల వంటచెరకును, 500 పౌనుల నీటియావిరియు కావలసియున్నది. బట్టిపెట్టుటకై ఒక్క యావిరిమాత్రమేకాక యీచందనభృతి యంత్రశాలయములలో (1) కర్రను సన్ననిపొట్టుగా జేయుటకును (2) ఆవిరిని చల్లార్చుటకై చన్నీటిని ప్రవహింపజేయుటకును (3) యంత్రశాలయములు రాత్రింబగళ్లు పనిచేయవలసియుండుటచే విద్యుద్దీపము లవసరమగుటచేతను పెద్దశక్తి కావలసియున్నది. బట్టీపని యెడతెగకుండ జరుగవలసినది: అయినను మైసూరు, బెంగుళూరునగరములందు విద్యుచ్ఛక్త్యాలయము లుండుటచే మైసూరు రాష్ట్రమందు దానికి కావలసిన విద్యుచ్ఛక్తి సులభముగా దొరకుచున్నది. ఈపరిశ్రమకు కూలివాండ్రెక్కువగా కావలసియున్నారు. బెంగుళూరు, మైసూరు యంత్రశాలయములలో రసాయనవేత్తలును ఉద్యోగులును, భారతీయులై యున్నారు.

అవకాశములు

నీలగిరులలో యూకలిప్టసు, ప్రొద్దుతిరుగుడు పువ్వు, జెరేనియం, వింటరుగ్రీన్ అను పుష్పములును విశేషముగా నుండును. ప్రొద్దుతిరుగుడుపువ్వు సువాసన గలది. దానిని బట్టీపెట్టి లవెండరు మొదలైన నూనెలతో కలిపినట్లయిన చక్కని సుగంధ (తైలము) ద్రవ్యమగును. జెరానియం వింటరుగ్రీన్ పుష్పములను బట్టీపెట్టుటకు ప్రయత్నములే చేయబడుటలేదు. అట్టివీలును కనుగొన్న యెడల యూకలిప్టసు ఆకు తక్కువగా నున్నప్పు డీపనిని సాగింపుచుండవచ్చును. సేలం, తిరుచనాపల్లి, కోయంబత్తూరులందు నారింజ, చేదునారింజ, పోమిలోస్ (ఒకవిధమైన ద్రాక్ష), నిమ్మ విశేషముగా దొరుకును. నారదబ్బజాతినుండి తైలమును తీయుట మరియొక ముఖ్యవిషయము. తొక్కల నిప్పుడు వ్యర్థముగ పారవైచుచున్నారు. కావున మార్మలేడులను (కిచ్చిలిపండ్లు చక్కెర నీటితో చేసిన ఒకవిధమైన మిఠాయి), తైలమును తయారుచేయుచున్నట్లయిన పరిశ్రమ మరింత వృద్ధియగుట కవకాశము గలుగును.

చిక్కులు

తైలమును తీయుటలో శక్తిమంత మైనట్టియు, చౌకయైనట్టియు మార్గముల నవలంబించిన ట్లయిన యీపరిశ్రమను దేశమునందు శాశ్వతముగా నెలకొల్పవచ్చునని కొంతవరకు క్లుప్తముగా చెప్పబడినది. చందనపుకర్ర వ్యాపారమును తిలకించినట్లయిన హిందూదేశమున నీతైలపరిశ్రమకుగల ప్రాముఖ్యము స్పష్టమగును. చందనపుకర్రను ఏలము వేయుటవలన సగటున 27 లక్షలు వచ్చుచున్నవి. నూతనముగా కొన్ని సంవత్సరములనుండి, వర్తకపరిస్థితులు ప్రతికూలముగా నున్నవనుకొన్నప్పుడే, తైలమునుండియు కర్రనుండియు దాదాపు 40 లక్షలు వచ్చుచున్నవి. దీనికి అమెరికా, జపాను, యూరపులందు పూర్తిగా గిరాకికలదు. మరియు ఆస్ట్రేలియా దేశపు చందనతైలముకంటె నిది శ్రేష్ఠమయినది. హిందూదేశము వ్యవసాయదేశము. అన్నివిధములైన సుగంధ ద్రవ్యములును తైలములును, నిచ్చట మిక్కుటముగా దొరకుచున్నవి. ప్రస్తుతము వ్యాపారమునకు తగిన సుగంధద్రవ్యముల నేర్పరచుకొని వాటికి కావలసినముడిపదార్థములను పండించుటయే చేయవలసియున్నది. ఈపని వ్యవసాయదారుడును రసాయనవేత్తయును సమానమైన సహకారమునుజూపి పనిచేసినగాని నెరవేరదు. వ్యవసాయదారుడును తగినయెరువు నుపయోగించి నాణ్యమైనగట్టిపంటనుపండించినట్లయిన రసాయనశాస్త్రవేత్త తైలమునుతీయుటకు చౌకయైశక్తివంతమైనమార్గములను చూపవలయును. పరి


శోధనలనుసల్పి చూపుటకై ఒకశాల ముఖ్యావసరమైయున్నది. ముడిపదార్థము కావలసినంతదొరుకునట్టి నీలగిరుల మీద ప్రభుత్వమువారి యాజమాన్యముక్రింద అట్టిపరిశోధనాలయమొకటి స్థాపించుటయే యీసమస్యను పరిష్కరించుటకు ముఖ్యమార్గమైయున్నది. ఇందువలన వ్యాపారమున కవసరమైనఫలితములు సిద్ధించుటయు, ముడిపదార్థము విరివిగా పండింపబడుటయును నిస్సంశయము. ఇట్టి తైలపు పరిశ్రమాభివృద్ధికి విదేశములెట్లుప్రోత్సాహ మొసంగినవో తెలియజేయుట అప్రస్తుతము కాదు. ఈ పరిశ్రమకు కావలసిన పుష్పములను మొక్కలను పెంచుటకై యుపయోగింపబడు భూములను పదిసంవత్సరములను శిస్తులను గాని మరియేయితరమైన పన్నులనుగాని లేకుండ ఇటాలియన్ ప్రభుత్వమువారొసర్చిరి. తైలములను తీయు యంత్రాలయములకుగూడ 5 సంవత్సరములవరకు నిట్టి సౌకర్యములను సమకూర్చిరి. రయితుల కట్టిప్రభుత్వ సహాయ మున్నచో పరిశ్రమ యభివృద్ధిచెందుటకును ప్రయివేటు పెట్టుబడిదారు లటువంటివాటియందు పెట్టుబడి పెట్టుటకును సందియ ముండదు.

పరిశ్రమయొక్క ప్రాముఖ్య మిప్పుడు విశదమైనది. సరియైన పునాదిమీద స్థాపింపబడినట్లయిన యీపరిశ్రమ యింకను వృద్ధిజెందుననుటకు సందియముండదు. హిందూదేశములో నొకప్పు డిట్టికళలును పరిశ్రమలును ఉన్నతదశయందుండెననియు, నాగరకత కీదేశము కేంద్రస్థానముగా నుండెననియు గొందరు సగర్వముగా పలుకుచున్నారు. కాని ప్రస్తుతము మనదేశ మెట్టిహీనస్థితియందున్నదో వారు గమనింపకున్నారు. సుగంధద్రవ్యములయొక్కయు, పరిమళతైలములయొక్కయు పరిశ్రమ ఆదినుండి తుదివరకు దేశీయమైనదగుటచే నెట్టిసమయమందైన పోటీకి నిలువగలదు. కాని అది యభివృద్ధిజెందవలె నన్న యేర్పాట్లు మంచివిగా నుండవలెను. ఐశ్వర్యమును వృద్ధిచేయు నిట్టి పరిశ్రమలు దేశమున కవసరములు. కావున అట్టివి దేశములో నుత్పన్నమై మనదేశములోగూడ నట్టి పరిశ్రమలు గలవని సగర్వముగా వెనుకకు తిరిగిచూడగలిగిన యవకాశములను ముందుసంతతివారి కొసంగు నని యాశించుచున్నాము.

కాపుకన్నె

దీపాల పిచ్చయ్యశాస్త్రి గారు

ప్రసవగుచ్ఛంబుల భరమున నసియాడు, వల్లీమతల్లినా వ్రాలి వ్రాలి
ఎక్కుడించిన కుసుమేషుచాపంబునా, లీలమైఁ జివ్వున లేచిలేచి
గండరించిన మేల్మి కనకంపుఁ బ్రతిమనాఁ, జలన మించుక లేక నిలిచినిలిచి
వెడవింటివాని పెంపుడు రాజహంసినా, నవకంపు నడకలు నడచినడచి
నడుము జవ్వాడఁ గరకంకణములు మ్రోయఁ, జీరచెఱఁగూఁగఁ జెక్కులు చెమరువార
నోరచూపుల మడవల నీరు మలుపు, కాపుకన్నియఁ గనుఁగొంటిఁ గనులు దనియ.



జీవబ్రహ్మైక్య వేదాంతరహస్యము

గ్రంథకర్త: శ్రీ పరమహంస సచ్చిదానంద యోగీశ్వరులవారు, గడికోట, కడపజిల్లా.

ప్రకాశకులు: ఏ. రాజగోపాలు అండు కంపెనీవారు, పెరంబూరు బారెక్సు, చెన్నపురి. డెమీ క్రౌను సైజున 800 పుటలుగల చక్కనిసంపుటము. మేలు బైండు. వెల రూ 3-0-0.

శ్రీ యోగీశ్వరులవారు ద్రావిడభాషయందు రచియించిన గ్రంథమునకు స్వీయాంధ్రీకరణ మీ గ్రంథము. పామరజనులకే కాక ఆస్తికభావశూన్యులగు నక్షరవేత్తలకు సైతము దుర్గమమగు వేదాంతరహస్యము లిందు అరటిపండొలిచి చేతఁబెట్టినట్టులు సులభముగను, విపులముగను జర్చింపఁబడినవి. స్త్రీలును సులభముగ గ్రహింపఁగలరు. ఇందు సగుణోపాసన, నిర్గుణోపాసన, ఈషణత్రయస్వరూపనిరాసములు, పంచీకరణ విధానము, సాంఖ్యపద్ధతి, వాయూపవాయువుల తత్త్వము, పంచకోశవివరము, అవస్థాచతుష్టయము, జీవాత్మ పరమాత్మ స్వరూపవిభేదవిచారము, జీవన్ముక్తి, వాసనాత్రయము, పిండోత్పత్తి, యోగాభ్యాసక్రమము, ప్రాణాయామ విధానము, దశవిధనాదములు, పంచముద్రలు మొదలయిన విషయములు మిగుల నుపయోగకరములైనవి యిందువివరింపఁబడినవి. జ్ఞానమే యుత్కృష్టమనువిషయ మిందు లెస్సగాఁ బ్రతిపాదింపఁబడినది. శ్రుతులు, స్మృతులు, ఉపనిషత్తులు, భగవద్గీత, ఆంధ్ర భాగవతము, ఇతరాంధ్ర ప్రబంధములు మొదలయినవాని నుండి గైకొనినప్రమాణవాక్యములు పెక్కుచోట్ల నుదాహృతములు. వానిలో భగవద్గీతయందలి కృష్ణార్జునల సంభాషణవాక్యములు బంగారునకుఁ బరిమళమువలె నీ గ్రంథముయొక్క విలువను బొడిగించుచున్నవి. ఎట్టి నాస్తికులైనను ఆధ్యాత్మికజ్ఞానసంపన్నులై సంసారసాగరమును దరించి ముక్తులగుదురు. ఈగ్రంథమునకన్న సులభశైలిని రచింపఁబడిన వేదాంతగ్రంథ మాంధ్రసారస్వతమున నిదవఱకు వెలువడలేదనుట సాహసముకానేరదు. శ్రీయోగీశ్వరులవారు దీనిని స్వానుభవముచేత రచియించిరి. దీని ద్రావిడమూలముయొక్క ఎనిమిది కూర్పులు (18 వేల ప్రతులు) చెల్లినవి. మనోహరాంగ్లపరివర్తనము ముద్రితమై పాశ్చాత్యుల మెప్పును బడసినది. మఱియు సంస్కృతపరివర్తనమును ముద్రితమై ప్రచారమును గాంచినది. ఇంతకన్న నీ గ్రంథప్రాశస్త్యమునకు వేఱునిదర్శనము లక్కఱలేదు.

ఆరోగ్యశాస్త్రమునకు శారీరశాస్త్రమునకు సంబంధించిన విషయము లీగ్రంథమున నచ్చటచ్చటఁ జర్చింపఁబడినవి. ఇట్టి చర్చలు శ్రీ యోగీశ్వరులవారికిఁ గల వివిధవిషయ పరిజ్ఞానమును జాటుచున్నను గొన్నిపట్ల నసంబద్ధములుగను, ననవసరములుగను జూపట్టుచున్నవి.

ఈ గ్రంథమున దంతమూర్ణము, గంధకకల్పము మొదలగు కొన్నియౌషధములు చేయుక్రమము, వాని ధరలు నచ్చటచ్చటఁ జేర్పఁబడినవి. ఇట్టి జాబితాలు (Catalogues) ప్రత్యేకముగ నుండవలసినవికాని అనవసరముగ గ్రంథమధ్యమునఁజేరి పాఠకులకు విషయావగాహనమున నంతరాయము గలిగించుట మంచిదికాదు.

దురవగాహవిషయములను సుబోధములుగా విమర్శించుపట్ల నీగ్రంథమునఁ జిత్రములు సైతముఁ జేర్పఁబడినవి. రజ్జుసర్పభ్రాంతి నిరాసములు, శిశూదయము,

చిన్ముద్రారహస్యము, జలముపైఁబరుండియుఁబద్మాసనాసీనుఁడయ్యు యోగనిష్ఠనుండుట, సుషుమ్నా నాడి, చిదాకాశమున మనోవేగమును నిలుపుట, నిర్వికల్పసమాధి, అన్నోదక మాత్రకోశములను శుద్ధిచేయుట, హృదయకమలమునఁ బరమాత్మను నిలుపుట, పంచాక్షర మంత్ర చక్రము మొదలైనవి ఆచిత్రములు. అవి గ్రంథస్థవిషయములను జక్కఁగా మనసున కెక్కించుకొనుటకు మిగులఁ గోడ్పడుచున్నవి.

ఇట్టి గ్రంథమును అధిక వ్యయ ప్రయాసలకోర్చి ముచ్చటలు మూటగట్టునట్లు ముద్రించి యాంధ్రలోకమున కర్పించిన ఏ. రాజగోపాలు అండుకంపెనీ వారెంతయు శ్లాఘాపాత్రులు.

ఈ గ్రంథ పరమార్థము నాంధ్ర ప్రపంచము గ్రహించి కృతార్థమగును గాక!

వలయువారు పై ఏ. రాజగోపాలు అండు కంపెనీవారికి వ్రాయునది.

సెలెస్టియలు కరస్పాండెన్సు (ఇంగ్లీషు)

ఇతర లోకములలోని రహస్యములను గురించి, యీ గ్రంథమున విజయనగరమునందలి తాతాశాస్త్ర పరిశోధక సంఘమువారు (తాతా ఇండియను సైన్సు ఇన్స్టిట్యూటు) అనేక నిదర్శనములను తమ పరిశోధనల వలన నిరూపించుచు, వ్రాసియున్నారు.

ఇట్టి పరిశోధనలు పాశ్చాత్యదేశము లన్నిటిలో, శాస్త్రీయపద్ధతుల ననుసరించి జరుపబడుచున్నవి. ఇప్పుడిప్పుడే ఆదేశమువారు, ఈ లోకమునకన్న మించిన లోకములు కొన్నిగల వనియు, అచ్చట జీవన్మృతులు అన్ని సౌఖ్యముల బడయుచున్నారనియు, వారితో మనము సంభాషించవచ్చుననియు గ్రహించుచున్నారు. కాని యీ విషయములు మన భారతభూమికి క్రొత్త గావు. ఈ విషయపరిశోధనమున మనప్రాచీనులు అత్యున్నతస్థానము నలంకరించి యున్నారు. ఇప్పు డీరహస్యముల నన్నిటిని మనము, కాలపరిస్థితుల ననుసరించి, సంపూర్ణముగా మరచియున్నాము. అట్టి పరిస్థితులలో, వీని నుద్ధరించుటకు, పరిశోధకసంఘమువారు పూనుకొనుట సంస్తవనీయము. వారి ప్రయత్నములు సఫలములగుగాక!

గ్రంథము 96 పుటలు. వెల రూ 1-6-0 లు. సంఘమువారికి విజయనగరమునకు వ్రాసికొనవలయును.

ఈ క్రింది గ్రంథములను వందన పూర్వకముగా నందుకొంటిమి. వీనిపై విమర్శనములు మున్ముందు సంచికలయందు వెలువడ గలవు.

౧. భారతీ భాస్కరము (నవల)

గ్రంథకర్త:—పోలవరపు రామబ్రహ్మముగారు, బి. ఏ.

ప్రకాశకులు:—ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము, కాకినాడ, వెల రు. ౧-౮-౦.

౨. విమర్శకపారిజాతము (వచనము)

గ్రంథకర్త:—పురాణంసూరిశాస్త్రిగారు, విద్యానిలయము, బందరు. మేలుప్రతి, వెల రు. ౧-౮-౦, సాదాప్రతి, ౧-౦-౦.

3. కృష్ణపక్షము (ఖండపద్యకావ్యసంపుటము)

గ్రంథకర్త:—దేవులపల్లి కృష్ణశాస్త్రి, బి. ఏ., సాహితీసమితి, తెనాలి, వెల రు. ౧-౮-౦.

౪. చంద్రగుప్త (గద్యనాటకము-అం. ౫.)

గ్రంథకర్త:— శ్రీపాద కామేశ్వరరావు గారు, అభినవాంధ్ర గ్రంథమాల, రాజమండ్రి, వెల రు. ౧-౦-౦

౫. అమెరికా సంయుక్తరాష్ట్రములు (చరిత్ర-వచనము)

గ్రంథకర్త:—అయ్యదేవర కాళేశ్వరరావుగారు విజ్ఞానచంద్రికా గ్రంథమాల, 33 వ సంఖ్య;

విజ్ఞాన చంద్రికా మండలి, బెజవాడ. వెల రు. ౧-౮-౦, చందాదారులకు రు. ౧-౪-౦.

౬. భీషణప్రతిహింస (పరిశోధక నవల)

గ్రంథకర్త: కేతవరపు రామకృష్ణ శాస్త్రిగారు. మేనేజరు, రజతప్రెస్సు, తెనాలి. వెల రు. ౧-౮-౦.

౭. అహింసా ప్రబోధిని (వచనము)

గ్రంథకర్త: సత్యవోలు వెంకట్రావుపంతులుగారు.

ప్రకాశకులు: సత్యవోలు రాధామాధవరావుగారు, పిఠాపురము, గోదావరిజిల్లా.

౮. శ్రీ వివేకానందస్వామివారి పౌరాణోపన్యాస చతుష్కము (వచనము)

అనువాదకులు: కూచి నరసింహముగారు, పిఠాపురము, గోదావరిజిల్లా. వెల రు. ౦-౮-౦.

జీవితాదర్శము

పంగనామముల రామచంద్రరావు గారు

మహనీయప్రతిభా సమన్వితులు సూక్ష్మగ్రాహు లాశ్చర్య కృ
ద్బహుళోద్గ్రంథనిబంధ నప్రచురితప్రాపంచికైశ్వర్య ధూ
ర్వహులైనట్టి మహామహుల్ బుధులు పూర్వంబుండి యీనేల నేఁ
డహహా! యట్టి పవిత్రగర్భమున నీచాత్ముండ నేఁ బుట్టితిన్.

గీ. భారతాభ్యుదయార్థంబు వారు మనిరి, **మాతృ**హృదయ వ్రణంబుగా మంటి నేను
సమత నాకెట్లు వారితో సంఘటిల్లుఁ, బుటము వెట్టిననైన నో భువనరక్ష!

ఉ. కొండికనాఁడు నాదుజనకుండు మదీయరసజ్ఞ పల్కులం
బండువు సేయుచుంటఁ గని పట్టనిమోదము గట్టు దాటరా
కుండునె యాంధ్రభాషయని యొప్పగ నాంగ్లము నభ్యసించి త
త్పాండితికై శ్రమంపడ నుపాయముల౯ సమకూర్చె నెంతయు౯.

శా. పుత్రాభాషణలోలుపాత్ముఁడయి రేపు౯మాపు నాతండ్రి నా
గాత్రంబు౯ స్పృశియించి మూర్ధమున రాగంబొప్ప మూచూచి యే
మాత్రం బాంధ్రముఁ బల్కనీక యెపుడు౯ మాటాడుచో నూహలం
జిత్రింపించె విదేశజాంగ్లమున విశేషించి నాతల్లిని౯.

చ. అరయ సమస్తశాస్త్ర నిచయంబుల నందియఁ గట్టుచు౯ దిగం
తరములఁ గీర్తివల్లికల నాటిన యాంగలబాసకు౯ నమ
స్కరణపురస్సరాదరము సల్పుట తప్పనికాదు తియ్యతే
నెరుచు లొసంగి పెంచు జననీమణిసేవలకంటె నెక్కుడే!

వ. నాకుఁ బంచవర్షంబు లతిక్రమించుచుండె. అంత నాంగ్లవిద్యాపూర్ణవిజ్ఞానియయి యందందు విద్యార్థుల బ్రోవుసేసికొని యింటనే చదువుఁ గఱపుచుఁ దచ్ఛిష్యదత్తధనంబునను నితర విధంబులను బొట్టవోసికొనుచుండు పంగువును, బ్రహ్మసమాజమతావలంబియు నగు నొక బ్రాహ్మణయువకుని సమీపించి నాతండ్రి నా విషయంబుఁ జెప్పి యాతని పాఠశాలయందు నన్ను విద్యాసముపార్జనార్థం బునిచె. ఇటు లేడెనిమిది సంవత్సరంబులు గతించునప్పటికి.

(సశేషము)

సాభిప్రాయ విశేషములు

కీ. శే. సర్ సురేంద్ర నాథ బెనర్జీ

భారతదేశ సమస్యలు విచిత్రములు; ప్రపంచాతీతములు. రాజద్రోహము రాజసన్మానముగ బరిణమించును. దేశాభిమానము ప్రభుత్వనిరసనమునకు పాలగును. ప్రభుత్వసేవ గౌరవలాభములకు సాధనం బగును. ప్రజాసేవ దండనమునకు గారణంబగును. అధికార మహాప్రవాహమునందు సకలసద్గుణములును విలయమును బొందుచుండును. స్తోత్రపాఠము సకల సద్గుణములకును లక్షణమగును. పరాధీనస్థితియందున్న భారతీయులకు ప్రతిభావంతులయిన మహనీయులకునైనను మానరక్షణము దుస్తరముగ నుండును. నేటి దేశభక్తులు రేపు స్వామిభక్తులై ప్రజాకంటకు లగుచుందురు. ఈవిపరీతస్థితి పరాధీన దేశములకు సహజమైనను భరతవర్షమునందు విపరీతాకారమును దాల్చి భారతసత్వమును నిర్మూలము చేయుచున్నది.

* * * *

వంగదేశసింహమని ఖ్యాతినిబడసిన సర్ సురేంద్రనాథ బెనర్జిగారిజీవితవృత్తము మీవిషమ సమస్యలకు వ్యాఖ్యానముగనున్నది. ఇంగ్లాండునందు విద్యాభ్యాసముచేసి పౌరసేవోద్యోగమును గడించినను బెనర్జిగారి స్వాతంత్ర్య స్వభావము ప్రభుత్వాగ్రహమునకు పాత్రమైనది. బెనర్జిగారు జీవితారంభమునందే నిరంకుశవర్గాగ్రహమునకు బాత్రులై దండనము ననుభవించిరి. అధికారాగ్రహము బెనర్జిగారి స్వాతంత్ర్యాగ్నిని ప్రజ్వలింపజేసినది. బెనర్జిగారి సుగుణములు, తన్మూలమున భారతీయప్రతిభయును విశద మయినది. బెనర్జిగారు పౌరసేవోద్యోగమునందు జీవితమును గడిపియుండిన వారిసింహగర్జనముల కవకాశములేకను స్తోత్రపాఠములతో గాలము గడిచియుండును. అధికారావరణమునందు జేరినతోడనే యెంతటి మహానుభావులైనను నధికార స్వరూప స్వభావములను దాల్చుట పరిపాటి యైనది. భారతీయుల ప్రతిభ ప్రతిఘటన దశయందు ప్రకాశించునటులు సహకారదశయందు బ్రకాశింప జాలదని మహానుభావుల జీవితములు విశదము చేయుచున్నను నధికారసమ్మోహము ప్రతిబంధకముగ నున్నది. పౌరసేవోద్యోగము ప్రజాసేవకు వినియోగపడక నిరంకుశత్వసేవకు వినియోగపడుచున్నది. బెనర్జిగారు కలెక్టరైనను, కమిషనరైనను, జడ్జియైనను, కార్యనిర్వాహకసభాసభ్యుడైనను, వారిసింహగర్జనములును, రిపను కళాశాలయును, బంగాళిపత్రికయును నసంభవములైయుండును. అధికారదశయందు చేయగలిగిన సేవకంటెను వేయిరెట్లధిక సేవను ననధికారదశయందు బెనర్జిగారు చేయగలిగిన విధమును వారిజీవితము విశదము చేయుచున్నది.

* * * *

మంత్రిపదవి బెనర్జిగారికిని వంగ రాష్ట్రమునకును స్వల్ప ప్రయోజనముల నొడగూర్చినను భారతభూమికి ప్రయోజనమును గలుగజేయలేదు. అధికార స్వర్ణశృంఖల బద్ధులైన బెనర్జిగారి కధికార పదవి వాగ్బంధనమును జేసినది. అధికారపాశబద్ధులైన బెనర్జిగారికి ప్రజాసేవ దురారాధ్యమైనది. అధికార ప్రాపకముతో ప్రజాగౌరవము సన్నగిలినది. సర్ బిరుదముతో నధికార పాశబలము హెచ్చినది. బ్రిటీషు ప్రభుత్వ సేవాపరాయణులైన భారత ప్రముఖులందు గలుగగల పరివర్తన విధానమును బెనర్జిగారి యుదంతము విశదము చేయుచున్నది. బర్కెనుహెడు రీడింగు ప్రభువులు కోరుచున్న సహకార విధానమునకు ఫలమును బెనర్జిగారి యుదంతము విశదము చేయుచున్నది. నాయకులను ప్రజలను నిట్టి యనివార్యమైన వ్యామోహమునుండి కాపాడుటకు సత్యాగ్రహయోగ ముదయించినది. అసహాయయోగమున కపరిచితులైన బెనర్జిగారు సక్రమాందోళన సాధనము నవలంబించి ప్రభుత్వసమ్మానమునకు బాత్రులైరి. ప్రభుత్వ సమ్మానముతో ప్రజాగౌరవము క్షీణించినను బెనర్జిగారి యప్రతిమానమైన సేవ సువర్ణాక్షరములతో భారతదేశ రాజ్యాంగేతిహాసములందు చిత్రింపబడి దేశసేవా పరాయణులకు చిరసంస్మరణీయముగ నుండగలదు.

* * * *

సర్ సురేంద్రనాథబెనర్జి నిర్యాణముతో దేశీయమహాసభ నారంభించిన మహానాయకులతర మంతము నొందుచున్నది. నౌరోజి, బోనర్జి, రానడె, బానర్జి, తిలకు, మెహతా మొదలగుధీరులుసంకల్పించినభారత జాతీయమహాసభకు పూర్వపునామ మున్నను రూపాంతర మేర్పడినది. వయోవృద్ధులకు విద్యావంతులకును నాశ్రయమైన మహాసభ యువజనులకును సామాన్యులకును నాశ్రయమైనది. గంభీరోపన్యాసములకు రంగమైనమహాసభావేదిక కార్యకలాపమునకు రంగముగను బరిణమించినది. సక్రమాందోళనమునకు రంగస్థలమైన జాతీయమహాసభ అసహాయయోగమునకు రంగముగను వెలసినది. ఈ పరిస్థితులందు బెనర్జిగారు కాంగ్రెసుపట్లను విముఖత్వమును జూపినను వారి స్వాతంత్ర్య ప్రియత్వము, మేధాశక్తి, వక్తృత్వసామర్థ్యము, దేశాభిమానము, కార్యనిర్వహణదక్షత స్వీయ చరిత్రమునందు వివరించినవిధమునను భారత సంరంభమునందు సేవాపరాయణుల కాదర్శములుగ నుండగలవు. అన్నిప్రాంతములందును సమర్పించిన స్తోత్రాంజలులు సర్ సురేంద్రనాథ బెనర్జి ప్రతిభను విశదము చేయుచు ప్రజలకు కర్తవ్యమును బోధించుచున్నవి. దేశసేవయందు జీవితమును గడిపిన సురేంద్రనాథ బెనర్జిగారి యాత్మకు పరమేశ్వరుడు శాంతిని ప్రసాదించుగాత!

* * * *

సామ్రాజ్యశాసనసభ

సామ్రాజ్యశాసనసభాసమావేశ మారంభ మైనది. రాజప్రతినిధి రూ. 64,000 వ్యయముచేసి స్వదేశయాత్రను జేసినందులకు

ఫలము వారి ప్రసంగమునందు గనుపడినది. బర్కెను హెడు ప్రభువు పాడినపాటనే చక్కని మాటలతో సుస్వరముతో శ్రీరాగమునందు రీడింగు ప్రభువుపాడి యన్నిపక్షముల వారికిని నాశాభంగము గలుగజేసెను. బ్రిటీషు ప్రభుత్వమున కనుశ్రుతమైన పల్లవినే తిరిగిపాడి వారి యసమర్థతను వెల్లడిచేసిరి. బ్రిటీషు ప్రభుత్వమునకు భారతప్రజల యొక్క యోగక్షేమముల పట్లనుగల "రక్షకబాధ్యత గీతమును" ఎన్ని సారులు పాడినను పాడవచ్చును. క్రియలేని పాటవలన నెవరికిని ప్రయోజనము గలుగదు. ఒకటిరెండుసారులు భారతీయులను ప్రపంచమునుసంభ్రమింప జేయుటసాధ్యమైనను ఎల్లపుడును నందరను మోసగించుట సాధ్యము గాదు. మితవాదులు, స్వతంత్రవాదులు, కన్వెన్షనుపక్షవాదులు, స్వరాజ్యవాదులు రీడింగు ప్రభువు తెలిపినభావములను నిరసించిరి. శ్రీనివాసశాస్త్రి, బెజంటు, జిన్నా, నెహ్రూ గారులు మొదలగువారు నిరాశను దెలియజేసిరి.

* * * *

బెజంటమ్మగారు తానునిర్మించినస్వరాజ్య విధానము నందరును నాశీర్వదించుటకు గ్రేటు బ్రిటనునందునుభరతవర్షమునందును విశ్వప్రయత్నములను జేయుచున్నది. తన ప్రయత్నములను సఫలము చేయుటకు స్వదేశ యాత్రను జేయుచున్నది. మితవాదపక్ష సభ బర్కెను హెడు రీడింగు ప్రభువుల ప్రహసనమును నిరసించినను దేశమోక్షమునకు సక్రమాందోళనమె శరణ్యమని నిర్ణయించినది. స్వతంత్ర పక్షము సమయోచిత సహకారమే సాధనాంతరమని నిర్ణయించినది. స్వరాజ్యపక్షము ప్రతిష్టంభన మంత్రమును బోధించుచున్నను కార్యమునందు స్వతంత్రపక్ష మార్గము నవలంబించుచున్న విధమును పండిత మోతీలాలు నెహ్రూగారి యాచరణము విశదము చేయుచున్నది. నెహ్రూగారు ప్రభుత్వవ్యవహారముల కొసంగుచున్న ప్రోత్సాహము దురభిప్రాయములకు గారణంబగుచున్నను స్వరాజ్య పక్ష సిద్ధాంతములందే లోపముగల దని గ్రహించవలసియున్నది. గాంధిమహాత్ముడు నిరంకుశ ప్రతిఘటనమునకు శక్తిసామర్థ్యములు లేవని మన నిస్సహాయస్థితి నంగీకరించుచున్నాడు.

* * * *

ఈమహాసంకులస్థితియందుస్వరాజ్యయోధులుస్వధర్మనిర్వహణమార్గమును గానలేకను పరితపించుచున్న విధమును దేశ పరిస్థితులు విశదము చేయుచున్నవి. పాట్నాయందు సెప్టెంబరు మాసాంతమునందు గూడనున్న అఖిల భారతమహాసభాపసంఘము ప్రజలకు సంశయ విచ్ఛేదమును జేయదగిన కార్యవిధానమును నిర్ణయించి సరళమైన రాజ్యాంగజీవనమును నెలకొలుపుట కుపయోగపడునని నమ్ముచున్నాము. ఈ సంకులదశయందు దేశమునందు ప్రతిధ్వనించుచున్న స్వరాజ్యపక్షనాదము దేశముసందంతటను నవ్యమైన స్వరాజ్యాందోళనమును వ్యాపింపజేయుటకు వినియోగపడునటులు కాంగ్రెసునందలి భిన్న పక్షములవారు పాటుపడి కాంగ్రెసుప్రతిష్ఠను గాపాడుదురుగాత!

* * * *

స్వరాజ్యపక్షము

దేశబంధు చిత్తరంజనదాసు గారి కవచమును పండిత మోతిలాలు నెహ్రూగారు ధరించి స్వరాజ్యపక్షమును నడుపుటకు బూనుకొనిరి. మోతిలాలు నెహ్రూగారి నాయకత్వము గాంధిమహాత్మునియామోదమును బడసినది. వంగరాష్ట్రశాసనసభయందు సభాధిపతిని నెన్నుకొనుటయందు స్వరాజ్యపక్షమున కపజయము గలిగినది. స్వరాజ్యపక్షనాయకులు సేనుగుప్తగారు వ్యవహారనిర్వాహణమునందు సామర్థ్యమును జూపుచున్నను భిన్నపక్షములను బంధించిన సంయోగపాశము శిథిలమగుట కారంభించినది. మహమ్మదీయసభ్యులు స్వరాజ్యపక్ష సభ్యత్వమును వదలుకొనుట కారంభించిరి. స్వల్పకారణములు విభేదములకు గారణములగుచున్నవి. ఎవరిలాభములకు వారు పాటుపడుచున్నటులు వ్యవహారములు విశదము చేయుచున్నవి. మధ్యరాష్ట్రములందు స్వరాజ్యపక్షము మంత్రిపదవులను స్వీకరించుటకు నిరాకరించి స్వధర్మమును రక్షించినది. సామ్రాజ్యశాసనసభయందు విట్టలుభాయి పటేలుగారి నధ్యక్షులనుగ నెన్నుకొని స్వరాజ్యపక్షము విజయమును బొందినది. విట్టలుభాయి పటేలుగారి బ॥ మధ్యక్షాసనమునందు కంటెను సభ్యత్వస్థానమునందు బలవత్తరమై యుండి యుండును. వర్తమాన సమావేశమున సామ్రాజ్యశాసనసభయందు స్వరాజ్యపక్ష మవలంబించుచున్న కార్యవిధానము సామాన్యమై యిదమిత్థమని నిర్ణయించుట కవకాశములు గలుగకున్నవి. మడ్డిమను కమిటి నివేదికను విమర్శించునపుడు స్వరాజ్యపక్షబలము వ్యక్తమై ప్రభుత్వమునకు ప్రజాప్రతినిధులబలము వ్యక్తమగునని నమ్ముచున్నాము.

* * * *

అల్పసంఖ్యాకుల మతమును సర్ విలియము విన్సెంటు రీడింగుప్రభువు మొదలగువా రామోదించినను మెస్టను బర్కెను హెడు ప్రభువు మొదలగు ప్రతిపక్షులమతము ప్రబలినది. ఉదారసంకల్పముతో నింగ్లాండునకు బోయిన రీడింగుప్రభువు బర్కెను హెడు ప్రభువుయొక్క నిరాదరణసందేశమును సామ్రాజ్యశాసనసభకు సమర్పించెను. బర్కెనుహెడుప్రభువు తెలిపిన భావములు గుప్తములుగ నున్నవి. అన్నిపక్షములవారును గలిసి రాజ్యాంగవిధానమును సిద్ధము చేసినను దానిని విచారించెడివా రెవరో తెలియకున్నది. మడ్డిమను కమిటియొక్క అధికసంఖ్యాకుల నివేదికనైనను నధికారు లామోదించనపుడు స్వరాజ్యవిధానమువలన నేమి ప్రయోజనముగలుగగలదో తెలియకున్నది. మడ్డిమనుగారి శ్రమకు బీహారుగవర్నరుపదవి లభింపనున్నదను వదంతియందు మాత్రము యథార్థము గలదు. వివిధపక్షములకును భావములందును కార్యములందును సంయోగము సాధ్యముగానపుడు ప్రభుత్వము నిరాటంకముగను నిరంకుశాధికారమును జెల్లించుకొనుట కభ్యంతరముండదుగదా !

* * * *

స్థానిక సంస్థలు

స్వరాజ్యపక్షాభ్యర్థులు మ్యూనిసిపల్ సంఘములందును లోకలుబోర్డులందును స్థానముల నాక్రమించుకొనుటకు జేయుచున్న ప్రయత్నములు ప్రజాప్రబోధమునకు సాధనంబు లయినను నంతఃకలహములకు సాధనంబులు గాకుండుట యవసరము. ప్రత్యర్థులను నిర్ణయించుటయం దన్నిపక్షములవారును జేరి నిజమైన కాంగ్రెసు ప్రత్యర్థులను నిలువబెట్టుట సమంజసము. స్వలాభార్థ మావేళకు కాంగ్రెసునందు జేరిన ప్రత్యర్థులను ప్రోత్సహించుట వలనను కాంగ్రెసు ప్రతిభ భగ్నముగాగలదు. చెన్నపురి కార్పొరేషనునందు నిలువబడిన ప్రత్యర్థులు భిన్నపక్షములకు జెందినను నితర స్థలములందు ప్రత్యర్థులం దట్టిభేదము లేకను సంక్షోభ మేర్పడుచున్నది. బందరు గుంటూరు మ్యునిసిపలుసంఘములందు జరిగిన యెన్నికలును, జరుగనున్న యెన్నికలును కాంగ్రెసు సభ్యులకు ధర్మోపదేశమును జేయుచున్నవి. ప్రత్యర్థుల నిర్ణయము స్వప్రయోజనములకు గాక దేశ ధర్మప్రయోజనముల కేర్పడుట సమంజసము. ప్రజల యజ్ఞానావస్థయందు భిన్నపక్షములవారు స్వప్రయోజనములకు గాను ప్రజలయందు దుర్మార్గమును వ్యాపింపజేసినపుడు కక్షులతోను, పక్షములతోను, మతములతోను, కులములతోను నిండిన దేశమునకు తరణోపాయము దుర్లభమగును.

* * * *

స్థానికసంఘముల సందర్భముననె జరుగుచున్న దుర్నయములును దురాలాపములును నేహ్యముగ నున్నవి. శాసనసభల ఎన్నికల సందర్భమున జరుగనున్న సంక్షోభ మెంత తీవ్రరూపమును దాల్చునో నిర్ణయించుట దుస్తరముగ నున్నది. దీర్ఘదర్శియైన గాంధిమహాత్ముడీ యనర్థములను గ్రహించియే వర్తమానస్థితియందు గ్రామసీమలందు రాజ్యాంగాందోళన మసంగత మని యొక నాయకుని ప్రశ్నలకు సమాధానమును చెప్పిరి. కాని నిర్మాణకార్యమునం దుత్సాహము లేకను స్వరాజ్యపక్ష ప్రణాళికయం దుత్సాహ మేర్పడినపుడు గాంధి మహాత్ముడు స్వరాజ్యపక్షవిధానమున కభయము నొసంగెను. మహాత్ముని త్యాగమును స్వరాజ్యపక్షము వారును నితర పక్షములవారును గ్రహించి ఎన్నికలయందును అభ్యర్థులనిర్ణయమునందును ధర్మపరిజ్ఞానమును వినియోగించి కాంగ్రెసు ప్రతిభను ఆత్మగౌరవమును గాపాడుదురుగాత!

* * * *

చెన్నరాష్ట్ర శాసనసభ

సభాధ్యక్షు డితరరాష్ట్రసభలయందువలె నీసభయందును మడ్డిమను కమిటీనివేదికకు సంబంధించిన చర్చను ప్రతిషేధించెను. ద్వంద్వప్రభుత్వము నిరపాయముగను చెన్నరాష్ట్రమునందునడిచినదని బర్కెనుహెడుప్రభువు ప్రశంసించినను దానిని విమర్శించుటకైనను శాసనసభ కధికారము లేకుండుట శాసనసభల దౌర్బల్యమును విశదము చేయుచున్నది. చెన్నరాష్ట్రసభయందు విమర్శనమును గోరినది జస్టిసుపక్షమువారైనను నితర